اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 2 సంచిక 11 & 12 జూన్ & జూలై, 2011 రూ. 34/-



## టెర్రరిజం

శీర్షిక చివరి భాగం

## పేదరికం

నిర్మూలనకు ఆచరణయోగ్యమైన పరిష్కారం

## మస్జిద్ ప్రత్యేక వ్యాసం

"ఎవరైతే అల్లాహ్ కొరకు ఓ మస్జిద్‌ను నిర్మిస్తారో, పిచ్చుక గూడు వంటిది లేక దానికంటే చిన్నదైనా సరే, అల్లాహ్ అతని కొరకు స్వర్గంలో ఓ గృహాన్ని నిర్మిస్తారు"

وَلِيَعْلَمَ الَّذِينَ أُوتُوا الْعِلْمَ أَنَّهُ الْحَقُّ مِن رَّبِّكَ فَيُؤْمِنُوا بِهِ فَتُخْبِتَ لَهُ
قُلُوبُهُمْ وَإِنَّ اللَّهَ لَهَادِ الَّذِينَ ءَامَنُوٓا إِلَىٰ صِرَٰطٍ مُّسْتَقِيمٍ

మరియు జ్ఞానం ఇవ్వబడిన వారు ఇది (ఈ ఖుర్'ఆన్) నీ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమని తెలుసుకొని దానిని విశ్వసించటానికి, వారి హృదయాలు దానికి అంకితం కావటానికి, మరియు నిశ్చయంగా, అల్లాహ్ విశ్వసించేవారికి ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తాడు. (ఖుర్'ఆన్ 22:54)

And so those who were given knowledge may know that it is the truth from your Lord and [therefore] believe in it, and their hearts humbly submit to it. And indeed is ALLAH the Guide of those who have believed to a straight path (Qur'an 22:54)

అన్-నూర్

اَلنُّور

THE LIGHT

జ్యోతి

الله

అల్-హాది

اَلْهَادِي

THE GUIDE

మార్గదర్శకుడు

# అల్లాహ్

اللَّهُ نُورُ السَّمَٰوَٰتِ وَالْأَرْضِ

అల్లాహ్ ఆకాశాలకూ మరియు భూమికీ జ్యోతి! ... (ఖుర్'ఆన్ 24:35)

ALLAH is the Light of the heavens and the earth ...

(Qur'an 24:35)

జూన్ & జూలై 2011
రజబ్ - షాబాన్ 1432

# శాంతిబాట

మాసపత్రిక రూ. 34/-

సంపుటి 2 సంచికలు 11 & 12 జూన్ & జూలై'2011
2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440
Email:velugubaata@gmail.com
Cell : 9491103017

ఎడిటర్:
**ఎమ్.డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**
డా॥ సలీమ్ పాషా
డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు
ఎమ్.డి. అప్ఫాన్ ఉమ్రీ

**4** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ ప్రారంభం : 21 - 25 ఆయత్‌ల వివరణ ...

**10** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - సంపాదన ...

**13** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం - అబూ ఉబైదా(రజి)

**20** **హదీస్ విజ్ఞానం :** చివరి వర్గీకరణ - సహీహ్, హసన్, దయీఫ్ మరియు మౌదూ ...

**24** **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** తొలి దివ్య సందేశం ...

**27** **పేదరికం :** ఆర్థిక అసమానతలు - ఇస్లాం సూచించిన పరిష్కార మార్గం ...

**38** **ముస్లిం యువత ఆలోచించండి! :** ఘనత గల రాత్రి - యువకుల వికృత చేష్టలు ...

**41** **మస్జిద్ :** ప్రత్యేక వ్యాసం ...

**59** **టెర్రరిజం :** శీర్షిక ముగింపు వ్యాసం (ఆఖరి భాగం)

**Printed by**
Md. Athaharullah
**Published by**
Md. Athaharullah
**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440
and
**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440
and
**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,
**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**సంవత్సర చందా :**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:
**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440
**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి
**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# గురివింద గింజలు

మక్కా మస్జిద్, అజ్మీర్ దర్గా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లపై స్వామి అసీమానంద బృందం చేసిన బాంబుదాడులు మరియు ముంబైలో కసబ్ బృందం చేసిన బాంబుదాడులను ప్రజలు మరచిపోకుండానే మరలా ముంబైలో ఈ నెలలో దాడులు జరిగాయి. వీటిని ఎవరు చేసారు? సాధారణంగా ఇటువంటి దాడుల విషయంలో వెంటనే వెలువడే ప్రకటనల వంటివి ఈసారి వెలువడలేదు. దర్యాప్తు కొనసాగుతూ ఉంది. ఇన్షా అల్లాహ్ ఆ దాడులకు అసలు బాధ్యులెవరో రెండు మూడు సంవత్సరాలలో తెలిసిపోతుంది. ఏ దాడినైనా ఇంతవరకూ ముందుగా ముస్లిములకే అంటగట్టేవారు. ఈ తరువాత రెండు మూడు సంవత్సరాలకు అసలు నేరస్థులు దొరికి, వారు అంగీకరించాక నిజం తెలిసేది. ఆ నిజం తెలిసేవరకూ ముస్లిములే విమర్శలకు గురి అయ్యేవారు. ఒకప్పుడు బాంబు ప్రేలుడు గురించి వార్త రాగానే, వెంటనే అది నక్సలైట్ల పనే అనేవారు. ప్రపంచంలో అమెరికా వాడి పెత్తనం పెరిగిన తరువాత ఏ బాంబు దాడి జరిగినా అది ముస్లిములు చేసిన పనే అని ప్రకటించడం మొదలైంది.

ఈ ముంబై పేలుళ్ల విషయంలో సంఘ్ ప్రమేయాన్ని తోచి పుచ్చలేమని కాంగ్రెస్ సీనియర్ నేత మరియు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, శ్రీ దిగ్విజయ్ సింగ్ గారు ప్రకటించగానే, బిజెపి ప్రతినిధులైన ఇద్దరు సీనియర్ నేతలు దిగ్విజయ్‌సింగ్‌కి 'నోటి విరేచనాల వ్యాధి' ఉందని తిట్టిపోశారు. కేవలం ఓ సంస్థపై అనుమానం వ్యక్తం చేస్తేనే దానికి కారణం 'నోటి విరేచనాల వ్యాధి' అయితే, ప్రపంచంలోని 157 కోట్ల ముస్లిముల ధర్మమైన ఇస్లామ్(శాంతి)ని తీవ్రవాదంతో కలిపి ఇంతకు ముందు ప్రకటనలు చేసినవారిది ఏ వ్యాధి అనాలో!

దిగ్విజయ్ సింగ్ గారి స్టేట్‌మెంట్ : ''నేను దేన్నీ తోసిపుచ్చడం లేదు. **ఉగ్రవాద కార్యకలాపాల్లో సంఘ్‌పరివార్ ప్రమేయానికి సంబంధించి ఆధారం కావాలంటే అది నా వద్ద ఉంది.** అయితే **ముంబై పేలుళ్ల విషయంలో మాత్రం నా వద్ద ఆధారం లేదు**''.

స్వామి అసీమానంద నేరాన్ని అంగీకరించడంతో మక్కా మస్జిద్, అజ్మీర్ దర్గా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌పై జరిపిన ఉగ్రవాద దాడులలో సంఘ్‌లో పనిచేసే వారిలో కొందరికి ప్రమేయమున్నట్లు అందరికీ తెలుసు. కాబట్టి ఆ విషయంలో దిగ్విజయ్ సింగ్ అనుమాన పడ్డారు. పూర్వం జరిగిన సంఘటనలను బట్టి ఆయన అనుమానపడి ఉండవచ్చు. అంతేకాకుండా ముంబై పేలుళ్ల విషయంలో తన దగ్గర ఆధారం లేదని కూడా స్పష్టంగా ప్రకటించారు.

బిజెపి ప్రతినిధుల ప్రశ్న : **" పేలుళ్లపై ప్రకటనలు చేయడానికి ఆయనేమన్నా హోం మంత్రా? నిఘావర్గాల కంటే గొప్పవాడా? "**

''ఒకవేళ హోం మంత్రే అటువంటి ప్రకటన చేస్తే వీరు స్వీకరించి ఉండేవారా?' ఎంతమాత్రం స్వీకరించరు. ఎందుకంటే ''పార్లమెంట్‌లోనే 'కాషాయ ఉగ్రవాదం' అని హోం మినిస్టర్ చిదంబరం గారు మాట్లాడారు''. ఆ ప్రకటనను బిజెపివారు వ్యతిరేకించారు. నిఘా వర్గానికి చెందిన హేమంత్ కర్కరేగారు సాధ్వి ప్రజ్ఞాసింగ్ విషయాన్ని ప్రపంచానికి తెలియజేశారు''. ఆ విషయాన్ని వీరు స్వాగతించారా?

బిజెపి వారి మరొక ప్రశ్న : **"పేలుళ్లకు ఎవరు బాధ్యులో హోం మంత్రిగానీ, దర్యాప్తు సంస్థలుగానీ ఇంకా తేల్చలేదని, ఇలాంటి స్థితిలో దిగ్విజయ్ ఏ ఆధారంతో ఈ వ్యాఖ్యలు చేశారు?"** ఇదే ప్రశ్నను బిజెపివారు తమవారిపై వేసుకుని ఉంటే ఎంత బావుండేది?

గురివింద గింజకు తన కిందనున్న నలుపు తెలియదట. అలాగే ఉంది బిజెపి వారి వ్యవహారం. ఆ విషయం వారి స్టేట్‌మెంట్ ద్వారానే తెలుస్తుంది. ''పేలుళ్లపై అందరూ పాక్‌ను వేలెత్తి చూపుతున్న తరుణంలో అందరం ఏకతాటిపై నిలవాల్సి ఉండగా దిగ్విజయ్ మాత్రం శవాలపై పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని'' రవిశంకర్ ప్రసాద్ అన్నారు. **దర్యాప్తు కాకుండానే పాకిస్తాన్‌వైపు వేలెత్తి ఎలా చూపుతారు?** ఈనాడు దిగ్విజయ్ సింగ్ గారు వేలెత్తి చూపినట్లు పూర్వపు దాడులలో మీరు వేలెత్తి చూపలేదా?

**''అందరూ పాక్‌ను వేలెత్తి చూపుతున్నారా?''** ఎవరు ఆ **''అందరు?''**. భారతీయులు అందరూ అని మీ ఉద్దేశ్యమా? లేక బిజెపివారు అందరూ అని మీ గూఢార్థమా? ఆ 'అందరూ' ఆధారం లేకుండా పాక్‌పై ఎలా వేలెత్తి చూపుతున్నారని వారిపై మీరు బరస్ట్ అయిపోవాలి కదా!

పేలుళ్ళకు ఎవరు బాధ్యులో హోం మంత్రి తేల్చలేదని, దర్యాప్తు సంస్థలు తేల్చలేదని వీరే స్వయంగా చెబుతున్నారు. అటువంటప్పుడు ఏదీ తేల్చకుండానే, ఎటువంటి ఆధారాలు లేకుండానే పాకిస్తాన్‌పై వేలెత్తి ఎందుకు చూపుతున్నారు? ఏ ఆధారం లేకుండానే మీరంతా పాకిస్తాన్‌పై వేలెత్తి చూపినప్పుడు, మీ లాగే ఏ ఆధారం లేకుండా మీపై వేలెత్తి ఓ మాజీ ముఖ్యమంత్రి ఎందుకు చూపకూడదు?

మరి మీరేమైనా హోం మంత్రా? లేక నిఘావర్గం వారా? మీకు పాకిస్తాన్‌పై అనుమానం. మీపై దిగ్విజయ్‌సింగ్ గారికి అనుమానం. దిగ్విజయ్ సింగ్ దేశాన్ని అస్థిరపరచేందుకు అలా మాట్లాడుతున్నారని బిజెపి ప్రతినిధులు విమర్శించారు.

ఆయన మాటల వలన, బిజెపి వారి మాటల వలన, మొత్తంగా చూస్తే రాజకీయ నాయకులందరూ కలిసి మాట్లాడిన మాటల వలన కూడా మన ఇండియా అస్థిరపడదు. కేవలం ఓ సంస్థపై లేదా ఓ రాజకీయ పార్టీపై మాట్లాడినంత మాత్రాన మన భారతదేశం అస్థిరం కాదు. కేవలం కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు కలిస్తేనే దేశం కాదు. మన భారతీయులందరికీ మనదేశం ముఖ్యం. మనదేశ గౌరవం ముఖ్యం.

డబ్బులిస్తే మతకలహాలు సృష్టించడానికి సిద్ధంగా కర్ణాటకలో ఓ సంస్థ ఉందని 'తెహల్కా'వారు ఓ స్టింగ్ ఆపరేషన్ ద్వారా బయటపెట్టారు. వారు ఎవరో, వారు ఏ పార్టీకి సన్నిహితులో బిజెపి వారికి బాగా తెలుసు.

**దేశాన్ని అస్థిరపరచేవి మత కలహాలు.** నిజంగా ఈ దేశం సుస్థిరంగా ఉండాలని కోరుకునే వారెవరైనా సరే, మత సహనం కలుగజేయడానికి

మతాల మధ్య మంచి సంబంధాలు కలిగి ఉండేలా ప్రయత్నించాలి. మరో దేశం సంగతి మనకు అనవసరం. మనదేశంలో ఎన్ని మతధర్మాల వారున్నా సరే, మనమంతా భారతీయులమే! మనందరి మధ్య ఐక్యత ఉండాలి.

ఆ ఐక్యతను చెడగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని కోరుకునే వారెవరో, దేశాన్ని అస్థిర పరచాలని కోరుకునే వారెవరో ప్రజలకు స్పష్టంగా తెలుసు. ప్రజలేమీ మాట్లాడటం లేదని, వారికి ఏమీ తెలియదని, ఏ రాజకీయ నాయకుడైన 'నోటి విరేచనాల వ్యాధి'తో ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే, సహనం కోల్పోయిన ప్రజలు నాయకులకు బుద్ధి చెప్పేరోజు తప్పక వస్తుంది. తమకొక నీతి, ఇతరులకు మరొక నీతి. ఇది న్యాయమా?

ఏ ప్రేలుడు ఎవరు చేసినా వారిని వెంటనే కఠినంగా శిక్షించాలి. మన దేశంలో ఐక్యతను చెడగొట్టేవారు రెండు వర్గాలలో ఉన్నారు. ఆ వర్గాలలోని మొత్తం వ్యక్తులంతా దానికి కారణం కాదు. కాని వారిలో ఎక్కువమంది ఐక్యతను చెడగొట్టడానికే ప్రయత్నిస్తున్నారు. వాటిలో ఒక వర్గం రాజకీయ వర్గమయితే మరొకటి మీడియా వర్గం. రాజకీయ నాయకులను మీడియా విమర్శిస్తుంది. మీడియా వారిని రాజకీయ నాయకులు విమర్శిస్తారు. కాని వాస్తవానికి వీరిద్దరిలో పెద్దగా తేడా ఏమీ లేదు. వారు లేకపోతే వీరు లేరు. వీరు లేకపోతే వారు లేరు.

అన్నా హజారేగారి దీక్ష సూపర్ హిట్. కారణం మీడియా. రామ్‌దేవ్ బాబాగారి దీక్ష కూడా దాదాపు సూపర్ హిట్. వార్తా చానళ్ళన్నీ అక్కడే బస చేశాయి. కాని 110 రోజుల నిరాహార దీక్ష చేసి మరణించిన ఓ స్వామి గారి దీక్ష విషయం మాత్రం సూపర్ ప్లాప్ అయింది. అలా అవడానికి కారణం ఎవరు? ఈ స్వామి గారి సంకల్పం మంచిదే. కాని బడ్జెట్ లేదు. జీరో బడ్జెట్. బడ్జెట్ లేని దీక్షకు మీడియా వారి సహకారం ఉండదని చాలా స్పష్టంగా సమాజానికి ఈ స్వామి మరణం తెలియజేసింది.

ఈ స్వామి గారి దీక్షకు స్పందించని వారు, ఇతరుల దీక్షకు స్పందిస్తే ఆ స్వామి గారి మరణాన్ని అవమానించినట్లే! ఆ స్వామి గారి మరణానికి ఏ ఒక్క రాజకీయ పార్టీగాని, ఏ మీడియా సంస్థగాని ఆందోళన చేయలేదు. దీని ద్వారా మనకు స్పష్టంగా తెలిసింది ఏమిటంటే సంకల్పానికి, స్పందనకు ఎటువంటి సంబంధమూ లేదు. **స్పందన కేవలం సెలెబ్రిటీలకే!**

ఈ నెలలోనే మన రాష్ట్రంలోని ఓ తెలుగు ఛానల్ వారు తిరుమలలోని ఓ హొటల్‌లో పనిచేస్తున్న ముస్లిమ్ యువకులను చూపిస్తూ, వారు తిరుమల కొండపై దాడికి వచ్చిన ఉగ్రవాదులని అనుమాన పడేవిధంగా చూపించారు. వారి దగ్గర మారణాయుధాలు ఉన్నాయని చెబుతూ, వారి దగ్గరున్న రెండు మూడు సిడిలను క్లోజప్‌లో చూపించినదే చూపించి చూసేవారిని భయభ్రాంతులను చేయడానికి చాలా కష్టపడ్డారు. ప్రజలను భయభ్రాంతులను చేయడాన్ని కూడా తీవ్రవాదమే అంటారని వీరికి బహుశా తెలియదేమో! ఛానల్ వారు మారణాయుధాలు అని చెప్పగానే అవి బాంబులని ఎవరైనా అనుకోవచ్చు. కాని అవి రెండు కొడవళ్ళు. కొబ్బరి బొండాలను కొట్టడానికి ఉపయోగించేవి. మీడియా భాష ఎంత ఘోరంగా తగలడిందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. ఆ విధంగా చూస్తే ప్రతీ ఇంటిలో మారణాయుధాలున్నట్లే! ఎందుకంటే చాకుగాని, కత్తిపీటగాని లేని వంటగది ఉండదు కదా!

ఆ తరువాత ఓ తెలుగు జాతీయ డైలీలో వివరాలు స్పష్టంగా ఇచ్చారు. వారి దగ్గరున్న సిడిలలో అన్యమత ప్రచారానికి సంబంధించినవి ఏవీ లేవని స్పష్టం చేశారు. ఆ యువకులు పొట్ట కూటికోసం హొటల్‌లో పనిచేయడానికి వేరే రాష్ట్రం నుండి వచ్చినవారు. ఆ ఛానల్ తరువాత, మరో రెండు ఛానళ్లలో కూడా ఇదే విషయం ప్రసారం అవుతుంటే చూశాము. ఆ యువకులు ఒక సంవత్సరం నుండి ఆ హొటల్‌లో పనిచేస్తున్నా పోలీసుల దృష్టికి రాకపోవడం వైఫల్యం అని చెబితే, మరో ఛానల్‌వారు ఆ యువకులు రెండు సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, మరో ఛానల్ మూడు సంవత్సరాలనుండి పనిచేస్తున్నారని, పోలీసులు నిద్రపోతున్నారని చెప్పుకొచ్చారు. 1 సంవత్సరానికి, 3 సంవత్సరాలకి మధ్య తేడా లేదా?

ఈ యువకుల సిడిలను క్లోజప్‌లో చూపించిన ఛానల్ వారైతే మరికాస్త ముందడుగు వేశారు. ఆ యాంకర్‌గారు ఓ బిజెపి నాయకునికి ఫోన్ చేసి అతని స్పందనను చెప్పమన్నారు. అతను ముస్లిముల గురించే చెప్పాడు. అయినా సరే, మరలా ఆ యాంకర్‌గారు మీ స్పందన ఏమిటి? మీరేం చేయబోతున్నారో చెప్పండి? అని అడిగారు. దీనికి అర్థం ఏమిటి? మీరు ఏదో ఒక గొడవ చేయండి అని పరోక్షంగా సలహా ఇచ్చినట్లా?

అంటే ముస్లిమ్ యువకుల విషయం కాబట్టి బిజెపి నాయకుడికి ఫోన్ చేసి స్పందన అడుగుతారా? దీనిని బట్టి ఆ ఛానల్ వారి ఆంతర్యమేమిటో మనకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఆ విషయానికి బిజెపి వారికి ఏమిటి సంబంధం? ఇంటెలిజెన్స్ వారికి ఫోన్ చేసి అడగాలి. లేదా దేవాదాయ శాఖమంత్రిగారిని అడగాలి. లేదా ముఖ్యమంత్రి గారినో లేక హొం మినిస్టర్‌గారినో, ఇతర సంబంధిత అధికారులను, పోలీస్ అధికారులను అడగాలి. అంతేగాని అక్కడి సెక్యూరిటీతో ఏమాత్రం సంబంధం లేని ఓ రాజకీయ పార్టీవారికి ఫోన్ చేసి అడగడం ఎంత వరకూ సబబు? పూర్తిగా నిజనిజాలు తెలుసుకోకుండా చేసే ఇటువంటి ప్రసారాలు ప్రజలలో తప్పుడు భావాలు కలుగజేయవా?

లేక అటువంటి భావాలు కలుగజేయాలనే వారి ప్రయత్నమా? హొటల్‌లో పనిచేసేవారుగాని, కొండపైకి బస్ నడిపే డ్రైవర్లు, కండక్టర్లుగాని, ఇతర పోలీసాఫీసర్లుగాని, లాయర్లుగాని, కార్మికులుగాని, రోజు కూలీలు గాని కేవలం హిందువులు మాత్రమే అయిఉండాలని, ముస్లిములకు అక్కడ ప్రవేశం లేదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, బోర్డులను ఏర్పాటుచేస్తే బావుండేది. ఆ యువకులే కాదు, మరే ముస్లిమ్ యువకులైనా సరే వారు తీవ్రవాదులు కానప్పుడు, వారిని తీవ్రవాదులుగా అనుమానిస్తూ అరెస్ట్ చేసినప్పుడు, వారి మనస్సు ఎంత గాయపడుతుందో మానవత్వ విలువలు తెలియని కొన్ని మీడియా సంస్థలు ఇప్పటికైనా ఆలోచించి అర్థం చేసుకుంటే మంచిది. నిజాన్ని నిర్భయంగా చెప్పడానికే మీడియాకు స్వేచ్ఛ నివ్వడం జరిగింది. వైషమ్యాలు పెంచడానికి కాదు. మనదేశ ప్రజలందరూ సమైక్యంగా ఉండేలా చేయమని అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాము.

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

17

## ఖుర్'ఆన్ తఫ్సీర్

(గత సంచిక తరువాయి)

**2. సూరహ్ అల్-బఖరా**

21. ఓ మానవులారా! మిమ్మల్ని మరియు మీకు పూర్వం వారిని సృష్టించిన మీ ప్రభువు (అల్లాహ్)నే ఆరాధించండి, బహుశా మీరు భక్తిపరులు కావచ్చు (మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు)!

22.ఆయన(అల్లాహ్)యే మీ కొరకు భూమిని పరుపుగాను మరియు ఆకాశాన్ని కప్పుగాను చేశాడు. మరియు ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీకు జీవనోపాధిగా ఫలాలను (పంటలను) ఉత్పత్తి చేశాడు! కావున ఇది తెలుసుకుని కూడా, మీరు ఇతరులను అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టకండి.

23.మరియు మేము మా దాసుడు (ముహమ్మద్)పై అవతరింపజేసిన దానిని (ఈ ఖుర్'ఆన్‌ను) గురించి, మీకు సందేహముంటే, దాని వంటి ఒక్క సూరానైనా మీరు (రచించి) తీసుకురండి. మరియు అల్లాహ్ తప్ప మీకు ఉన్న సహాయకులను అందరినీ పిలుచుకోండి, మీరు సత్యవంతులే అయితే.

يٰۤاَيُّهَا النَّاسُ

ఓ మానవులారా!

| | | | | | |
|---|---|---|---|---|---|
| مِنْ قَبْلِكُمْ | وَالَّذِيْنَ | خَلَقَكُمْ | الَّذِىْ | رَبَّكُمُ | اعْبُدُوْا |
| మీకు పూర్వం | మరియు వారు | మిమ్మల్ని సృష్టించారు | ఆయనే | మీ ప్రభువు | ఆరాధించు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| لَكُمُ | جَعَلَ | الَّذِىْ | ٢١ | تَتَّقُوْنَ | لَعَلَّكُمْ |
| మీ కొరకు | చేశారు | ఆయనే | 21 | భక్తిపరులు కావచ్చు | బహుశా మీరు |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| السَّمَآءِ | مِنَ | وَّاَنْزَلَ | بِنَآءً | وَّالسَّمَآءَ | فِرَاشًا | الْاَرْضَ |
| ఆకాశం | నుండి | మరియు క్రిందకు పంపారు | కప్పుగాను | మరియు ఆకాశాన్ని | విశ్రాంతి స్థలం (పరుపు) | భూమి(ని) |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| لَّكُمْ | رِزْقًا | الثَّمَرٰتِ | مِنَ | بِهٖ | فَاَخْرَجَ | مَآءً |
| మీ కొరకు | జీవనోపాధి(గా) | ఫలాలను | నుండి | తద్వారా | తరువాత ఉత్పత్తి చేశారు | నీరు |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| وَاِنْ | ٢٢ | تَعْلَمُوْنَ | وَّاَنْتُمْ | اَنْدَادًا | لِلّٰهِ | تَجْعَلُوْا | فَلَا |
| మరియు అయితే | 22 | తెలుసుకున్నారు | మరియు మీరు | సాటి వారు | అల్లాహ్‌కు | నిలబెట్టుట | కావున వద్దు |
| | | | | | | నిలబెట్టకండి | |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| فَاْتُوْا | عَبْدِنَا | عَلٰى | نَزَّلْنَا | مِّمَّا | رَيْبٍ | فِىْ | كُنْتُمْ |
| తీసుకురండి | మా దాసుడు | పై | మేము అవతరింపజేశాము | దాని గురించి | సందేహం | లో | మీరు ఉన్నారు |

24.కానీ, ఒకవేళ మీరు అలా చేయలేకపోతే - నిశ్చయంగా, మీరు అలా చేయలేరు - మానవులు మరియు రాళ్ళు ఇంధనమయ్యే ఆ నరకాగ్నికి భయపడండి. అది సత్య తిరస్కారుల కొరకే తయారు చేయబడింది.

25.మరియు విశ్వసించి, సత్కార్యాలు చేసేవారి కొరకు నిశ్చయంగా, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు ఉంటాయనే శుభవార్తను వినిపించు. ప్రతిసారి వారికి తినటానికి ఫలాలు ఒసంగబడినప్పుడల్లా వారు : "ఇవి ఇంతకు ముందు మాకు ఇవ్వబడినవే!" అని అంటారు. ఎందుకంటే, వారికి ఇవ్వబడేవి (వాటి) పోలిక గలవే. అక్కడ వారికి నిర్మల సహవాసులు (అ'జ్వాజ్) ఉంటారు. మరియు వారందులో శాశ్వతంగా ఉంటారు.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| اللّٰهِ | مِّنْ دُوْنِ | شُهَدَآءَكُمْ | وَادْعُوْا | مِّثْلِهٖ ۖ | مِّنْ | بِسُوْرَةٍ |
| అల్లాహ్‌ను కాకుండా | | మీ సాక్షులను | మరియు పిలవండి | దాని వంటి | | ఒక సూరహ్ |

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| تَفْعَلُوْا | وَلَنْ | تَفْعَلُوْا | لَّمْ | فَاِنْ | ٢٣ | صٰدِقِيْنَ | كُنْتُمْ | اِنْ |
| మీరు చేస్తారా | మరియు ఎన్నడూ | మీరు చేయి | లేదు | కాని అయితే | 23 | సత్యవంతులు | మీరు | అయితే |
| | | | | | | మీరు సత్యవంతులే అయితే | | |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| اُعِدَّتْ | وَالْحِجَارَةُ ۚ | النَّاسُ | وَقُوْدُهَا | الَّتِيْ | النَّارَ | فَاتَّقُوا |
| తయారు చేయబడింది | మరియు రాళ్ళు | మానవులు | (దాని) ఇంధనం | ఎవరి | నరకాగ్ని | అప్పుడు భయపడండి |

| | | | | | |
|---|---|---|---|---|---|
| وَعَمِلُوا | اٰمَنُوْا | الَّذِيْنَ | وَبَشِّرِ | ٢٤ | لِلْكٰفِرِيْنَ |
| మరియు చేశారో | విశ్వసించారో | ఎవరైతే | మరియు శుభవార్తనివ్వు | 24 | సత్య తిరస్కారుల కొరకు |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| تَحْتِهَا | مِنْ | تَجْرِيْ | جَنّٰتٍ | لَهُمْ | اَنَّ | الصّٰلِحٰتِ |
| వారి క్రింద | నుండి | ప్రవహించాయి | స్వర్గవనాలు | వారి కొరకు | అది | (ఆ) మంచి ఆచరణలకు |

| | | | | | |
|---|---|---|---|---|---|
| رِّزْقًا ۙ | مِنْ ثَمَرَةٍ | مِنْهَا | رُزِقُوْا | كُلَّمَا | الْاَنْهٰرُ ۖ |
| జీవనోపాధి(గా) | ఫలం | అక్కడి నుండి | వారు ఇవ్వబడ్డారు | ప్రతీ సారి | ఆ నదులు |

| | | | | |
|---|---|---|---|---|
| مِنْ قَبْلُ ۙ | رُزِقْنَا | الَّذِيْ | هٰذَا | قَالُوْا |
| ఇంతకు పూర్వం | మాకు ఇవ్వబడ్డాయి | అదే | ఇది | వారు అంటారు |

| | | | | |
|---|---|---|---|---|
| اَزْوَاجٌ | فِيْهَآ | وَلَهُمْ | مُتَشَابِهًا ۖ | وَاُتُوْا بِهٖ |
| సహవాసులు | అందులో | మరియు వారి కొరకు | పోలికగల (వస్తువులు) | మరియు వారికి ఇవ్వబడుతుంది |

| | | | | |
|---|---|---|---|---|
| | خٰلِدُوْنَ | فِيْهَا | وَّهُمْ | مُّطَهَّرَةٌ ۙ |
| 25 | శాశ్వతంగా ఉంటారు | అందులో | మరియు వారు | నిర్మలమైన (పవిత్రమైన) |

## సూరహ్ అల్-బఖరా (8 నుండి 20 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| అర్థం | | అరబీ |
|---|---|---|
| 160. ఓ మానవులారా | | يَآ أَيُّهَا النَّاسُ |
| 161. మీరు ఆరాధించండి (బహు) | | اُعْبُدُوْا |
| 162. ప్రభువు | | رَبّ |
| 163. మీ యొక్క | | كُمْ |
| 164. ఆయనే | | اَلَّذِيْ |
| 165. సృష్టించాడు, తీర్చిదిద్దాడు, రూపమిచ్చాడు | | خَلَقَ |
| 166. బహుశా మీరు | | لَعَلَّكُمْ |
| 167. భక్తిపరులు కావచ్చు | | تَتَّقُوْنَ (و ق ي) |
| 168. సృష్టించాడు, తయారుచేశాడు | | جَعَلَ |
| 169. మీ కొరకు (బహు) | | لَكُمْ |
| 170. భూమి | | أَرْضٌ |
| 171. పరుపు, విశ్రాంతి స్థలం | | فِرَاشًا |
| 172. కప్పి ఉంచేది, పైకప్పు | | بِنَآءً |
| 173. క్రిందికి దింపబడింది, తెలియజేయబడింది | | أَنْزَلَ (ن ز ل) |
| 174. నీరు | | مَآءٌ |
| 175. బయటికి తీశాడు | | أَخْرَجَ (خ ر ج) |
| 176. దానితో | | بِهٖ |
| 177. నుండి, చే, యొక్క | | مِنْ |
| 178. ఫలాలు, పొందినవి, ప్రయోజనాలు | ثَمَرَةٌ | ثَمَرَاتٌ |
| 179. అప్పుడు నిలబెట్ట వద్దు, నియమించవద్దు | | فَلَا تَجْعَلُوْا (ج ع ل) |
| 180. భాగస్వాములు, సమానమైనది | | أَنْدَادًا |
| 181. మీరు (బహు) | | أَنْتُمْ |
| 182. మీరు తెలుసుకున్నారు | | تَعْلَمُوْنَ (ع ل م) |
| 183. అయితే | | إِنْ |
| 184. మీరున్నారు (బహు) | | كُنْتُمْ |
| 185. లో, లోపల | | فِي |
| 186. సందేహం, అనుమానం | | رَيْبٌ |
| 187. మేము దింపాము/అవతరింపజేశాము | | نَزَّلْنَا (ن ز ل) |
| 188. పైన, మీద | | عَلٰى |
| 189. బానిస, దాసుడు | | عَبْدٌ |
| 190. కాబట్టి తీసుకురండి (బహు) | | فَأْتُوْا |
| 191. ఖుర్’ఆన్‌లోని ఒక అధ్యాయం | | سُوْرَةٌ |
| 192. అటువంటి | | مِثْلِهٖ |
| 193. మరియు పిలవండి (బహు) | | وَ ادْعُوْا (د ع و) |
| 194. సాక్షులు | | شُهَدَاءُ (شَهِيْدٌ |
| 195. అల్లాహ్ కాకుండా | | مِنْ دُوْنِ اللهِ |
| 196. సత్యవంతులు | (صَادِقٌ | صَادِقِيْنَ (ص د ق) |
| 197. అప్పుడు | | فَ |
| 198. అయితే | | إِنْ |
| 199. కాదు | | لَمْ |
| 200. మీరు చేయగలరు (బహు) | | تَفْعَلُوْا (ف ع ل) |
| 201. ఎన్నడూ | | لَنْ |
| 202. వారి, దాని | | اَلَّتِيْ |
| 203. ఇంధనం | | وَقُوْدٌ |
| 204. దానియొక్క, ఆమె యొక్క | | هَا |
| 205. రాళ్ళు | | حِجَارَةٌ |
| 206. సిద్ధంచేయబడింది | | أُعِدَّتْ (ع د د) |
| 207. సత్య తిరస్కారులు | كَافِرٌ | كَافِرِيْنَ |
| 208. శుభవార్తల నివ్వు | (بَشَارَةٌ | بَشِّرْ |
| 209. వారు పనిచేసారు, వారు ఆచరించారు | | عَمِلُوْا |
| 210. మంచి పనులు | (صَالِحُوْنَ | صَالِحَاتٌ |
| 211. అది | | أَنَّ |
| 212. వారి కొరకు | | لَهُمْ |
| 213. స్వర్గవనాలు | جَنَّةٌ | جَنَّاتٌ |

| | | | | |
|---|---|---|---|---|
| 214. ప్రవాహం | | تَجْرِيْ | 220. ఇది | هٰذَا |
| 215. దిగువన, క్రింద | | تَحْتَ | 221. ఇవ్వబడింది, అనుగ్రహించబడింది | أُتُوْا |
| 216. నదులు | نَهْرٌ | أَنْهَارٌ | 222. అటువంటి | مُتَشَابِهًا |
| 217. ఎప్పుడైనా | | كُلَّمَا | 223. సహవాసులు | أَزْوَاجٌ |
| 218. ప్రసాదించబడ్డారు | | رُزِقُوْا | 224. నిర్మలమైన | مُطَهَّرَةٌ |
| 219. ఫలం | ثَمَرَاتٌ | ثَمَرَةٌ | 225. శాశ్వతంగా ఉంటారు | خَالِدُوْنَ |

**తఫ్సీర్** (2:21-25) :

**ఓ మానవులారా! మిమ్మల్ని మరియు మీకు పూర్వం వారిని సృష్టించిన మీ ప్రభువు (అల్లాహ్)నే ఆరాధించండి, బహుశా మీరు భక్తిపరులు కావచ్చు (మిమ్మల్ని మీరు కాపాడు కోవచ్చు)! ఆయన(అల్లాహ్)యే మీ కొరకు భూమిని పరుపుగాను మరియు ఆకాశాన్ని కప్పుగాను చేశాడు. మరియు ఆకాశం నుండి వర్షాన్ని కురిపించి, తద్వారా మీకు జీవనోపాధిగా ఫలాలను (పంటలను) ఉత్పత్తి చేశాడు! కావున ఇది తెలుసుకుని కూడా, మీరు ఇతరులను అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టకండి. (21, 22)**

వాక్యం ప్రారంభంలో ఉపయోగించిన అరబీ పదం 'అన్-నాస్' (మానవులు). అల్లాహ్ మానవులందరినీ సంబోధిస్తూ చెబుతున్నారు. మిమ్మల్ని మరియు మీకు పూర్వం పుట్టిన వారిని సృష్టించినవాడు అంటే అర్థం - సర్వమానవాళిని సృష్టించింది అల్లాహ్‌యే! అయితే ఇక్కడ ఓ ముఖ్యమైన విషయం ఉంది. మిమ్మల్ని మరియు మీకు పూర్వం వారిని అని చెప్పడం జరిగింది కాబట్టి రాబోయే వారిని సృష్టించేది ఎవరు? అని అనుమానపడ నవసరం లేదు. వారిని సృష్టించేది కూడా అల్లాహ్‌యే! రాబోయేవారి గురించి ఇక్కడ చెప్పవలసిన అవసరం ఏముంది? ఎందుకంటే ముహమ్మద్(స)వారే చివరి ప్రవక్త కాబట్టి.

" ల'అల్లకుమ్ తత్తఖూన్ " అనే పదాలను "బహుశా మీరు భక్తిపరులు కావచ్చు" అని అనువదించడం జరిగింది. దీనిని మరో విధంగా కూడా అనువదించవచ్చు. "బహుశా మిమ్మల్ని మీరు నరకాగ్ని నుండి రక్షించుకోవచ్చు" లేదా "బహుశా చెడు నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవచ్చు".

అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిస్తూ, ఆయనకు సహవర్తులనెవరినీ నిలబెట్టకపోతే తప్పనిసరిగా స్వర్గాన్ని పొందగలమని సగటు విశ్వాసి భావిస్తాడు. అయితే 'లఅల్ల' అని అంటే ఇది నిస్సంకోశంగా జరుగుతుందనే తలంపు మాత్రమేగాని గ్యారంటీ కాదు. ఓ నమ్మకం.

స్వర్గానికి వెళ్ళేది విశ్వాసి(మోమిన్) మాత్రమే! అయినప్పటికీ కేవలం 'మోమిన్'ల యొక్క ఆచరణలు వారిని స్వర్గానికి తీసుకొనిపోలేవు. అల్లాహ్ యొక్క కరుణతోనే స్వర్గం లభిస్తుంది.

తరువాత మనిషి చుట్టూ ఉన్న ఈ భౌతిక ప్రపంచంలో అల్లాహ్ అనుగ్రహించిన మేళ్ళు గురించి చెప్పడం జరిగింది. భూమిని పరుపుగా చేశారు. దానిని మానవులకు విశ్రాంతి స్థలంగా చేశారు. అరబీ పదం **'ఫిరాష్'** (పరుపు)కు భాషాపరమైన అర్థం - **పరచబడినది.**

ఈ ఆయత్‌నే ప్రస్తావిస్తూ కొందరు, "భూమి పరుపుగా ఉంటుందని ఖుర్ఆన్‌లో చెప్పబడింది. కాబట్టి ఖుర్ఆన్ సందేశం సైన్స్‌కి విరుద్ధం" అని చెబుతారు. కాని ఇటువంటివారు తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే, సైన్స్‌లో ఏదైనా ఓ దృగ్విషయాన్ని కనుగొంటే దానికి ఒక పేరు పెడతారు. ఆ పేరును భాష నుండి తీసుకుంటారు. అంతేగాని సైన్స్ పదాలతో భాష తయారవ్వలేదు.

కాబట్టి ఒక పదం సైన్స్ పరంగా చెప్పబడిందా? భాషా పరంగా చెప్పబడిందా? అని ముందుగా తెలుసుకోవాలి. ఉదాహరణకు సర్కిల్ (◯)అంటే పరిపూర్ణంగా గుండ్రంగా ఉండే ఓ వృత్తం. మీకు ఎస్.ఐ., సి.ఐ. అనే పదాలు బాగా పరిచయమున్న పదాలే. సి.ఐ. అంటే సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ఒక ఊరిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉన్నాడంటే, ఆ ఊరి చుట్టూ ఉండే కొన్ని పోలీస్ స్టేషన్లకి ఇన్‌స్పెక్టర్ మరియు ఆ ఊర్ల ఎస్.ఐ.లపై అధికారం కలిగిన వ్యక్తి. ఇక్కడ సర్కిల్ అంటే చుట్టూ ఉండే కొంత పరిధి మాత్రమే. అంతేగాని పరిపూర్ణ వృత్తం కాదు. ఆ చుట్టూ ఉన్న ఊర్లన్నింటిని కలిపితే సైన్స్ ప్రకారం సర్కిల్ వలే ఉండదు. కాబట్టి ఇక్కడ సైన్స్ పరమైన అర్థాన్ని కాకుండా భాషాపరమైన అర్థాన్ని తీసుకోవాలి.

కొందరు ఫలానా వ్యక్తి హృదయం బాగా విశాలమైనది అని అంటూ ఉంటారు. కొందరైతే ఫలానా వ్యక్తి హృదయం వెన్నవంటిది అంటారు. 'అతని హృదయం ద్రవించింది' అని కొందరంటారు. ఇవన్నీ భౌతిక విషయాలకి సంబంధించినవి కావు. ఒకరి గుండె చాలా చిన్నదిగానూ, మరొకరిది కొండంత పెద్దదిగానూ ఉండదు కదా! హృదయం ద్రవిస్తుందా? కాబట్టి ఈ మాటలు సైన్స్‌కి వ్యతిరేకంగా అనిపిస్తాయి. కాని ఇక్కడ భాషార్థం కాకుండా, భావార్థం తీసుకోవాలి.

ఏ పదాలను ఏ విధంగా అర్థం చేసుకోవాలి అనే విషయం వ్యక్తి యొక్క మానసిక పరిపక్వత మీద ఆధారపడుతుంది.

కాబట్టి పై ఆయత్ భూమి ఆకారాన్ని వర్ణించే ఆయత్ కాదు. భూమి ఆకారాన్ని వర్ణించే ఆయత్‌లు తరువాయి అధ్యాయాలలో ఉన్నాయి. మనం భూమి క్రస్ట్‌పై ఉన్నాము. భూమిని మూడు భాగాలుగా అనుకుంటే, ఈ క్రస్ట్ భూమి పైభాగాన ఉండే ఒక భాగం మాత్రమే. దీని మందం అతి తక్కువ. మిగతా రెండు భాగాలను ఓ కవర్‌లో చుట్టి ఉంచినట్లు, ఈ భాగం వాటిని చుట్టి ఉంటుంది.

ఈ క్రస్ట్ భాగం మన జీవనానికి అనువుగా ఉంటుంది. దీని క్రింద భాగం మాంటిల్. అది ద్రవ-ఘన స్థితిలో ఉంటుంది. మధ్యలో కోర్ ఉంటుంది. భూమి యొక్క మాంటిల్ భాగంపై పరచబడినదే మనం ఉంటున్న క్రస్ట్. కాబట్టి భూమి గుండ్రంగా ఉన్న విషయాన్ని ఈ ఆయత్ ఖండించడం లేదు.

భూమి గుండ్రంగా ఉన్నప్పటికీ కూడా మానవునికి ఎటువంటి ఇబ్బంది లేకుండా దానిపై విశ్రాంతి తీసుకునే విధంగా దానిని అల్లాహ్ ఏర్పాటు చేశారు.

మరొక అనుగ్రహం ఏమిటంటే ఆకాశాన్ని ఓ అందమైన సీలింగ్ (పైకప్పు)గా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఆకాశం నుండి క్రిందికి వర్షాన్ని పంపుతున్నారు. అంటే దీనర్థం మేఘాలు లేకుండానే పై నుండి పంపబడుతున్నాయని కాదు. పై నుండి ఏది వచ్చినా, అది ఆకాశం నుండి వచ్చిందనే చెప్పబడింది.

ఖుర్'ఆన్‌లో చాలా సందర్భాలలో మేఘాల నుండి వర్షాలను పంపుతున్నట్లు అల్లాహ్ తెలియజేస్తున్నారు.

"ఏమీ? మీరు ఎప్పుడైనా మీరు త్రాగే నీటిని గురించి ఆలోచించారా? **మీరా దానిని మేఘాల నుండి కురిపించే వారు? లేక మేమా దానిని కురిపించేవారము? మేము తలచుకుంటే దానిని ఎంతో ఉప్పుగా ఉండేలా చేసేవారము!** అయినా మీరెందుకు కృతజ్ఞత చూపరు?" (ఖుర్'ఆన్ 56:68-70)

**"మరియు మేఘాల నుండి ధారాపాతంగా వర్షాన్ని కురిపించాము. దానితో మేము ధాన్యం మరియు పచ్చిక (చెట్లు చేమల)ను పెరిగించటానికి! మరియు దట్టమైన తోటలను"** (ఖుర్'ఆన్ 78:14-16)

**మనిషిని సృష్టించక ముందే భూమి మరియు ఆకాశాలు ఉన్నాయి. మేఘాలు ఉన్నాయి. అప్పుడు కూడా వర్షం కురిసేది. కాబట్టి వీటన్నింటిని మనిషి సృష్టించలేదు. వీటి సృష్టి తరువాతే మనిషి సృష్టించబడ్డాడు. ఆ తరువాతే మనిషి విగ్రహాలను తయారు చేసుకున్నాడు. అంటే మనిషి పుట్టాకే విగ్రహాలు తయారయ్యాయి. కాబట్టి ఈ సృష్టికి కారణం మనిషిగాని లేక ఆ మానవుని వలే సృష్టించబడిన మరే వస్తువుగాని కాదు.**

భూమి నుండి మొక్కలు మొలకెత్తి వృక్షాలై ఫలాలు ఇస్తాయి. వీటికి కారణం 'రైతు' అని అనుకుంటారు. కాని ప్రపంచంలో ఎన్నో మహా అరణ్యాలు ఉన్నాయి. వాటిలోని చెట్లను ఎవరు నాటారు? వాటి బాగోగులు ఎవరు చూసుకుంటున్నారు? రైతు భూమిని దున్ని, విత్తనాలు చల్లి, నీరు పెడతాడు. వాటిలో మట్టిని గాని, విత్తనాలనుగాని, నీటిని గాని మనిషి తయారు చేయలేదు. వాటి ఉత్పత్తి మరియు రక్షణ కూడా అల్లాహ్ అధీనంలోనే ఉంది. క్రింది ఆయత్ ఆ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

"మరియు వాస్తవానికి మీ మొదటి సృష్టిని గురించి మీరు తెలుసు కున్నారు. అయితే మీరెందుకు గుణపాఠం నేర్చుకోరు? **మీరు నాటే, విత్తనాలను గురించి, మీరెప్పుడైనా ఆలోచించారా? మీరా వాటిని పండించేది? లేక మేమా వాటిని పండించేవారము?** మేము తలచుకుంటే, దానిని పొట్టుగా మార్చి వేయగలము, అప్పుడు మీరు ఆశ్చర్యంలో పడిపోతారు." (ఖుర్'ఆన్ 56:62-64)

కాబట్టి సూరహ్ బఖరాలో ప్రస్తుతం వివరణ తెలుపబడుతున్న 21 మరియు 22 ఆయత్‌లలో అల్లాహ్ యొక్క లక్షణాలు తెలుపబడు తున్నాయి. ఆ లక్షణాలు సృషించబడిన వాటిల్లో వేటిలోనూ లేవు. మనిషి సృష్టించింది ఆయనే. మనిషి జీవించడానికి ఆకాశాల ద్వారా, భూమి ద్వారా, వర్షాల ద్వారా, ఫలాల ద్వారా జీవనాధారాన్ని కల్పించేది ఆయనే! కాబట్టి మనం ఆరాధించడానికి మరియు విధేయత చూపడానికి అర్హుడు కేవలం అల్లాహ్‌యే!

ఇతరులకు బానిసలుగా కావడం నుండి మానవులని రక్షించడానికి, ఆయత్ చివరిలో ఖుర్'ఆన్ ఇలా చెబుతుంది :

**"కావున ఇది తెలుసుకుని కూడా, మీరు ఇతరులను అల్లాహ్‌కు సాటిగా నిలబెట్టకండి"**

ఆయత్‌లు : 23-24

**మరియు మేము మా దాసుడు (ముహమ్మద్)పై అవతరింపజేసిన దానిని (ఈ ఖుర్'ఆన్‌ను) గురించి, మీకు సందేహముంటే, దాని వంటి ఒక్క సూరానైనా మీరు (రచించి) తీసుకురండి. మరియు అల్లాహ్ తప్ప మీకు ఉన్న సహాయకులను అందరినీ పిలుచుకోండి, మీరు సత్యవంతులే అయితే. కానీ, ఒకవేళ మీరు అలా చేయలేకపోతే - నిశ్చయంగా, మీరు అలా చేయలేరు - మానవులు మరియు రాళ్ళు ఇంధనమయ్యే ఆ నరకాగ్నికి భయపడండి. అది సత్య తిరస్కారుల కొరకే తయారు చేయబడింది.**

మానవునికి ఖుర్'ఆన్ అందించే మార్గదర్శకత్వం రెండు ప్రాథమిక నియమాలపై ఆధారపడి ఉంది. (1) తౌహీద్ (దేవుని ఏకత్వం) మరియు రిసాలా (ప్రవక్తిత్వం).

ముందరి రెండు ఆయత్‌లు (21 మరియు 22) అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకించబడిన కొన్ని పనులను సాక్ష్యాలుగా తెలియపరుస్తూ సృష్టికర్త

ఏకత్వాన్ని ధృవీకరిస్తున్నాయి. అయితే ప్రస్తుత రెండు ఆయత్‌లు (23 మరియు 24) అల్లాహ్ మాటలనే సాక్ష్యాలుగా ముహమ్మద్(స)వారి యొక్క ప్రవక్తిత్వాన్ని ధృవీకరిస్తున్నాయి.

ఏ విధంగా అయితే మానవుడు ఆకాశాన్ని సృష్టించలేడో, వర్షాన్ని సృష్టించలేడో, అదే విధంగా అల్లాహ్ ఖుర్'ఆన్‌లో చెప్పిన మాటలకు సరిసమానమైన మాటలను కూడా సృష్టించలేడని పై ఆయత్‌ల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది.

అల్లాహ్ చేసిన ఛాలెంజ్ అప్పటి వారికే కాదు, ఇప్పుడు మరియు రాబోయే వారికి కూడా. ఈ ఖుర్'ఆన్ గ్రంథం గనుక మనిషి వ్రాసినదేనని అనుమానముంటే, మరో మనిషి చేత వ్రాయించగలమనే నమ్మకం వారికుండేది. వారికి అవకాశమున్న అన్ని రకాల సహాయ సహకారాలు తీసుకోమని స్వయంగా అల్లాహ్‌యే సలహా ఇస్తున్నారు.

అయితే తరువాయి ఆయత్‌లో ఖుర్'ఆన్ ముందుగానే హెచ్చరించింది ఒకవేళ ఆ ఛాలెంజ్‌లో విఫలమైతే వారికి పడబోయే శిక్ష గురించి.

**దివ్య ఖుర్'ఆన్ గ్రంథమే ముహమ్మద్(స)వారి యొక్క ప్రవక్తిత్వం**

ఈ ఆయత్‌లు ఖుర్'ఆన్ యొక్క అద్భుతాన్ని నొక్కి వక్కాణిస్తున్నాయి. ముహమ్మద్(స)వారి ప్రవక్త పదవికి మరియు ఆయన చెప్పే సత్యానికి సాక్ష్యమిస్తున్నాయి.

ముహమ్మద్(స)వారు చూపించిన అద్భుతాలు ఎన్నో ఉన్నాయి. అందులో ఎటువంటి సందేహమూ లేదు. ప్రతీ అద్భుతం మరొక అద్భుతం కంటే గొప్పగా ఉంటుంది. కొన్ని అద్భుతాలను మాచే ప్రచురించ బడిన పుస్తకం 'ముహమ్మద్(స) వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం"లో అందించాము. ఇంకా చాలానే ఉన్నాయి.

కాని వీటన్నింటి కంటే ఆయన(స)ద్వారా అల్లాహ్ చూపిన అతి గొప్ప అద్భుతం మరేమిటో కాదు - 'ఖుర్'ఆన్' గ్రంథమే! ప్రవక్త లందరూ చూపిన అద్భుతాల కంటే, గొప్ప అద్భుతం ఈ ఖుర్'ఆన్.

ప్రవక్తలు చూపిన అద్భుతాల కంటే ఈ ఖుర్'ఆన్ అద్భుతానికి ఓ ప్రత్యేకత ఉంది. ప్రతీ ప్రవక్త ద్వారా అల్లాహుతాలా ఆ కాలానికి మరియు ఆ జాతికి సరిపోయే విధంగా అద్భుతాలు చేయించి ప్రజలకు చూపారు. ఆ అద్భుతం కొంతసమయం మాత్రమే ఉంటుంది.

కాని ఖుర్'ఆన్, ఈ అద్భుతం ప్రళయం వరకూ సజీవంగానే ఉంటుంది. ఈ అద్భుతం ముగిసిపోలేదు.

ఎవరైతే ఈ ఖుర్'ఆన్‌ను 'అల్లాహ్ వచనం'గా ఒప్పుకోవడానికి మొహమాట పడుతున్నారో మరియు ఇది ప్రవక్త(స)వారి రచనగానో లేక మరెవరి రచనగానో అనుమాన పడుతున్నారో వారికి పై ఆయత్ ఓ సులభమైన పరీక్షను ప్రతిపాదించింది - **అటువంటి ఓ సూరహ్‌ని తీసుకు రావాలి లేదా ఖుర్'ఆన్‌కు సరిసమానమైన దానిని తీసుకువచ్చి తమ అనుమానాన్ని నిరూపించుకోవాలి.**

'ఇస్లామ్'ను రూపామాపాలని ఎన్నో రకాలుగా ప్రయత్నిస్తున్న శతృవులు ఈ ఛాలెంజ్‌ను స్వీకరించి వారి అనుమానాన్ని నిరూపించుకుంటే ఇస్లామ్ ఉండేది కాదు కదా! అల్లాహ్ వారికి చాలా మంచి అవకాశం ఇచ్చారు.

ఖుర్'ఆన్‌లో 114 సూరహ్‌లున్నాయి. కేవలం 3 లైన్లతో ఉన్న అతి చిన్న సూరహ్ కూడా ఖుర్'ఆన్‌లో ఉంది. ప్రత్యేకంగా ఫలానా 'సూరహ్' వంటిది రచించుకు రమ్మని చెప్పలేదు కాబట్టి ఈ అతి చిన్న సూరహ్ వంటిది వారు రచించి తీసుకువచ్చి, ఖుర్'ఆన్ అల్లాహ్ గ్రంథం కాదని, ముహమ్మద్(స)వారు ఆయన ప్రవక్త కాదని నిరూపించడానికి ప్రయత్నించవచ్చు. కాని వారు అలా చేయలేకపోయారు.

ఖుర్'ఆన్ గ్రంథాన్ని తెలుగులోనో, ఇంగ్లీష్‌లోనో లేక మరేదైనా అనువాద భాషలో చదివిన వారు అల్లాహ్ విసిరిన ఈ ఛాలెంజ్ గురించి, ఆ అద్భుతం గురించి పొందగలిగినంత అనుభూతిని పొందలేరు.

నిజమైన అనుభూతి పొందాలంటే, అరబీ భాషగురించి తెలుసుకోవాలి. అరబ్బులు ఆ భాషకిచ్చిన ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. వారి చరిత్ర తెలుసుకోవాలి.

నిజంగా ఇవన్నీ తెలుసుకుంటే పొందే ఆ గొప్ప అనుభూతి అంతా ఇంతా కాదు. ఖుర్'ఆన్‌లోని అరబీ భాషపై 800 సం॥ల పాటు జరిగిన పరిశోధన ద్వారా లభించిన గొప్ప విషయాలతో '**ఖుర్ఆన్ అరబీ భాషలోనే ఎందుకు అవతరించింది?**' పుస్తకాన్ని అందించాలని ప్రారంభించి 4 సంవత్సరాలు కావస్తుంది. మా సమయం పూర్తిగా శాంతిబాట పత్రికకే సరిపోవడంతో ఆ పుస్తకాన్ని మధ్యలో ఆపవలసి వచ్చింది.

ఆ పుస్తకంలోని విషయాలు ఏ విద్వాంసులకి చెప్పినా, విన్నవారు ఎంతో గొప్ప అనుభూతికి లోనయ్యేవారు. ఆ విషయాలు తెలుసుకుంటే ఈ ఛాలెంజ్‌లోని గొప్పతనం అర్థమౌతుంది.

ప్రపంచంలో ఏ జాతి కూడా అరబ్బులు తమ భాషను ప్రేమించినంతగా ప్రేమించలేదని ప్రొఫెసర్ హిట్టి గారు స్పష్టం చేశారు. అరబీ భాష అరబ్బులకు ప్రాణంతో సమానం. వారిలో ఏ తెగలోనైనా ఓ కవి పుట్టాడని తెలిస్తే, అందరూ వెళ్ళి పండగ చేసుకునేవారు. వారికి పుస్తకాలు లేవు. వారికి అరబీలో తొలిగ్రంథం - ఖుర్'ఆన్.

తమ పూర్వీకుల చరిత్ర, వారి పేరుప్రఖ్యాతులు మొదలైన విషయాలన్నీ పద్యాల రూపంలో వారు మనస్సులలోనే భద్రపరచుకునేవారు.

వారి జ్ఞాపకశక్తి అమోఘం. బహిరంగంగా సాహిత్య సమావేశాలు జరుగుతూ ఉండేవి. ప్రవక్త(స)వారి కాలంలో గొప్ప కవులు ఉండేవారు. ఖుర్'ఆన్ గ్రంథం మానవ రచనే అయితే, ఇస్లామ్‌ను విరోధించే ఆ కవులు ఓ మూడులైన్లతో ఖుర్'ఆన్ ఆయత్‌లకు సమానమయ్యే విధంగా వ్రాసి చూపవచ్చు కదా!

**(తరువాయి భాగం కొరకు 23వ పేజీ చూడండి)**

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

ప్రపంచ శాంతి దూత

# ముహమ్మద్ (స) వారి

**బోధనలు ఆచరణలు**

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం (14)

( జనవరి'2011 సంచిక తరువాయి భాగం)

**ఈ నెల ప్రత్యేకం : సంపాదన**

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై'10 సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా తరువాయి సంచికలో వివరించడం జరిగింది. వ్యాపారం మరియు వ్యవసాయ ఉత్పతులు వాటికి సంబంధించిన విషయాలను ఈ శీర్షికలోని గత రెండు వ్యాసాలలో అందించడం జరిగింది. హరామ్(నిషిద్ధ) వ్యాపారాలు చేయకూడదు. హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారంలో కూడా ఏ ఏ విషయాలు ప్రవక్త(స)వారిచే నిషేధించేబడ్డాయో, ఏవి అనుమతించబడ్డాయో ఇంతవరకూ చెప్పడం జరిగింది.

## సంపాదన

ఈ వ్యాసంలో వివిధ రకాల సంపాదనలపై ముఖ్యమైన విషయాలను అందిస్తున్నాము.

### స్వచ్ఛమైన సంపాదన

ఆయిషా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, ''ఒకని కుమారుడు అతని సంపాదనలలోని భాగం, అతను స్వచ్ఛంగా సంపాదించిన వాటిలో, కావున మీరు వారి సంపాదన నుండి తీసుకోవచ్చు. (అబూదావూద్, సహీహ్, 3529, పుస్తకం 22, అధ్యా.77, సంపుటి 4)

### హరామ్ సంపాదన? లేక హలాల్ సంపాదన?

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ఒక సమయం వస్తుంది అప్పుడు మనిషి అతని ఐశ్వర్యం ఎక్కడి నుండి వస్తుందో లెక్కచేయడు (ఆ సంపాదన) హలాల్ లేక హరామ్ (అవునో కాదో తెలుసుకోడు). (నసాయీ, సహీహ్, 4459, పుస్తకం 44, అధ్యా.2, సంపుటి 5)

అంటే సంపాదించే సొమ్ము ధర్మసమ్మతమైనదా (హలాల్) లేక నిషేధించబడినదా(హరామ్) అని పట్టించుకోని కాలం వస్తుందని ప్రవక్త(స)వారు ముందుగా చెప్పారు. ప్రస్తుత కాలం ఆ విధంగానే ఉంది.

### నిషేధించబడిన సంపాదనలు

వాటిలో కొన్నింటిని ఇక్కడ అందిస్తున్నాము.

అబూ మస్'ఊద్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు నిరోధించారు కుక్క ఖరీదును, వేశ్య సంపాదనను మరియు జ్యోతిష్యుని రుసుమును. (అబూదావూద్, సహీహ్, 3428, పుస్తకం 22, అధ్యా.40, సంపుటి 4)

---

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) నుండి అబూ సుఫ్యాన్(రజి) ఉల్లేఖించారు. ప్రవక్త(స) నిరోధించారు కుక్కలు మరియు పిల్లుల ఖరీదును' (అబూదావూద్, సహీహ్, 3479, పు. 62, అధ్యా.40, సం. 4)

---

అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) కుక్క ఖరీదును నిరోధించారు మరియు ఎవరైనా వచ్చి కుక్క యొక్క వెలను అడిగినట్లయితే, అతని చేతిని మట్టితో నింపండి. (అబూదావూద్, సహీహ్, 3482, పుస్తకం 22, అధ్యా.63, సంపుటి 4)

---

ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) విత్తులు కొట్టని పశువుతో సంతానాభివృద్ధి కొరకు తీసుకునే రుసుమును నిరోధించారు. (అబూదావూద్, సహీహ్, 3429, పుస్తకం 22, అధ్యా.40, సంపుటి 4)

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : నిస్సందేహంగా అల్లాహ్ **ఖమ్ర్** మరియు **దాని ఖరీదును** నిషేధించారు మరియు **చనిపోయిన జంతువు మాంసాన్ని** మరియు దాని ఖరీదును మరియు నిషేధించారు పందిని మరియు **దాని ఖరీదును.** (అబూదావూద్, సహీహ్, 3485, పుస్తకం 22, అధ్యా.64, సంపుటి 4)

---

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం. నేను రసూలుల్లాహ్(స)వారు (కాబా) మూలలో కూర్చుని ఉండగా చూశాను. ఆయన(స) ఆకాశం వంక చూసి చిరునవ్వు నవ్వారు. తరువాత ఆయన చెప్పారు, 'అల్లాహ్ యూదులను శపించుగాక! (దానిని) మూడుసార్లు (చెప్పారు). సర్వశక్తివంతుడైన అల్లాహ్ కొవ్వును వారికి నిషేధించారు. కాని వారు దానిని అమ్మి మరియు ఆ సొమ్మును తింటున్నారు. ఎప్పుడైతే ప్రజలకు ఓ వస్తువును తినవద్దని అల్లాహ్ నిషేదిస్తే దాని సొమ్మును (కూడా) వాళ్లకు నిషేధించినట్లు' (అబూదావూద్, సహీహ్, 3488, పుస్తకం 22, అధ్యా.64, సంపుటి 4)

### నిత్యావసర వస్తువులను నిల్వచేసి కృత్రిమ కొరతను కలుగజేయడం

ముహమ్మద్ బిన్ అమ్ర్ బిన్ 'అతా, స'ఈద్ బిన్ ముసయ్యబ్ నుండి, మ'మార్ బిన్ అబీ మ'మార్, బనీ అదీ బిన్ కా'బ్ చెప్పారు: అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **ఎవరూ నిల్వ చేయరు, పాపాత్ముడు తప్ప**. నేను స'ఈద్‌తో అన్నాను, ''నీవు నిల్వ ఉంచుతావు''. అతను చెప్పాడు, ''మ'మార్ నిల్వ ఉంచేవాడు''. అబూదావూద్ చెప్పారు : నేను అహమద్‌ని అడిగాను, ''(నిరోధించబడిన రకపు) నిల్వ చేయడం అంటే ఏమిటి?'' అతను చెప్పారు, ప్రజలు జీవించడానికి అవసరమైన వస్తువులు''. (అబూదావూద్, సహీహ్, 3447, పుస్తకం 22, అధ్యా.47, సంపుటి 4)

ప్రజలకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులను నిల్వచేసి, కృత్రిమ కొరతను సృష్టించి, ఎక్కువ లాభాలను గడించడం. ఈ తరహాలో సంపాదించడాన్ని నిరోధించారు.

### మోసాన్ని నిరోధించారు

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఆహారాన్ని (ఆహార దినుసులను) అమ్మే వ్యక్తి ప్రక్కనుండి వెళుతూ అతనిని అడిగారు అతడు ఏ విధంగా అమ్మకం చేస్తున్నాడోనని. మరియు అతడు ఆయన(స)కు చెప్పాడు. అందులో ఆయన(స)వారి చేయి నుంచమని దివ్య సందేశం ఆయనకు వచ్చింది, కావున ఆయన(స) తన చేతిని దానిలో ఉంచారు మరియు అది తడిగా ఉందని తెలుసు కున్నారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: 'మోసం చేసేవాడు మనలో ఒకడు కాదు'' (అబూదావూద్, సహీహ్, 3452, పుస్తకం 22, అధ్యా.50, సంపుటి 4)

మోసం చేసి సంపాదించేవాడు ముహమ్మద్(స)వారి ఉమ్మత్‌లోని వాడు కాదు.

**కష్టపడి సంపాదించడం ఉత్తమం**

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు. ఉత్తమమైన (చాలా స్వచ్ఛమైన) ఆహారం మనిషి తినేది అతను స్వయంగా సంపాదించుకున్నదానితో మరియు అతని కుమారుడు అతని సంపాదనలో ఓ భాగం. (కుమారుని సంపాదనలో తండ్రికి భాగం ఉంది) (నసాయీ, సహీహ్, 4456, పుస్తకం 44, అధ్యా.1, సంపుటి 5)

---

అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం : ఓ అన్సార్ వ్యక్తి ప్రవక్త(స) వద్దకు వచ్చి ఆయనను (దానం) అడిగారు. ప్రవక్త(స) చెప్పారు: "నీ ఇంటిలో ఏమైనా ఉందా?" అతను చెప్పాడు : "ఔను! ఒక ముతక చాప (నా దగ్గరుంది). దాని ఒక భాగాన్ని మేము కప్పుకోవడానికి మరియు ఒక భాగాన్ని మేను వాల్చడానికి ఉపయోగిస్తాము. మరియు మాకు ఒక పాత్ర ఉంది దాని నుండి మేము నీళ్ళు త్రాగుతాము". ఆయన(స) చెప్పారు: "వాటిని నా దగ్గరకు తీసుకురా", అతడు వాటిని తీసుకు వచ్చాడు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వాటిని తన చేతిలో పట్టుకుని అన్నారు : **"నా నుండి ఈ రెండింటిని ఎవరు కొంటారు?"** ఒక వ్యక్తి అన్నాడు: "నేను వాటిని ఒక దిర్హమ్‌కొరకు తీసుకుంటాను". అప్పుడు ఆయన(స) అన్నారు: **"ఒక్క దిర్హమ్ కంటే ఎక్కువ ఎవరు ఇస్తారు?"** రెండు లేదా మూడుసార్లు (అన్నారు). ఒక వ్యక్తి అన్నాడు: "నేను వాటిని రెండు దిర్హమ్‌ల కొరకు తీసుకుంటాను". కనుక ఆయన(స)వాటిని అతనికి ఇచ్చేశారు, రెండు దిర్హమ్‌లు తీసుకుని వాటిని అన్సారీ కిచ్చేశారు అతనితో (ఇలా) చెబుతూ : **"ఒక (దిర్హమ్)తో ఆహారం కొని నీ కుటుంబానికి తీసుకెళ్ళు మరియు మరొక (దిర్హమ్)తో గొడ్డలి కొని దానిని నా దగ్గరకు తీసుకురా"**. అతను దానిని ఆయన(స)వారి దగ్గరకు తీసుకువచ్చాడు, మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన స్వీయ హస్తాలతో దానికి కర్రను తగిలించి, తరువాత అతనికి చెప్పారు: "వెళ్ళి వంటచెరకు (కట్టెలు) సేకరించి వాటిని అమ్ము. మరియు నేను పదిహేను రోజులపాటు నిన్ను చూడనివ్వకూడదు (అంటే పదిహేను రోజుల పాటు కనిపించవద్దని)". ఆ వ్యక్తి వంటచెరకును సేకరించడానికి మరియు అమ్మడానికి వెళ్ళాడు. మరియు తరువాత 10 దిర్హమ్‌లతో తిరిగి వచ్చాడు. దానిలోని కొంత భాగంతో అతడు ఓ వస్త్రాన్ని కొన్నాడు మరియు కొంత భాగంతో ఆహారాన్ని. అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "తీర్పుదినాన నీ మొహంపై వికృతంగా నీ భిక్షాటన రావడం కంటే **ఇది ఉత్తమం కాదా?**"

భిక్షమెత్తుకోవడానికి అనుమతి లేదు ముగ్గురికి తప్ప : (1) బాగా పేదవాడైన వ్యక్తి లేదా (2) తీవ్రనష్టాలలో ఉన్న వ్యక్తి లేదా (3) బాధాకరమైన రక్తం కొరకు (రక్త పరిహారం కొరకు)" **(అబూదావూద్, హసన్ హదీస్ నెం. 1641, పుస్తకం 9, అధ్యా. 26, సంపుటి 2)**

(మరో ఉల్లేఖనం ప్రకారం భిక్షాటన చేసేవాడు మొహం మీద మాంసం లేకుండానే అల్లాహ్‌ను కలుస్తాడు).

**మిగులు నీటిని అమ్మకూడదు**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. **మిగులు నీటిని పట్టి ఉంచ కూడదు**, పశువుల కాపర్లు తమ పశువులను మేపేటందుకు రాకుండా నిరోధించే ఉద్దేశ్యంతో" (అబూదావూద్, సహీహ్, 3473, పుస్తకం 22, అధ్యా.60, సంపుటి 4)

---

ఇయాస్ బిన్ 'అబ్ద్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు నిరోధించారు "మిగులు నీటిని అమ్మడాన్ని" (అబూదావూద్, సహీహ్, 3478, పుస్తకం 22, అధ్యా.61, సంపుటి 4)


**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**

SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
**(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)**
**కావలిసిన వారు**
**రూ. 165/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్ల నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

**నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 5**

*ఆగష్టు '10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ నవముస్లిమ్ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. ఇంత వరకూ బిలాల్(రజి), అబూజర్(రజి) మరియు సల్మాన్ ఫార్సీ (రజి) ఏ విధంగా ఇస్లామ్ స్వీకరించారు, వారెటువంటి సమస్యలను ఎదుర్కొన్నారు, ఆ సమస్యలను ఏ విధంగా అధిగమించారో తెలియజేశాము. ఈ నెల అబూ ఉబైదా (రజి) వారి గురించి క్లుప్తంగా మీకు అందిస్తున్నాము.

## అబూ ఉబైదా బిన్ జర్రా (రజి)

**ఓ పేద గవర్నర్ మరియు ప్రపంచంలోనే అతి పెద్ద ముస్లిమ్ సైన్యానికి సర్వసైన్యాధిపతి**
**అధికారం మరియు పదవులతో ఎంటువంటి గర్వాన్ని దరిచేరనీయని**
**నిరాడంబరుడు, ధర్మ పరాయణుడు**



**"ప్రతీ ఉమ్మత్ ఓ నమ్మకస్తుడిని కలిగి ఉంటుంది**
**అబూ ఉబైదా ఈ ఉమ్మత్ యొక్క నమ్మకస్తుడు"**

## అబూ ఉబైదా బిన్ జర్రా (రజి)

### ఇస్లామ్ స్వీకరణ

ఈయన అబూ బకర్ సిద్ధీఖ్ (రజి)వారికి మంచి స్నేహితుడు. అబూ బకర్(రజి)వారి గురించి పాఠకులకు బాగా తెలిసిన విషయమే! ఆయన తొలి ఖలీఫా మరియు పురుషులలో ఇస్లామ్ స్వీకరించిన తొలి వ్యక్తి. ఆయన ఇస్లామ్‌ను అబూ ఉబైదా(రజి)కి పరిచయం చేసి ముహమ్మద్(స) వారితో కలిసి మాట్లాడే ఏర్పాటు చేశారు.

ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి మాటలను విన్నాక అబూ ఉబైదా(రజి)వారికి ముహమ్మద్(స)వారి గురించి స్పష్టంగా అర్ధమైంది. ఇస్లామ్ స్వీకరిస్తే తనపై మక్కా విగ్రహారాధకుల నుండి ఎటువంటి ఉపద్రవాలు పడతాయో ఊహించగలిగి కూడా ఇస్లామ్ స్వీకరించారు. అంతేకాదు ఎన్నో కష్టాలలో ఆయన ప్రవక్త(స) వారి వెంటే ఉన్నారు.

విగ్రహారాధనను వదిలేసి ఇస్లామ్ స్వీకరించి నందుకు మక్కాలో అవిశ్వాసులు పెట్టే హింసల నుండి కాపాడుకోవడానికి ప్రవక్త(స)వారి ఆదేశం మేరకు కొందరు అబిసీనియా దేశానికి వలస వెళ్ళిపోయారు. కాని అబూ ఉబైదా(రజి)వారు వలస వెళ్ళలేదు. ముహమ్మద్(స)వారిని ఒంటరిగా వదిలి వెళ్ళడానికి ఆయనకు మనసొప్పలేదు. ఆయన మక్కాలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు.

ఇస్లామ్ జ్యోతిని ఆర్పడానికి ఎన్నో హింసలు పెట్టి అలసి పోయిన అవిశ్వాసులు, ముస్లిములను మరియు ముహమ్మద్(స)వారి వంశమైన బనీ హాషిమ్ వారిని ఊరినుండి వెలివేశారు. 'షేబె అబీ తాలిబ్' (అబూ తాలిబ్ లోయ)లో వారంతా జీవించవలసి వచ్చింది.

అంతేకాకుండా మక్కా అవిశ్వాసులు వారితో ఎటువంటి వ్యాపార మరియు ఇతర బంధుత్వ సంబంధాలు ఉంచుకోకూడదని మరియు వారికి ఆహారం లేకుండా చేయాలని ప్రతిజ్ఞ చేసుకున్నారు.

ఆ లోయలో ప్రవక్త(స)వారు, అబూ ఉబైదా(రజి) మరియు ఇతర ముస్లిములు దుర్భర జీవితాన్ని గడిపారు. ఆఖరికి వారు ఆకులను కూడా తినవలసిన పరిస్థితి వచ్చింది. అయినప్పటికీ వారు తమ విశ్వాసాన్ని వదులుకోలేదు.

ఆ వెలి చివరికి విఫలమైంది. కాని ముస్లిములను అణచివేతకు గురిచేసే కార్యక్రమాలు మాత్రం ఆగలేదు. అవి ముస్లిములపై కొనసాగుతూనే ఉన్నాయి. ఖురైష్‌లపై సవాల్ చేయడానికి వారు చాలా బలహీన స్థితిలో ఉన్నారు. కాబట్టి ముహమ్మద్(స)వారు తన సహచరులను అబిసీనియాకు వలస వెళ్ళమని రెండవసారి ఆదేశించారు. అబూ ఉబైదా(రజి) మరియు ఇతర ముస్లిములు మక్కా వదిలి విగ్రహారాధకుల హింసల నుండి కాపాడుకోవడానికి ఓ కొత్త ప్రదేశానికి వలస వెళ్ళారు.

అయితే వారు ఆ విధంగా హింసల నుండి తప్పించుకు వెళ్ళిపోవడాన్ని ఖురైష్‌లు జీర్ణించు కోలేకపోయారు. వారి తరపున మక్కా నుండి ఓ రాయబారిని అబిసీనియా రాజుగారి దగ్గరకు పంపారు. ఏదో విధంగా వారిని వెనక్కి తీసుకువచ్చి చిత్రహింసలకు గురిచెయ్యాలనేది వారి కోరిక. వారు రాజు గారి దగ్గరికి వెళ్ళి, ఈ ముస్లిములు తమ పూర్వీకుల ధర్మాన్ని వదిలేసి, క్రైస్తవ ధర్మంతో సహా అన్ని ధర్మాలను వ్యతిరేకిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆ రాజు క్రైస్తవుడు కనుక కోపంతో ఆశ్రయం ఇవ్వకుండా వారినందరినీ వెనక్కి పంపించేస్తారని ఆశించారు.

కాని అబిసీనియా రాజుగారు మంచివారు మరియు న్యాయాన్ని గౌరవించే వ్యక్తి. తన దేశానికి వలస వచ్చిన ముస్లిములకు ఖురైష్‌లు చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పుకునే అవకాశాన్ని ఇచ్చారు. వారు ఇస్లామ్‌కు పూర్వం మరియు తరువాత ఉన్న పరిస్థితులను వివరించారు. అంతేకాకుండా తాము జీసస్‌ను మర్యమ్ వారి కుమారుడిగానూ మరియు ప్రవక్త గానూ విశ్వసిస్తామని చెప్పారు.

ఈ ముస్లిములు నిజ ధర్మాన్నే అనుసరిస్తున్నారని రాజుగారికి స్పష్టంగా అర్ధమైంది. అంతేకాకుండా వారందరూ స్వేచ్ఛగా తమ దేశంలో ఉండే అవకాశాన్ని కల్పించారు. ఇతరులు వారికి ఎటువంటి హాని తలపెట్టరని వారికి భరోసా ఇచ్చారు. అబిసీనియాకు వలస వెళ్ళిన ముస్లిములు అక్కడ చాలాకాలం ఉన్నారు.

ముహమ్మద్(స)వారు మక్కానుండి మదీనాకు వలస వెళ్ళారు. ఆ తరువాత అబూ ఉబైదా(రజి)వారు మరియు ఆయనతోపాటు అబిసీనియాకు వలస వచ్చిన వారంతా అక్కడినుండి మదీనాకు పయనమయ్యారు. వీరంతా మదీనా చేరగానే తోటి ముస్లిములు వీరిని అక్కున చేర్చుకున్నారు. ఇస్లామీయ ప్రభుత్వ నిర్మాణంలో అబూ ఉబైదా(రజి) తన వంతు కృషి సలిపారు.

అక్కడ తొలి మస్జిద్ నిర్మాణంలో పాలుపంచుకున్నారు.

ఇదే శీర్షికలో ఇప్పటి వరకూ 4 గురు సహాబీల గురించి తెలియజేశాము. ఆ వ్యాసాలలో బద్ర్ మరియు ఉహద్ యుద్ధాల గురించి కొంత చెప్పడం జరిగింది. ఇక్కడ వాటిని మరలా చెప్పడం లేదు.

### కఠిన పరీక్ష: తండ్రా? లేక ఇస్లామా?

బద్ర్ యుద్ధం భీకరంగా జరుగుతుంది. అబూ ఉబైదా(రజి)వారు కూడా తీవ్రంగా పోరాడుతున్నారు. అయితే ఆయనకు వింత పరిస్థితి ఎదురైంది. ఖురైష్‌లకు తోడుగా తన తండ్రి కూడా యుద్ధం చేస్తున్నాడు. అతడు తన కుమారుడిని చూచాడు. తన కుమారుడిని కలవడం అంటూ జరిగితే అతనిని ఒక్క నిమిషం కూడా బ్రతక నివ్వకూడదని అతడు అప్పటికే నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే అతని కుమారుడు అతని దైవాలను (విగ్రహాలను) వదిలేసాడు మరియు ఇస్లామ్ ధర్మాన్ని అనుసరిస్తున్నాడు.

తండ్రీ కొడుకులు యుద్ధంలో ఒకరికొకరు ఎదురయ్యారు. అబూ ఉబైదా(రజి)వారి పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. ఆయన తన తండ్రిని చంపడానికి తటపటాయిస్తున్నారు. తనకు వీలైనంత వరకూ తండ్రిని వదిలేయడానికే చూస్తున్నారు. ఇది నిజంగా కఠిన పరీక్ష. కాని ఆ తండ్రి

మాత్రం తన కుమారుడిని చంపడానికే నిశ్చయించుకున్నాడు. ఇద్దరి మధ్య పోరాటం జరిగింది. తన విశ్వాసాన్ని మరియు ప్రాణాన్ని రక్షించుకోవడానికి తండ్రిని చంపడం తప్పితే మరో అవకాశం లేకుండా పోయింది. ఆయన తండ్రిని చంపేశారు.

అబూ ఉబైదా(రజి) ఈ విషయంలో చాలా విచారంగా ఉన్నారు. చాలా పెద్ద పాపం చేశానేమోనని ఆయన చాలా బాధపడుతున్నారు. కాని ఆయన చేసిన దానిని ప్రశంసిస్తూ ఓ ఆయత్ అవతరించబడింది.

**అల్లాహ్ మరియు పరలోకాన్ని విశ్వసించే జనులలో (మోమిన్‌లలో) అల్లాహ్ మరియు ఆయన సందేశహరుణ్ణి వ్యతిరేకించే వారిని ప్రేమించటాన్ని నీవు ఎన్నడూ చూడలేవు. ఆ వ్యతిరేకించే వారు, తమ తండ్రులైనా లేదా తమ కుమారులైనా లేదా తమ సోదరులైనా లేదా తమ కుటుంబంవారైనా సరే! అలాంటి వారి హృదయాలలో ఆయన విశ్వాసాన్ని స్థిరపరచాడు.** (ఖుర్‌ఆన్ 58:22)

తాను చేసిన పని సరియైనదేనని తెలుసుకున్నాక అబూ ఉబైదా(రజి)కి తృప్తి కలిగింది.

బద్ర్ పరాజయం తరువాత మరో రెండు సంవత్సరాలకు ప్రతీకారంతో ఖురైష్ నాయకులు మరలా యుద్ధానికి సిద్ధమయ్యారు. 3000 మంది సైనిక బలంతో బయలుదేరి వచ్చారు. దాదాపు 1000 మంది ముస్లిములు సమావేశమై, ఉహద్ పర్వత దిశగా కదిలారు శత్రువులను ఢీకొనడానికి. అయితే కొందరు కపట విశ్వాసులు వెనుక మదీనాలోనే ఉండిపోయారు. దాదాపు 3వ వంతు సైన్యం వెనుకకు వెళ్ళిపోవడం జరిగింది. ముస్లిములు చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నప్పటికీ, అల్లాహ్ నుండి సహకారం అందుతుందనే ధృడ విశ్వాసంతో ఉన్నారు.

ప్రవక్త(స)వారు 50 మంది విలుకాండ్రులను (బాణాలు వదిలేవారిని) ఓ చిన్న కొండపై యుద్ధ రంగానికి చేరువలో ఉంచారు. వెనుకవైపునుండి జరిగే దాడి నుండి రక్షణగా ఉండాలని వారిని ఆదేశించారు. యుద్ధ ఫలితం ఏదైనప్పటికీ వారు తమ స్థానాలను వదిలి రావద్దని కూడా ఆదేశించారు.

యుద్ధరంగం నుండి మక్కా అవిశ్వాసులు పలాయనం చిత్తగించారు. వారి వెనుక ముస్లిములు పడ్డారు. ఇది వారిపై గొప్ప దెబ్బే. తమ స్థానాల్లో కదలకుండా ఉండవలసిన విలుకాండ్రు యుద్ధరంగంలో తమ తోటి ముస్లిములు యుద్ధప్రాప్తిని సేకరించడాన్ని చూశారు. వారిలో ఎక్కువ మంది తమకు ఇచ్చిన ఆదేశాన్ని మరచిపోయి తమ స్థానాలను వదిలేసి వారు కూడా యుద్ధప్రాప్తి సేకరణలో పడిపోయారు.

కొందరు ఖురైష్ గుర్రపు రౌతులు విలుకాండ్రు స్థానాలను వదిలేయడాన్ని గమనించారు. అంతే వారు ముస్లిము సైన్యంపై వెనుక వైపు నుండి దాడి చేశారు. పారిపోతున్న ఖురైష్ సైనికులకు ఈ వెనుక వైపు నుండి జరుగుతున్న దాడి గురించి అర్థమై తిరిగి బలాన్ని పుంజుకుని ముస్లిములపై తిరగబడ్డారు. ఆ విధంగా అన్నివైపుల నుండి శతృవులు చుట్టుముట్టారు.

ముస్లిములలోని చాలామంది వీరులు మరణించారు. కొందరు యుద్ధ రంగం నుండి తప్పించుకున్నారు. వారు ముహమ్మద్(స)వారు మరణించారని భావించారు. అయితే మిగిలినవారు వారి వారి స్థానాలలో యుద్ధం చేస్తున్నారు.

అబూ ఉబైదా(రజి)వారు సైన్యం మధ్యలో ఉన్నారు. చివరి క్షణం వరకూ పోరాడటానికి సిద్ధపడి ఉన్నారు. ఆయన ప్రవక్త(స)వారి దగ్గరే ఉన్నారు. ప్రవక్త(స)వారి సహచరులు తమ శక్తినంతా కూడదీసుకుని యుద్ధం చేస్తున్నారు. ముహమ్మద్(స)వారి ముఖానికి ఓ బాణం వచ్చి తగిలింది. ప్రవక్త(స)వారు పడిపోయారు. అబూ ఉబైదా(రజి) ప్రవక్త(స) వారివైపు పరుగెట్టుకుని వచ్చారు. ప్రవక్త(స)వారి శిరస్త్రాణం యొక్క రెండు గొలుసులు ఆయన(స) ముఖంలోకి గుచ్చుకు పోయాయి. అటువంటి భీకరమైన పరిస్థితిలో అబూ ఉబైదా(రజి)వారికి ఆలోచించే సమయం కూడా లేదు. ఆయన తన ముందరి పళ్ళతో వాటిని పట్టుకుని ప్రవక్త(స)వారి ముఖం నుండి తీసివేశారు. ఆ విధంగా చేయడంలో ఉబైదాగారి ముందరి పళ్ళు రెండు ఊడిపోయాయి.

యుద్ధం చివరి వరకూ ప్రవక్త(స)వారికి కవచంలా నిలబడి ఆయన పోరాడారు. ఆ తరువాత జరిగిన యుద్ధం కందక యుద్ధం. దీని గురించి సల్మాన్ పార్సీ(రజి)వారి వ్యాసంలో వివరించాము.

## మిలటరీ కమాండర్

ఎన్నో సైనికయాత్రలకి నాయకుడిగా అబూ ఉబైదా(రజి)ను ప్రవక్త(స)వారు నియమించారు. అన్నింటిలోనూ ఆయన ఎంతో విధేయంతో మరియు విశ్వాసంగల సైనికుడిగా వ్యవహరించారు.

అరేబియా ఉత్తర సరిహద్దుల్లో ఖుదా'అ తెగవారితో రోమన్లు ఒప్పందం చేసుకున్నారు. ముస్లిమ్‌ల ప్రభుత్వానికి వారు అంతరాయం కలిగిస్తున్నారు. ప్రవక్త(స)వారు 'అమ్ర్ బిన్ ఆస్(రజి)ను వారితో పోరాడటానికి నియమించారు. చిన్న సైనిక సమూహంతో వారితో యుద్ధం చేయడం కష్టమని, అదనపు సహాయం కొరకు ఓ రాయబారిని ముహమ్మద్(స)వారి వద్దకు పంపారాయన.

ప్రవక్త(స)వారు అబూ ఉబైదా(రజి)ని 200 మంది సైనికులకు నాయకునిగా నియమించి అమ్ర్ బిన్ ఆస్(రజి)కు సహాయం కొరకు పంపారు. అమ్ర్ బిన్ ఆస్(రజి) మరియు ఉబైదా(రజి)వారు పరస్పరం కలిసినప్పుడు, అమ్ర్‌గారు ముందుగా ఆ పోరాటానికి నాయకత్వం వహించింది తానేనని తనకు సహాయంగా వచ్చిన ఉబైదా గారితో చెప్పారు.

అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి కంటే ముందుగా ఇస్లామ్ స్వీకరించినప్పటికీ అబూ ఉబైదా(రజి)వారు అమ్ర్(రజి) నాయకునిగా ఉండటానికి చేసిన ప్రతిపాదనకు ఎటువంటి అభ్యంతరం చెప్పలేదు.

అల్లాహ్ మార్గంలో పోరాడేవాడు నాయకుడైనా లేక సామాన్య సైనికుడైనా ఒక్కటే! వారి ధ్యేయం కూడా ఒక్కటే!

ప్రవక్త(స)వారు పాల్గొన్న ప్రతీ యుద్ధంలోనూ అబూ ఉబైదా(రజి) పాల్గొన్నారు. ఆ తరువాత ఖైబర్ విజయం మరియు మక్కా విజయం ముస్లిములకు దక్కాయి. ఆ తరువాత ప్రవక్త(స)వారి మరణం సంభవించింది.

అబూ ఉబైదా(రజి) మంచితనం, నీతి కలిగిన వ్యక్తి. ఆయనను ప్రవక్త(స)వారు ఎంతగానో ప్రేమించేవారు. ఆయన(స) తన అనుచరులలో అబూ ఉబైదా(రజి) వారిని నమ్మకస్తుడుగా ప్రకటించారు.

**నమ్మకస్తుడైన రాయబారి**

నజ్రాన్ నుండి ఓ ప్రతినిధి బృందం ఓ ఒప్పందం విషయంలో సంప్రదించడానికి మదీనాకు వచ్చింది. వారు జిజ్యా పన్ను చెల్లించి రక్షణ పొందే విషయంలో ప్రవక్త(స)తో ఒప్పందానికి అంగీకరించారు. ఆ ఒప్పందం పూర్తయ్యాక, వారు ప్రవక్త(స)వారితో ఆయన సహచరులలోని ఒకరిని జిజ్యా పన్ను సేకరించడానికి తమ భూభాగానికి పంపమని అడిగారు. అతడు బాగా నమ్మకస్తుడు అయివుండాలని ప్రవక్త(స)వారికి చెప్పారు.

నిజమైన నమ్మకస్తుడినే వారితోపాటు పంపుతానని ప్రవక్త(స)వారు చెప్పారు. ప్రవక్త(స)వారు మాటలలోని ఆ వ్యక్తి ఎవరా అని తెలుసు కోవడానికి అందరూ ఉబలాట పడుతున్నారు. వారిలో ఆ వ్యక్తి ఎవరో! ఎవరైనాగాని ఆ వ్యక్తికి అది ఎంతో గౌరవప్రదం.

తరువాయి రోజు జుహ్ర్ సలాత్ కొరకు మస్జిద్‌లో ప్రవక్త(స)వారి అనుచరులు హాజరయ్యారు. ప్రవక్త(స)వారు అబూ ఉబైదా(రజి)వారికి ఆ పెద్ద బాధ్యతను అప్పగించారు.

ప్రవక్త(స)వారు అబూ ఉబైదా చేయి పట్టుకుని చెప్పారు :

**"ప్రతీ ఉమ్మత్ ఓ నమ్మకస్తుడిని కలిగి ఉంటుంది, అబూ ఉబైదా ఈ ఉమ్మత్ యొక్క నమ్మకస్తుడు"**

అబూ ఉబైదా(రజి)వారు నమ్మకానికి మరియు నిజాయితీకి సరియైన ఉదాహరణ. ఆయన తన ఆఖరి క్షణం వరకూ అలాగే గడిపారు.

**ప్రవక్త(స)వారు ఆయనకు బోధించారు, ఈ జీవితంలో ఆత్మ మరియు శరీర స్వచ్ఛత కంటే ఏదీ సమానం కాదు మరియు నిజాయితీ, నమ్మకాలను నిలబెట్టుకునేవారికి పరలోకంలో తీర్పు దినం నాడు ఇచ్చే ప్రతిఫలం కంటే ఈ లోకంలో ఏదీ సమానం కాదు.**

**జ్ఞానం మరియు ఆచరణ**

అబూ ఉబైదా(రజి) మరియు ఇతర ముస్లిమ్ సోదరులు ప్రవక్త(స)వారి శరీరాన్ని సమాధి గావించడానికి సిద్ధం చేయడంలో మునిగి ఉండగా, అకస్మాత్తుగా వారికొక వార్త అందింది, అన్సారులంతా వారిలో నుండి తరువాయి నాయకుడు ఎవరో నిర్ణయించు కోవడానికి ఒకచోట సమావేశమయ్యారని.

దాని వలన ముస్లిముల మధ్య ఎటువంటి బేధాలొస్తాయేమోనని నాయకులు భయపడ్డారు.

అబూబకర్, ఉమర్ బిన్ ఖత్తాబ్ మరియు అబూ ఉబైదా (రజి అల్లాహు అన్‌హుమ్) ముగ్గురూ ఈ సమస్యను ఎదుర్కోవడానికి మరియు పరిష్కారాన్ని కనుగొనడానికి సిద్ధపడ్డారు. వారు అన్సారులతో కలిసి ఆ విషయంపై చర్చించారు. అన్సారులు తమవారి నుండే 'ఖలీఫా'ను ఎన్నుకోవాలని మొదట పట్టుబట్టారు. గొడవ బయటపడే సూచనలు కనిపిస్తున్నాయి.

అబూబకర్(రజి)వారు తన వివేకంతో ముహమ్మద్(స)వారి తెగవారి నుండే ఖలీఫా ఉండాలని వారిని ఒప్పించడానికి ప్రయత్నించారు. ఆయన ఉమర్ మరియు ఉబైదా (రజి. అ) ఇద్దరి చేతులను పట్టుకుని అక్కడ సమావేశమైన వారికి సూచించారు వారిలో ఒకరిని ఖలీఫాగా ఎన్నుకోగలరని.

ఉమర్(రజి)వారు ఈ మాటలు వినగానే, ఆయన తన చేతిని అబూబకర్ గారి చేతినుండి లాక్కొని చెప్పారు, అబూబకర్ కాకుండా ఇతరులెవ్వరూ ఖలీఫాకాలేరని, ఆయన ఇస్లామ్‌ను స్వీకరించిన తొలివ్యక్తి మాత్రమే కాకుండా ఉత్తమ విశ్వాసి మరియు ఇస్లామ్‌ను ధృడంగా నిలబెట్టడంలో అన్నీ త్యాగం చేసిన వ్యక్తి అని ఉమర్(రజి) చెప్పారు.

**అబూఉబైదా(రజి) రోదిస్తూ అబూబకర్(రజి)వారికి చెప్పారు, తొలి విశ్వాసి మరియు ప్రవక్త(స)వారికి అత్యంత సన్నిహితుని స్థానంలో తనను ఉంచడం సిగ్గుగా ఉందని అన్నారు. ఆయన పూర్తిగా తిరస్కరించారు. ఇస్లామీయ ఉమ్మత్‌లో తాను ఓ అణుకువ కలిగిన సభ్యుడిగా ఉండటానికే అబూ ఉబైదా(రజి) ప్రాధాన్యమిచ్చారు.**

ఉమర్ మరియు అబూ ఉబైదా(రజి) ఇద్దరూ అబూబకర్(రజి)వారి చేతిని పట్టుకుని, ఆయన ఏమి చెప్పినా మరియు ఏమి చేసినా విధేయత చూపుతామని ప్రతిజ్ఞ చేశారు. ఇది జరిగాక ఉత్తమ వ్యక్తినే ఖలీఫాగా ఎన్నుకోవాలని ముస్లిములందరూ (అన్సారులు మరియు ముహాజిరీన్‌లు) ఒప్పించబడ్డారు .

అందరూ కొత్త ఖలీఫాకు విధేయత చూపుతామని ప్రతిజ్ఞ చేయడానికి ముందుకు వచ్చారు.

ఖలీఫా ఎన్నిక విషయంలో అబూ ఉబైదా(రజి) వారు స్వయంగా పదవిని తిరస్కరించారు. ఆయన పరలోకానికే విలువిచ్చారు. అబూబకర్(రజి) మరియు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) పరిపాలనలలో విశ్వసనీయుడైన సైనికుడిగా ఉన్నారు మరియు ఎంతో అణుకువ కలిగిన పేద ముస్లిముగా అబూ ఉబైదా(రజి) జీవించారు. అన్ని పరిస్థితులలోనూ ఆయన పదవులను స్వయంగా తృణీకరించారు.

అబూబకర్(రజి)వారు ఖలీఫా అయిన తరువాత ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారిని సర్వసైన్యాధిపతిగానూ, ఉమర్(రజి)వారిని న్యాయాధిపతిగానూ మరియు అబూ ఉబైదా(రజి)వారిని కోశాధికారి గానూ నియమించారు.

ఇస్లామ్ చాలా శీఘ్రంగానూ మరియు బలంగానూ వ్యాప్తి చెందడం చూచి రోమన్లు ఆగ్రహంతో ఉన్నారు. అంతేకాకుండా, ముహమ్మద్(స) వారి మరణం తరువాత అరేబియా ద్వీప కల్పంలో కూడా కొందరు తిరుగుబాటు చేయడానికి ఇదే మంచి అవకాశమని భావిస్తున్నారు.

## విజేత

సిరియా వెళ్ళి రోమన్ల హెచ్చరికలను శాశ్వతంగా ఆపమని అబూ ఉబైదా(రజి)ని మొదటి ఖలీఫా అయిన అబూబకర్ (రజి)వారు ఆదేశించారు. మరో మూడు సైన్యాలను సిరియాలోని ఇతర భూభాగాలకు అమ్ర్ బిన్ ఆస్, యజీద్ బిన్ అబూ సుఫ్యాన్ మరియు షురహ్‌బీల్ బిన్ మస్నా (రజి)లను నాయకులుగా నియమించి పంపారు.

ఒకవేళ ఎక్కడైనా ఆ నాలుగు సైన్యాలు కలిస్తే, అన్నింటికి కలిపి సైన్యాధిపతిగా అబూ ఉబైదా(రజి)వారు వ్యవహరించాలని వారందరికీ స్పష్టంగా ఆదేశాలు ఇవ్వబడ్డాయి.

సిరియాకు పంపబడిన ఈ నాలుగు సైన్యాలు అల్-యర్‌మౌక్ దగ్గర కలిసాయి. అయితే అసంఖ్యాకంగా ఉన్న రోమన్ సైనికులను చూచి అబూ ఉబైదా(రజి) ఆశ్చర్యపోయారు. వారంతా చర్చించుకుని, ఆ పరిస్థితిని వివరిస్తూ అబూబకర్(రజి)వారికి వర్తమానం పంపారు, ఎక్కువ మంది సైనికులను పంపించమని.

## స్వయంగా పదవుల తృణీకరణ

ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారిని తూర్పుభాగాన పర్షియన్లతో పోరాడటానికి అబూబకర్(రజి)వారు అప్పటికే పంపి ఉన్నారు. అయితే అధిక సంఖ్యలో ఉన్న రోమన్ల సైన్యాన్ని ఎదిరించడానికి, ఖాలిద్ బిన్ వలీద్ (రజి)వారిని తూర్పు భాగం వదిలేసి, అబూ ఉబైదా(రజి)వారి సైన్యంతో కలవాలని ఆదేశించారు.

ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారిని సైన్యాధిపతిగా ఉండమని చెప్పడం జరిగింది.

ఖాలిద్ బిన్ వలీద్(రజి) అల్-యర్‌మౌక్ చేరాక, ఆయన అబూ ఉబైదా(రజి)వారికి ఖలీఫాగారి ఆదేశాలను తెలియజేశారు. అబూ ఉబైదా (రజి) వెంటనే ఆయనకు విధేయత ప్రకటించి పోరాటంలో ఓ సామాన్య సైనికుడిగా భాగం పంచుకున్నారు. నాయకుడు ఏ ముస్లిమ్ అయినప్పటికీ ఇస్లామ్‌కు విధేయత చూపే సైనికుడిగా ఉండాలనేది ఆయన కోరిక.

అల్లాహ్‌పై పూర్తి విశ్వాసాన్ని ఉంచి అతి పెద్ద రోమన్ సైన్యాన్ని ఢీకొని రోమన్లును ఓడించారు. సిరియాను వశపరచుకున్నారు.

యుద్ధం భీకరంగా జరుగుతున్న సమయంలో మదీనా నుండి ఓ వార్తహరుడు వచ్చి అబూ ఉబైదా(రజి)వారితో అబూబకర్(రజి) మరణించారని, ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)గారు ఖలీఫాగా ఎన్నికయ్యారని మరియు ఆయన కొరకు ఉమర్(రజి)వారు పంపిన సందేశాన్ని అందించారు.

ఆ సందేశంలో ఉన్నది ఏమిటంటే, ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారి స్థానంలో కమాండర్ జనరల్‌గా అబూ ఉబైదా(రజి)వారిని నియమించారు. ఉబైదా(రజి)వారు ఆ సందేశాన్ని చదివి ఆ వార్తాహరుడితో ఖాలిద్ బిన్ వలీద్(రజి) నాయకత్వంలో ఈ యుద్ధం జరుగుతున్నంతవరకూ, ఈ విషయాన్ని రహస్యంగా ఉంచమని చెప్పారు.

యుద్ధం ముగిసింది. ముస్లిములు గొప్ప విజయాన్ని సాధించారు. అప్పుడు అబూ ఉబైదా(రజి)వారు ఖాలిద్(రజి)వారికి ఖలీఫా పంపిన సందేశం గురించి చెప్పారు. ఖాలిద్(రజి) ఆ సందేశాన్ని చదివి, ముందుకు వచ్చి అబూ ఉబైదా(రజి)వారి నుదుటిని ముద్దాడారు. అబూ ఉబైదా(రజి) వారు చేసిన ఆ పనికి ఖాలిద్ బిన్ వలీద్ (రజి) చాలా ప్రభావితం అయ్యారు.

**"నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు?"** ఆశ్చర్యంగా అడిగారు.

అబూ ఉబైదా(రజి) సమాధానం చెప్పారు, **"నేను మిమ్మల్ని గందర గోళంలో పడవేయదలచు కోలేదు. మనం ప్రాపంచిక ప్రయోజనాల కోసం చూడటం లేదని మీకు తెలుసు. మనమంతా సోదరులం"**.

ఖలీఫాగారి ఆదేశాలను విధేయతతో ఖాలిద్(రజి)వారు స్వీకరించారు. ఆయన అబూ ఉబైదా(రజి) నాయకత్వలో అవిశ్వాసానికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించారు.

**ఈ ఇద్దరు విశ్వాసులు ఎంత ఉన్నతంగా వ్యవహరించారు!**

వారి ధ్యేయం ఒక్కటే! అల్లాహ్ వచనాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళడం మరియు ఇస్లామ్‌ని ప్రపంచమంతా వ్యాపింపజేయడం.

గొప్పవైన వ్యక్తిత్వాలు మరియు అమోఘమైన విశ్వాసం వారిది. వారు బ్రతికి ఉండగానే వారికి స్వర్గ శుభవార్త అందజేయబడింది. అటువంటి విశ్వాసులున్న ఉమ్మత్‌లోనే మనం కూడా ఉండటం అల్లాహ్ మనపై చూపిన అనుగ్రహమే!

## వినయుడైన గవర్నర్

అబూ ఉబైదా(రజి)వారిని సిరియాకు గవర్నర్‌గానూ మరియు అతిపెద్ద ముస్లిమ్ సైన్యానికి సర్వసైన్యాధిపతిగా రెండవ ఖలీఫా ఉమర్(రజి) నియమించారు. అయినా సరే, అబూ ఉబైదా(రజి) ఎంతో వినయంతో సైనికుడి వలే వ్యవహరించేవారు. అధికారాలు మరియు పదవులు ఆయనను ఇతరులపై గర్వపడేలా చేయలేదు.

డమాస్కస్ ప్రజలు అబూ ఉబైదా(రజి)వారి నైతిక విలువలను చాలా మెచ్చుకుంటూ, తమ సంభాషణలలో ఆయనను ప్రసంశి స్తున్నారని విన్నారు. స్వయంగా ఏదైనా ప్రశంసకు లోనవుతానేమోనని ఆయన భయపడ్డారు.

కాబట్టి ఆయన వారందరిని ఒకచోట సమావేశపరచి ప్రసంగించారు.

**"ఓ ప్రజలారా! నేను ఖురైష్‌కు చెందిన ముస్లిమ్‌ను. మీలో ఎవరైనా, తెల్లవారైనా లేక నల్లవారైనా, ధర్మపరాయణతలో నన్ను మించితే, అతనే నా నాయకుడు"**

## పేద గవర్నర్

ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు సిరియాను సందర్శించాలని నిర్ణయించుకున్నారు. డమాస్కస్ చేరగానే ఆయన ప్రజలతో తమను అబూ ఉబైదా(రజి) ఇంటికి తీసుకెళ్ళమని చెప్పారు. ఆ ఇంటిలో ఆహ్లాదాన్ని కలిగించేవి ఏమీ లేవు. ఖాళీగా ఉంది. అంత కఠినమైన జీవనాన్నిచూశారు. అబూ ఉబైదా(రజి)ని కొంత ఆహారం తీసుకురమ్మని ఉమర్(రజి)వారు కోరారు. అబూ ఉబైదా(రజి)వారు కొన్ని ఎండిన మరియు ముతక రొట్టెలను తీసుకువచ్చారు.

**అది చూడగానే ఉమర్(రజి) చెంపలపై కన్నీరు కారింది.**

ఆయన అబూ ఉబైదా(రజి)తో **"మేమంతా మారాము నువ్వు తప్ప"**.

ఉమర్(రజి)వారు తన కోశాధికారిని ఆదేశించారు, అబూ ఉబైదా(రజి) వారికి కొంత సొమ్ము పంపమని. కాని అబూ ఉబైదా(రజి) ఆ సొమ్మును తిరస్కరించి ఉమర్(రజి)వారికి ఇలా చెప్పారు :

> **"నేను మీ కోసం పనిచేయడం లేదు. నేను అల్లాహ్ కొరకు పనిచేస్తున్నాను. దాని కొరకు ప్రాపంచిక పరిహారాన్ని స్వీకరించను"**

అల్లాహ్ మార్గంలో పనిచేస్తున్నామని చెప్పే నేటి దాయీలు, ప్రజల సొమ్ముతో ఎంత లగ్జరీ అనుభవిస్తున్నారో తెలిసినదే! వారికి **ఇటువంటి సహాబాల జీవితచరిత్ర కనువిప్పు కలిగించాలి**. ఇన్షా అల్లాహ్, మీరు కూడా వారిలో మార్పును తీసుకురావడానికి ప్రయత్నించండి.

అబూ ఉబైదా(రజి) చాలా పేదవారిగా జీవించారు. అవసరం ఉన్నవారి మరియు పేదవారి వ్యథలను అర్థం చేసుకుని ఆయన జీతం లోని ఎక్కువ భాగం వారికే పంచేవారు. ఆయన జీవితంలో ఏనాడూ సుఖవంతమైన జీవితాన్ని అనుభవించ లేదు. ఆయనకు తెలుసు తను చేసే ప్రతీ పని లెక్కించబడుతుందని, అది తనకు అనుకూలంగా లేదా ప్రతికూలంగా తీర్పుదినం నాడు మారుతుందని.

## బోధన

అబూ ఉబైదా(రజి)వారు ఎల్లప్పుడూ తన సహచరులతో లోపల మరియు బయట కూడా స్వచ్ఛంగా ఉండాలని సలహా ఇచ్చేవారు. ప్రజలతో ఎప్పుడు ప్రసంగించ వలసి వచ్చినా వారిని ధర్మ పరాయణులుగా మరియు ఆత్మనిగ్రహం చేసుకునేవారిగా ఉండమని కోరేవారు.

జోర్డాన్‌లో మరణానికి ముందు ఆయన చెప్పిన మాటలు :

ఓ ప్రజలారా!

నేను మీకు సలహా ఇస్తున్నాను. మీరు నా సలహా విన్నట్లయితే (అంటే ఆచరణలో పెడితే), మీరు నిశ్చయంగా శాంతిగా జీవిస్తారు :

- సలాత్ చేయండి
- రమదాన్‌లో ఉపవాసముండండి
- దానాలు చేయండి
- హజ్జ్ యాత్ర చేయండి
- ప్రాపంచిక వస్తువుల కొరకు అపమార్గం పట్టవద్దని మీ పాలకులకు సూచించండి.
- మీరు వెయ్యి సంవత్సరాలు జీవించినా చివరకు మీ ముగింపు ఇప్పటి నా ముగింపులాగే ఉంటుంది. అల్లాహ్ మానవులకు మరణాన్ని విధిగా చేశారు.
- తీర్పుదిన జ్ఞానం గల మీ ప్రభువుకు విధేయులుగా ఉండేవారే మీలో ఉత్తములు.



## ఔదార్యంగల వ్యక్తి

ఉమర్(రజి)వారు అబూ ఉబైదా(రజి) విషయంలో ఎంతో ఎడ్మైర్ అయ్యారు. అందుకే ఆయన **అబూ ఉబైదా(రజి)వంటి వారు వేల సంఖ్యలో ఉండాలని కోరుకున్నారు.**

అమ్ర్ బిన్ ఆస్ చెప్పారు : "ఖురైష్‌లలో ముగ్గురున్నారు, బాగా సమర్థులు, నైతిక విలువలలో మేటి మరియు ఎక్కువ బిడియం గలవారు. వారు ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు లేక ఇతరులను తృణీకరించ లేదు. వారు అబూ బకర్, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ మరియు అబూ ఉబైదా బిన్ జర్రా (రజి.అ)

## చివరి ప్రయాణం

అబూ ఉబైదా (రజి) మరియు ఇతర సైనికులకు సిరియాలో ప్లేగు వ్యాధి సోకింది. అది తెలిసి ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) చాలా విచారపడ్డారు. అబూ ఉబైదా (రజి) వారిని వెంటనే మదీనా వచ్చెయ్యమని కోరారు. కాని అబూ ఉబైదా మదీనా రావడానికి ఇష్టపడలేదు మరియు వచ్చిన వార్తాహరులతో అల్లాహ్ తలపెట్టిన కార్యం నుండి నేనెన్నటికీ తప్పించుకోననే చెప్పారు.

తన సైనికులను ఒంటరిగా వదిలి రాలేనని కూడా చెప్పారు.

ఆయన ఉమర్(రజి)వారికి ఓ లేఖ వ్రాశారు.

> **"ఓ విశ్వాసుల నాయకా! మీకు నేను కావాలని నాకు తెలుసు. అయినప్పటికీ నేను కొందరు ముస్లిమ్ సైనికులతో ఉన్నాను. వారిని ఒంటరిగా వదలడం నాకిష్టం లేదు. కాబట్టి నా సైనికులతో నన్ను వదిలేయమని మిమ్మల్ని అడుగుతున్నాను".**

లేఖను అందుకుని ఉమర్(రజి) చాలా ఎక్కువగా రోదించారు.

ఆ లేఖ కూడా తనకు అనుమతి నివ్వమని అమీరుల్ మోమినీన్‌కు చేసుకున్న విన్నపమే! ఆయన నాయకుని ఆదేశాన్ని తిరస్కరించే వ్యక్తి కాదు. ఉమర్(రజి)వారి సహచరులు ఆ లేఖ గురించి అడిగారు. సర్వ సైన్యాధిపతి మరణించారేమోననే గుబులుతో అడిగారు.

ఉమర్(రజి)వారు సమాధానం చెప్పారు : "లేదు, చావు ఆయనకు దగ్గరగా ఉంది".

అబూ ఉబైదా(రజి) చాలా నీరసపడిపోయి మంచానికే పరిమిత

మయ్యారు. ఆయన తన చుట్టూ ఉన్నవారితో "**నా సలామును విశ్వాసుల నాయకుడికి అందజేయండి. ఆయనకు చెప్పండి నేను చేయగలిగినంత మే నా బాధ్యతలను నిర్వహించాను**".

ఆయన ము'ఆజ్ బిన్ జబల్(రజి)వారి వైపు తిరిగి అన్నారు :

"ప్రజలకు ముందుండి సలాత్ చేయించండి. అల్లాహ్ మిమ్మల్ని రక్షించుగాక!"

వినయంతో నిండిన ఈ మాటలు ఆయన పెదవుల నుండి వెలువడ్డాయి. 'అమీనుల్ ఉమ్మా' ఇహలోకాన్ని వీడారు.

ఎంతో సున్నిత హృదయంగల ఈ పేద గవర్నర్, సర్వసైన్యాధిపతిగా యుద్ధంలో మాత్రం శతృవులను గడగడలాడించే ఉక్కు మనిషి. ఈ ఉమ్మత్‌కి ఆయనకు జ్ఞాపకాలను వదిలేసి వెళ్ళిపోయారు.

"ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్"

ము'ఆజ్ బిన్ జబల్(రజి) లేచి పెదవులు కంపిస్తుండగా వణుకుతున్న స్వరంతో ప్రజలకు చెప్పారు :

"సోదరులారా! మీరు ఈ రోజు విచారంలో మునిగిపోయారు, మనలో అందరికంటే మంచి మనస్సుగల వ్యక్తి కోసం. ఎటువంటి కాపట్యం లేని హృదయం ఆయనది. ఆయన పరలోకాన్ని ప్రేమించినవారు మరియు మనలోని ప్రతీ ఒక్కరికి శ్రేయోభిలాషి".

**నల్లటి పర్వతాల మధ్య మక్కాలో జీవితం ప్రారంభించిన అబూ ఉబైదా(రజి) ఇస్లామ్ స్వీకరించడానికి పూర్వం, సిరియాను పాలిస్తానని కలలో కూడా ఊహించి ఉండరేమో! కాని ఇస్లామ్ స్వీకరించాక ప్రభుత్వ నిర్మాణంలో భాగం పంచుకుని ఓ బలమైన రాజ్య స్థాపనలో తనవంతు కృషి చేశారు. ఆ రాజ్యమే గొప్ప సామ్రాజ్యాలైన రోమన్ మరియు పర్షియన్ సామ్రాజ్యాలను జయించింది.**

**ఎన్ని విజయాలు సాధించినా, ఎంత సంపద చేరినా, అబూ ఉబైదా(రజి)వారు ప్రవక్త(స)వారి కాలంలో జీవించినట్లే జీవించారు.**

విశ్వసించడం అంటే అన్ని రకాల పూజలను ఆపేసి, కేవలం నోటితో కలిమా చదివేస్తే సరిపోదు. ఇస్లామ్‌ను అర్థం చేసుకున్న ఏ నవ ముస్లిమైనా, సమస్యలు చూచి భయపడరు. ఇస్లామ్‌పై అవగాహన లేని దాయీల మేడిపండు మాటలతో ఏదో ప్రయోజనాన్ని ఆశించి వచ్చిన వారే సమస్యల గురించి భయపడుతూ ఉంటారు.

స్వర్గ శుభవార్తలను అందుకున్న సహాబీలందరూ ప్రారంభంలో ఇస్లామ్ స్వీకరించినవారే!

వారిని చూచి సమస్యలే భయపడేలా వారి జీవనం సాగింది.

ఇస్లామ్‌పై అవగాహన పెంచుకోండి.

ఆలిమ్‌ల దగ్గర సరియైన శిక్షణ పొందండి.

**ఇస్లామ్ స్వీకరించాక అబూ ఉబైదా (రజి),**

- ఆకలితో ఆకులు తినడానికి సిద్ధపడ్డారుగాని విశ్వాసాన్ని వదులు కోలేదు.
- అబిసీనియాకు వలస వెళ్ళారు.
- విశ్వాసం కొరకు తండ్రితో యుద్ధం చేసారు. ఆయనను ప్రశంసిస్తూ అల్లాహ్ ఓ ఆయత్‌ను అవతరింప జేశారు.
- ముహమ్మద్(స)వారికి కవచంలా నిలబడి పోరాడారు. ముహమ్మద్(స)వారు అంటే ఆయనకు ఎనలేని ప్రేమ.
- ఆయనకు పదవులు తృణప్రాయం.
- గవర్నర్‌గా ఆయన అందుకునే జీతంతో సుఖంగా బ్రతకవచ్చు. ఆయన ప్రజలకు ధర్మాన్ని బోధించారు. ప్రతిఫలంగా వారినుండి ఏమీ తీసుకోలేదు. తమ జీతాన్నే పేదవారిపై ఖర్చు చేసేవారు. బిర్యానీలు తింటూ బ్రతకలేదు. ఎండిన ముతక రొట్టెలు తింటూ, ఎంతో వినమ్రంగా బ్రతికిన అతి పేద గవర్నర్.
- నిన్నగాక మొన్న ఇస్లామ్‌కు సంబంధించి 4 అక్షరాలు తెలియగానే బోలెడు పెద్ద పెద్ద బిరుదులు పేరుకు ముందు తగిలించుకుని లగ్జరీలు అనుభవిస్తూ అల్లాహ్ కొరకే పనిచేస్తున్నామంటూ ప్రజల సొమ్మును బొక్కేవారు, ఈ సహాబీ గడిపిన సామాన్య జీవితాన్ని చూచి నేర్చు కోవలసింది చాలా ఉంది.
- ఏదైనా చిన్న సమస్య వస్తుందని ముందుగా తెలిస్తే చాలు, జంప్ అయిపోయే నేటి ధర్మ ప్రచారకులు, ప్లేగు వ్యాధితో తన సహచరుల కోసం అక్కడే ఉండిపోయిన అబూ ఉబైదా(రజి)వారి గురించి తెలుసుకోవాలి.
- ఎంతో తక్కువ స్థాయిలో జీవనం సాగించి అందరిచేత కంట తడి పెట్టించిన రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారి చేతే కన్నీరు పెట్టించినటు వంటి అతి సామాన్య జీవితాన్ని గడిపిన సర్వసైన్యాధిపతి 'అబూ ఉబైదా బిన్ జర్రా(రజి)'.

ఓ అల్లాహ్! నీ దాసులలో ఒకరి జీవిత చరిత్రను చదివింపజేసి, మా విశ్వాసం ఏ స్థాయిలో ఉందో మాకు తెలియజేశారు. అబూ ఉబైదా(రజి) వంటి దాసులను ప్రారంభంలో కలిగి ఉన్న ఈ ఉమ్మత్‌లోనే మేము ఉన్నామని చెప్పుకోవడానికి ఒక విధంగా గర్వపడినా, వారి నిరాడంబరత, ధర్మ పరాయణతతో పోల్చుకుని నేటి ముస్లిమ్ సమాజం సిగ్గుపడుతోంది. అటువంటి దాసుల ఉమ్మత్‌లో ఉన్నామని చెప్పుకునే అర్హత కోసమైనా నేటి ముస్లిములపై మీ కరుణను కురిపించి వారిని సన్మార్గంలో ఉంచమని కోరుకుంటున్నాము. **- శాంతిబాట టీమ్**

ఇస్లామ్ యొక్క అతి ముఖ్యమైన జమియత్ వ్యవస్థ నేడు పతనమై పోయింది. నాయకుని మాటకు విలువిచ్చే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. ఖుర్'ఆన్ మరియు సున్నత్ పాటించే నాయకులు కరువయ్యారు. కలిసి నమాజ్ చేస్తే పుణ్యమెక్కువని అందరికీ తెలుసు. అంతేకాదు, ఏ సత్కార్యమైనా అందరూ కలిసి చేస్తే అల్లాహ్ నుండి అందే కరుణ కూడా ఎక్కువ అవుతుంది. తమ స్వార్థం కోసం సమాజాన్ని ముక్కలు చేసే వారి నుండి దూరంగా ఉంటూ, ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల కనుగుణంగా ఇన్షా అల్లాహ్ ముందడుగు వేద్దాం!

# హదీస్ విజ్ఞానం
## Science of Hadith

(గత సంచిక తరువాయి)

7

### ఉల్లేఖకుల విశ్వసనీయత మరియు జ్ఞాపకశక్తి ఆధారంగా వర్గీకరణ

**ఈ శీర్షికలోని వ్యాసాలను మీరు బాగా అధ్యయనం చేయగలిగితే, హదీస్‌లను వక్రీకరించి ప్రసంగించేవారిని మీరు సులభంగా గుర్తుపట్ట గలుగుతారు, ఇన్షాఅల్లాహ్!**

*(హదీస్‌లో ఉండే 'బోధన' లేదా వచన భాగం (text) - మతన్ అని, ఆ హదీస్‌ను ఉల్లేఖించిన ఉల్లేఖకుల వివరాలను తెలిపే హదీస్ భాగాన్ని 'సనద్' అని అంటారని పాఠకులకు తెలిసిన విషయమే)*

ఇంతవరకూ అందించిన వర్గీకరణల ద్వారా ఎన్నో పదాలను నిర్వచించడం జరిగింది.

**ఖుద్‌సీ, మర్‌ఫూ, మౌఖూఫ్, ముస్నద్, ముత్తసిల్, మున్‌ఖతి, ము'అల్లఖ్, ము'అదల్, ముర్సల్, ముతవాతిర్, అహద్ (గరీబ్, అజీజ్, మష్‌హూర్), ముదల్లస్, తద్‌లీస్, ముసల్‌సల్, షాజ్, మున్‌కర్, ముద్‌రజ్, ముజ్‌తరిబ్, మఖ్‌లూబ్, మ'లూల్/ము'అల్లల్.**

వాటిని అర్థం చేసుకోవడానికి కొన్ని హదీస్‌లను ఉదాహరణగా ఇవ్వడం జరిగింది. పైన పేర్కొన్న పదాలు హదీస్‌లను వర్ణిస్తాయని పాఠకులకు తెలిసిన విషయమే!

ఇక హదీస్‌పై చిట్టచివరి నిర్ణయం (అంటే సహీహ్, హసన్, దయీఫ్, మౌదూ) ఈ లక్షణాలపై ఆధారపడి ఉంటుంది.

మొదటి రెండు శతాబ్దాలకు చెందిన ముహద్దిస్‌లలో ఎక్కువమంది హదీస్‌లను రెండే రెండు కేటగిరులుగా వర్గీకరించారు. 1. సహీహ్ 2. దయీఫ్. మొదటి సారిగా 'తిర్మిజీ' (ర) దయీఫ్ నుండి 'హసన్'ను వేరు చేశారు. ఈ వ్యాసంలో హదీస్‌ల యొక్క 4 తరగతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం!

## సహీహ్
### (Strong - బలమైనది)

'ముతవాతిర్' హదీస్ కాకుండా మరి ఏ హదీస్ అయినా స్వీకరించ బడాలంటే క్రింది విధంగా ఉండాలి. (ముతవాతిర్ హదీస్ అంటే అసంఖ్యాక ప్రజలచే ఉల్లేఖించ బడింది. దానిని ఎవరూ ఖండించలేరు)

హదీస్‌ను తెలియజేసిన ప్రతీ ఉల్లేఖకుడు తన ధర్మంలో నమ్మకస్తుడు (trustworthy) అయి ఉండాలి. హదీస్‌ను ఉల్లేఖించడంలో అతను సత్యాన్ని చెప్పేవాడని (truthful) తెలిసి ఉండాలి. అతడు తాను ఉల్లేఖించిన విషయాన్ని అర్థం చేసుకుని ఉండాలి. హదీస్‌ను ఉన్నది ఉన్నట్లుగా కాకుండా వేరే విధంగా వ్యక్తం చేస్తే దాని అర్థం ఏవిధంగా మారిపోతుందో తెలుసుకుని ఉండాలి.

మరియు దాని అర్థం మారకుండా ఉండటమే కాకుండా, మాటకు మాట ఉండాలి. హదీస్‌లో ఉండే మాటను మార్చడానికి లేదు. వేరే విధంగా వ్యక్తం చేస్తే మొత్తం అర్థమే మారిపోతుందని తెలుసుకోకపోతే, అతడు ధర్మసమ్మతమైన విషయాన్ని (హలాల్‌ను) నిషేధించబడిన దానిగా మార్చివేశాడేమోననే విషయం స్వయంగా అతను తెలుసుకోలేడు.

అంతేకాకుండా, అతనికి మంచి జ్ఞాపకశక్తి కూడాఉండాలి. అతడు తన జ్ఞాపకంనుండి గాని లేదా తాను భద్రపరచుకున్న వ్రాతల నుండి తెలియజేయవలసి వచ్చినా, అవి ప్రావీణ్యమున్న ప్రామాణీకుల (హుఫ్ఫాజ్) ఉల్లేఖనాలతో సరిపోవాలి. అంటే ఒకవేళ అతడు వారు తెలియజేసిన దానినే ఏదైనా తెలియజేస్తే వారి ఉల్లేఖనాలతో సరిపోవాలి.

అతడు ముదల్లిస్ కాకూడదు (ముదల్లిస్ అంటే ఏమిటో అక్టోబర్-నవంబర్'2010 సంచిక చూడండి). ఆ ఉల్లేఖకుడికి పైనుండే ఉల్లేఖకుడికి కూడా అవే లక్షణాలు ఉండాలి, అదే విధంగా ఆ పై వ్యక్తికి ... చివరికి ముహమ్మద్(స)వారి నుండి ప్రత్యక్షంగా తెలుసుకున్న వారి వరకూ ఉన్న ఉల్లేఖకులందరికీ ఇప్పటివరకూ చెప్పుకున్న లక్షణాలు ఉండాలి.

సహీహ్ హదీస్ యొక్క సనద్ తెగకుండా ఉండాలి. మధ్యలో అంతరాయాలు ఉండకూడదు. ఆ ఇస్నాద్‌లోగాని లేదా మతన్‌లోగాని ఎంటువంటి దోషాలు ఉండకూడదు.

ఆ హదీస్ మున్‌ఖతి, ము'దల్, ముజ్‌తరిబ్, మఖ్‌లూబ్, షాజ్, మున్‌కర్, మ'లూల్ కాకూడదు. ఉల్లేఖకులలో ముదల్లిస్ ఉండకూడదు.

పైన చెప్పిన లక్షణాలన్నీ కలిగి ఉన్న హదీస్ 'సహీహ్' హదీస్ అవుతుంది.

బుఖారీ(ర) తన హదీస్ గ్రంథంలో కేవలం సహీహ్ హదీస్‌లను మాత్రమే అందించారు. ముస్లిమ్(ర) కూడా సహీహ్ హదీస్‌లను మాత్రమే అందించారు. అయితే బుఖారీ(ర) ఓ హదీస్‌ను సహీహ్‌గా నిర్ధారించు

కోవడానికి కొన్ని షరతులు ఏర్పాటు చేసుకున్నారు. అదే విధంగా ముస్లిమ్(ర) కూడా కొన్ని షరతులను ఏర్పాటు చేసుకున్నారు. ఆ షరతుల వివరాలను ఇన్శా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.

సహీహ్ హదీసులను ఎటువంటి అనుమానం లేకుండా స్వీకరించ వచ్చు. ఈ సహీహ్ హదీసులకు మరలా విద్వాంసులు గ్రేడింగ్ కూడా ఇచ్చారు.

1. ఏదైనా హదీస్ సహీహ్ బుఖారీ మరియు సహీహ్ ముస్లిమ్ గ్రంథాల రెండింటిలోనూ ఉంటే ఆ హదీస్‌ను అన్నిటికంటే ఎక్కువ ప్రామాణికత కలిగిన సహీహ్ హదీస్‌గా తీసుకుంటారు. ఇలాంటి హదీస్‌ను 'ముత్తఫికున్ అలైహ్' అంటారు.
2. సహీహ్ బుఖారీ గ్రంథంలో మాత్రమే ఉండే హదీస్.
3. సహీహ్ ముస్లిమ్ గ్రంథంలో మాత్రమే ఉండే హదీస్.
4. ఈ రెండు గ్రంథాలలో లేకపోయినప్పటికీ బుఖారీ(ర) మరియు ముస్లిమ్(ర) ఏర్పరచుకున్న షరతులకు సరిపోయే హదీస్.
5. బుఖారీ(ర)వారి షరతులకు సరిపోయే హదీస్.
6. ముస్లిమ్(ర(వారి షరతులకు సరిపోయే హదీస్.
7. ఇతర ముహద్దిస్‌లు సహీహ్‌గా నిర్ధారించినవి.

ఈ గ్రేడింగ్ అనేది హదీస్‌లపై పరిశోధన చేసేవారికి బాగా ఉపయోగకరం. అయితే సగటు ముస్లిమ్‌కి ఏ హదీసైనా పైన పేర్కొన్న 7 గ్రేడ్‌లలో దేనికి చెందినా ఒక్కటే. ఆ హదీస్‌లలో ఉన్న విషయాలను ఎటువంటి సందేహం లేకుండా ఆచరించవచ్చు.

## హసన్
### (good - మంచి)

'హసన్' అనే ప్రామాణికతను తొలిసారిగా పరిచయం చేసినవారు తిర్మిజీ(ర). వారు నిర్వచించిన దాని ప్రకారం ఓ హదీస్ హసన్ హదీస్ ఎప్పుడు అవుతుందంటే అది షాజ్ కానప్పుడు లేక చెడ్డవాడైన ఉల్లేఖకుడు సనద్‌లో లేనప్పుడు మరియు ఆ హదీస్ ఒకటి కంటే ఎక్కువ సనద్‌లలో ఉల్లేఖించబడినప్పుడు.

అల్-ఖత్తాబి(d.388) హసన్ హదీస్‌ను చాలా క్లుప్తంగా నిర్వచించారు. హసన్ హదీస్ యొక్క మూలం తెలిసుండాలి మరియు దాని ఉల్లేఖకులు అస్పష్టంగా ఉండకూడదు.

అంటే ముర్‌సల్ లేక మున్‌ఖతి హదీస్ వలే కాకుండా లేక ముదల్లిస్ కలిగిన హదీస్ వలే కాకుండా ఈ హదీస్‌ను ఉల్లేఖించినవారికి సందేహాస్పదమైన లక్షణం ఉండకూడదు.

ఇబ్నె సలా 'హసన్'ని రెండు కేటగిరులుగా విభజించారు.

1. సనద్‌లో ఒక ఉల్లేఖకుడు మస్తూర్ (అంటే ప్రముఖ వ్యక్తి ఎవరూ ఆయన నుండి ఉల్లేఖించలేదు), కాని హదీస్‌ను తెలియజేయడంలో అతను అశ్రద్ధ చూపే వ్యక్తి కాదు. ఈ హదీస్‌లో ఉన్నటువంటి మతన్, వేరే సనద్‌తో పాటు ఉల్లేఖించబడి ఉంటుంది. అంటే ఇటువంటి హదీస్ వేరే ఉల్లేఖకుల చైన్‌తో ఉల్లేఖించబడి ఉంటుంది.
2. సనద్‌లోని ఓ ఉల్లేఖకుడు నిజాయితీ పరుడు మరియు విశ్వసనీయుడే! కాని అతని జ్ఞాపకశక్తి లేదా హదీస్‌ను భద్రపరిచే స్థాయి, సహీహ్ హదీస్‌ను తెలియజేసే వారి స్థాయికంటే తక్కువ స్థాయిలో ఉంటుంది.

పై రెండు కేటగిరిలలో కూడా ఎటువంటి దోషాలు ఉండకూడదు. 'శాంతిబాట'లో హసన్ హదీస్‌ల నెన్నింటినో అందించాము. కాబట్టి ఇక్కడ ప్రత్యేకంగా హసన్ కొరకు ఏ హదీస్‌నూ ఉదహరించడం లేదు.

'హసన్' స్థాయి హదీస్‌లు 'సహీహ్' హదీస్‌ల స్థాయి కంటే తక్కువ. అయినప్పటికీ వీటిని ఆచరించడంలో కూడా ఎటువంటి అనుమానం పెట్టుకోనవసరం లేదు.

హసన్ హదీస్ స్థాయి 'దయీఫ్' హదీస్ స్థాయి కంటే ఎక్కువ మరియు సహీహ్ స్థాయి కంటే తక్కువ. కొన్ని హసన్ హదీస్‌లను తరువాయి కాలంలోని విద్వాంసులు పరిశోధనల ద్వారా వాటిని సహీహ్ హదీస్‌ల కుండే షరతులతో సరిపోయినట్లుగా తెలుసుకుని వాటిని సహీహ్‌గా నిర్ధారించడం జరిగింది.

ఉదాహరణకు అబూదావూద్ హదీస్ గ్రంథంలోని 4596, 4597 మరియు 4603 హసన్ హదీస్‌లను, నాశిరుద్దీన్ అల్బానీగారు సహీహ్‌గా ప్రకటించారు.

## దయీఫ్
### (weak - బలహీనమైనది)

ఒక పళ్ళెంలో బియ్యపు గింజలు మరియు రాళ్ళ బెడ్డు కలిసిపోయి ఉంటే, రాళ్ళను బియ్యం నుండి ఏరి, క్రింద పడవేస్తున్నాం అనుకోండి. ఆ విధంగా చేసేటప్పుడు రాళ్ళ బెడ్డలతో పాటు ఒకొక్కసారి బియ్యపు గింజ కూడా పడిపోవచ్చు. కాని ఏరడం పూర్తయ్యాక పళ్ళెంలో బియ్యం మాత్రమే ఉంటాయి. రాళ్ళు ఉండవు. కాని రాళ్ళతో పాటు క్రిందికి కొన్ని బియ్యపు గింజలు కూడా పడిపోయి ఉండవచ్చు. తరువాత ఆ బియ్యపు గింజలను కూడా ఏరుకోవచ్చు.

కొన్ని దయీఫ్‌గా నిర్ధారించబడిన హదీస్‌లలో సహీహ్ కూడా ఉండే అవకాశం ఉంది అని చెప్పడానికే ఈ ఉదాహరణ చెప్పడం జరిగింది గాని, దయీఫ్ హదీస్‌లు రాళ్ళ వంటివని కాదు. అవి కేవలం బలహీనమైనవి మాత్రమే. వాటిలో ఏదో ఒక దోషం ఉంటుంది.

'హసన్' స్థాయికి చేరుకోని హదీస్‌ను 'దయీఫ్' అని పిలుస్తారు. 'దయీఫ్' అంటే అబద్ధం కాదు. బలహీనమైనది / అనుమానాస్పదమైనది. సాధారణంగా ఆ బలహీనత సనద్‌లోనే ఉంటుంది. సనద్‌లో ఉల్లేఖకుల

మధ్య సంబంధం తెగిపోయి ఉంటుంది. (discontinuity ఉంటుంది).

అటువంటప్పుడు ఆ హదీస్ ముర్‌సల్, ము'అల్లఖ్, ముదల్లస్, మున్‌ఖతి లేదా ము'అదల్ కావచ్చు. వీటి గురించి జూన్-జూలై' 2010 సంచికలో చూడండి.

ఉల్లేఖకుల మధ్య సంబంధం తెగిపోవడంలో స్పష్టంగా ఉండే లక్షణాన్ని బట్టి లేదా ఉల్లేఖకులలో ఒకరి కారెక్టర్ మంచిది కాకపోతే, అంటే అతడు అబద్ధాలు చెప్పేవాడు, ఎక్కువగా పొరపాట్లు చేసేవాడు, విశ్వసనీయమైన మూలాల నుండి ఉల్లేఖించబడిన వాటికి వ్యతిరేకంగా ఉల్లేఖించేవాడు, అంతేకాకుండా అతడు బిద్'అత్‌లో ఉన్నవాడు అయివుంటే, అతని విషయంలో అస్పష్టత ఉంటే ఆ వ్యక్తి ఉల్లేఖించిన హదీస్‌ను దయీఫ్ హదీస్‌గా తీసుకుంటారు. దోషం/దోషాలు ఎంత తక్కువగా ఉంటే హదీస్ బలహీనత అంత తక్కువగా ఉంటుంది.

ఒకవేళ దోషాలు ఎక్కువగానూ మరియు తీవ్రంగానూ ఉంటే, అప్పుడు ఆ హదీస్ 'మౌదూ' హదీస్ అవుతుంది.

## మౌదూ
### (fabricated - కల్పించబడినది)

దయీఫ్ హదీస్‌లోనయితే సనద్‌లోనే దోషాలుంటాయి. కాని ఈ హదీస్‌లో మతన్ (వచన భాగం)లో కూడా దోషాలుంటాయి. ప్రవక్త(స)వారు బోధించకుండానే బోధించినట్లు లేదా ఏదైనా ఓ విషయం ఆయన(స) చెప్పకుండానే చెప్పినట్లు కల్పించడం జరిగితే, లేదా ప్రవక్త(స)వారి బోధనలకు వ్యతిరేకంగా ఉంటే అప్పుడు ఆ హదీస్‌లను మౌదూ హదీస్‌లుగా పరిగణిస్తారు.

దీనికి సంబంధించి ఒక ఉదాహరణను ఇక్కడ అందిస్తున్నాము.

ఖైబర్ నుండి యూదులను బహిష్కరించడానికి రెండవ ఖలీఫాయైన ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) నిర్ణయించుకున్నారు. ఖైబర్ యూదులను అక్కడే ఉండనివ్వాలని మరియు జిజ్యా పన్ను నుండి వారికి మినహాయింపు నివ్వడం ప్రవక్త(స)వారి ఉద్దేశ్యం అని ప్రత్యక్షంగా నిరూపించే ఉద్దేశ్యంతో కొందరు యూద ఉన్నతాధికారులు ఉమర్(రజి)వారి వద్దకు ఒక పత్రాన్ని తీసుకువచ్చారు.

ఆ పత్రంపై ఇద్దరు సాక్షుల పేర్లున్నాయి. వారిలో ఒకరు సాద్ బిన్ ము'ఆజ్, మరొకరు ము'ఆవియా బిన్ అబూ సుఫ్యాన్. ఉమర్(రజి)వారు అది కల్పితమని తెలుసుకుని ఆ పత్రాన్ని ఖరాఖండిగా తిరస్కరించారు. ఎందుకంటే ఖైబర్ యుద్ధం 6 హిజ్రీలో జరిగింది. సాద్ బిన్ ము'ఆజ్ కందక యుద్ధం ముగిసిన కొన్నాళ్లకు 3 హిజ్రీలో మరణించారు. మరియు ము'ఆవియా మక్కా విజయం తరువాత 8 హిజ్రీలో ఇస్లామ్ స్వీకరించారు. కాబట్టి వీరు సాక్షులయ్యే ప్రశ్నే లేదు.

అంటే సాక్షులలో ఒకరు ఆ పత్రంలో చెప్పిన సమయానికి దాదాపు 3 సంవత్సరాలకు పూర్వమే మరణించారు. కాబట్టి ఆయన ఏ విధంగా సాక్షి అవుతారు? మరొకరు ఆ సమయానికి ఇంకనూ ఇస్లామ్ స్వీకరించ లేదు. పత్రంలో చెప్పిన సమయానికి రెండు సంవత్సరాల తరువాత ఆయన ఇస్లామ్ స్వీకరించారు. కాబట్టి ఆయన కూడా సాక్షి కాడు. ఇదంతా కల్పితం.

కొందరు సామెతలను హదీస్‌లుగా మార్చడం జరిగింది. అటువంటి హదీస్‌లు కూడా మౌదూ కేటగిరికే చెందుతాయి. యూదులు మరియు క్రైస్తవుల ఉల్లేఖనాలను (ఇస్రా'ఇలియాత్) ముహమ్మద్(స)వారికి ఆపాదించి చెప్పినవి కూడా మౌదూ హదీస్‌లే!

ఇస్లామ్ ప్రకారం ఆచరిస్తూ విశ్వసనీయులై, మంచి జ్ఞాపకశక్తి గలిగి, ఉన్నది ఉన్నట్లుగా ఉల్లేఖించే వారి ఉల్లేఖనాలను మాత్రమే సహీహ్‌గా తీసుకోవడం జరిగింది. ఉల్లేఖించే విషయం వారికి అర్థమై ఉండాలి. ఎందుకంటే ఆయన నుండి వినే వ్యక్తికి అర్థమయ్యేటట్లు చెప్పగలగాలి.

వచన భాగం కరెక్ట్‌గా ఉన్నప్పటికీ ఉల్లేఖకులలో ఎవరైనా అబద్ధాలు చెప్పేవాడు, మోసం చేసేవాడు ఉంటే, అటువంటి వ్యక్తి ఉల్లేఖించిన వాటిని బలహీనమైనవిగా పరిగణించారు.

జ్ఞాపకశక్తి సరిగ్గా లేకపోతే ఒకమాటకు బదులుగా మరొక మాట చెప్పవచ్చు లేదా ఒకమాట వదిలేయవచ్చు.

ప్రవక్త(స)వారి నుండి కొందరు ఒక హదీస్‌ను వింటే, ఆ విధంగా విన్న ఒకొక్కరినుండి మరలా ఎందరికో ఆ హదీస్ అందజేయబడేది. ఆ విధంగా ఒకే హదీస్ వివిధ ఉల్లేఖకుల కాంబినేషన్‌లో చాలా హదీస్‌లుగా ఉల్లేఖించబడుతుంది.ఏ ఒక్క హదీస్ కూడా మరొక హదీస్‌ను విభేదించదు. అన్నింటిలోని వచన భాగం ఒకే విధంగా ఉంటుంది.

కాబట్టి ఒక హదీస్ యొక్క ప్రామాణికతను నిర్ణయించడం సాధ్యం అయింది. ఎందరో విద్వాంసులు ఈ హదీస్ విజ్ఞానం కొరకు తమ జీవితకాలాన్ని కేటాయించారు.

ఆ హదీస్ విద్వాంసుల గురించి క్లుప్తంగా తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇన్షా అల్లాహ్ వచ్చే సంచిక నుండి ఆ విషయాలను అందిస్తాము. ఈ శీర్షిక ప్రారంభం నుండి మేము అందించిన వ్యాసాలన్నింటిని శ్రద్ధగా అధ్యయనం చేయండి.

చెప్పేది సత్యమే అయినప్పటికీ, ఆ చెప్పేవారి కారెక్టర్‌కి కూడా అత్యంత ప్రాముఖ్యతను ఇవ్వబట్టే హదీస్‌లు ఉన్నవి ఉన్నట్టుగా గ్రంథస్థం కాగలిగాయి.

**హదీస్‌లపై అభ్యంతరకర వ్యాఖ్యలు :**

ప్రవక్త(స)వారి తరువాత ఒక హదీస్‌ను 'సహీహ్' హదీస్‌గానూ, 'దయీఫ్' హదీస్‌గానూ నిర్ణయించడానికి వారికి వహీ ఏమైనా వచ్చిందా? అని కొందరు ప్రశ్నించడం మా దృష్టికి వచ్చింది. కొన్ని పదాలను లూజ్‌గా వాడకండి. 'వహీ' అనేది ప్రవక్తలకు మాత్రమే అందుతుంది.

'దయీఫ్' అంటే 'అబద్ధం' అని అపోహపడటం వల్లనే ఆ విధంగా కొందరు వ్యాఖ్యానించి ఉండవచ్చు.

ఫిజికల్ సైన్స్, కెమికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ మొదలైన వాటి వలే హదీస్ సైన్స్ కూడా గురువుల దగ్గర చాలాకాలం నేర్చుకోవలసి

ఉంటుంది.

కత్తిరించడం మరియు కుట్టడం బాగా తెలిసినంత మాత్రాన ఓ టైలర్‌గారు 'సర్జరీ' (ఆపరేషన్) చేయలేరు. చెక్కలకు స్క్రూలు బిగించడం బాగా తెలసిన ఓ కార్పెంటర్‌గారు విరిగిపోయిన ఎముకులకు స్క్రూలు బిగించలేరు.

కొన్నిపనులు చూడటానికి ఒకే విధంగా ఉంటాయి. కాని జ్ఞానం, నైపుణ్యం విషయంలో రెండింటి మధ్య పరమాణువుకు మరియు పర్వతానికి మధ్య నున్నంత వ్యత్యాసముంటుంది.

హదీస్‌ల విషయంలో దయచేసి మీకు తోచినట్లు మాట్లాడకండి. హదీస్ జ్ఞానాన్ని పొంది, వాటిని ఆచరించండి.

ఈ మధ్యన మొబైల్ ఫోన్‌లలో ఎస్.ఎమ్.ఎస్. ద్వారా హదీస్‌లను ఇంగ్లీష్‌లోనూ, వాటి ట్రాన్స్‌లిటరేషన్‌ను తెలుగు మరియు ఉర్దూలలో పంపిస్తున్నారు. చాలా మంది దానిని అర్థం చేసుకోకుండానే మరొకరికి ఫార్వర్డ్ చేస్తున్నారు. ఒకవేళ ఆ హదీస్ సరియైన అనువాదం కాకపోయినా, అందులో కొన్ని పదాలు మిస్ అయిపోయినా, సహీహ్ హదీస్‌ను మీరు 'మౌదూ' రూపంలో మరొకరికి తెలియజేసినట్లు అవుతుంది.

మీరు ఏ హదీస్ గురించి అయితే మాట్లాడాలని అనుకుంటారో, ముందుగా ఆ హదీస్‌ను దాని మూలంతో సహా చదివి పూర్తిగా అర్థం చేసుకున్నాకే చెప్పండి.

తెలియని హదీస్‌ల గురించి మీకు తోచినదేదో చెప్పకండి. కనీసం ఒక 2000 హదీసులనైనా చదివి అర్థం చేసుకోని వ్యక్తి కూడా ఏదైనా హదీస్‌ను వినగానే, అటువంటి హదీస్ ఏమీ లేదని చెప్పేయడం తప్పు మాత్రమే కాకుండా, ఒకవేళ అటువంటి హదీస్ ఉండి ఉంటే అది ప్రవక్త(స)వారి ద్వారా విన్న విషయమే అయితే, అప్పుడు ఆ వ్యక్తి ప్రవక్త(స)వారిని తప్పు పట్టినట్లు అవుతుంది.

ఏ హదీస్ గురించి అయినా తెలియకపోతే, 'నాకు తెలియదు' అని చెప్పుకోవడం చిన్నతనమేమీ కాదు. ఎందరో హదీస్ జ్ఞానంగల విద్వాంసులు రోజులో ఎన్నోసార్లు తమకు 'తెలియదు' అని చెప్పేవారు. జ్ఞానమున్నవారికి లేనివారికి అదే తేడా!

**మరి కొన్ని ముఖ్యవిషయాలు ఇన్షా అల్లాహ్ రాబోయే సంచికలో ...**

(9వ పేజీ తరువాయి భాగం ...)

కాని ఎవ్వరూ ఆ ఛాలెంజ్‌ని స్వీకరించలేదు.

ముహమ్మద్(స)వారు అల్లాహ్ దయతో చంద్రుడిని రెండుగా చీల్చి చూపినా, చుట్టు ప్రక్కల ప్రాంతాల వారు అది చూశామని సాక్ష్యం చెప్పినా సరే వారు ఆ అద్భుతాన్ని స్వీకరించలేదు.

ఇక్కడ తెలుసుకోవలసిన మరో ముఖ్య విషయం ఏమిటంటే, ముందరి ప్రవక్తలు ఇటువంటి అద్భుతాలు చూపించి, అల్లాహ్ మార్గం వైపు పిలిచేవారు. కాని ముహమ్మద్(స) అటువంటి ఎన్నో అద్భుతాలు చేసి చూపినా, వాటి ద్వారా ఎన్నడు ఆయన(స) ప్రజలను ఇస్లామ్ వైపు పిలవలేదు. ఆయన(స) కేవలం ఖుర్ఆన్ ద్వారానే పిలిచారు.

ఎటువంటి అద్భుతాన్ని అయినా సరే, అరబ్బులు తిరస్కరించగలరు. కాని వారు తిరస్కరించలేని అద్భుతం కేవలం - 'ఖుర్ఆన్' మాత్రమే! ఖుర్ఆన్‌ను ముహమ్మద్(స)వారి అద్భుతంగా చెప్పుకున్నారు వారు.

కాబట్టి అరబీ తెలియని పాఠకుడు, ఖుర్ఆన్ గొప్ప గ్రంథమని, అల్లాహ్ యొక్క వచనమని స్వీకరించడం వలన ఈ ఛాలెంజ్‌ను బహుశా మామూలుగా తీసుకుని ఉండవచ్చు.

వారికి సాధ్యమైనన్ని విధాలుగా అందరి సహకారం తీసుకోమన్నారు. ఆ తరువాయి ఆయత్‌లో 'నిశ్చయంగా మీరు అలా చేయలేరు' అని అల్లాహ్‌యే స్పష్టం చేసేశారు.

ఇస్లామ్ జ్యోతిని ఆర్పివేయడానికి తమ జీవితాలనే త్యాగం చెయ్యడానికి సిద్ధపడినవారు - 'అలా చేయలేరు' అని చెప్పిన ఆయత్‌కు వ్యతిరేకంగా 'చేయగలిగాము' అని నిరూపించ గలిగి ఉంటే, ఏ రక్తపాతమూ, ఏ ఒత్తిడి లేకుండానే సులభంగా చాలా కూల్‌గా తాము అనుకున్నది సాధించగలిగేవారు.

ఈ ఆయత్ వివరణకి సంబంధించి ఇంకా ఎన్నో ఆసక్తికరమైన విషయాలు ఉన్నాయి.

**ఇన్షా అల్లాహ్! వాటిని వచ్చే సంచికలో అందిస్తాము.**

**ఇస్లామ్ గురించి ఎవరికైనా పరిచయం చేయాలనుకుంటున్నారా?**

**ఇస్లామ్‌పై మరియు ముస్లిములపై అపోహలను**

**తొలగించాలనుకుంటున్నారా?**

**శాంతిబాట మాసపత్రికను చదివించండి**

**చందాదారులను చేర్పించండి.**

**ఆర్థికంగా మీకు వీలైతే ఒకటి కంటే ఎక్కువ కాపీలను తీసుకుని**

**మీ స్నేహితులకు అందజేయండి.**




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

# సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**9**

(గత సంచిక తరువాయి ...)

## తొలి దివ్య సందేశం అవతరణకు పూర్వం సమాజంలో నెలకొని ఉన్న పరిస్థితులు

ముహమ్మద్(స)వారిని అల్లాహ్ యొక్క ప్రవక్తగా స్వీకరించడానికి ప్రజలు ఏ విధంగా సిద్ధం కావించబడుతున్నారో గత సంచికలో తెలియజేశాము. ముహమ్మద్(స)వారికి ప్రవక్త పదవి స్వీకరించ వలసిన సమయం దగ్గరయ్యే కొద్దీ ఆయన అనుభూతులు ఎలా ఉండేవో చెప్పేముందు అప్పటి పరిస్థితుల గురించి క్లుప్తంగా చెప్పుకుందాం.

నైతిక పతనం సమాజం అంతా వ్యాపించి ఉంది. ఏ సమాజంలో నైనా చెడు వ్యాపించడం ప్రారంభం కాగానే కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత స్థాయిలో ఆ చెడునుండి సమాజాన్ని నయం చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటారు. కాని అటువంటి పరిష్కారాలు ఏవీ కూడా 6వ శతాబ్దం మధ్య కాలంలో సాధ్యం కాని విధంగా అప్పటి పరిస్థితులు ఉండేవి.

కేవలం ఏదో ఒక నమ్మకాన్నో లేదా ఓ చెడు ఆచారాన్నో తొలగిస్తే సరిపోయే పరిస్థితి కాదు అది. మొత్తం వ్యవస్థనే మార్చాలి. ఓ కొత్త జీవనవిధానాన్ని పరిచయం చేయాలి. తరతరాలుగా పేరుకుపోయిన తప్పుడు నమ్మకాలు మరియు ఆచారాలు మారాలి. ఈ సమస్యల పరిష్కారానికి ఎవరో కొందరు సంఘ సంస్కర్తలు సరిపోరు.

మానవాళిని చీకటి నుండి వెలుగువైపు తీసుకు రావడానికి మానవులలో ఓ సంపూర్ణమైన పరివర్తనం తీసుకువచ్చి వారి స్థాయిని పెంచడానికి అల్లాహ్ ఓ సందేశహరుడిని మానవాళికి కారుణ్యంగా పంపారు.

**మరియు ఏమీ? ఒక మరణించిన వ్యక్తి (అవిశ్వాసి)ని, మేము సజీవుని (విశ్వాసి)గా చేసి జ్యోతిని ప్రసాదించగా! దానితో ప్రజల మధ్య సంచరిస్తున్నవాడూ మరియు అంధకారం (అవిశ్వాసం)లో చిక్కుకొని, దాని నుండి బయటకు రాజాలని వాడూ ఇద్దరూ సమానులా? ఇదే విధంగా సత్య తిరస్కారులకు, వారు చేస్తున్న కర్మలు, మనోహరమైనవిగా చేయబడ్డాయి.** (ఖుర్'ఆన్ 6:122)

ముహమ్మద్(స)వారిని అల్లాహ్ తన సందేహరునిగా పంపడానికి ముందు మరియు తరువాత మానవాళి పరిస్థితి ఏ విధంగా ఉండేదో క్రింది ఆయత్‌లో మరింత లోతుగా వర్ణించడం జరిగింది.

**"...మీరు ఒకరికొకరు శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలను కలిపాడు. ఆయన అనుగ్రహం వల్లనే మీరు పరస్పరం సోదరులయ్యారు. మరియు మీరు అగ్ని గుండం ఒడ్డున నిలబడినప్పుడు ఆయన మిమ్మల్ని దాని నుండి రక్షించాడు. ఈ విధంగా అల్లాహ్ తన సూచనలను మీకు స్పష్టం చేస్తున్నాడు, బహుశా మీరు మార్గదర్శకత్వం పొందుతారని!** (ఖుర్'ఆన్ 3:103)

## ప్రవక్త పదవికి సంబంధించి ముహమ్మద్(స)వారికి ముందుగా అందిన సూచనలు

ప్రవక్తగా త్వరలో స్వీకరించబోయే కర్తవ్యం గురించి ముహమ్మద్(స) వారికి సూచనలు అందుతుండేవి.

జాబిర్ బిన్ సమురా ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"నాకు మక్కాలోని ఓ రాయి తెలుసు అది నేను (ప్రవక్తగా) పంపబడక ముందు నుండి నాకు సలామ్ చేస్తుండేది. దానిని నేను ఇప్పటికీ గుర్తించగలను".** (సహీహ్ ముస్లిమ్, 5939, పుస్తకం. 43, అధ్యా.1, సంపుటి 6)

హిరా గుహలో మొదటిసారి జిబ్రీల్(అ) తొలి దివ్య సందేశాన్ని తీసుకు రావడానికి పూర్వమే ప్రవక్త(స)వారికి నిజమైన కలలు వచ్చేవి. ఆయన ఏదైతే కలలో చూసేవారో నిజజీవితంలో ఖచ్చితంగా అది జరుగుతూ ఉండేది. ఆ విషయం తెలియజేసే ఉల్లేఖనాన్ని తరువాయి పేజీలో అందిస్తున్నాము.

ప్రవక్త కావడానికి ముందు ఆయనలో అంతర్గతంగా మార్పు

వస్తుందని ఆయన అనుభూతి చెందేవారు. ఏకాంతంగా ఉండడం మరియు ఆ పరిస్థితిలో ఆరాధన చేసుకోవడం ఆయన(స)కు ఎంతో ఇష్టంగా ఉండేది. ఆయన(స) హిరా గుహలో ఒంటరిగా ఉంటూ ఆరాధన చేయాలనుకునేవారు. ఆ గుహ (cave) మక్కాకు వాయువ్య (north-west) దిశలో ఉంది. ఎన్నో రాత్రులు ఆయన అక్కడే గడిపేవారు. ఒకొక్కసారి 10 రాత్రులు, ఒకొక్కసారి అంతకంటే ఎక్కువగా బస చేసేవారు. మధ్యలో ఇంటికి వెళుతుండేవారు. ఇంటి దగ్గర గడిపే సమయం తక్కువగా ఉండేది. అక్కడి నుండి ఆహారపానీయాలు తీసుకుని గుహకు తిరిగి వచ్చేవారు.

అబూహురైరా (రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: "**విశ్వాసి కొచ్చే స్వప్నం (కల) ప్రవక్త పదవి యొక్క 46 భాగాలలో ఒక భాగం**" (సహీహ్ ముస్లిమ్, 5911, పుస్తకం 43, అధ్యా.1, సంపుటి 6)

**విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా(రజి) ఉల్లేఖనం :** ప్రారంభంలో దైవప్రవక్త(స)కు కొన్ని మంచి (నిజమైన) కలలు వచ్చేవి. అవి పగటి వెలుతురులా స్పష్టంగా ఉండేవి. మరియు ఆయనపై ఏకాంతం అనుగ్రహించబడింది. ఆయన ఒంటరిగా హిరా గుహకు వెళ్ళి (అక్కడ) ఎన్నో రాత్రులు ఆరాధనలో నిమగ్నులై ఉండేవారు తిరిగి తన కుటుంబాన్ని (చూడటానికి) వెళ్ళేవరకూ.

అక్కడ ఉండటానికి ఆయనతో పాటు ఆహారం తీసుకెళ్ళేవారు మరియు వెనక్కి (తన భార్య) ఖదీజ(రజి) దగ్గరకు వచ్చి ఆహారాన్ని తీసుకెళ్ళేవారు. ఇలా జరుగుతూ ఉంది, ఆయన హిరాగుహలో ఉండగా అకస్మాత్తుగా ఆయనపై సత్యం దిగేవరకూ. దైవదూత ఆయన దగ్గరికి వచ్చి ఆయనను చదవమని అడిగారు. ప్రవక్త(స) చెప్పారు, '**ఎలా చదవాలో నాకు తెలియదు**'.

ప్రవక్త(స) ఇంకా చెప్పారు, "తరువాత దైవదూత నన్ను (బలంగా) పట్టుకుని, నేను ఏ మాత్రం భరించలేనంత గట్టిగా అదిమారు. తరువాత ఆయన నన్ను వదిలి, చదవమని అడిగారు. మరియు నేను సమాధానమిచ్చాను, '**ఎలా చదవాలో నాకు తెలియదు**'. అప్పుడు మరలా నన్ను పట్టుకుని రెండవసారి నన్ను అదిమారు. ఇక నేను ఎంతమాత్రం భరించలేనంత వరకూ. తరువాత ఆయన నన్ను వదిలి, చదవమని మరలా అడిగారు కాని నేను మరలా సమాధానం చెప్పాను, '**ఎలా చదవాలో నాకు తెలియదు**' అప్పుడు ఆయన మూడవసారి నన్ను పట్టుకుని అదిమారు. మరియు తరువాత నన్ను వదలి చెప్పారు,

**"చదువు నీ ప్రభువు పేరుతో, ఆయనే (సర్వాన్ని) సృష్టించాడు. ఆయనే మానవుణ్ణి రక్తపు ముద్ద (జీవకణం)తో సృష్టించాడు. చదువు! మరియు నీ ప్రభువు పరమదాత. ఆయన కలం ద్వారా నేర్పాడు. మానవుడు ఎరుగని జ్ఞానాన్ని అతనికి బోధించాడు."** (సూరహ్ అలఖ్ 1-5)

తరువాత అల్లాహ్ సందేశహరులు గుండె దడదడ కొట్టుకుంటుండగా ఆ సందేశంతో తిరిగివచ్చారు. ఆయన ఖదీజ బిన్త్ ఖువైలిద్(రజి) దగ్గరికెళ్ళి చెప్పారు, "నన్ను దుప్పటితో కప్పు, నన్ను దుప్పటితో కప్పు". వారు ఆయనను కప్పారు ఆయన భయం పోయేవరకు. ఆ తరువాత ఖదీజ(రజి)వారికి జరిగిన విషయం ప్రతీది ఆయన తెలియజేసి (చెప్పారు), "నాకేదో జరుగుతుందని నేను భయపడుతున్నాను." ఖదీజ బదులుగా చెప్పారు, "ఎన్నటికీ కాదు! అల్లాహ్ సాక్షి! అల్లాహ్ ఎన్నటికీ మిమ్మల్ని అవమానపరచరు. మీరు బంధువులను ఆదరిస్తారు, పేదవారికి, అనాథలకు సహాయం చేస్తారు, అతిథులను సత్కరిస్తారు మరియు ఆపదలలో ఉన్నవారికి సహాయం చేస్తారు".

తరువాత ఖదీజ(రజి) ఆయనని తనతోపాటు తన చిన్నాయన కొడుకు వరఖ బిన్ నౌఫల్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా దగ్గరకు తీసుకెళ్ళారు. ఆయన అజ్ఞానకాలంలో క్రైస్తవుడిగా మారాడు మరియు హెబ్రూ అక్షరాలతో వ్రాస్తూ ఉండేవాడు. అల్లాహ్ ఆయనకు అవకాశ మిచ్చినంతమేర ఇంజీల్‌ను హెబ్రూలో వ్రాశాడు. ఆయన చాలా వృద్ధుడు మరియు ఆయన చూపును కోల్పోయాడు.

వరఖగారితో ఖదీజ(రజి) చెప్పారు, "అన్నా! నీ సోదరుని కుమారుడు (యొక్క కథ) వినండి. వరఖ అడిగారు, "ఓ కుమారా! నీవేమి చూశావు?" అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) ఆయన చూసిన దానిని వర్ణించారు. వరఖ చెప్పారు, "ఇది ఆయనే, ఎవరైతే రహస్యాలను దాచిఉంచుతారో - మూసా(అ)వారి దగ్గరకు అల్లాహ్ పంపిన దైవదూత జిబ్రీల్.

**"నీ జాతి ప్రజలు నిన్ను బహిష్కరించే వరకూ నేను యౌవ్వనంతో బ్రతికి ఉండగలిగితే బావుణ్ణు"**

అల్లాహ్ యొక్క సందేశహరుడు(స) అడిగారు "**వారు నన్ను బహిష్కరిస్తారా?**".

వరఖ అవునని సమాధానమిచ్చి చెప్పారు "**నీవు తీసుకొచ్చినవంటిదే ఎవరైనా తీసుకువచ్చాక వారితో శతృత్వం వహించారు, మరియు ఆ రోజు వరకూ నేను జీవించి ఉన్నట్లయితే నేను నీకు గట్టిగా మద్దతునిస్తాను**". కాని కొన్ని రోజులకే వరఖా చనిపోయారు మరియు దివ్య సందేశావతరణ కూడా కొంతకాలంపాటు నిలిచిపోయింది. (సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 3, సంపుటి 1, అధ్యా. 3)

పై హదీస్‌ను తీసుకుని ఎందరో దుష్ప్రచారకులు, ముహమ్మద్(స) వారిపై ఎన్నో అభాండాలు వేశారు. 'ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం' పుస్తకంలో 141వ పేజీలో కొంత వివరణ ఇచ్చాము. www.saanthibaata.net నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఈ దుష్ప్రచారకుల విషయం పక్కన పెడదాం. ముహమ్మద్(స)వారి చరిత్రను తెలుసుకోవడానికి ఆసక్తి చూపేవారికి పై హదీస్ విషయంలో కొంత వివరణ ఇవ్వడం తప్పనిసరి అనిపించింది.

మేము చెప్పే ఈ వివరణ పూర్తిగా మా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. మాకు అర్థమైన దానిని మీకు తెలియజేస్తున్నాము. నిజం అల్లాహ్‌కే తెలుసు.

ఈ ఉల్లేఖనంలో ముఖ్యమైనవి రెండు విషయాలు :

1. ముహమ్మద్(స)వారిని జిబ్రీల్(అ)వారు ఎందుకు గట్టిగా అదిమారు?
2. ముహమ్మద్(స)వారు ఎందుకు భయపడ్డారు?

అది ఎటువంటి భయం? ఎప్పుడూ చూడని వ్యక్తిని అకస్మాత్తుగా చూస్తే కలిగే భయమా? అది ఎంతమాత్రం కాదు. ఎందుకంటే జిబ్రీల్ (అ)వారిని చూసి భయపడినట్లు పై ఉల్లేఖనంలో లేదు. అంతేకాకుండా ఆ విధంగా అకస్మాత్తుగా చూడటం వలన భయం కలిగితే, అది తాత్కాలిక మైనదే, అంతేగాని ఇంటికి చేరేవరకూ ఉండదు.

ప్రవక్త(స)వారిని జిబ్రీల్(అ) గట్టిగా అదిమారు. ఎందుకు అలా అదిమారు? నిజం అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికే తెలుసు. 'ఎలా చదవాలో నాకు తెలియదు' అని అన్నందుకే అదిమారా? అది ఎంతమాత్రం కాదు.

ముహమ్మద్(స)వారికి చదవడం, వ్రాయడం తెలియదని జిబ్రీల్(అ) వారికి అల్లాహ్ తెలిపే ఉంటారు. ఇక్కడ ప్రవక్త(స)వారు స్వీకరించబోయే బాధ్యత సామాన్యమైనది కాదు. చిట్టచివరిది మరియు పరిపూర్ణమైన ధర్మశాస్త్రాన్ని ప్రపంచ ప్రజలకు అందజేయవలసిన బాధ్యత.

ప్రవక్త(స)వారిని అదమ కుండానే జిబ్రీల్(అ)వారు చెప్పవచ్చు. దివ్య సందేశాన్ని స్వీకరించడానికి ప్రవక్త(స)వారిని సిద్ధం చేయడానికి అలా చేసి ఉండాలి. ఈ జిబ్రీల్(అ)వారే ప్రవక్త(స)వారి చిన్న తనంలో ఆయన హృదయాన్ని శుభ్రం చేశారు. ఈ 'గట్టిగా అదమడం' వెనుక కారణం ముహమ్మద్(స)వారిని అతి శక్తివంతమైన ఓ కర్తవ్యాన్ని స్వీకరించడానికి తయారు చేయడంగా అనిపిస్తుంది. నిజం అల్లాహ్‌కే తెలుసు.

ఇక రెండవ విషయానికొద్దాం. ఎందుకు భయపడ్డారు? ప్రవక్త(స) వారు తరువాయి కాలంలో ఒంటె మీద ఉన్నప్పుడు వహీ (దివ్య సందేశం) అందినప్పుడు, ఆ సమయంలో ఆ భారాన్ని ఒంటె కూడా భరించలేకపోయింది. ఆ వహీని స్వీకరించేటప్పుడు ప్రవక్త(స)వారి పరిస్థితి ఎలా ఉండేదో అర్థమౌతుంది. సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ఆయనకు అప్పుడు ఎంత కష్టంగా ఉంటుందో!

ఆ కాలంలోనే అలా ఉంటే, మొట్టమొదటి సారి వహీ స్వీకరించి నప్పుడు ఆయన పరిస్థితి ఇంకెంత కష్టంగా ఉంటుందో ఆలోచించ గలిగే ప్రతివారికి అర్థమౌతుంది. ఒంటెపై కూర్చున్నప్పుడు వచ్చిన వహీ తదితర విషయాలు, ఆయా సందర్భాలలో ఇన్షా అల్లాహ్ ఇదే శీర్షికలో అందిస్తాము.

అంతకు ముందు ఏ విధమైన అనుభవంలేని ఓ అతిపెద్ద బాధ్యతను స్వీకరించవలసి వచ్చినప్పుడు ఎవరైనా ఓ విధమైన టెన్షన్‌కు గురి అవుతారు. బాధ్యత స్వీకరించే సమయంలో ఆ టెన్షనే భయమంటే! ఆ భయం యొక్క స్థాయి కూడా స్వీకరించబోయే బాధ్యత యొక్క స్థాయిపై ఆధారపడి ఉంటుంది. చదవడం, వ్రాయడం తెలియని ఓ వ్యక్తిని ఓ అతిపెద్ద కంపెనీకి మేనేజింగ్ డైరక్టర్‌గా చేసి, ఫలానా ఫలానా చేయాలని ఆదేశిస్తే, ఆ వ్యక్తి ఎటువంటి అనుభూతికి లోనవుతాడో ఆలోచించండి!

టెన్షన్‌లో ఉన్నప్పుడు ఏదో అయిపోతున్నట్లు అవుతుంది.

సాధారణంగా ఏ భార్య అయినా టెన్షన్‌తోనూ భయంతోనూ తన భర్త ఇంటికి వస్తే, ఏ విధంగా రియాక్ట్ అవుతారు? వెంటనే కంగారు పడిపోతారు. కాని ముహమ్మద్(స)వారి భార్యయైన ఖదీజ(రజి)వారు ఆ విధంగా కంగారు పడలేదు. ఆయన ఆ స్థితి నుండి బయటపడేలా ఎంత చక్కగా మాట్లాడారో!

**"ఎన్నటికీ కాదు! అల్లాహ్ సాక్షి! అల్లాహ్ ఎన్నటికీ మిమ్మల్ని అవమానపరచరు. మీరు బంధువులను ఆదరిస్తారు, పేదవారికి, అనాథలకు సహాయం చేస్తారు, అతిథులను సత్కరిస్తారు మరియు ఆపదలలో ఉన్నవారికి సహాయం చేస్తారు"**

భర్తకు ఉన్న అసాధారణమైన గుణాలను ఆమె అర్థం చేసుకున్నారు. తన భర్తకు మేలే జరగుతుందని ప్రగాఢ విశ్వాసం ఆమె మాటలలో కనిపిస్తుంది. అనంత కరుణామయుడైన అల్లాహ్, తన సందేశహరునికి కూడా అసాధారణమైన లక్షణాలున్న ఓ మంచి భార్యనే అనుగ్రహించారు. అర్థం చేసుకునే మంచి భార్య తోడుగా ఉంటే, కష్టాలలో ఉన్నప్పటికీ ఏ మనిషికైనా ఎంతో మనశ్శాంతిగా ఉంటుంది.

ఏ భర్త అయినా జీవితంలో ఎంత ఐశ్వర్యాన్ని పొందినా రాని సుఖం, అర్థం చేసుకునే ఓ మంచి భార్య తోడుగా ఉంటే వస్తుంది. అంతకన్నా మించిన ఐశ్వర్యం మరొకటి ఉండదు. అటువంటి భార్యపై భర్తకు ఎంత గౌరవముంటుందో ప్రవక్త(స)వారి జీవితాన్ని తెలుసుకుంటే స్పష్టమౌతుంది.

హజ్రత్ ఖదీజా(రజి) మరణించిన తరువాత ఆమె గురించి ఎంతో గౌరవంగా ముహమ్మద్(స) వారు తన ప్రియమైన భార్య 'ఆయిషా' (రజి)తో ఏమని చెప్పారో చూడండి.

**''లేదు. ప్రజలు నన్ను త్రోసి పుచ్చిన రోజుల్లో ఆమె నా పక్షాన నిలిచింది. ప్రజలు తిరస్కార వైఖరి నవలంభిస్తుండగా ఆమె ఇస్లాంను స్వీకరించింది. నాకు సహాయపడే వారెవరూ లేని సమయంలో ఆమె నన్ను ఆదుకున్నది''**

ఉత్తముడైన తన భర్త నుండే కాకుండా, ఖదీజ(రజి)వారికి అందిన మరొక అపూర్వ గౌరవం గురించి క్రింది హదీస్ ద్వారా తెలుస్తుంది.

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స)వారి వద్దకు జిబ్రీల్(అ) వచ్చి చెప్పారు, '' ఓ రసూలలుల్లాహ్(స)! షేర్వా (లేదా కొంత ఆహారం లేదా నీళ్ళు - ఉల్లేఖకునికి ఈ మూడింటిలో ఏదో గుర్తు లేదు) కలిగిన పాత్రతో ఖదీజా(రజి) మీ దగ్గరకు వస్తున్నారు. ఆమె మిమ్మల్ని చేరినప్పుడు ఆమెకు ఆమె ప్రభువు (అల్లాహ్) తరపున సలామ్ చెప్పండి మరియు నా తరపున (కూడా). మరియు స్వర్గంలో ఖసబ్(మణుల)తో నిర్మించబడిన భవనాన్ని కలిగి ఉంటారనే శుభవార్తను అందజేయండి, అందులో అలజడులుగాని, కష్టాలుగాని ఉండవు **(సహీహ్ బుఖారీ, 3820, సంపుటి 5, పుస్తకం 63, అధ్యాయం 20)**

**(మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...)**



# పేదరికం

## ఆర్థిక అసమానతలు



**పేదరిక నిర్మూలనకు 1400 సంవత్సరాల క్రితమే ఖుర్'ఆన్ స్పష్టమైన పరిష్కారాన్ని చూపింది.**

ప్రతీ మనిషి యొక్క మూడు ముఖ్యమైన కనీస అవసరాలు : ఆహారం, దుస్తులు, ఉండటానికి ఓ నివాసం. ఉండే నివాసం స్వంతది కానవసరం లేదు. ఎందుకంటే పేదరికం లేని ఎంతోమంది మధ్య తరగతి వారికి స్వంత ఇల్లు లేదు. కొంతమందికి స్వంత ఇల్లు ఉంటుంది గాని తినడానికి ఏమీ ఉండదు. కాబట్టి ప్రపంచం దృష్టిలో పేదరికం అంటే ఏమిటో ముందుగా తెలుసుకుందాం.

పేదరికానికి ఆకలే కారణమని చెబుతున్నారు. తినడానికి సరిపడా తిండి లేకపోవడం పేదరికాన్ని సూచిస్తుంది. మన ప్రపంచంలో ఆకలితో బాధపడేవారి సంఖ్య 2010 గణాంకాల ప్రకారం (FAO) దాదాపు 93 కోట్ల మంది. ఒక్క Sub-Saharan ఆఫ్రికాలో 24 కోట్లమంది ఉన్నారు. ఆశియా మరియు ఫసిఫిక్ ప్రాంతాలలో 58 కోట్ల మంది. అభివృద్ధి చెందిన దేశాలలో 2 కోట్లమంది ఉన్నారు.

**అంటే ప్రపంచ జనాభాలో దాదాపు 7వ వంతు ప్రజలకు తినడానికి తిండి (సరిపడా ఆహారం) లేదని స్పష్టమౌతుంది.**

### ప్రపంచంలో ఉత్పత్తి చేసే తిండి గింజలు తక్కువుగా ఉన్నాయా?

ప్రపంచంలో ప్రతీ ఒక్కరికీ సరిపోయేటంత ఆహారం ఉత్పత్తి అవుతుంది. FAO గణాంకాల ప్రకారం ఓ 30 సంవత్సరాల క్రితం లభించిన ఉత్పత్తి కంటే నేడు 17శాతం ఉత్పత్తి పెరిగింది. విచిత్రమేమిటంటే జనాభా 70 శాతం పెరిగినా సరే ఉత్పత్తి కూడా పెరిగింది.

సరిపోయేటంత ఉత్పత్తి ఉన్నప్పటికి, వాటిని కొనడానికి సరిపడా ధనం 93 కోట్లమంది పేదవారి దగ్గర లేదు.

కాబట్టి పేదరికాన్ని, వారు సంపాదించే 'వేతనం' (రోజు కూలీ) ప్రకారం నిర్వచించారు.

ప్రపంచ బ్యాంకు 2005 గణాంకాల ప్రకారం **అభివృద్ధి చెందుతున్న దేశాలలో** 134 కోట్లమంది పేదవారు రోజుకి 1.25 డాలర్లు లేదా అంతకంటే తక్కువ సంపాదిస్తున్నారు. 1.25 డాలర్లు అంటే దాదాపు 62 రు॥లు.

102 కోట్ల మందికి పోషకాహారం లేదు. 1981 సంవత్సరంలో ప్రపంచంలోని 190 కోట్లమంది రోజుకి 1.25 డాలర్లు లేదా అంతకంటే తక్కువ సంపాదించేవారు ఉండగా, 2005 సంవత్సరం నాటికి వారి సంఖ్య 134 కోట్లకు తగ్గింది. పేదవారి సంఖ్య తగ్గింది. దానికి కారణం ఆశియాలో పెరిగిన అభివృది. చైనాలో ఈ అభివృద్ధి బాగా జరిగింది.

**ఉత్పత్తి అయిన ఆహారం అందరికీ అందక పోవడానికి మరియు పేదరికానికి ప్రస్తుతం అమలులో ఉన్న ఆర్థిక వ్యవస్థలే కారణం.**




### వృథా గావించబడుతున్న ఆహారం

అమెరికాలోని వ్యవసాయ విభాగం (US Dept. of Agriculture) ప్రకారం, అమెరికన్లు వృథాగా పారవేసే ఆహారంలో కనీసం 5 శాతాన్ని గనుక రికవర్ చేయగలిగితే, ఆ ఆహారంతో 40 లక్షల మంది ఒక రోజు కడుపు నింపవచ్చు. 5 శాతం కాకుండా ఆ వృథాగా పోయే మొత్తం ఆహారాన్ని పూర్తిగా రికవర్ చేయగలిగితే ఆ ఆహారం 8 కోట్లమందికి ఒక రోజుకు సరిపడా ఆహారం అవుతుంది లేదా 2 లక్షల మందికి ఓ సంవత్సరానికి పూర్తిగా సరిపడా ఆహారమవుతుంది.

ఇక ఐక్యరాజ్యసమితి యొక్క ప్రపంచ ఆహార ప్రోగ్రామ్‌ని బట్టి తెలిసేదేమిటంటే,

- అమెరికాలో, అక్కడి ప్రజలకు సరిపోగా, మిగిలిన ఆహారంతో ఆఫ్రికాలోని ప్రతీ ఖాళీ కడుపును నింపవచ్చు.
- ఫ్రాన్స్ ప్రజలు వదిలేసిన వాటితో ప్రజాస్వామ్య రిపబ్లిక్ అయిన 'కాంగో' దేశ ప్రజలను పోషించవచ్చు.
- ఇక ఇటలీ విషయానికొస్తే, వీరు ఇథియోపియాలోని పోషకాహారం లేక బాధపడుతున్న వారిని పోషించవచ్చు.

ప్రపంచ వ్యాప్తంగా చూస్తే, ఈ మధ్య కాలంలో అందరికంటే చాలా ఘోరంగా తప్పుచేసే దేశాలు ఏవంటే యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటిష్ వారు) మరియు జపాన్.

వీరు తమ ఆహార ఉత్పత్తిలో 30 నుండి 40 శాతం వరకూ ప్రతీ సంవత్సరం వృథా చేస్తున్నారు. అమెరికా వ్యవసాయ విభాగం అంచనాల ప్రకారం, దేశంలోని నాలుగవ వంతు ఆహారం అంటే దాదాపుగా

**2 కోట్ల 59 లక్షల టన్నుల ఆహారం** ప్రతీ సంవత్సరం **చెత్తకుండీలలో** పడుతుందంటే పరిస్థితిని అర్థం చేసుకోండి.

అరిజోనా యూనివర్శిటీ గావించిన మరొక అధ్యయనంలో, అమెరికాలో వృధాగా పోయే ఆహారం 50 శాతం కంటే ఎక్కువగానే ఉందని తేలింది. దేశంలోని సూపర్ మార్కెట్లు, రెస్టారెంట్లు మరియు కన్వీనియన్స్ స్టోర్‌లను మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటే, కేవలం వీటి ద్వారానే **2 లక్షల 70వేల టన్నుల ఆహారం వృధాగా విసిరివేయబడుతుందని తెలుస్తుంది.** ఈ వృధాగా పారవేసిన ఆహారం విలువ 3000 కోట్ల డాలర్లు. మన కరెన్సీలో చెప్పాలంటే 1 లక్షా 20వేల కోట్ల రూపాయలు.

వృథాగా పారవేయబడిన ఆహారం విలువే అంత ఉంటే, ఆ వృథాగా పారవేసిన ఆహారాన్ని తొలగించి శుభ్రం చేయాలి కదా!

అమెరికాలోని EPA (Environmental Protection Agency) ప్రకారం, వృధాగా పారవేసిన ఆ ఆహారాన్ని తొలగించడానికి ప్రతీ సంవత్సరం 100 కోట్ల డాలర్లు (5000 కోట్ల రూపాయలు) ఖర్చవుతుందట.

శుభ్రం కావించడానికి అయ్యే ఈ ఖర్చుతో 8 లక్షల 30 వేల కుటుంబాలు మనదేశంలో సంవత్సరంపాటు ఏ లోటు లేకుండా బ్రతకుతాయి.



**అందరికీ సరిపడా ఆహారం ఉత్పత్తి అవుతున్నా సరే, ఆకలి కడుపులకి చేరవలసిన ఆహారం చెత్త కుండీలకు చేరడమే కాకుండా, ఆ చెత్తకుండీల నుండి తొలగించడానికి వందల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టవలసి వస్తుంది.**

**ఇన్‌కమ్ టాక్స్ రూపంలో మనదేశానికి లభించే ఆదాయం :**

ఆదాయపు పన్ను ద్వారా మన దేశానికి లభించేది కేవలం రెండున్నర లక్షల కోట్లు. మన దేశంలో ఎంతోమంది ఆదాయపు పన్ను ఎగ్గొట్టేవారు ఉన్నారు. ఎగ్గొట్టడానికి వీలులేనివారు ఉద్యోగస్తులు.

**మనదేశ ప్రభుత్వం 2011-12 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశించిన ఆదాయపుపన్ను శ్లాబులు:**

| | |
|---|---|
| రూ. 1,80,000 వరకూ | పన్ను లేదు |
| రూ. 1,80,001 - రూ. 5,00,000 వరకూ | 10 శాతం |
| రూ. 5,00,001 - రూ. 8,00,000 వరకూ | 20 శాతం |
| రూ. 8,00,000 పైగా ఆదాయముంటే | 30 శాతం |

1 లక్షా 80వేల రూపాయల వార్షిక ఆదాయముంటే అతనిపై ఆదాయపు పన్ను లేదు. దానిపై ఒక్క రూపాయి పెరిగినా సరే 10శాతం పన్ను చెల్లించాలి. ఉదాహరణకు ఒక ఉద్యోగి సంవత్సరానికి 1 లక్షా ఎనభై వేలు సంపాదిస్తున్నాడని అనుకుందాం. మరొక వ్యక్తి సంపాదన 1 లక్షా ఎనభై వేల కంటే ఒక్క రూపాయే ఎక్కువనుకుందాం. కేవలం ఆ ఒక్క రూపాయి ఎక్కువైనందుకు అతను 18వేల రూపాయల టాక్స్ కట్టాలి. తన తోటి ఉద్యోగి కంటే ఒక్క రూపాయి ఎక్కువైనందుకు 18వేలు రూపాయలు కోల్పోవలసి వచ్చింది. అంటే దాదాపు ఒక నెల జీతాన్ని కోల్పోయాడు.




9 లక్షల రూపాయలు కలవాడు **2 లక్షల 70వేలు** ఆదాయపు పన్ను కట్టాలి.
ఇస్లామ్ ప్రకారం అయితే సంపదపై జకాత్ పన్ను కేవలం **రూ. 22,500/-**.

క్రింది పట్టిక చూడండి :

(రూపాయిలలో)

| కలిగి ఉన్న ఆదాయం | మనదేశం విధించిన ఆదాయపు పన్ను | ఇస్లామ్ విధిగా చేసిన జకాత్ |
|---|---|---|
| 30,000 | లేదు | 750 |
| 50,000 | లేదు | 1,250 |
| 1,00,000 | లేదు | 2,500 |
| 1,50,000 | లేదు | 3,750 |
| 1,80,000 | లేదు | 4,500 |
| 1,80,001 | **18,000** | **4,500** |
| 2,00,000 | 20,000 | 5,000 |
| 5,00,000 | 50,000 | 12,500 |
| 5,00,001 | **1,00,000** | **12,500** |
| 9,00,000 | 2,70,000 | 22,500 |
| **1 కోటి** | **30 లక్షలు** | **2 లక్షల 50 వేలు** |

100 కోట్లు కలిగిన వ్యక్తి ఇస్లామ్ జకాత్ ప్రకారం రెండున్నర కోట్లు ఇవ్వడానికి ఇష్టపడతాడుగాని మనదేశ చట్టప్రకారం 30 కోట్లు ఇవ్వడానికి ఇష్టపడడు. కాబట్టి సంపాదన ఎక్కువగలవారు భారీ ఎత్తున కట్టవలసిన ఆదాయపు పన్ను నుండి తప్పించుకోవడానికే అవినీతి మార్గాలను ఉపయోగించుకుని ఆ సొమ్మును మన దేశాన్ని దాటించి విదేశీ బ్యాంకులలో దాచు కుంటున్నారు.

నిజానికి ఇస్లామ్ చట్టప్రకారం ఏర్పాటు చేసిన జకాత్ పరిమాణానికి సరిపోయే విధంగా పన్ను విధిస్తే, సంపన్నులు అందరూ మన బ్యాంకుల లోనే ధనాన్ని దాచుకుంటారు.

ప్రస్తుతం విదేశీ బ్యాంకులలో మనవారు దాచుకున్న డబ్బు 75 లక్షల కోట్ల రూపాయలని అంటున్నారు. కొందరు 500 లక్షల కోట్ల రూపాయలు అంటున్నారు. ఏ సంఖ్య నిజమో మనం పరిశోధించి తెలుసుకోలేము. వాస్తవంగా 75 లక్షల కోట్ల రూపాయలకు జకాత్ కడితే, దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలు అవుతుంది. ఒకవేళ 500 లక్షల కోట్ల రూపాయలు నిజమైతే మన ప్రభుత్వానికి అందే ఆదాయపు పన్ను దాదాపు 12 లక్షల కోట్లు అవుతుంది.

మన ప్రభుత్వానికి ఇన్‌కమ్ టాక్స్ రూపంలో అందే సొమ్ము కేవలం రెండున్నర లక్షల కోట్లు మాత్రమే. మన ప్రభుత్వ టాక్స్ విధానాన్ని ఇస్లామీయ టాక్స్ విధానం ప్రకారం మార్పు చేస్తే, ఆదాయపు పన్ను ద్వారా మనదేశానికి లభించే సొమ్ము చాలా రెట్లు పెరుగుతుంది.

అంతేకాకుండా మనదేశం ప్రపంచ బ్యాంకు నుండి అప్పు తీసుకునే బదులు, మన సంపన్నుల నుండే తీసుకోవచ్చు. ఈ విధంగా చేయడం వలన పేదవారికే కాకుండా మన దేశానికి కూడా మేలు జరుగుతుంది. అదే విధంగా సంపన్నులకు కూడా సంతోషంగా ఉంటుంది. అందరికీ ఆమోద యోగ్యమయ్యే విధానం 'ఇస్లామ్' నిర్దేశించిన 'జకాత్'.

**జకాత్ విధానాన్ని అనుసరిస్తే, మనదేశంలో పేదరికం పోవడమే కాకుండా, ఆకలితో అలమటించే ఆఫ్రికా దేశాలకు సైతం మనం జకాత్‌ను ఇన్షా అల్లాహ్ అందించ గలుగుతాము.**

**తెలుసుకోవలసిన నిజాలు :**

**ప్రపంచంలో 225 మంది అత్యంత ధనవంతుల దగ్గర ఒక ట్రిలియన్ డాలర్ల డబ్బుంది. ఒక ట్రిలియన్ డాలర్లు అంటే, 1000,000,000,000 డాలర్లు.**

మన ఇండియా కరెన్సీ ప్రకారం అయితే సుమారు 50,000,000,000,000 రూపాయలు. అంటే సుమారు 50 లక్షల కోట్ల రూపాయలు.

ప్రపంచంలోని ఈ 225 అత్యంత ధనవంతులు **'జకాత్' అనే విధి దానాన్ని** చేస్తే, అంటే 50 లక్షల కోట్ల రూపాయలలో 40వ భాగం, అంటే **1.25 లక్షల కోట్ల రూపాయలు** అవుతుంది.

ఉదాహరణకు మన రాష్ట్రంలో ఓ చిన్ని కుటుంబం (అంటే భార్య, భర్త, ఇద్దరు పిల్లలు) పెద్దగా సౌకర్యాలు లేని చిన్న ఇంటిలో తిండికి లోటులేకుండా జీవించాలంటే, నెలకి **రూ. 5,000/-** అవసరం అనుకుందాం. అంటే సంవత్సరానికి ఆ కుటుంబానికి 60 వేల రూపాయలు అవసరం.

పైన చెప్పిన ఆ 1.25 లక్షల కోట్ల రూపాయలను మన రాష్ట్రానికే దానంగా ఇస్తే, **రెండు కోట్ల కుటుంబాలు** అంటే, పెద్దలు 4 కోట్లమందికి, పిల్లలు 4 కోట్లమందికి ఒక సంవత్సరం పాటు 60 వేల రూ॥ల చొప్పున అందుతుంది. తిండికి మరియు ఉండటానికి వారికి లోటు ఉండదు.

అంటే 'ఖుర్ఆన్' ఆదేశం ప్రకారంగా జీవిస్తే, 225 మంది అత్యంత ధనవంతులు చేసే దానం 10 కోట్లమందిని లోటు లేకుండా జీవించేలా చేస్తుంది. ఈ దానాన్ని అందుకోవడమే కాకుండా ప్రతీరోజూ అదనంగా కూలిపని కూడా వారు చేస్తే, ఈ రెండు కోట్ల కుటుంబాల వారు, మరికొన్ని కుటుంబాలకు దానం చేసే పరిస్థితి వస్తుంది.

కేవలం 225 మంది అత్యంత ధనవంతులు దానం చేస్తేనే, ఆంధ్ర రాష్ట్రం లాంటి రాష్ట్రం పేదరికంలేని రాష్ట్రంగా మారిపోతే, ప్రపంచంలోని ధనవంతులందరూ ఈ తప్పనిసరి దానాన్ని (జకాత్) ఇస్తే, **ప్రపంచంలో పేదరికం ఉంటుందా? ఆలోచించండి!**

ఈ 225 మందిలో 10మంది మన భారతీయులే ఉన్నారు. వారు జకాత్ ఇస్తే 21 లక్షల కుటుంబాలు లోటులేకుండా జీవిస్తాయి.

ఈ దానం వారి ఆస్తిలో 40వ వంతు మాత్రమే కాబట్టి, ఈ దానం చేయడం వలన, దానం చేసిన వారు నష్టపోరు. అంతేకాకుండా అల్లాహ్ జకాత్ ఇచ్చిన వారి సంపాదనని వృద్ధి చేస్తానంటున్నారు.

## జకాత్ అంటే ఏమిటి?

పన్నుల ద్వారా ఆదాయం పొందకుండా ఏ ప్రభుత్వమూ నడవదు. ఇస్లామీయ చట్ట ప్రకారం, కొంత నిర్ణీత పరిమాణం (400 దిర్హములు)కంటే ఎక్కువ సంపద కలిగినవారు తప్పని సరిగా ఇవ్వవలసిన దానం 'జకాత్'. వక్రీకరించ బడిన చరిత్ర పుస్తకాలు చదువుకున్న వారికి కేవలం జిజ్యా పన్ను గురించే తెలుసు. అది ముస్లిములు కానివారు కట్టవలసిన పన్ను. కాని ముస్లిములు అంతకంటే ఎక్కువ పన్ను కట్టవలసి ఉంది. ఒకవేళ జిజ్యా పన్ను కట్టకపోతే, ముస్లిమ్ పాలకులు వారికి మినహాయింపు నిచ్చే అవకాశం ఉంది. కాని ముస్లిమ్ ఎవరైనా ప్రభుత్వానికి జకాత్ చెల్లించకపోతే, అతనిని జకాత్ నుండి మినహాయింపు నిచ్చే అధికారం ఆ పాలకునికి లేదు.

తొలి ఖలీఫా అబూబకర్ సిద్దీఖ్ (రజి) వారు 'జకాత్' చెల్లించని వారిపై యుద్ధం చేయడానికి కూడా సిద్ధపడ్డారు. ఈ విషయం జకాత్‌ను వసూలు చేయడం ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది.

ఈ వ్యాసం వ్రాసేటప్పటికి జకాత్ పరిమాణం (నిసాబ్) :
రూ. 32,212/-. జకాత్ ఇచ్చే సమయానికి మార్కెట్లో ఒక కేజీ వెండి ధర తెలుసుకుని, దానిని 0.595 చేత గుణిస్తే వచ్చే విలువే నిసాబ్. ఆ పరిమాణం కంటే ఎక్కువ ఉంటే, నూటికి రెండున్నర రూపాయలు (2.5 శాతం) లేదా దానిలో 40వ భాగాన్ని జకాత్‌గా చెల్లించాలి.

## జకాత్ నుండి మినహాయింపు ఉందా?

ప్రయాణంలో ఉన్న వ్యక్తి చేయవలసిన సలాత్ (నమాజ్) సగానికి తగ్గించ బడింది. బహిష్టు అయిన స్త్రీలు సలాత్ చేయకూడదు.

రమదాన్ నెలలో సౌమ్ (ఉపవాసం) నుండి రోగులకు మినహాయింపు ఉంది. బహిష్టు అయిన స్త్రీలకు మినహాయింపు ఉంది. ప్రయాణంలో ఉన్న వారికి కూడా మినహాయింపు ఉంది.

హజ్ యాత్ర విషయంలో స్తోమత లేనివారికి మినహాయింపు ఉంది.

**కాని నిర్ణీత పరిమాణం కంటే ఎక్కువ సంపద ఉంటే జకాత్ నుండి మాత్రం మినహాయింపు లేదు.**

జకాత్ ఇవ్వడం తప్పనిసరి



**జకాత్ ఇవ్వడం ద్వారా మీరు పేదవారికి మేలు చేస్తున్నామని అనుకుంటున్నారా?**

# జకాత్ 2.5% (40వ భాగం)

జకాత్ పేదవారి హక్కు. ఒకరు మన దగ్గర సొమ్ము దాచుకుని, దానిని తిరిగి అడిగినప్పుడు ఏ విధంగా ఇస్తామో, అదే విధంగా జకాత్‌ను పేదవారికి ఇవ్వాలి. దీనిని అల్లాహ్ విధిగా చేశారు.

జకాత్ (విధి దానం) మాత్రమే కాదు, ఏ దానం చేసేవారైనా దానం చేసేటప్పుడు, క్రింది ఖుర్ఆన్ ఆయత్‌ను జ్ఞాపకం చేసుకోండి :

> **మరియు అది తమకు ప్రీతికరమైనప్పటికీ, వారు నిరుపేదలకు మరియు అనాథలకు మరియు ఖైదీలకు, ఆహారం పెట్టేవారై ఉంటారు. వారు** (అనాథలు మరియు ఖైదీలతో ఇలా అంటారు) : **"వాస్తవానికి మేము అల్లాహ్ ప్రసన్నత కొరకే మీకు ఆహారం పెడుతున్నాము. మేము మీ నుండి ఎలాంటి ప్రతిఫలం గానీ, లేదా కృతజ్ఞతలు గానీ ఆశించటం లేదు.** (ఖుర్ఆన్ 76:8,9)

**పశువులపై జకాత్ చెల్లింపు :**

బంగారం మరియు వెండి నగలు, డబ్బు మొదలైన వాటిపై ఏవిధంగా జకాత్ చెల్లిస్తున్నామో అదే విధంగా పశువులపై కూడా జకాత్ చెల్లించాలి. పంటలపై జకాత్ ఏవిధంగా చెల్లించాలో క్రిందటి సంచికలో వివరించాము. పశువులపై జకాత్ ఆయా పశువులను బట్టి మారుతుంది. ఆ వివరాలను క్రింద అందించాము. ఎన్ని పశువులకి జకాత్ చెల్లించాలో ఆ సంఖ్యను బ్రాకెట్లలో ఇవ్వడం జరిగింది.

ఉదాహరణకు ఒకరి దగ్గర 30 ఆవులుంటే అతను ఆ ఆవులపై జకాత్ చెల్లించాలి. 29 ఆవులు మాత్రమే ఉంటే జకాత్ చెల్లించవలసిన అవసరం లేదు. ఒకవేళ అతను ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చు. 30 ఆవులకు జకాత్‌గా 1 సంవత్సరం వయస్సున్న దూడను ఓ పేదవాడికి ఇవ్వవచ్చు. లేదా ప్రభుత్వం తరపున జకాత్‌ను వసూలు చేయడానికి వచ్చేవారికి ఇవ్వవచ్చు.

కాబట్టి నిర్ణీతమైన సంఖ్యలో పశువులుంటే జకాత్ చెల్లించాలి.

అబూ సయీద్ అల్-ఖుద్రీ (రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "5 కంటే తక్కువ ఒంటెలపై దానం (జకాత్) లేదు మరియు **5 అవాఖ్‌ల (వెండి) కంటే తక్కువున్న వాటిపై సదఖా లేదు.** 5 ఔసఖ్‌ల కంటే తక్కువ ఉన్న దానిపై సదఖా లేదు. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1558, పుస్తకం 9, అధ్యాయం 2, సంపుటి 2)**

**ఆవులు / గేదెలు (30)**

- ప్రతీ 30 పశువులకి **1 సంవత్సర వయస్సున్న దూడ**
- ప్రతీ 40 పశువులకి **2 సంవత్సరాల వయస్సున్న దూడ**

**మేకలు / గొర్రెలు (40)**

- 40 నుండి 120 వరకూ, **1 గొర్రె**
- 120 నుండి 200 వరకూ, **2 గొర్రెలు**
- 200 నుండి 300 వరకూ, **3 గొర్రెలు**
- ఆపై ప్రతీ 100 గొర్రెలకు **1 గొర్రె జకాత్‌గా ఇవ్వాలి.**

**ఒంటెలు (5)**

- ఐదు ఒంటెలకు, **1 గొర్రె**
- 25 నుండి 35 ఒంటెలకు, **1 బిన్త్ మఖాద్** (ఒక సంవత్సరం వయస్సు గల ఆడ ఒంటె)
- 36 నుండి 45 ఒంటెలకు, **1 బిన్త్ లబూన్** (రెండు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె)
- 46 నుండి 60 ఒంటెలకు, **1 హిఖ్ఖా** (మూడు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె)
- 61 నుండి 75 ఒంటెలకు, **1 జద్'అ** (నాలుగు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె)
- 76 నుండి 90 ఒంటెలకు, **2 బిన్త్ లబూన్**
- 91 నుండి 120 ఒంటెలకు, **2 హిఖ్ఖా**
- 120 కంటే ఎక్కువ ఒంటెలుంటే, ప్రతీ 40 ఒంటెలకు **1 బిన్త్ లబూన్**
  ప్రతీ 50 ఒంటెలకు **1 హిఖ్ఖా**

**తేనె** 10వ వంతు

క్రిందటి సంవత్సరం జకాత్ ప్రత్యేక సంచికను అందించాము. జకాత్ వ్యాసంపై అప్పట్లో కొందరు స్పందించారు. ఆ స్పందనలను మరియు గత సంచికలో 'రమదాన్' వ్యాసంలో క్లుప్తంగా ఇచ్చిన వివరాలకు వివరణను ఈ వ్యాసంలో అందిస్తున్నాము. ఖుర్ఆన్ లో అల్లాహ్ జకాత్ గురించి మనల్ని ఏ విధంగా ఆదేశించారో ఒకసారి గుర్తు చేసుకుందాం:

**"నిశ్చయంగా అస్సదఖాత్(జకాత్) కేవలం యాచించు నిరుపేదలకు మరియు యాచించని పేదవారికి, (జకాత్) వ్యవహారాలపై నియమించ బడిన వారికి మరియు ఎవరి హృదయాలనైతే (ఇస్లామ్ వైపుకు) ఆకర్షించ వలసి ఉందో వారికి, బానిసల విముక్తి కొరకు,**

**ఋణగ్రస్తులైన వారి కొరకు, అల్లాహ్ మార్గంలో (పోయేవారికొరకు), మరియు బాటసారుల కొరకు ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక విధి మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు."**

(ఖుర్ఆన్ 9:60)

**1. (యాచించు) పేదవారు :** వీరికి ఇవ్వవచ్చు. అయితే ఇక్కడ మరొక విషయం గుర్తుంచుకోవాలి. క్రింది హదీస్ ప్రకారం 40 దిర్హములు (దాదాపు 6 వేల రూపాయలు)గాని లేదా ఆ మొత్తానికి సరిసమానమైన వస్తువులు ఉన్నవారు జకాత్‌ను అడగకూడదు.

అతా' బిన్ యసార్ ఉల్లేఖనం : బనూ అసద్ తెగకు చెందిన వ్యక్తి ఇలా చెప్పాడు : "ఒకసారి నేను నా కుటుంబంతో బఖీ అల్-ఘర్ఖద్ దగ్గర మకాం వేశాను. నా కుటుంబ సభ్యులు నాతో చెప్పారు : "రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి వెళ్ళి మనం తినడానికి ఏదైనా అడగండి" మరియు వారి అవసరాలను చెప్పడం మొదలుపెట్టారు. కాబట్టి నేను రసూలుల్లాహ్(స) వారి దగ్గరకు వెళ్లాను. కాని అప్పటికే అక్కడ ఓ మనిషి ప్రవక్త(స)వారిని అడుగుతూ ఉండగా గమనించాను. రసూలుల్లాహ్(స) అతనితో ఇలా చెప్పారు: 'నీకివ్వడానికి నా దగ్గర ఏమీ లేదు'. అప్పుడు ఆ వ్యక్తి కోపంతో మరలిపోయి అన్నాడు : 'నేను ప్రమాణం చేస్తున్నాను. మీరు కోరినవారికి మాత్రమే మీరిస్తున్నారు!' రసూలుల్లాహ్(స)వారు సమాధాన మిచ్చారు: 'అతనికి నాపై కోపం వచ్చింది ఎందుకంటే అతనికి ఇవ్వడానికి నా దగ్గర ఏమీ లేదు కనుక! మీలో ఒక ఊఖియ్యాహ్ (40 దిర్హములు) లేదా దానికి సమానమైనది కలిగి ఉన్నవారెవరైనా (దానాన్ని) అడిగితే వాస్తవానికి (వారు) అన్యాయంగా అడిగినట్లు!'

బనూ అసద్ తెగ వ్యక్తి తనకు స్వయంగా చెప్పుకున్నాడు : "వాస్తవానికి మా ఆడ ఒంటె ఒక ఊఖియ్యాహ్ కంటే చాలా విలువైనది. మరియు ఒక ఊఖియ్యాహ్ అంటే 40 దిర్హములు (లేదా వెండి నిసాబ్‌లో 5వ వంతు ప్రస్తుతం దాదాపు **6 వేల రూపాయలు**). కాబట్టి అతను ఏదీ అడగకుండా తిరిగి వెళ్ళి పోయాడు. అతను చెప్పాడు: "దాని తరువాత కొంత బార్లీ మరియు ఎండు ద్రాక్ష అల్లాహ్ యొక్క సందేశహరులు(స) దగ్గరికి పంపబడ్డాయి. అందులోని కొంత భాగాన్ని (ఆయన-స) మాకు పంపారు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మమ్మల్ని నిరాపేక్షా పరులుగా (అడగకుండా) చేసేవరకూ. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1627, పుస్తకం 9, అధ్యాయం 24, సంపుటి 2)**

**2. యాచించని పేదవారు (అల్-మసాకీన్) :** వీరు పేదవారైనా సరే, ఎవరినీ చేయి చాచి అడగరు. వీరు ఆత్మాభిమానం కలవారు. వీరి గురించి ముహమ్మద్(స)వారు ఇలా చెప్పారు :

"మిస్కీన్‌లు వీరు కారు ఎవరైతే ప్రజల చుట్టూ ఒక ముద్దకోసమో లేక రెండు ముద్దల కోసమో లేక ఒక ఖర్జూరానికో లేక రెండింటి కోసమో తిరుగుతారో. కాని నిజమైన మిస్కీన్ ఎవరంటే తన అవసరాలు తీర్చుకోవడానికి సరిపోయినంత ధనం ఉండదు, అతని స్థితి ఇతరులకు తెలియదు, తెలిసుంటే అతనికి కొంత దానం చేసేవారు మరియు అతను ప్రజలను అడగడు **(అబూహురైరా ఉల్లేఖనం, సహీహ్ బుఖారీ, 1479,** పుస్తకం 24, అధ్యాయం 53, సంపుటి 2, **సహీహ్ ముస్లిమ్ 2393)**

ఇటువంటి వ్యక్తుల గురించి ఓ ఉదాహరణ ఇక్కడ అందిస్తున్నాము. అబూహురైరా(రజి) వారి గురించి పాఠకులకు తెలిసిన విషయమే. ఈయన ఒక సహాబీ (ప్రవక్త(స)వారి సహచరుడు). ఈయన అత్యధిక హదీస్‌లను ఉల్లేఖించారు. ఈయన పేదవారిగా ఉన్నప్పుడు ఆకలికి తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయేవారు. కాని ఎవరినీ నోరు తెరిచి అడిగేవారు కాదు.

ముహమ్మద్ ఉల్లేఖనం : ఎర్రమట్టితో రంగు అద్దిన రెండు నేత వస్త్రాలను ధరించియున్న అబూహురైరా(రజి)తో మేము ఉండగా, ఆయన తన వస్త్రంతో ముక్కు శుభ్రం చేసుకుంటూ చెప్పారు - అమోఘం! అమోఘం! అబూహురైరా నేత బట్టతో ముక్కు శుభ్రం చేసుకుంటున్నాడు. ఒకానొక కాలం వచ్చింది. (అప్పుడు) నేను అల్లాహ్ సందేశహరుల(స) యొక్క ఉపన్యాస పీఠము (మింబర్)నకు మరియు ఆయిషా(రజి)వారి కుటీరము నకు మధ్య స్పృహ లేకుండా పడి ఉన్నప్పుడు దారిన పోయేవాడు వచ్చి, నన్ను ఓ పిచ్చివాడనుకుని నా మెడపై అతని పాదాన్ని ఉంచేవాడు. కాని **నిజానికి నాకు పిచ్చి ఏమీ లేదు. నేను పడిపోయింది మరిదేనితోనూ కాదు ఆకలితో.** (సహీహ్ బుఖారీ, 7324, సంపుటి 9, పుస్తకం 96, అధ్యా.16)

**అల్లాహ్ పేరుతో అబూహురైరా(రజి) కష్టాలను సహించారు. సహనం వహించారు. తరువాతి కాలంలో విజయాలను, సుఖాలను పొందారు. కష్టాలను తొలగించి సుఖాలను కలుగజేసేది అల్లాహ్‌యే! అయితే కష్టాలతో బాధపడుతున్న సోదరునిపై గాని, సోదరిపైగాని మన బాధ్యత ఉందా? లేదా? దీనికి సమాధానంగా క్రింది హదీస్‌ను చెప్పుకోవచ్చు.**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఇలా చెప్పారు "ఎవరైతే ప్రాపంచిక బాధలనుండి ఓ సోదరుని బాధను తగ్గిస్తారో, పునరుత్థాన దినపు బాధల నుండి అతని బాధను అల్లాహ్ తగ్గిస్తాడు మరియు **కష్టాలతో ఉన్నవానికి ఎవరైతే ఉపశమనం కలిగిస్తారో అతనికి అల్లాహ్ ఇహలోకంలో మరియు పరలోకంలో విషయాలను సులభతరం చేస్తారు.** ........" **(సహీహ్ ముస్లిమ్, నెం. 6853, పుస్తకం 48, సంపుటి 7)**

మిస్కీన్‌లు ఇతరులను అడగడానికి సిగ్గుపడతారు. కాని ఇటువంటి వారిని గుర్తించి జకాత్ ఇవ్వడం గురించి అల్లాహ్ పై ఖుర్ఆన్ ఆయత్ (9:60)లో చెబుతున్నారు.

**3. జకాత్ సేకరించేవారికి :** జకాత్‌ను సేకరించడానికి నాయకుడు (అమీర్) ఎవరినైనా నియమించవచ్చు. ఇది అల్లాహ్ ఆదేశం కాబట్టి, ఆ విధంగా సేకరించిన వ్యక్తికి కొంత వేతనం ఇవ్వాలి. అయితే, వేతనంగా అందిన ఆ సొమ్మును తీసుకున్న వ్యక్తి కావాలనుకుంటే ఉపయోగించు కోవచ్చు లేదా దానం చేయవచ్చు. ఈ విషయాన్ని స్పష్టం చేసే హదీస్:

ఇబ్న్ అస్-సా'ఇదీ అల్-మాలికీ వారిని, అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు 'జకాత్' సేకరణ కొరకు నియమించారు. సేకరణ పూర్తయ్యాక, ఆ మొత్తాన్ని ఆయన అందజేశారు. అప్పుడు ఉమర్(రజి)వారు ఇబ్న్ అస్-సా'ఇదీ గారికి కూడా వేతనమివ్వమని చెప్పారు. కాని ఆయన 'ఇది నేను అల్లాహ్ కొరకు చేశాను మరియు నా ప్రతిఫలం అల్లాహ్ దగ్గర ఉంటుంది' అని సమాధానమిచ్చారు. అప్పుడు ఉమర్(రజి)వారు "నీకేది ఇవ్వబడిందో అది తీసుకో. ప్రవక్త(స)వారి కాలంలో కొంత పని చేయడం కొరకు నియమించి, నాకు కొంత వేతనమిచ్చేవారు. నీవు చెప్పినట్లే నేను (కూడా) చెప్పాను, కాని రసూలుల్లాహ్(స)వారు నాకు చెప్పారు, "దేని గురించి అయితే నీవు అడగలేదో, అది నీకిచ్చినప్పుడు, అది తీసుకుని తిను మరియు దానంగా ఇచ్చివెయ్యి' " **(సహీహ్ ముస్లిమ్ 2408, పుస్తకం 12, అధ్యాయం 37, సంపుటి 3)**. సహీహ్ ముస్లిమ్‌లోనే మరో ఉల్లేఖనం (నెం. 2405)లో ప్రవక్త(స)వారు ఉమర్(రజి)వారితో ఇలా చెప్పారు: **"తీసుకో, ఏ ఐశ్వర్యమైతే నీ దగ్గరికి వచ్చిందో దాని గురించి నీవు ఆశించనప్పుడు లేక దాని గురించి అడగనప్పుడు, దానిని తీసుకో. అలా కాకుండా దాని వెనుక పడకు"**.

పై హదీస్ జకాత్‌కు సంబంధించినది. కొందరు దాయీలు పై హదీస్‌ను వినిపిస్తూ, "మేము చేస్తున్న పనికి డబ్బులిస్తున్నారు. మేము అడగడం లేదు గనుక తీసుకుంటున్నాము" అని చెబుతున్నారు.

ఎవరైనా మున్సిపాలిటీ వారికి కట్టవలసిన ఇంటిపన్ను తీసుకొచ్చి అది ఇంటిపన్ను అని చెప్పి మీకు ఇస్తే, మీరు అడగలేదు కాబట్టి వారు ఇచ్చింది తీసుకున్నామంటారా? మీకు కట్టినా, మున్సిపాలిటీకి కట్టినా ఒకటేనని వారు పొరపడుతున్నారని చెప్పరా? ఆ బాధ్యత మీకు లేదా? మీకు ఖుర్'ఆన్ అర్థం కాలేదా? వాస్తవానికి చాలామంది దాయీల దగ్గర ఎన్నో స్థిరాస్తులు, చరాస్తులు ఉన్నాయి.

పేదవారైన అబూజర్(రజి) వారికి కానుకలిచ్చినా, నగదు ఇచ్చినా తీసుకోలేదు. సల్మాన్ ఫార్సీ(రజి)వారికి 5000 దిర్హములు వేతనాన్ని ఇచ్చినా సరే, దానిని పేదలకు పంచి, బుట్టలు చాపలు అల్లి మార్కెట్లో వాటని అమ్మడం ద్వారా వచ్చిన డబ్బుతో జీవించారు. సల్మాన్ ఫార్సీ(రజి) వారు జ్ఞాని, ఆయన ఏ ఇతర ధర్మం జోలికి వెళ్ళక పూర్వం ఓ గొప్ప ధనవంతుని కుమారుడు.

ఇస్లామ్ స్వీకరించాక కొంత కాలానికి పర్షియాకు గవర్నర్ అయ్యారు. ఆయనకున్న జ్ఞానం పరంగా చూసినా, లేక పదవి ప్రకారం చూసినా కూడా ఆయన కున్న స్థాయి సమాజంలో చాలా ఎక్కువ. అటువంటి వ్యక్తే కష్టపడి సంపాదించుకుంటే, నేటి దాయీలు కష్టపడి సంపాదించు కోలేరా? ఇస్లామ్ అంటే ఏమిటో అర్థం చేసుకోగలిగిన వాడు కష్టపడటానికి సిగ్గుపడడు. సల్మాన్ ఫార్సీ(రజి)వారు ప్రజలను ఇస్లామ్ వైపు పిలవలేదని అనుకుంటున్నారా? ఆయన ధర్మం గురించి బోధించలేదని అనుకుంటున్నారా? ఆయన దాయీ అని చెప్పుకోలేదు. ఆయన తన పేరు ముందు బిరుదులు తగిలించుకోలేదు. కాని ఆయన(రజి) అల్లాహ్ మార్గంలోనే జీవించారు.

ధర్మానికి సంబంధించిన ఏ విషయాన్ని అయినా సరే, పూర్తిగా అధ్యయనం చేసి తెలుసుకోవాలి. మనం ఆదర్శంగా తీసుకోవలసింది ముహమ్మద్(స)వారిని మరియు ఆయన(స) బోధనల ప్రకారం జీవితం గడిపిన సహాబాలను ఉదాహరణలుగా తీసుకోవాలి.

రమదాన్ నెల వచ్చేసరికి, బీహార్, అస్సాం మొదలైన దూర ప్రాంతాల నుండి ఓ రశీదు పుస్తకాన్ని పట్టుకుని నెల అంతా దేశంలో పర్యటిస్తారు. మదరసాలకు చందా కోసం వచ్చామని చెబుతారు. ఈ విధంగా సేకరించినందుకు మరియు ఈయన తిరగడానికి అయిన ఖర్చులు పోగా, ఇతను తీసుకునే వాటా పోగా, మదరసాకు వాస్తవంగా అందేది ఎంత ఉంటుందో మీరు ఊహించగలరా? కొన్ని మదరసాలకు అయితే నూటికి 10 రూ॥లు లేదా 20 రూ॥లు మాత్రమే అందుతుందని చెబుతున్నారు. వాస్తవానికి మదరసాలకు జకాత్ లేదు.

ముస్లిమ్ జీవితంలో అతి ముఖ్యమైన ప్రాథమిక అంశాలలో ఒకటైన జకాత్‌ను ఎవరికి ఇవ్వాలో తెలుసుకోలేని పరిస్థితిలో నేటి ముస్లిమ్ సమాజం ఉంది. ఇంతకంటే ఘోరం మరేమి ఉంటుంది?

ఈ అతిచిన్న విషయాన్ని తెలుసుకోలేని దాయీలు, జకాత్ సొమ్మును ప్రజల నుండి తీసుకుని లక్షలు, కోట్లు ఖర్చుపెట్టి ప్రోగ్రాములు చేస్తున్నారు. ఒకటీ రెండు రోజుల కోసం ఖరీదైన సెట్టింగులు వేస్తున్నారు. ఇవి సున్నత్‌కి పూర్తిగా వ్యతిరేకం. వారు ఖర్చుపెట్టే ఆ సొమ్ము, **పేదవారి కోసం ధనవంతుల దగ్గర అల్లాహ్ ఉంచిన సొమ్ము.**

ఈ మాత్రం జ్ఞానం కూడా లేనివారు ప్రజలకు ధర్మం ఎలా బోధిస్తారు?

చిన్న పిల్లవాడు తినబోయేదాన్ని ఎవరైనా ఆ కుర్రాడి దగ్గర నుండి లాక్కుపోతుంటే, అది చూసినప్పుడు మీకేమనిపిస్తుందో అర్హత లేని వారు జకాత్‌ను తీసుకుపోతుంటే, అవగాహన కలిగినవారికి అలాగే అనిపిస్తుంది.

**4. హృదయాలను ఆకర్షించడానికి :** ఒకరికి డబ్బు ఇచ్చి 'ఇస్లామ్' ధర్మంలోకి మార్చుకోవలసిన చెడు సాంప్రదాయం ఇస్లామ్‌లో లేదు. దీనికి సంబంధించిన కొన్ని వివరాల కొరకు ఏప్రిల్ & మే, 2010 శాంతిబాట సంచిక చూడండి. షిర్క్‌కు పాల్పడేవారికి జకాత్ ఇవ్వకూడదు. కొందరు దాయీలు నవ ముస్లిముల కొరకు సహాయం అందించడానికి అని చెప్పి డబ్బు దండుకుంటున్నారని తెలిసింది. కాని నవముస్లిమైనా లేక ముస్లిమైనా సరే వారు పేదవారైతే వారికి మొదటి రెండు కేటగిరుల ప్రకారం ఇవ్వవచ్చు. వారికి ఈ 4వ కేటగిరి వర్తించదు. షిర్క్‌కు పాల్పడేవారికి జకాత్ లేదు.

(గమనిక : వాస్తవానికి నవముస్లిము అనే పదం ఉపయోగించేది ఇస్లామ్ స్వీకరించిన కొన్ని రోజుల వరకే, అతనికి నమాజ్ చేయడం మరియు ప్రాథమిక శిక్షణ పొందేవరకు మాత్రమే)

**5. బానిసల విముక్తి కొరకు :** ఏప్రిల్ & మే, 2010 శాంతిబాట చూడండి

**6. ఋణగ్రస్తుల కొరకు :** ఇది చాలా ముఖ్యమైన కేటగిరి. వీరు పేదవారి కంటే ఇంకా తక్కువ స్థాయిలో ఉంటారు. పేదవారి దగ్గర ఏమీ ఉండదు. కాని వీరి దగ్గర ఏమీ లేకపోయినా సరే, అప్పు తీర్చాలి.

అబూ సయీద్ అల్-ఖుద్రీ ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారి కాలంలో ఒక వ్యక్తి పండ్ల అమ్మకంలో నష్టపోయాడు, (దాని) ఫలితంగా అప్పు ఎక్కువైంది. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"అతనికి దానం చేయండి".** ప్రజలు అతనికి దానం చేశారు కాని అది అతని అప్పుకు సరిపోలేదు. అప్పుడు రసూలుల్లాహ్(స)వారు అతనికి అప్పు ఇచ్చిన వారితో చెప్పారు: "మీకు కలిగింది తీసుకోండి మరియు మీ కొరకు ఇంకేమీ లేదు అది తప్ప" **(తిర్మిదీ, సహీహ్ హదీస్, 655, పుస్తకం 5, అధ్యాయం 24, సంపుటి 2)**

**7. అల్లాహ్ మార్గంలో (ఫీ సబీలిల్లాహ్) :**

అందరూ స్పష్టంగా తెలుసుకోవలసిన కేటగిరి ఇదే! పేద ప్రజలకు అందవలసిన జకాత్‌ను ఈ పేరు చెప్పుకుని మోసంతో దోచేస్తున్నారు. ఈ ఆయత్ (9:60)లో చెప్పిన 'అల్లాహ్ మార్గంలో' పోయేవారు కేవలం (1) **ముజాహిద్‌లు** (2) **హజ్జ్ యాత్ర చేసే పేదవారు.** ఈ విషయానికి సంబంధించి సహీహ్ బుఖారీ గ్రంథం నుండి ఆధారాన్ని కూడా ఇక్కడ అందిస్తున్నాము.

**(٤٩) بـابُ قَـوْلِ اللهِ تَـعـالـى : ﴿وَفِـى الرِّقَابِ وَالْغَٰرِمِينَ وَفِى سَبِيلِ اللَّهِ﴾ [التوبة: ٦٠]**

**وَيُـذْكَـرُ عَنِ ابنِ عَبَّاسٍ رَضِيَ اللهُ عنهُما : يُعْتِقُ مِنْ زكاةِ، ويُـعْـطِي في الـحَـجِّ. وَقالَ الحَسَنُ : اِنِ اشْتَرَى أباهُ مِنَ الـزَّكـاةِ جازَ، ويُعْطي في المُجاهِدِينَ وَالَّذِي لَمْ يَحُجَّ. ثُمَّ تَـلا ﴿اِنَّـمَـا الصَّدَقَٰتُ لِلفُقَرَآءِ﴾ [التوبة : ٦٠] الآيَةَ. في أيِّها أعطَيْتَ جَزَتْ. وَقالَ النَّبِيُّ ﷺ : ((اِنَّ خالِداً احْتَبَسَ أَدْرُعَـهُ في سَبِيلِ اللهِ)) وَيُذْكَرُ عَنْ أبي لاسٍ: حَمَلَنا النَّبِيُّ عَلى اِبِلِ الصَّدَقَةِ لِلْحَجِّ.**

**సహీహ్ బుఖారీ గ్రంథంలో,** సంపుటి 2లో నున్న 24వ పుస్తకం- జకాత్. ఈ పుస్తకంలో 49వ అధ్యాయం : 'అల్లాహ్ యొక్క ప్రకటన'. సూరహ్ తౌబాలోని 60వ ఆయత్ ఈ అధ్యాయంలో ప్రస్తావించడం జరిగింది. ఈ అధ్యాయంలోని మొదటి హదీస్ (నెం. 1468)కి ముందుగా ఇబ్నె అబ్బాస్(రజి), అల్-హసన్(రజి) మరియు అబుల్ 'ఆస్(రజి) చెప్పిన ఉల్లేఖనాలున్నాయి. అవి :

**ఇబ్నె అబ్బాస్**(రజి) చెప్పారు, **(బానిసల) విముక్తి కొరకు** మరియు **హజ్ చేయడానికి** (పేద ప్రజల కొరకు) ఎవరైనా (జకాత్‌ను) ఖర్చు చేయవచ్చు.

**అల్-హసన్**(రజి) చెప్పారు, "ఒకరు తన జకాత్‌తో **తన తండ్రిని బానిసత్వం నుండి విముక్తుడిని చేయడానికి** అనుమతి ఉంది మరియు దాని (జకాత్) నుండి (అల్లాహ్ మార్గంలో పోరాడే) **ముజాహిదీన్‌లకు** మరియు **హజ్ చేయని వారికి** ఇవ్వవచ్చు. ఆ తరువాత ఆయన 9:60 ఆయత్‌ను పఠించారు. అల్-హసన్ ఇంకా ఇలా కొనసాగించారు: **"మరియు వారిలో (ఎనిమిది రకాల మనుష్యులలో) ఎవరికైనా మీరు జకాత్ ఇస్తే, మీ ప్రతిఫలాన్ని పొందుతారు.**

**అబుల్ 'ఆస్**(రజి) చెప్పారు, **జకాత్‌గా ఇవ్వబడిన ఒంటెలపై, హజ్ చేయడానికై రసూలుల్లాహ్(స) మమ్మల్ని ప్రయాణింప జేశారు**".

జకాత్ విధి దానం. అది తప్పనిసరి దానం. దానిని అల్లాహ్ నిర్దేశించిన వ్యక్తులకే ఇవ్వవలసి ఉంది. జకాత్ కాకుండా స్వచ్ఛందంగా చేసే దానాలు (నఫిల్ దానాలు) చాలా ఉంటాయి. వాటిని ధర్మ సమ్మతం చేయబడిన అన్ని పనులకు ఉపయోగించవచ్చు.

ఈ కేటగిరీకి కూడా చాలా ప్రాముఖ్యత ఉంది. దీనివలన రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి పేదవానికి సహాయం చేయడం, రెండవది ధార్మిక మార్గంలో సహకరించడం.

ఇక్కడ '**ఫీ సబీలిల్లాహ్** (అల్లాహ్ మార్గంలో)' అంటే (1) ముజాహిద్‌లు ధర్మ పోరాటంలో వారి కవసరమైన ఆయుధాలు మరియు ఇతర యుద్ధ సామాగ్రి కొనుక్కోవడానికి, ఒకవేళ బైతుల్ మాల్ నుండి ప్రభుత్వం వారికి సరఫరా చేయలేకపోతే (2) ఓ వ్యక్తికి అతని హజ్జ్ యాత్ర పూర్తి చేసుకోవడానికి ఆర్థికంగా సహకరించడం. ఇవి రెండూ కూడా పూర్తిగా ధార్మిక పరమైనవే! రెండూ ఆరాధనా ప్రక్రియలే. కాబట్టి జకాత్ సొమ్మును వారిపై ఖర్చు చేయడం ద్వారా ఒక పేదవానికి సహాయం చేస్తూ అతని 'ఆరాధన' (ఇబాదత్) కొరకు మద్దతునివ్వడం జరుగుతుంది.

క్రింది హదీస్‌ను చూడండి :

**حَـدَّثَـنَـا اِسحَاقُ بنُ نَصرٍ : حدَّثنا عَبْدُ الرَّزَّاقِ : أخْبرَنا ابنُ جُرَيْجٍ قالَ : أخْبرَني يَحْيى بـنُ سَـعيـدٍ، وَ سُهَيْلُ ابن أبي صَالحٍ : أنَّهُما سَمِعَا النُّعْمانَ بنَ أبي عَيَّاشٍ عَنْ أبي سَعِيدٍ الخُدْرِيِّ رَضِيَ اللهُ عَنْهُ قالَ : سَمِعْتُ النَّبِيَّ ﷺ يَقُولُ : ((مَنْ صَامَ يَوْماً فِي سَبِيلِ اللهِ، بَعَّدَ اللهُ وَجْهه عَنِ النَّارِ سَبْعِينَ خَرِيفاً)).**

అబూ స'ఈద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: "ఎవరైతే **అల్లాహ్ మార్గంలో** ఒక రోజు సౌమ్ (ఉపవాసం) ఉంటారో, అల్లాహ్ అతని ముఖం నుండి నరకాగ్నిని 70 వసంతాల (సంవత్సరాల ప్రయాణ దూరమంత) దూరంగా ఉంచుతాడు."
(సహీహ్ బుఖారీ, 2840, పుస్తకం 56, అధ్యా.36, సంపుటి 4)

పై హదీస్‌లో అల్లాహ్ మార్గంలో చేసే ఉపవాసం కోసం చెప్పడం జరిగింది. ఇస్లామ్‌లో ఏ సత్కార్యమైనా అల్లాహ్ పేరుతో చేస్తే అది అల్లాహ్ మార్గంలో చేసినట్లే కదా! 9:60 ఆయత్‌లో చెప్పినట్లు జకాత్‌ను యాచించు పేదవారికి ఇచ్చినా, యాచించని పేదవారికి ఇచ్చినా, అది కూడా అల్లాహ్ మార్గమే కదా! అటువంటప్పుడు ఈ ఆయత్‌లో

ప్రత్యేకంగా 8 రకాల వ్యక్తులు గురించి మాత్రమే ఎందుకు చెప్పినట్లు?

ఈ విధంగా ఆలోచించి ఉంటే, 'అల్లాహ్ మార్గంలో' అని చెప్పిన ఆ కేటగిరి ఏ వ్యక్తులకు వర్తిస్తుందో తెలిసుండేది. ఖుర్ఆన్‌లో ఏదైనా ఓ విషయం అర్థం కాకపోతే, ఖుర్ఆన్‌లోని మరో వాక్యం ద్వారా దానికి వివరణ దొరకుతుంది. ఆ విధంగా కూడా దొరకకపోతే హదీస్ గ్రంథాలలో లేక తఫ్సీర్ గ్రంథాలలో వెతకాలి. సహీహ్ బుఖారీ గ్రంథంలో ఏమి చెప్పబడిందో ముందరి పేజీలో అరబీ మూలంతో సహా వివరించాము. తఫ్సీర్ ఇబ్నె కసీర్, మారిఫుల్ ఖుర్ఆన్ మొదలైన తఫ్సీర్ గ్రంథాలలో కూడా సహీహ్ బుఖారీ గ్రంథంలో చెప్పిన విషయమే చెప్పబడింది.

వాస్తవం ఇలా ఉంటే ఈ కేటగిరిలోకి మదరసాలను, దావా సంస్థలను, దాయీలను, సొసైటీలను, జీతాలను, లైబ్రరీలను, టి.వి. ఛానళ్ళను, పబ్లిషర్స్‌ను, పుస్తకాలను, ఇంకా ఎన్నింటినో సంబంధం లేనివాటిని చేర్చేసారు. వీటిలో వేటికీ జకాత్ తీసుకునే హక్కు లేదు.

ఈ విషయం కూడా తెలియని వారు దాయీలు అయిపోయి ప్రజలను తప్పుదోవ పట్టించి, వారి జకాత్‌ను అల్లాహ్ స్వీకరించకుండా చేయడానికి ప్రయత్నిస్తుంటే, జ్ఞానం కలవారు కూడా చూస్తూ ఎందుకు మౌనంగా ఉన్నారు?

సోదరులారా! ఇప్పటికైనా కళ్ళు తెరవండి. మీ విలువైన సొమ్మును, మీ విలువైన జకాత్‌ను దాయీలకొరకు, దావా ప్రోగ్రామ్‌ల కొరకు ఖర్చు పెట్టవద్దు. పేదలకు ఇవ్వండి. పూజారి వ్యవస్థలా మారిపోయిన ఈ దావా వ్యవస్థను రూపుమాపండి. పేదవారికి తోడుగా ఉండండి. అల్లాహ్ మీకు తోడుగా ఉంటారు.

**జకాత్ కాకుండా మామూలు దానాలు ఎవరికైనా ఇవ్వవచ్చు**. అయితే ఈ నఫిల్ దానాల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోండి. మీరు ఎవరికైతే దానమిస్తున్నారో వారిని గమనించండి. వారు ఆరోగ్యంగా ఉండి, కష్టపడి పనిచేసి బ్రతక గలిగే వారైతే, వారికి దానం ఇవ్వకండి. ఒకవేళ వారు మిమ్మల్ని ఆర్థిక సహాయం కొరకు అడిగితే క్రింది హదీస్‌ను వివరించండి.

ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ అల్-ఖియార్, తనకు ఇద్దరు వ్యక్తులు చెప్పినది ఉల్లేఖించారు. హజ్జతుల్ విదా (ప్రవక్త(స) వారి చివరి హజ్) సమయంలో ఆయన దానాన్ని పంచుతుండగా వారు ప్రవక్త(స) వారి వద్దకు వచ్చి దానిలో కొంచెం ఆయనను అడిగారు. "అప్పుడు మావైపు శ్రద్ధగా చూసి మమ్మల్ని ధృడంగా (మరియు ఆరోగ్యంగా) ఉన్నట్లుగా చూశారు. ఆయన(స) అన్నారు : 'మీరు కోరినట్లయితే, మీకు నేను ఇస్తాను, కాని ధనవంతుని కొరకు లేక ధృడంగా మరియు (స్వయంగా) సంపాదించు కోవడానికి సామర్థ్యమున్న వానికొరకు దీనిలో భాగం లేదు. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1633, పుస్తకం 9, అధ్యాయం 24, సంపుటి 2)**

తరువాయి ఉల్లేఖనం, 1634 (హసన్ హదీస్)లో **"బలమైనవారికి లేక ఎవరైతే ఆరోగ్యంగా ఉంటారో వారికి దానం న్యాయ సమ్మతం కాదు"** అని ఉంది.

కష్టపడి సంపాదించుకోమని వారికి సలహా ఇవ్వండి. ఎందుకంటే ప్రవక్త(స)వారు ఆ విధంగా చేసేవారు. ముహమ్మద్(స)వారి క్రింది బోధన చదవండి :

అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం : ఓ అన్సార్ వ్యక్తి ప్రవక్త(స) వద్దకు వచ్చి ఆయనను (దానం) అడిగారు. ప్రవక్త(స) చెప్పారు: **"నీ ఇంటిలో ఏమైనా ఉందా?"** అతను చెప్పాడు : "ఔను! ఒక ముతక చాప (నా దగ్గరుంది). దాని ఒక భాగాన్ని మేము కప్పుకోవడానికి మరియు ఒక భాగాన్ని మేను వాల్చడానికి ఉపయోగిస్తాము. మరియు మాకు ఒక పాత్ర ఉంది దాని నుండి మేము నీళ్ళు త్రాగుతాము". ఆయన(స) చెప్పారు: "వాటిని నా దగ్గరకు తీసుకురా", అతడు వాటిని తీసుకు వచ్చాడు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వాటిని తన చేతిలో పట్టుకుని అన్నారు : **"నా నుండి ఈ రెండింటిని ఎవరు కొంటారు?"** ఒక వ్యక్తి అన్నాడు: "నేను వాటిని ఒక దిర్హమ్‌కొరకు తీసుకుంటాను". అప్పుడు ఆయన(స) అన్నారు: **"ఒక్క దిర్హమ్ కంటే ఎక్కువ ఎవరు ఇస్తారు?"** రెండు లేదా మూడుసార్లు (అన్నారు). ఒక వ్యక్తి అన్నాడు: "నేను వాటిని రెండు దిర్హమ్‌ల కొరకు తీసుకుంటాను". కనుక ఆయన(స)వాటిని అతనికి ఇచ్చేశారు, రెండు దిర్హమ్‌లు తీసుకుని వాటిని అన్సారీ కిచ్చేశారు అతనితో (ఇలా) చెబుతూ : **"ఒక (దిర్హమ్)తో ఆహారం కొని నీ కుటుంబానికి తీసుకెళ్ళు మరియు మరొక (దిర్హమ్)తో గొడ్డలి కొని దానిని నా దగ్గరకు తీసుకురా"**. అతను దానిని ఆయన(స)వారి దగ్గరకు తీసుకువచ్చాడు, మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన స్వీయ హస్తాలతో దానికి కర్రను తగిలించి, తరువాత అతనికి చెప్పారు: "వెళ్ళి వంటచెరకు (కట్టెలు) సేకరించి వాటిని అమ్ము. మరియు నేను పదిహేను రోజులపాటు నిన్ను చూడనివ్వకూడదు (అంటే పదిహేను రోజుల పాటు కనిపించవద్దని)". ఆ వ్యక్తి వంటచెరకును సేకరించడానికి మరియు అమ్మడానికి వెళ్ళాడు. మరియు తరువాత 10 దిర్హమ్‌లతో తిరిగి వచ్చాడు. దానిలోని కొంత భాగంతో అతడు ఓ వస్త్రాన్ని కొన్నాడు మరియు కొంత భాగంతో ఆహారాన్ని. అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "తీర్పుదినాన నీ మొహంపై వికృతంగా నీ భిక్షాటన రావడం కంటే ఇది ఉత్తమం కాదా?"

భిక్షమెత్తుకోవడానికి అనుమతి లేదు ముగ్గురికి తప్ప : (1) బాగా పేదవాడైన వ్యక్తి లేదా (2) తీవ్రనష్టాలలో ఉన్న వ్యక్తి లేదా (3) బాధాకరమైన రక్తం కొరకు (రక్త పరిహారం కొరకు)" **(అబూదావూద్, హసన్ హదీస్ నెం. 1641, పుస్తకం 9, అధ్యా. 26, సంపుటి 2)**

(మరో ఉల్లేఖనం ప్రకారం భిక్షాటన చేసేవాడు మొహం మీద మాంసం లేకుండానే అల్లాహ్‌ను కలుస్తాడు).

హమ్‌జహ్ బిన్ అబ్దుల్లాహ్(రజి), తన తండ్రి నుండి ఉల్లేఖించారు: ప్రవక్త(స) చెప్పారు, “మీలో ఒకరు అడుక్కుంటూనే ఉంటారు అతడు తన ముఖంపై కొంచెం కూడా మాంసం లేకుండా అల్లాహ్‌ను కలిసే వరకూ”. **(సహీహ్ ముస్లిమ్, 2396, పుస్తకం 12 అధ్యాయం 35, సంపుటి 3)**

**కష్టపడి సంపాదించుకున్న దానితో తినడం లోనే గౌరవముంది. గవర్నర్‌గా ఉండి కూడా సల్మాన్ ఫార్సీ(రజి)వారు బుట్టలు, చాపలు అల్లి మార్కెట్లో అమ్మారు అంటే, గౌరవం అనేది కష్టపడి పనిచేయడం పైనే ఆధారపడి ఉంటుంది.**

అలా కష్టపడినప్పుడే దారిద్ర్యం తొలగిపోతుంది. అల్లాహ్ పేరుతో కష్టపడి పనిచేయాలి.

(అబ్దుల్లా) ఇబ్న్ మస్ఊద్ (రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) వారు చెప్పారు, “ఎవరైతే దారిద్ర్యంతో బాధపడ్డారో మరియు ప్రజలవైపు తిరిగారో (పరిష్కారం కొరకు), **అతని దారిద్ర్యం పరిష్కరించబడదు.** మరియు ఎవరైతే అల్లాహ్ వైపు తిరిగారో, అల్లాహ్ అతనికి స్వేచ్ఛా మార్గాలను (ఎవరిపై ఆధారపడకుండా పరిష్కారాన్ని) త్వరితం చేస్తాడు, శీఘ్ర మృత్యువు ద్వారాగాని లేక వేగంగా సంపదను చేకూర్చడం ద్వారా గాని”. **(అబూదావూద్, హసన్ హదీస్, 1645, పుస్తకం 9, అధ్యా. 28, సంపుటి 2)**

**8. బాట సారుల కొరకు :** బాటసారి విషయానికొస్తే, అతను తాను నివశించే ప్రదేశంలో ధనవంతుడు కావచ్చు. కాని ప్రయాణంలో అన్నీ పోగొట్టుకున్నాడు లేదా తన ఇంటికి చేరుకోవడానికి సరిపడా ధనం లేదు. అలాంటి బాటసారికి జకాత్ సొమ్ము నుండి సహాయపడవచ్చు.

## జకాత్‌ను వ్యక్తులకు ఇవ్వాలా? లేక సంస్థలకా?

ఖుర్ఆన్ గ్రంథంలో 9:60లో చెప్పబడిన 8 కేటగిరీలలోని, ఏ కేటగిరీని తీసుకున్నా సరే, ప్రతీ కేటగిరీలోనూ పేదవారికి విడి విడిగా ఇవ్వడం జరుగుతుంది గాని, ఆ సొమ్మును సంస్థలకు ఇవ్వడానికి లేదు. మొదటి రెండు కేటగిరీలలో పేదవ్యక్తికి జకాత్ ఇవ్వాలని ఆదేశించ బడింది. మూడవ కేటగిరీలో జకాత్‌ను సేకరించే వ్యక్తికి కొంత పైకం చెల్లించాలి. అదే విధంగా ఇస్లామ్‌వైపు హృదయాలను ఆకర్షించేందుకు కూడా ఓ వ్యక్తికి జకాత్ ఇవ్వవచ్చు. బానిస విముక్తి విషయంలో కూడా ఒక వ్యక్తికే ఇవ్వాలి. ఆ సొమ్మును బానిసకిస్తే, అది దాని యజమానికి చెందుతుంది. అప్పుడు అది జకాత్ అవ్వదు. బానిస విముక్తి కొరకు యజమానికి ఇవ్వడానికి యజమాని జకాత్‌కు అర్హుడు కాదు. అలా కాకుండా, బానిసను కొని, ఆ తరువాత అతనికి స్వేచ్ఛ నివ్వవచ్చు అనుకుంటే, జకాత్ దానం కాబట్టి, అది ఇవ్వడానికే గాని, దానితో కొనకూడదు. కొంతపైకం ఇస్తే స్వేచ్ఛ ఇచ్చేలా యజమానితో ఒప్పందం చేసుకుంటే, అప్పుడు ఆ సొమ్మును బానిసకిస్తే అతను దానిని యజమానికిచ్చి స్వేచ్ఛ పొందుతాడు. ఈ కేటగిరిలో కూడా ఒక వ్యక్తికే ఇవ్వడం జరిగింది. ఇక అప్పుల పాలైన వ్యక్తికి జకాత్ నిచ్చినప్పుడు, ఈ కేటగిరిలో కూడా ఒక వ్యక్తికే ఇవ్వడం జరిగింది. బాటసారికి ఇచ్చినప్పుడు కూడా ఒక వ్యక్తికే ఇచ్చినట్లవుతుంది.

### ‘ఫీ సబీలిల్లాహ్’ మదరసాలకు వర్తిస్తుందా?

ఈ కేటగిరీ కేవలం హుజ్జాజ్ (పేదవారైన హజ్జ్ యాత్రికులకు) మరియు ముజాహిద్‌లకు మాత్రమే అనడంలో ఎటువంటి సందేహం లేదు. మదరసా అనేది ఓ సంస్థ మాత్రమేగాని ఓ వ్యక్తి కాదు. పైన చెప్పిన విధంగా విడి విడిగా వ్యక్తులకేగాని, సంస్థలకు జకాత్ లేదు.

### ముందుగా ఎక్కడ పంచాలి?

మనం ఏది పంచవలసి వచ్చినా, ముందుగా మన ద్వారానికి దగ్గరగా ఉన్న ఇంటి నుండి మొదలు పెట్టాలి కదా! కాబట్టి జకాత్‌ను మన బంధువులలోని పేదవారికి మరియు మన చుట్ట ప్రక్కల ఉన్న పేదవారికి ముందుగా పంచాలి.

ఇబ్రాహీమ్ బిన్ అతా’ (ఇమ్రాన్ బిన్ హుసైన్ నుండి స్వేచ్ఛ నివ్వబడిన బానిస) తన తండ్రి జియాద్ నుండి లేక వేరొక గవర్నర్ నుండి ఉల్లేఖనం: ఇమ్రాన్ బిన్ హుసైన్ జకాత్ సేకరణకు పంపబడ్డారు. ఆయన తిరిగి వచ్చినప్పుడు, అతనిని అడిగారు : **“ఐశ్వర్యమెక్కడ?”** అతను సమాధాన మిచ్చారు : **“మీరు నన్ను సంపద (వెనక్కి తీసుకురావడం) కొరకు పంపారా? మేము దానిని రసూలుల్లాహ్(స)వారి కాలంలో తీసుకునే (ప్రజల) దగ్గరనుండి తీసుకుని, ప్రవక్త(స)వారి కాలంలో పంచబడే చోట పంచివేశాము.”** (అబూదావూద్, హసన్ హదీస్, 1625, పుస్తకం 9, అధ్యాయం 23, సం.2)

## జకాత్ ఇవ్వకపోతే ఏమవుతుంది?

సామాజిక వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉండటానికి అల్లాహ్ ఏర్పరచిన విధి దానం - జకాత్. జకాత్ చెల్లించకపోతే ఎటువంటి శిక్షలు విధించ బడతాయో ఖుర్ఆన్ మరియు హదీస్ గ్రంథాలలో చెప్పడం జరిగింది. ఎవరి సంపాదన ఎంత ఉందో, ఎవరు ఎక్కడెక్కడ సంపదను దాచు కున్నారో అల్లాహ్‌కు స్పష్టంగా తెలుసు. ఆయన సర్వ జ్ఞాని. జకాత్ చెల్లించకుండా ప్రజల నుండి తప్పించుకోవచ్చుగాని అల్లాహ్ నుండి ఎవరూ తప్పించుకోలేరు.

### శిక్షల వివరాలు

**సంపద విషయంలో :** అబూహురైరా(రజి) ఉల్లేఖనం, రసూలుల్లాహ్(స) చెప్పారు, “ఎవరైతే అల్లాహ్ వలన ఐశ్వర్యవంతులు కాబడ్డారో మరియు అతని ఐశ్వర్యంపై జకాత్ చెల్లించడో, పునరుత్థాన దినమున అతని ఐశ్వర్యం కళ్ళపై రెండు చుక్కలున్న బట్టతల గల విషపూరిత మగ పామువలే తయారవుతుంది. (బట్టతల పాము అంటే మిక్కిలి విషాన్ని కలిగి ఉండటం వలన ఆ విధంగా కనిపిస్తుంది). ఆ పాము అతని మెడచుట్టూ చుట్టుకుని, అతని బుగ్గలపై కాటేస్తూ ఉంటుంది. మరియు

చెబుతుంది, "నేను నీ ఐశ్వర్యాన్ని, నేను నీ ఖజానాని". తరువాత ప్రవక్త(స)వారు పవిత్ర ఆయత్‌ను పఠించారు : **"అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రసాదించిన దానిలో లోభం వహించేవారు, తమకది (లోభమే) మేలైనదని భావించరాదు. వాస్తవానికి అది వారి కొరకు ఎంతో హానికరమైనది. వారు తమ లోభత్వంతో (పిసినారి తనంతో) కూడబెట్టినదంతా, తీర్పుదినమున వారి మెడల చుట్టూ కట్టబడుతుంది. మరియు భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్‌కే చెందుతుంది. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్‌కు తెలుసు"** (ఖుర్'ఆన్ 3:180)

**బంగారం మరియు వెండి విషయంలో :**

**"..... మరియు ఎవరైతే వెండి బంగారాన్ని కూడబెట్టి, దానిని అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టరో వారికి బాధాకరమైన శిక్షగలదనే వార్తను వినిపించు."** (ఖుర్'ఆన్ 9:34)

**"ఆ దినమున దానిని (ఆ వెండి, బంగారాన్ని) నరకాగ్నిలో కాల్చి దానితో వారి నుదురుల మీద, ప్రక్కల మీద మరియు వీపుల మీద వాతలు వేయబడతాయి. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది), "ఇదంతా మీరు మీ కొరకు కూడబెట్టుకున్నదే. కావున మీరు కూడబెట్టుకున్న దానిని చవిచూడండి".** (ఖుర్'ఆన్ 9:35)

సహీహ్ ముస్లిమ్ **(హదీస్ నెం. 2290, పుస్తకం 12, అధ్యాయం 6, సంపుటి 3, అబూహురైరా(రజి) ఉల్లేఖనం)**లో బంగారం, వెండిపై చెల్లించవలసింది చెల్లించకుండా ఉంటే, పై ఆయత్‌లో చెప్పిన శిక్ష గురించి చెప్పిన తరువాత, ఇలా ఉంది : **అవి చల్లారిన ప్రతీసారి, అతని కొరకు అవి మరలా వేడి చేయబడతాయి. ఆ రోజున దాని నిడివి 50వేల సంవత్సరాలుగా ఉంటుంది.** (అంటే ఆ రోజు ఎంత పెద్దది అంటే, ఈ లోకంలోని 50 వేల సంవత్సరాలు పునరుత్థాన దినమున ఒక రోజుకి సమానం.) (ఈ శిక్ష) ప్రజల మధ్య తీర్పు పూర్తయ్యేవరకూ (ఉంటుంది). ఆ తరువాత అతని మార్గం చూపబడుతుంది - **స్వర్గానికో లేక నరకానికో**" ఇంకా పశువులపై జకాత్ గురించి మొదలైన చాలా విషయాల గురించి ఈ హదీస్‌లో చెప్పడం జరిగింది. ఇది చాలా పెద్ద హదీస్.

**ఆభరణాల విషయంలో :**

అమ్ర్ బిన్ షుహైబ్ ఉల్లేఖనం : యమన్ నుండి ఓ స్త్రీ రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి తన కుమార్తెతో వచ్చారు. మరియు కుమార్తె చేతులకు **రెండు మందంగా ఉన్న బంగారు గాజులున్నాయి.** ఆయన(స) చెప్పారు, **నీవు వీటిపై జకాత్ చెల్లించావా?**" ఆమె చెప్పింది, "లేదు". ఆయన(స) చెప్పారు: పునరుత్థాన దినమున అల్లాహ్ రెండు అగ్ని గాజులను నీపై నుంచినట్లయితే నీకు సంతోషం కలుగుతుందా?". అప్పుడు ఆమె వాటిని తీసివేసి, రసూలుల్లాహ్(స)వారికి చెప్పింది: "అవి అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికి" (**నసాయీ,** హసన్ హదీస్, 2481, పుస్తకం 23, అధ్యాయం 19, సంపుటి 3 మరియు **అబూదావూద్,** హసన్ హదీస్, 1563, పుస్తకం 9, అధ్యాయం 4, సంపుటి 2)

**గమనిక :** ప్రవక్త(స)వారికిగాని, ఆయన కుటుంబానికిగాని జకాత్ మరియు సదఖా నిషేధం. పై ఉల్లేఖనంలో **'అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరునికి'** అని చెప్పడం జరిగింది కాబట్టి, ఆ గాజులను ప్రవక్త(స)వారి కోసమని ఎవరైనా అనుకోవచ్చు. దానంగా వచ్చినది ఒక చిన్న ఖర్జూరమైనా సరే, ప్రవక్త(స)వారుగాని, ఆయన కుటుంబ సభ్యులుగాని స్వీకరించలేదు.

అబ్దుల్లాహ్ బిన్ షద్దాద్ బిన్ అల్-హాద్ ఉల్లేఖనం : ప్రవక్త(స)వారి సతీమణి ఆయిషా(రజి)వారిని మేము సందర్శించాము మరియు ఆమె చెప్పారు: రసూలుల్లాహ్(స)వారు ఒకసారి నా దగ్గరికి వచ్చి నేను పెద్ద వెండి ఉంగరాలను ధరించడం చూశారు. ఆయన(స) అన్నారు : 'ఇది ఏమిటి? ఓ ఆయిషా?'. నేను సమాధాన మిచ్చాను: 'ఓ రసూలుల్లాహ్! మీ కొరకు నేను సింగారించుకోవడానికై వాటిని చేశాను'. ఆయన(స) చెప్పారు : **వీటి జకాత్ ఇచ్చావా?** నేను చెప్పాను 'లేదు' లేక "ఏదైతే అల్లాహ్ ఇష్టపడతారో". ఆయన సమాధానమిచ్చారు: **"ఇది నీ వంతు అగ్ని"** (అబూదావూద్, సహీహ్ హదీస్, 1565, పుస్తకం 9, అధ్యాయం 4, సంపుటి 2)

**పశువుల విషయంలో :**

సహీహ్ ముస్లిమ్‌లోని పై ఉల్లేఖనం (2290)లోని ఓ భాగం : "ఓ రసూలుల్లాహ్!(స) "ఒంటెల గురించి ఏమిటి?" ఆయన(స) చెప్పారు: వాటిపై చెల్లించవలసినది చెల్లించకుండా ఒంటెల యజమాని ఉండడు - ............. - కాని పునరుత్థాన దినము వచ్చినప్పుడు, ఓ విశాలమైన మైదానం వారి కొరకు పరచబడుతుంది మరియు మొత్తం పశువుల గుంపు సమీకరించబడుతుంది. మరియు ఒక్క చిన్న ఒంటె కూడా కనిపించకుండా పోదు. అవి అతనిని తమ గిట్టలతో తొక్కుతాయి మరియు తమ నోళ్ళతో కరుస్తాయి. ప్రతీసారి వాటిలోని మొదటిది వెళుతుంది. చివరిది వెనక్కి వస్తుంది. ఆ రోజు దాని నిడివి 50వేల సంవత్సరాలు, ప్రజల మధ్య తీర్పు పూర్తయ్యేవరకూ (ఈ శిక్ష ఉంటుంది). తరువాత అతని మార్గం చూపబడుతుంది, స్వర్గానికో లేక నరకానికో.

ఇదే విధంగా ఇతర పశువుల విషయంలో చెప్పడం జరిగింది. స్థలాభావం వలన పూర్తి హదీస్‌ను ఇక్కడ అందించడం లేదు.

హదీస్‌లో చివరిగా పఠించిన ఖుర్'ఆన్ ఆయత్‌లు : **"అప్పుడు, ప్రతివాడు తాను రవ్వంత (పరమాణువంత) మంచిని చేసి ఉన్నా దానిని చూసుకుంటాడు. మరియు అలాగే, ప్రతివాడు తాను రవ్వంత (పరమాణువంత) చెడును చేసి ఉన్నా దానిని చూసుకుంటాడు."** (ఖుర్'ఆన్ 99:7,8)

**జకాత్ చెల్లించకపోతే ఘోరమైన శిక్షలున్నాయి. జకాత్ చెల్లిస్తే సంపదను వృద్ధి చేస్తానని అల్లాహ్ చెబుతున్నారు. అల్లాహ్ వాగ్దానం సత్యమైనది. ఆలోచించండి! జకాత్‌ను చెల్లించడమా? ఎగ్గొట్టడమా?**

## ఆర్థిక అసమానత

- ప్రపంచ సంపదలోని 40 శాతం సంపద కేవలం 1 శాతం ధనవంతుల దగ్గరే ఉంది. 40 మంది ఆస్తి కేవలం 1 ధనవంతుని ఆస్తితో సమానం.
- ప్రపంచ సంపదలలోని 85 శాతం సంపద కేవలం 10 శాతం ధనవంతుల దగ్గరే ఉంది.
- ప్రపంచ జనాభాను రెండు భాగాలుగా విభజిస్తే మొదటి సగం ప్రజల వద్ద 99 శాతం సంపద ఉంటే రెండవ సగం ప్రజల వద్ద కేవలం 1 శాతం సంపద మాత్రమే ఉంది.

  ఉదాహరణకు ప్రపంచ జనాభా 100 మంది అనుకుందాం. ప్రపంచ సంపద 100 రు॥లు అనుకుందాం.

  ఈ 100 మందిలో మొదటి 50 మంది దగ్గర మొత్తం 99 రు॥లు ఉంటే రెండవ 50 మంది దగ్గర కేవలం ఒక్క రూపాయే ఉంది. అంటే 99 రు॥లను 50 మంది పంచుకుంటే, మిగిలిన 50 మంది ఒక్క రూపాయనే పంచుకుంటున్నారు. **ఎంత అసమానత!**
- 5 కోట్ల మంది ధనవంతుల సంపద, 270 కోట్ల మంది పేదవారి సంపదతో సమానం.
- ప్రపంచంలోని ముగ్గురు అత్యంత ఐశ్వర్యం గల ధనవంతుల సంపద 47 దేశాల GDP కంటే ఎక్కువే ఉంది.
- FORBES వారు విడుదల చేసిన జాబితాలో మొదటి 200 మంది అత్యంత ధనవంతులలో మనదేశానికి చెందిన ధనవంతులు 10 మంది ఉన్నారు.
- ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో మొదటి 200 మంది సంపద = 1920 బిలియన్ డాలర్లు. అంటే మన ఇండియన్ కరెన్సీ ప్రకారం, వారి సంపద = 96 లక్షల 45వేల కోట్ల రూపాయలు. వీరు తమ సంపాదన నుండి జకాత్ తీస్తే, అది 2 లక్షల 41వేల 125 కోట్ల రూపాయలు అవుతుంది. (2,45,125 కోట్లు)
- ఆ 200 మంది అత్యంత ధనవంతులు (బిలియనీర్స్)లో మన ఇండియన్స్ 10 మంది సంపాదన = 134 బిలియన్ డాలర్లు. అంటే 6 లక్షల 70వేల కోట్ల రూపాయలు. ఈ పది మంది తమ సంపద నుండి జకాత్ తీస్తే, 16 వేల 750 కోట్ల రూపాయలు అవుతుంది.
- ఒక కుటుంబంలో ఇద్దరు పెద్దవాళ్ళు, ఇద్దరు పిల్లలు ఉంటే, వారు జీవించడానికి ఒక నెలకు రూ. 5,000/- (100 డాలర్లు) చొప్పున ఒక సంవత్సరానికి రూ. 60,000/- (1200 డాలర్లు) అవసరం అనుకుందాం.

  200 మంది బిలియనీర్ల జకాత్‌తో అటువంటి 4 కోట్ల కుటుంబాలకు సంవత్సరానికి 60వేల రూపాయల చొప్పున అందించవచ్చు.

  మన 10 మంది భారతీయుల జకాత్‌తో 28లక్షల కుటుంబాలకు సంవత్సరానికి 60వేల రూపాయల చొప్పున అందించవచ్చు.

## తొలి ప్రాధాన్యత

ఆఫ్రికాలోని ఓ ప్రాంతంలో మట్టితో బిస్కట్లు చేసి రోడ్డుపై ఎండబెట్టారు. పేదరికంలో మగ్గే వారి పిల్లలకు అవే బిస్కట్లు. ఆ వార్త చదివి పక్కనున్న ఫొటో చూస్తే ఎవరికైనా మనసంతా బాధతో నిండిపోతుంది.

ఆఫ్రికా అనగానే ముస్లిములందరికీ ముందుగా గుర్తు వచ్చేది, వారంతా ఎంతగానో ప్రేమించే బిలాల్(రజి)వారు.

మస్‌జిద్‌లు కట్టించడానికి మరియు దావా ప్రోగ్రామ్‌ల కోసం అరబ్ దేశాల నుండి మన భారతదేశం వంటి కొన్ని దేశాలకు ఆర్థిక సహాయం అందుతుంది.

కాని ఈ దేశాలకు ఇటువంటి సహాయం అందకపోయినా నష్టమేమీ లేదు.

ఆకలితో బాధపడే ఆఫ్రికా దేశాలకు సాయం అందాలి.

అందరూ జకాత్ ఇస్తే ప్రపంచంలో పేదరికం ఉండదు.

పేదవారికి సహాయం అందడం చూస్తే మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స)వారు ఎంతో సంతోషించేవారు.

ముహమ్మద్(స)వారికి ఇష్టమైన ఈ పనిని ధనవంతులలో ప్రతీ ఒక్కరూ చేయగలరు.

పేదవారి హక్కును మన సృష్టికర్త ఐశ్వర్యవంతుల సంపదలో ఉంచారు. వారు తప్పనిసరిగా దానిని పేదవారికి అందించాలి.

ధనవంతులకి ఆ సంపద నిచ్చింది అల్లాహ్‌యే!
పేదవారికి పేదరికం ఇచ్చింది ఆ అల్లాహ్‌యే!

ఆర్థిక అసమానతలు తగ్గడానికి 'జకాత్' మరియు ఇతర సదఖా(దానాలు) ఏర్పరిచారు.

వీటి ద్వారా ఇద్దరినీ పరీక్షిస్తున్నారు.

రమదాన్ నెలలో

# లైలతుల్ ఖద్ర్ ఘనత గల రాత్రి

## యువకుల వికృత చేష్టలు

అల్లాహ్‌పై విశ్వాసం గలిగిన ముస్లిములకు రమదాన్ నెల సమీపించే కొద్దీ మనస్సు ఉత్తేజం పొందుతుంది. ఎప్పుడెప్పుడా అని రమదాన్ నెల కొరకు ఎదురు చూస్తుంటారు. నెలవంక కనిపించగానే ఎన్నాళ్ళ నుండో వెతుకుతున్నది దొరికినంత సంబరం వారి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

రమదాన్ నెల ప్రత్యేకతే వేరు. సంవత్సరంలో ప్రతీ రోజూ చేసే సలాత్ (నమాజ్)లే ఆ నెలలో కూడా చేయబడతాయి. అయినప్పటికీ అవి చేస్తున్నప్పుడు చెప్పనలవి గాని ఓ అనుభూతికి లోనవుతారు. మామూలు రోజుల్లో చేసే సలాత్ (నమాజ్) కంటే రమదాన్ నెలలో చేసే సలాత్(నమాజ్)కు 70 రెట్లు అధిక పుణ్యం లభిస్తుంది. అది ఒక్కటే కారణం కాదు. ఈ నెలలో విశ్వాసులపై చెడు ప్రభావం తగ్గుతుంది.

రమదాన్ నెల అంటే సలాత్, జకాత్, సౌమ్(ఉపవాసం) మాత్రమే కాకుండా, అతి ముఖ్యమైన ఓ రాత్రి కూడా ఉంది. అదే ఖద్ర్ రాత్రి. ఘనతగల ఆ రాత్రి గురించి ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియ జేస్తున్నారు.

**నిశ్చయంగా, మేము దీనిని** (ఈ ఖుర్ఆన్‌ను) **ఘనతగల ఆ రాత్రి (లైలతుల్-ఖద్ర్)లో అవతరింపజేశాము. మరియు ఆ ఘనత గల రాత్రి అంటే ఏమిటో నీకేం తెలుసు? ఆ ఘనత గల రాత్రి వేయి నెలల కంటే శ్రేష్ఠమైనది. ఆ రాత్రియందు దేవదూతలు మరియు ఆత్మ (జిబ్రీల్), తమ ప్రభువు అనుమతితో, అన్ని** (వ్యవహారాలకి సంబంధించిన) **ఆజ్ఞలు తీసుకుని దిగివస్తారు. ఆ రాత్రియందు తెల్లవారే వరకు శాంతి వర్ధిల్లుతుంది.** (ఖుర్ఆన్ 97:1-5)

ఇంతటి గొప్ప రాత్రి రమదాన్ నెలలో ఆఖరి 10 రోజులలో ఒక రోజు వస్తుంది. ఈ విషయమై ముహమ్మద్(స) వారు ఏమి చెప్పారో తెలుసుకుందాం:

ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారి సహచరులలోని కొందరికి కలలలో ఖద్ర్ రాత్రి ఆఖరి 7 రాత్రులలో చూపబడింది. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "మీ కలలన్నీ (ఖద్ర్ రాత్రి) ఆఖరి 7 రాత్రులలో అని అంగీకరిస్తున్నట్లు అనిపిస్తుంది. మరియు ఎవరైతే దాని కొరకు (ఖద్ర్ రాత్రి కొరకు) వెతకాలని అనుకుంటారో, ఆఖరి ఏడు (రమదాన్ రాత్రుల)లో వెతకాలి.
**(సహీహ్ బుఖారీ, 2015, పుస్తకం 32, అధ్యా.1, సంపుటి 3)**

---

అబూ స'ఈద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) (మస్‌జిద్‌ల) ఎతిఖాఫ్‌ను రమదాన్ నెల మధ్య 3వ భాగంలో ఆచరిస్తుండేవారు. మరియు 20 రాత్రులు గడిచాయి. ఆయన(స) తన ఇంటికి 21న వెళ్ళేవారు మరియు ఆయన(స)తో ఎతిఖాఫ్‌లో ఉన్నవారు కూడా తమ ఇళ్ళకు వెళ్ళేవారు. ఒకసారి రమదాన్‌లో ఎతిఖాఫ్ ఆచరించి (సాధారణంగా) తన ఇంటికి తిరిగి వెళ్తుండే రాత్రి సలాత్ (నమాజ్) స్థాపించారు (చేశారు). మరియు ఆయన(స) ప్రజలను సంభోదిస్తూ వారిని ఆదేశించారు అల్లాహ్ ఏదైతే ఆయన ద్వారా చెప్పాలనుకున్నారో. మరియు చెప్పారు, "నేను ఈ 10 రోజుల కొరకు (రమదాన్ నెల మధ్యలోని 10 రోజులు) ఎతిఖాఫ్ ఆచరించేవాడిని కాని ఇప్పుడు (ఈ నెలలోని) ఆఖరి 10 రోజులు ఎతిఖాఫ్‌లో ఉండాలను కుంటున్నాను. కాబట్టి ఎవరైతే ఎతిఖాఫ్‌లో నాతో ఉన్నారో అతని స్థానంలో విడిగా ఉండాలి. నిశ్చయంగా, (ఖద్ర్) రాత్రి నాకు చూపబడింది కాని నేను దానిని మరచిపోయాను. కాబట్టి, దానిని (ఈ నెల)ఆఖరి 10 రోజులలో బేసి రాత్రులలో వెతకండి. నేను స్వయంగా (కలలో) మట్టి మరియు నీటిలో సజ్దా చేయడం చూశాను". ఆ 21వ రాత్రి, ఆకాశం మేఘాలతో నిండి వర్షం కురిసింది మరియు వర్షపు నీరు మస్‌జిద్ పైకప్పు నుండి కారడం మొదలైంది ప్రవక్త(స)వారు ముసల్లా (ప్రార్థనా చోటు) దగ్గర. ఉదయం సలాత్ పూర్తి చేసుకుని ఆయన వెళుతుండగా ముఖానికి మట్టి మరియు నీరు అంటుకుని ఉండగా నేను నా కళ్ళతో చూశాను.
**(సహీహ్ బుఖారీ, 2015, పుస్తకం 32, అధ్యా. 3, సం. 3)**

---

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు : "రమదాన్ ఆఖరి పది రోజులలో ఖద్ర్ రాత్రి కొరకు చూడండి, ఆ రాత్రి - ఆఖరి పది రమదాన్ రాత్రులలో తొమ్మిది లేదా ఏడు లేదా ఐదు రాత్రులు మిగిలి ఉండగా (అంటే వరుసగా 21, 23, 25 రాత్రులు)
**సహీహ్ బుఖారీ, 2021, పుస్తకం 32, అధ్యా.3, సంపుటి 3**

---

ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "ఖద్ర్ రాత్రి (రమదాన్) నెల ఆఖరి పది రాత్రులలో ఉంది. మొదటి తొమ్మిది (రాత్రుల)లో లేదా ఆఖరి ఏడు రాత్రులలో". ఇబ్నె అబ్బాస్ (రజి) అదనంగా చెప్పారు, "వెతకండి దానికొరకు (రమదాన్) 24న" **(సహీహ్ బుఖారీ, 2022, పుస్తకం 32, అధ్యా 3, సంపుటి 3)**

ఉబాదా బిన్ సామిత్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు ఖద్ర్ రాత్రి గురించి మాకు తెలియజేయాలని బయటకు వచ్చారు కాని ఇద్దరు ముస్లిములు పరస్పరం గొడవ పడుతున్నారు. ప్రవక్త(స) చెప్పారు, "ఖద్ర్ రాత్రి గురించి మీకు తెలియజేయాలని బయటికి వచ్చాను. కాని ఫలానా మరియు ఫలానా వ్యక్తులు గొడవ పడుతున్నారు, కాబట్టి దానికి సంబంధించిన వార్త తీసుకెళ్ళిపోబడింది. అయినప్పటికీ అది మీ స్వీయ మేలుకే కావచ్చు. కాబట్టి దాని కొరకు 29వ, 27వ మరియు 25వ (రమదాన్ రాత్రులలో) వెతకండి. **(సహీహ్ బుఖారీ, 2023, పుస్తకం 32, అధ్యా.4, సంపుటి 3)**

పై ఉల్లేఖనాలను బట్టి ఖద్ర్ రాత్రి (ఘనతగల రాత్రి) బేసి రాత్రి అవుతుంది. ప్రవక్త(స)వారు ఈ రాత్రి గురించి ఏ రోజైతే మొదటిసారి చెప్పారో ఆ 21వ రోజే ఖద్ర్ రాత్రి అయిందని తెలుస్తుంది. ఆ రాత్రి 23వ రోజు రాత్రి కావచ్చు లేదా 25, 27, 29 రాత్రుల్లో ఏదో ఒక రాత్రి కావచ్చు. మరో ఉల్లేఖనం ద్వారా 24వ రాత్రి కూడా అయ్యే అవకాశం ఉంది. రమదాన్ నెలలో ఆఖరి 10 రోజులలో ఎన్నో శుభాలున్నాయి.

**ఈ రాత్రి ప్రార్థన చేయకపోతే ఏమవుతుంది?**

మనం చేసే ప్రతీ మంచి ఆచరణకు 10 రెట్ల పుణ్యం మరియు చెడు ఆచరణకు ఒక పాపమే వ్రాయబడుతుందని తెలిసిన విషయమే! అయితే మంచి ఆచరణకు 700 రెట్ల వరకూ కూడా ఇన్నా అల్లాహ్ పుణ్యాన్ని పొందే అవకాశం ఉంది. కేవలం మన ఆచరణలను మాత్రమే లెక్కలోకి తీసుకుంటే, వాటికి లభించే పుణ్యంతో స్వర్గం లభించడం కష్టం. అల్లాహ్ కరుణ లేకుండా ఆచరణలతో మనకు స్వర్గం లభించదు. కేవలం 10 రెట్ల పుణ్యానికి మాత్రమే అవకాశమున్న ఆచరణలకి కూడా 700 రెట్లు అల్లాహ్ పుణ్యాన్ని ఇస్తే, మన లెక్క పుణ్యం వైపుకు మొగ్గు చూపవచ్చు. అల్లాహ్ చూపే ఆ కరుణ వలన మనకు లభించే పుణ్యం ఎక్కువవుతుంది.

అల్లాహ్ తలచుకుంటే 700 రెట్లే కాదు ఇంకా ఎన్నో రెట్లు ఎక్కువ మన పుణ్యాన్ని పెంచవచ్చు. **ప్రజలకు ఇబ్బంది కలిగించే ఓ ముళ్ళ కంపను అందరూ నడిచే దారి నుండి తొలగించిన వ్యక్తికి అల్లాహ్ స్వర్గమిచ్చారు అంటే ఆ ఒక్క చిన్న ఆచరణకు ఎన్ని రెట్లు పుణ్యాన్ని ప్రసాదించారో!**

**ఆచరణ చిన్నదా? లేక పెద్దదా? అనే విషయం సంకల్పంపైనే ఆధారపడి ఉంటుంది.**

ఆ వ్యక్తి స్వర్గం లభిస్తుందనే సంకల్పంతో ముళ్ళ కంపను రోడ్డుపై నుండి తీయలేదు. తన తోటి మానవులకు దాని వలన కలిగే ఇబ్బందిని తొలగించాలనే మంచి సంకల్పంతో తీయడం జరిగింది. అంతేకాకుండా వారికి ప్రత్యక్షంగా అతడు మేలు చేయలేదు. కాని వారికి జరిగే కీడును తొలగించాడు.

సంకల్పం అతి ముఖ్యమైనది. సంకల్పం గొప్పదయ్యేకొద్దీ అల్లాహ్ నుండి కరుణ కూడా ఎక్కువ స్థాయిలో అందుతుంది.

అందుకే ఓ మంచి పని చేయాలని సంకల్పించుకుంటే ఒక పుణ్యం అతని ఖాతాలో వ్రాయబడుతుంది, అతడు ఆ మంచి పని చేయక పోయినా సరే. అదే విధంగా ఓ చెడు పనిచేయాలని సంకల్పించుకుని, అది చేయకపోతే అతని ఖాతాలో పాపం జమ చేయబడదు.

పై విషయాలను బట్టి మనకు స్పష్టంగా అర్థమయ్యేది ఏమిటంటే, కేవలం మన ఆచరణలు మనకు స్వర్గాన్ని ఇవ్వవు. అందుకనే కరుణామయుడైన అల్లాహ్ మన పుణ్యాన్ని పెంచుకోవడానికి ప్రతీ సంవత్సరం ఘనతగల రాత్రి రూపంలో కూడా ఓ గొప్ప అవకాశం ఇస్తున్నారు.

రమదాన్ నెలలో ఓ రాత్రి చేసే ప్రార్థనకు/ఆచరణలకు 1000 నెలలు చేసినంత పుణ్యాన్ని ఇస్తున్నారు.

అనంత కరుణామయుడు మరియు అపార కృపాశీలుడు - అల్లాహ్. తన దాసుడు దుర్మార్గుడైనప్పటికీ, అతను పీల్చుకునే ఆక్సిజన్‌ను ఆపివేయడం లేదు. ఇంకా ఎన్నో మేళ్ళు కలిగిస్తూనే ఉన్నారు. ఖద్ర్ రాత్రి వంటి ఎన్నో అవకాశాలను ఆయన ఇస్తూనే ఉన్నారు.

**ఆ అవకాశాలను ఉపయోగించుకోకపోతే, ఓ గొప్ప లాభాన్ని కోల్పోతాము.**

ఉదాహరణకు ప్రజలందరిని ఓ మైదానం లోకి పిలిచి "తెల్లవారే వరకూ అవకాశం ఇస్తున్నాము, ఇక్కడ ఉంచిన సంపద నుండి మీకు ఎంత వీలైతే అంత తీసుకువెళ్ళవచ్చు. కాని ఒక్క షరతు. తెల్లవారక ముందే తీసుకెళ్ళాలి" అని ప్రకటిస్తే, తెల్లవారే వరకూ ప్రజలు ఆ సంపదను తీసుకోవడంలో ఒక సెకను కాలం కూడా వృథా కానివ్వరు కదా!

అశాశ్వతమైన సంపదకే ఇంత చేస్తే, శాశ్వత స్వర్గసుఖాలను పొందడానికి మరి ఎంత కష్టపడాలి? ఆలోచించండి!

**కాని నేటి ముస్లిమ్ సమాజంలో కొందరు ఈ రాత్రిని అవమాన పరుస్తున్నారు. యువకులు బైక్‌లపై మితిమీరిన వేగంతో విన్యాసాలు చేస్తూ, తెల్లవార్లు తిరుగుతూ, ఇతర మతధర్మాలవారి ఇళ్ళపై రాళ్ళు వేయడం, తలుపులు బాదడం, స్ట్రీట్ లైట్లను పగలగొట్టడం చేస్తున్నారు. ఆ రాత్రుల్లో ముస్లిమ్ యువకులు ఎన్నో యాక్సిడెంట్లు చేస్తున్నారు. వీరు ప్రాణాలను కోల్పోవడమే కాకుండా ఇతరులకు కూడా నష్టం కలిగిస్తున్నారు.**

ముళ్ళ కంపలు మన తోటివారికి కష్టాన్ని కలిగిస్తాయి. వాటిని తొలగించాలి. వీధి దీపాలు మన తోటివారికి వెలుగునిస్తాయి. వాటిని కాపాడాలి. కాని దానికి విరుద్ధంగా వాటిని పగలగొట్టడం చాలా వికృతమైన హీనమైన పని.

పోలీసులకు రమదాన్ నెలలో ఆ రాత్రులందు ప్రత్యేక డ్యూటీ వేస్తున్నారు. ఘనత గల ఆ రాత్రి కోసం ఆ రోజు పొందబోయే అల్లాహ్ కరుణ గురించి విశ్వాసులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తుంటే, పోలీసులు ఎక్కడ ఏ సమస్య వస్తుందోనని కంగారుపడేలా కొందరు ముస్లిమ్ యువకులు ప్రవర్తిస్తున్నారంటే, ఇంత కంటే అవమానకరమైన విషయం ఇంకేముంటుంది?

మస్జిద్ ఇమామ్‌లు మరియు యువకుల తల్లిదండ్రులు ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోవాలి.

యువకులు ఆ రాత్రులందు ఏ ప్రార్థనలు చేయకపోయినా పర్వాలేదు. ప్రజలకు ఏ ఇబ్బందీ కలుగకుండా వారు ఇంటిలో పడుకోవడమే వారికీ మరియు ఇతరులందరికీ ఎంతో మేలు. ఈ యువకులు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు? కారణం వారికి ఇస్లామ్ గురించి సరియైన అవగాహన లేకపోవడమే.

తల్లిదండ్రులు పిల్లలను ఉదయం నుండి సాయంత్రం వరకూ స్కూళ్ళలో చదివించి, ఆ తరువాత ట్యూషన్లకు పంపి, డిగ్రీల కోసం కార్పోరేట్ కాలేజీలలో పడేసి, రుబ్బేసి ప్రయోజకులుగా తీర్చి దిద్దేశామని సంతోషపడతారు.

కాని రోజులో ఓ అరగంట లేదా శలవు రోజున కాస్సేపు ఇస్లామ్ అంటే ఏమిటో బోధించడానికి ప్రయత్నించరు. ఇస్లామ్‌ని తెలుసు కోనివాడు ప్రయోజకుడు ఎలా అవుతాడు?

దాహాన్ని తీర్చవలసిన త్రాగునీరు కుళాయిల నుండి డ్రైనేజీలలోకే పోతూ ఉంటే, ఆ నీటి వలన ప్రయోజనమేముంది?

**కొందరు పెద్దలు యువకులకేమీ తీసిపోవడం లేదు.**

కొన్ని చోట్ల ఖద్ర్ రాత్రి అని భావించిన రోజున మస్జిద్‌లో ఎలక్షన్లు, మీటింగ్‌లు ఏర్పాటు చేస్తారు. మస్జిద్‌లో ప్రశాంతంగా సలాత్ చేసుకుందామని అనుకునేవారికి, ఖుర్ఆన్ చదువుకోవాలని అనుకునే వారికి ఇటువంటి కార్యక్రమాల వలనచాలా ఇబ్బంది కలుగుతుంది.

ఆ కార్యక్రమాలు తరువాయి రోజు పగలు పెట్టుకోవచ్చు లేదా అదే నెలలో అందరికీ వీలయ్యే ఓ శలవు దినాన పెట్టుకోవచ్చు. ఆ రాత్రి యొక్క ప్రతి సెకను కాలం ఎంతో విలువైనది. ప్రతీ సెకనులో ఎన్నో శుభాలు లభించే అవకాశం ఉంది. వాటిని ఎలా పోగొట్టుకుంటారు?

మరికొందరయితే ఎక్కడెక్కడి నుండో కొందరిని పిలిచి ప్రసంగాలు ఏర్పాటు చేస్తారు. ఎందుకని అడిగితే నిద్రరాకుండా అని చెప్పేవారు కూడా ఉన్నారు. అటువంటప్పుడు నిద్రపోవడమే మేలు. ఘనతగల రాత్రి అనేది కేవలం మెళుకువగా ఉండడం కోసం కాదు.

ఈ సమస్యకు పరిష్కారాలు రెండు. పైన చెప్పినటువంటివి ఆపి, ప్రతి ఒక్కరూ తమకు వీలైన విధంగా ఆరాధన చేసుకునే అవకాశాన్ని మస్జిద్‌లో కల్పించడం. వాస్తవానికి ఇది సామూహికంగా చేసే ప్రార్థన కాదు. వ్యక్తిగతం. కాని నేటి పెద్దలను ఒప్పించడం సాధ్యమా? సాధ్యం కాకపోతే వారితో ఘర్షణ పడటం వలన మీ విలువైన సమయం వృథా అవుతుంది.

మరొక పరిష్కారం ఏమిటంటే, రాత్రి నమాజ్ పూర్తి అయ్యాక ఇంటికి వెళ్ళిపోయి కుటుంబ సభ్యులందరినీ మేల్కొలిపి, ఎవరికి వీలైన స్థాయిలో వారు ఆరాధనలో గడపడం మరియు యువకులను ఆ రాత్రి బయట తిరగకుండా ఇంటిలోనే ఉంచడం. కనీసం ఆ రోజైనా వారి చేత ఖుర్ఆన్ చదివింపజేయండి.

**ఒక రాత్రి చేసే ప్రార్థన 1000 నెలల కంటే శ్రేష్టమైనది. ఉదాహరణకు ఆ రాత్రి వ్యవధి 12 గంటలు అనుకుందాం. ఆ 12 గంటల పాటు ప్రార్థనలోనే ఉంటే 30,000 రోజులు (1000 x 30) ప్రార్థనలో ఉన్నట్లే కదా!**

**ఖద్ర్ రాత్రి 1 గంట ప్రార్థన చేస్తే ఆ ప్రార్థన 2,500 రోజులు విరామం లేకుండా ప్రార్థన చేసినదానికి సమానమౌతుంది.**

**1 నిమిషం ఆ రాత్రి ప్రార్థన చేస్తే 41 రోజుల 16 గంటలు ఏకధాటిగా చేసిన ప్రార్థనకు సమానం.**

**మనం 'అల్లాహు అక్బర్' అని అల్లాహ్‌ను కీర్తించడానికి ఒక సెకను కాలం పడుతుంది. ఆ రాత్రి 'అల్లాహ్ అక్బర్' అని చెబితే, ఆ ఒక్క సెకనులో మీరు పలికిన 'అల్లాహు అక్బర్' అనే వచనం 16 గంటల 40 నిమిషాల పాటు ఆగకుండా 'అల్లాహు అక్బర్' అని చెప్పినదానితో సమానం.**

ఇప్పుడు ఆలోచించండి! ఆ రాత్రి ఒక్క సెకను కాలం ఎంత విలువైనదో! తల్లిదండ్రులు తమ పిల్లలకు అగ్ని వలన చిన్న గాయమైతేనే తట్టుకోలేరు కదా! మరి చెప్పడానికి, ఊహించడానికే సాధ్యం కానటువంటి ఆ నరకాగ్ని నుండి పిల్లలను కాపాడుకోవాలని తల్లిదండ్రులు ఎందుకు ప్రయత్నించడం లేదు? పిల్లల ప్రయాణం సౌకర్యంగా ఉండాలని బైక్‌లు కొని ఇస్తున్నారు. వారిని నరకం నుండి తప్పించి స్వర్గానికి తీసుకుపోయే ప్రయాణం సౌకర్యంగా ఉండాలని ఎందుకు కోరుకోవడం లేదు?

ఖద్ర్ రాత్రి యాక్సిడెంట్ చేసి మరణిస్తే, కొందరు వ్యక్తులు పరిగణిస్తూ వారిని షహీద్‌లుగా మాట్లాడుతున్నారు. దీనిని ఏమనాలో మీరే ఆలోచించండి.

ప్రతీ జమియత్ నాయకులు తమ యువకులను ముందుగానే హెచ్చరించాలి. ఇస్లామ్‌ను అవమాన పరిచే విధంగా ఏదైనా వికృత చేష్టకు ఎవరైనా పాల్పడితే, జమియత్ తరఫున ఆ కుటుంబం పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆ రాత్రులు ప్రారంభానికి ముందే ప్రకటించాలి.


ముస్లిములను చీలుస్తూ వర్గాలుగా చేసే గురువులు నేటి సమాజంలో ఎక్కువై పోయారు. ఇలాంటి గురువులు పుట్టగొడుగుల్లా పుట్టు కొచ్చేస్తున్నారు. వీరు చేసే బిద్అత్ పనులను బయటపెడితే, తమ గురువులను అవమానిస్తున్నారని కొందరు రెచ్చిపోతున్నారు. కాని ఎవరైనా ఇస్లామ్‌ని అవమానపరుస్తున్నా లేదా ముహమ్మద్(స)వారిని అవమాన పరుస్తున్నా సరే వీరికి నోట మాట రాదు.

అలా నిశ్శబ్దంగా ఉంటున్నందుకు కాస్త కూడా సిగ్గు పడటం లేదు. యువకులు వ్యక్తి పూజ (Hero-worship) వైపు మొగ్గు చూపుతున్నారు. ఇస్లామ్‌లో వ్యక్తులు ముఖ్యం కాదు. మనకు ఇస్లామ్ ముఖ్యం. ముహమ్మద్(స)వారు ముఖ్యం.

ఇస్లామ్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతూ, ఇస్లామ్‌ని అవమానించే వారిని వారు ఎవరైనా సరే నియంత్రించడం మన బాధ్యత కాదా? ఆలోచించండి!

"నిశ్చయంగా అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించేవారు, సలాత్ (నమాజ్)ను స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ భయపడని వారు మాత్రమే అల్లాహ్ మస్‌జిద్‌లను నిర్వహించాలి. ..." (ఖుర్'ఆన్ 9:18)





# మస్‌జిద్





మరియు నిశ్చయంగా మస్‌జిద్‌లు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కావున వాటిలో అల్లాహ్‌తో బాటు ఇతరులెవ్వరినీ ప్రార్థించకండి. (ఖుర్'ఆన్ 72:18)

"ఎవరైతే అల్లాహ్ కొరకు ఓ మస్‌జిద్‌ను నిర్మిస్తారో, పిచ్చుక గూడు వంటిది లేక దానికంటే చిన్నదైనా సరే, అల్లాహ్ అతని కొరకు స్వర్గంలో ఓ గృహాన్ని నిర్మిస్తారు." (ఇబ్నెమాజా, సహీహ్, 738)

ఇస్లామీయ సమాజంలో అన్ని నిర్మాణాలలో కెల్లా అత్యుత్తమమైన నిర్మాణం 'మస్‌జిద్'అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

ఇస్లామ్ తొలి రోజులలో ధార్మికమైన అన్ని ఆచరణలు మరియు ఫర్జ్‌కాని ఇతర ఆరాధనలు మక్కాలోని పవిత్ర గృహంలోనే జరిగేవి. మదీనాకు వలస వెళ్ళిన తరువాత ఇస్లామీయ వ్యవస్థ అధికారంలోకి వచ్చాక, ముహమ్మద్(స)వారు చేసిన మొదటి పని - అల్లాహ్ అనుగ్రహం పొందిన తన స్వహస్తాలతో 'ఖుబా' వద్ద మస్‌జిద్ నిర్మాణానికి పునాది వేయడం. ఆయన(స)తో పాటు అన్సారులు, ముహాజిర్‌లు ఎంతో ఉత్సాహంతో మస్‌జిద్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశ్వాసులకు మొత్తం భూమి అంతా మస్‌జిదే! అయితే కొన్ని చోట్ల ప్రార్థన చేయడానికి అనుమతి లేదు. ఆ విషయాలు తెలిపే హదీస్‌లను ఈ వ్యాసంలో అందిస్తున్నాము. ఇస్లామీయ సమాజంలో మస్‌జిద్ ఎంతో ముఖ్యమైన మరియు మూలాధారమైన పాత్ర వహిస్తుంది. ముహమ్మద్(స)వారు మస్‌జిద్‌ను ఎన్నో లక్ష్యాల కొరకు ఉపయోగించారు :

**ఇస్లామీయ ప్రభుత్వానికి రాజధానిగా, సైనిక వ్యవహారాలను ఆదేశించే కేంద్రంగా, ప్రభుత్వ వ్యవహారాల సంప్రదింపులు జరిపే ప్రదేశంగా, ప్రభుత్వ ఖజానాగా, ఇస్లామీయ న్యాయస్థానంగా, తొలి యూనివర్శిటీగా, సివిల్ సెక్రటేరియట్‌గా ప్రభుత్వ అతిథి గృహంగా మరియు ఎన్నో నిర్మాణాత్మక ప్రయోజనాల కొరకు ఉపయోగించారు.**

మస్‌జిద్ అంటే అల్లాహ్‌కు సజ్దా చేసే చోటు. ధార్మిక ప్రసంగాలు ఇచ్చే చోటు. ఖుర్'ఆన్ పఠనానికి మరియు ఇస్లామీయ విద్యను నేర్చుకోవడానికి అనువైన ప్రదేశం. ప్రతీ రోజూ 5 నిర్దేశిత సలాత్‌లు చేయబడే ప్రదేశం.

మస్‌జిద్‌ల యొక్క ఘనతను వివరిస్తూ శాంతిబాట సెప్టెంబర్'09 మరియు అక్టోబర్' 09 సంచికలలో విశ్లేషణతో కూడిన ఎన్నో వివరాలను అందించాము.

వేటివలన ఆ రోజుల్లో మస్‌జిద్‌కు ఘనత కలిగిందో, అవి ఈనాడు కనిపించడం లేదు. మస్‌జిద్‌లు కట్టడంలో పోటీ పెరిగింది. చాలా మస్‌జిద్‌లు జుమ్మా నమాజ్ కొరకు నిర్మించబడిన కట్టడాలుగా మిగిలిపోయాయి. కోట్లు ఖర్చుపెట్టి, ఖరీదైన ఫ్లోరింగ్‌లు, ఎ.సి.లు ఏర్పాటు చేయడం వలన **'ఘనత'** కలగదు. ఖుర్'ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా మస్‌జిద్ యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుని, మస్‌జిద్ విషయంలో మనపై నున్న బాధ్యత ప్రకారం వ్యవహరిస్తే, మస్‌జిద్‌లకు పూర్వవైభవం ఇన్షాఅల్లాహ్ వస్తుంది. నేటి యువతరానికి మస్‌జిద్‌లు కేవలం సలాత్(నమాజ్)లు చేసే నిలయాలుగా మాత్రమే తెలుసు.

ఇన్షా అల్లాహ్ ఈ సంచిక పవిత్ర రమదాన్ మాసంలో అందుతుందని మా నమ్మకం. ఈ నెలలో మస్‌జిద్ నిర్మాణం మరియు నిర్వహణ బాధ్యతలను తెలుసుకుని, ఆ విషయంలో సున్నత్‌ను తిరిగి పునరుద్ధరించడానికి నిర్ణయం తీసుకుందాం!

## ఎవరైనా అల్లాహ్ కొరకే మస్‌జిద్‌ను నిర్మిస్తే :

ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఉల్లేఖనం. **"నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా విన్నాను : 'ఎవరైతే ఓ మస్‌జిద్‌ను నిర్మిస్తారో అందులో అల్లాహ్ పేరు ప్రస్తావించబడుతుందో, అల్లాహ్ అతని కొరకు స్వర్గంలో ఓ ఇల్లు నిర్మిస్తారు"**

(ఇబ్నెమాజా, సహీహ్, 735, పుస్తకం 7, అధ్యా.1, సంపుటి 1)

అల్లాహ్ పేరును ప్రస్తావించడం అంటే సలాత్ చేయడమొకటే కాదు, అన్నిరకాల ధార్మిక ఆచరణలు, దువాలు, చదవడం, అల్లాహ్ నామ స్మరణ చేయడం అల్లాహ్ యొక్క గొప్పతనాన్ని ఘనపరచడం మొదలైనవి.

ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి)వారి ఉల్లేఖనం. **"అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పగా నేను విన్నాను : 'ఎవరైతే అల్లాహ్ కొరకే**

**ఓ మస్‌జిద్‌ను నిర్మిస్తారో, అల్లాహ్ అతని కొరకు అటువంటి దానినే స్వర్గంలో నిర్మిస్తారు"**

(ఇబ్నెమాజా, సహీహ్, 736, పుస్తకం 7, అధ్యా.1, సంపుటి 1)

'అల్లాహ్ కొరకే' మస్‌జిద్‌ను నిర్మించడం అంటే ఆ పని పూర్తి నిజాయితీతో చేయాలి. తన పేరు ప్రఖ్యాతల కోసం మస్‌జిద్ కట్టడం లేదా మస్‌జిద్ కట్టించినందుకు అందరూ మెచ్చుకోవాలనే తలంపుతో కాకుండా కేవలం అల్లాహ్ కొరకే దానిని అల్లాహ్ ఆమోదించే విధంగా నిర్మిస్తే అటువంటి దానినే అల్లాహ్ స్వర్గంలో నిర్మిస్తారు.

ఇందులో తెలుసుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే, '**అటువంటి దానినే**' అని చెప్పడం. మస్‌జిద్ అన్ని నిర్మాణాలలో కెల్లా ఉత్తమమైనది కాబట్టి, అటువంటి దానినే అంటే స్వర్గంలోని ఇతర నిర్మాణాల కంటే ఉత్తమమైనదని కావచ్చు. అసలు అర్థం అల్లాహ్‌కే తెలుసు.

## మస్‌జిద్ పరిమాణం ముఖ్యం కాదు

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : **"ఎవరైతే అల్లాహ్ కొరకే ఓ మస్‌జిద్‌ను నిర్మిస్తారో, పిచ్చుక గూడు వంటిది లేక దానికంటే చిన్నదైనా సరే, అల్లాహ్ అతని కొరకు స్వర్గంలో ఓ గృహాన్ని నిర్మిస్తారు."** (ఇబ్నెమాజా, సహీహ్, 738, పుస్తకం 7, అధ్యా.1, సంపుటి 1)

అల్లాహ్ కొరకు నిజాయితీతో కూడిన ఆచరణకే ప్రతిఫలం దక్కుతుంది. నేడు మనం చూస్తున్నాము, '**మా ఊరిలో మస్‌జిద్ కట్టుకోవాలి. చందా ఇవ్వండి**' అంటూ వచ్చే వారెందరో! చిన్న గోడలు, ఐరన్ గ్రిల్స్, పైన సిమెంట్ రేకులతో కట్టుకోవచ్చు లేదా చిన్న పాక వేసుకుని లోపలికి పశువులు, జంతువులు రాకుండా ఏర్పాటు చేసుకున్నా సరిపోతుంది.

20 సంవత్సరాల క్రితం విశాఖపట్నం నగరంలో ఒక పాకలో రోజూ ఇషా నమాజ్‌కి దాదాపు 100 మంది హాజరయ్యేవారు. ఆ సమయానికి చిన్న చిన్న పల్లెటూర్లలో కూడా పాకతో ఉన్న మస్‌జిద్‌ను మేమెక్కడా చూడలేదు. అటువంటిది ఓ నగరంలో పాకలో మస్‌జిద్‌ను నిర్వహించారంటే ఆలోచించండి.

ముహమ్మద్(స)వారు తన సహచరులతో కలిసి మదీనాలో నిర్మించిన మస్‌జిద్ పైకప్పు ఖర్జూరపు ఆకులతో ఏర్పాటు చేశారు. అది ఉన్నతమైన మస్‌జిద్ కాదా?

ముహమ్మద్(స)వారు మస్‌జిద్ నిర్మించిన కాలంలోనే రోమన్, పర్షియా దేశాలలో విలువైన కట్టడాలు ఎన్నో ఉన్నాయి. మదీనాలో ముహమ్మద్(స)వారిచే నిర్మించబడే తొలి మస్‌జిద్ ఆ విధంగా గొప్పగా ఉండాలని అన్సారులందరి దగ్గరా, చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఇస్లామ్ స్వీకరించినవారి నుండి చందాలు వసూలు చేసి కట్టలేదు.

ఎవరైనా తన ఇల్లు కట్టుకోవడానికి అందరి దగ్గరా చందాలు వసూలుచేసి కట్టుకోవడం లేదు కదా! మరి అల్లాహ్ గృహం కట్టడానికి ఆ మస్‌జిద్ పరిసర ప్రాంతాల వారు తమ స్తోమతకు తగిన విధంగా ఎందుకు కట్టుకోవడం లేదు?

'ఆంధ్రప్రదేశ్‌లో జనరేటర్ ఉన్న తొలి మస్‌జిద్ మాదే'నని ఒకరు గొప్పలు చెప్పుకుంటే, 'పూర్తి ఏ.సి. ఉన్న మస్‌జిద్ మాదే'నని మరొకరు చెప్పుకుంటారు. కొన్ని మస్‌జిద్‌లలో రమదాన్ నెలలో అనవసరంగా లక్షలు ఖర్చు పెడతారు. ఆ విధంగా ఖర్చుపెట్టే ఒకచోట క్రిందటి సంవత్సరం, రకరకాల ఐటమ్స్‌తో ఇఫ్తార్‌కి విందు ఇచ్చినవారు, ఆ తరువాయి ఉదయం అక్కడికి వచ్చిన ముసాఫిర్‌లకు సహరీ ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరమైన విషయం.

కొన్ని మస్‌జిద్‌లలో వుజూ కొరకు లభ్యమయ్యే నీరు ఉప్పునీరు, కలుషితమైన నీరు ఉంటుంది. ఆ నీటిని శుద్ధి చేసుకోవడానికి వృథా ఖర్చుని మానుకుని ఓ చిన్న ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని ఆలోచించరు.

ఎంతోమంది వృథాగా ఖర్చుపెట్టే ఆ సొమ్ములో పేదవారి హక్కు కూడా ఉందని తెలుసుకోవడం లేదు. పేదవారి అమానతును వారికి ఇవ్వకుండా వృథా చేసేస్తున్నారు. మస్‌జిద్‌ల నిర్మాణ వ్యయం తగ్గించాలి. కొన్నాళ్ళకి దానిని పడగొట్టి మరలా కట్టిస్తారు.

## ప్రళయకాల సూచనలలో ఒకటి

అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం. **"అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : 'ఆ ఘడియ** (ప్రళయ దినం) **ప్రారంభం కాదు, మస్‌జిద్‌లలో ప్రజలు పోటీ పడేవరకూ".**

(ఇబ్నెమాజా, సహీహ్, 739, పుస్తకం 7, అధ్యా.2, సంపుటి 1)

'మస్‌జిద్‌లలో పోటీ' విషయాన్ని రెండు విధాలుగా అర్థం చేసుకోవచ్చు. (1) ప్రజలు తమ ఐశ్వర్యం మరియు హోదా గురించి గర్వంగా చెప్పుకోవడం (2) మస్‌జిద్‌ల నిర్మాణాలలో పరస్పరం పోటీ పడటం.

### మస్‌జిద్‌లలో క్రయ విక్రయాలు జరపకూడదు

అమ్ర్ బిన్ షు'ఐబ్ తన తండ్రి నుండి ఉల్లేఖిస్తున్నారు. అతని తాతగారు చెప్పారు : "అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు మస్‌జిద్‌లలో **అమ్మడం, కొనడం మరియు కవిత్వం చెప్పడాన్ని నిరోధించారు**"

(ఇబ్నెమాజా, హసన్, 749, పుస్తకం 7, అధ్యా.5, సంపుటి 1)

మస్‌జిద్‌ను మార్కెట్ ప్రదేశంగా ఉపయోగించ కూడదు.

### మస్‌జిద్‌లలో నిద్ర పోవడం

ఇబ్నె ఉమర్(రజి) చెప్పారు : "అల్లాహ్ యొక్క సందేశహరుని(స) కాలంలో మేము మస్‌జిద్‌లలో పడుకునేవారము"

(ఇబ్నెమాజా, సహీహ్, 751, పుస్తకం 7, అధ్యా.6, సంపుటి 1)

య'ఈస్ బిన్ ఖైస్ బిన్ తిఖ్ఫా ఉల్లేఖనం. 'సుఫ్ఫా' వారిలో ఒకరైన ఈయన తండ్రి చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మాకు చెప్పారు : 'నాతో రండి'. కాబట్టి మేము ఆయిషా(రజి)వారి

ఇంటికి వెళ్ళాము. అక్కడ ఆహార పానీయాలు తీసుకున్నాము. తరువాత అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మాతో అన్నారు : 'మీరు కోరినట్లయితే, మీరు ఇక్కడ పడుకోవచ్చు లేక మీరు కోరినట్లయితే మీరు మస్‌జిద్‌కు వెళ్ళగలరు'. మేము అన్నాము : 'మేము మస్‌జిద్‌కు వెళతాము' (ఇబ్నెమాజా, సహీహ్, 752, పుస్తకం 7, అధ్యా.6, సంపుటి 1)

ముసాఫిర్‌లు వస్తూ ఉంటారు. వారికి ఆ ప్రాంతంలో బంధువు లెవరూ ఉండకపోవచ్చు. వేరేచోట ఉండే స్థోమత లేనప్పుడు మస్‌జిద్‌లలో పడుకోవడానికి అనుమతి ఉందనే విషయాన్ని పై హదీస్ స్పష్టం చేస్తుంది.

## ముస్లిములకు ప్రపంచమంతా మస్‌జిదే!

అబూ స'ఈద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖనం. ''అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : '**ప్రపంచం అంతా మస్‌జిదే, శ్మశానం మరియు హమ్మామ్ తప్ప**'' (ఇబ్నెమాజా, సహీహ్, 745, పుస్తకం 7, అధ్యా.4, సంపుటి 1)

అబూజర్ గిఫ్ఫారీ(రజి) ఉల్లేఖనం. నేను అడిగాను : ''ఓ రసూలుల్లాహ్! ఏ మస్‌జిద్ ముందుగా నిర్మించబడింది?'' ఆయన(స) చెప్పారు : 'అల్ మస్‌జిద్ అల్ హరమ్' (మక్కాలో). నేను అడిగాను: 'తరువాత ఏది?' ఆయన(స) చెప్పారు, 'తరువాత అల్ మస్‌జిద్ అల్ అఖ్సా' (జెరూసలెంలో). నేను అడిగాను: 'వాటి మధ్య ఎన్ని సంవత్సరాలు'. ఆయన(స) చెప్పారు, 'నలభై సంవత్సరాలు, **కాని మొత్తం భూమి మీ కొరకు మస్‌జిద్, కాబట్టి సలాత్ చేయండి మీరు ఎక్కడున్నా సలాత్ సమయం అయినప్పుడు** (ఇబ్నెమాజా, సహీహ్, 753, పుస్తకం 7, అధ్యా.7, సం. 1)

---

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సలాత్ కొరకు) గొఱ్ఱెలు మరియు ఒంటెల కొట్టాలలో తప్ప మీకు ఎక్కడా స్థలం దొరక నట్లయితే, గొఱ్ఱెల కొట్టాలలో సలాత్ చేయండి మరియు ఒంటెల కొట్టాలలో సలాత్ చేయకండి (ఇబ్నెమాజా, హసన్, 768, పుస్తకం 7, అధ్యా.12, సంపుటి 1)

ఒంటెల వలన ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

## మస్‌జిద్‌లను శుభ్రంగానూ, సువాసన భరితంగా ఉంచాలి

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) పల్లెటూర్లలో మస్‌జిద్‌లు నిర్మించమని ఆదేశించారు మరియు వాటిని **శుభ్రంగానూ మరియు సువాసన కలిగి ఉండేలా ఉంచమన్నారు.** (ఇబ్నెమాజా, సహీహ్, 758, పుస్తకం 7, అ.9, సం.1)

---

అబూహురైరా (రజి) మరియు అబూ స'ఈద్ ఖుద్రీ ఉల్లేఖించారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మస్‌జిద్ గోడపై 'ఉమ్మి'ని చూశారు. ఆయన ఓ రాయిని తీసుకుని దానిని గీకి వేశారు, తరువాత ఆయన అన్నారు, ''మీలో ఎవరికైతే ఉమ్మివేసే అవసరం వస్తుందో అతను తన ముందరివైపు లేక అతని కుడివైపున ఉమ్మివేయకూడదు , అతనిని ఉమ్మనీయండి తన ఎడమవైపు లేక అతని ఎడమ పాదం క్రింద (సహీహ్)

---

అనస్ బిన్ మాలిక్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: ''**మీలో ఒకరు సలాత్‌లో ఉన్నప్పుడు, అతడు తన ప్రభువుతో సంభాషిస్తూ ఉన్నాడు, కాబట్టి అతడు తన ముందరి వైపు లేదా తన కుడివైపు ఉమ్మి ఊయకూడదు బదులుగా అతని ఎడమవైపు, ఎడమ పాదం క్రింద.** (సహీహ్ ముస్లిమ్, 1230, పుస్తకం 5, అధ్యా.13, సంపుటి 2)

---

అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: ''**మస్‌జిద్‌లో ఉమ్మివేయడం పాపం మరియు దానికి పరిహారం దానిని పాతి పెట్టడమే** (అంటే దానిపై కొంత మన్ను వేయాలి)''. (సహీహ్ ముస్లిమ్, 1231, పుస్తకం 5, అధ్యా..., సంపుటి 2)

---

అబూజర్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు: ''నా ఉమ్మత్ ఆచరణలు, **మంచివి మరియు చెడ్డవి**, నాకు చూపబడ్డాయి. వారి మంచి ఆచరణలలో, మార్గం నుండి హానికరమైన వాటిని తొలగించడాన్ని చూశాను. మరియు వారి చెడు ఆచరణలలో పాతిపెట్టబడని ఉమ్మిని మస్‌జిద్‌లో చూశాను''. (సహీహ్ ముస్లిమ్, 1233, పుస్తకం 5, అధ్యా....., సంపుటి 2)

**వాసన యొక్క ప్రభావం మన మెదడుపై ఉంటుంది. సువాసన మన జ్ఞాపకశక్తిని పెంచుతుంది. సువాసన విషయంలో మెడికల్‌గా చెప్పాలంటే చాలా ప్రయోజనం ఉంది. స్థలాభావం వలన ఇక్కడ అందివ్వడం లేదు. మరొక వ్యాసంలో ఈ విషయాలను చర్చిద్దాం. మస్‌జిద్‌ను ఇన్షాఅల్లాహ్ సువాసనభరితంగా ఉంచుదాం!**

ఇబ్నె ఉమర్(రజి) ఉల్లేఖనం. ఎవరైతే ఈ కూరగాయలను తింటారో, అతనిని మన మస్‌జిద్ దగ్గరకు రానివ్వకండి. **ఆ వాసన పోయేవరకూ, వెల్లుల్లి నుద్దేశించి.**'' (సహీహ్ ముస్లిమ్, 1249, పుస్తకం 5, అధ్యా.17, సంపుటి 2)

## మస్‌జిద్‌లలో చేయకూడని ప్రకటనలు

పోయిన వస్తువులను గురించి ప్రకటనలు మస్‌జిద్‌లో చేయకూడదు. ఈ విషయంలో ముహమ్మద్(స)వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. మస్‌జిద్‌లు అందుకొరకు నిర్మించ బడలేదు.

సులైమాన్ బిన్ బురైదా ఉల్లేఖనం. అతని తండ్రిగారు చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశహరులు సలాత్ చేశారు (పూర్తి గావించారు?) తరువాత ఒక వ్యక్తి అన్నాడు : '**ఎర్ర ఒంటె కోసం ఎవరు వెతుకుతున్నారు?**' ప్రవక్త(స) చెప్పారు : '**నీవు దానిని కనుగొనవు గాక! మస్‌జిద్‌లు దానికొరకే నిర్మించబడ్డాయి, దేని కొరకయితే అవి నిర్మించబడ్డాయో**'' (ఇబ్నెమాజా, సహీహ్, 765, పుస్తకం 7, అధ్యా.11, సంపుటి 1)

---

అమ్ర్ బిన్ షు'ఐబ్ ఉల్లేఖనం. అతని తాతగారి నుండి తెలుసు కున్నది. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) 'పోగొట్టుకున్న

మరియు దొరికిన వాటి ప్రకటనలు మస్జిద్‌లో చేయడాన్ని నిషేధించారు'. (ఇబ్నెమాజా, హసన్, 766, పుస్తకం 7, అధ్యా.11, సం. 1)

షద్దాద్ బిన్ హాద్ గారి స్వేచ్ఛనివ్వబడిన బానిస, అబూ అబ్దుల్లాహ్ ఉల్లేఖనం. ఆయన అబూ హురైరా(రజి) చెప్పగా విన్నారు : 'నేను అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పగా విన్నాను: "పోగొట్టుకున్న మరియు దొరికిన వాటి ప్రకటన మస్జిద్‌లో ఒక వ్యక్తి చేయడం ఎవరైనా వింటే, అతనిని చెప్పనీయండి : **'అల్లాహ్ దానిని నీకు తిరిగి పొందకుండా చేయుగాక!'** దాని కొరకు మస్జిద్‌లు నిర్మించబడలేదు." (ఇబ్నెమాజా, హసన్, 767, పుస్తకం 7, అధ్యా.12, సంపుటి 1)

## మస్జిద్ ఎంత దూరంలో ఉండాలి?

మస్జిద్‌ను నిర్మిస్తే స్వర్గంలో అతనికి అల్లాహ్ ఓ ఇంటిని నిర్మిస్తారని, ఈనాడు మస్జిద్‌ల నిర్మాణాలకు భారీగా కొందరు దేశ విదేశాలలోని ధనవంతులు డబ్బు ఇస్తున్నారు. అయితే ఆ విధంగా నిర్మించడం కేవలం అల్లాహ్ కొరకే జరగాలి.

డబ్బు పుష్కలంగా అందుతుంది కాబట్టి, అవసరం లేనిచోట కూడా మస్జిద్‌లు నిర్మించేస్తున్నారు. కాని వాటిని కట్టించేస్తే సరిపోతుందా? వాటిని నిర్వహించాలి కదా! ఇమామ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

ఊరిలో గల్లీ గల్లీకి మస్జిద్‌లు కట్టేయవలసిన అవసరం లేదు. చాలా మస్జిద్‌లకు ఇప్పటికే ఇమామ్‌లు లేరు. కొన్నిచోట్ల అయితే ఇమామ్, ము'అజ్జిన్ మాత్రమే సలాత్ (నమాజ్) చేసుకోవలసి వస్తుంది. కేవలం ఒక్క జుమ్మా సలాత్‌కే కాస్త జమాత్ ఉంటుంది. ఈ మాత్రం దానికి కొత్త మస్జిద్‌లు ఎందుకు?

మస్జిద్‌లు దూరంగా ఉంటే, ఆ మస్జిద్‌ని చేరేవరకూ వేసే ప్రతీ అడుగుకి కూడా పుణ్యం లభిస్తుంది. జనాభా ప్రాతిపదికన, మస్జిద్‌లో హాజరయ్యేవారి సంఖ్యను బట్టి కొత్త మస్జిద్‌ల అవసరాన్ని నిర్ణయించుకోవాలి. దూరంగా ఉండే మస్జిద్‌లకు వెళ్ళే వారికి లభించే ప్రతిఫలానికి సంబంధించి ప్రవక్త(స)వారు చెప్పిన కొన్ని బోధనలు :

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు: **మస్జిద్ నుండి దూరం ఎక్కువయ్యే కొద్దీ, ప్రతిఫలం కూడా ఎక్కువవుతుంది**" (ఇబ్నెమాజా, హసన్, 782, పుస్తకం 7, అధ్యా.15, సంపుటి 1)

అనస్(రజి) చెప్పారు : బనూ సలిమా తెగవారు తమ ఇండ్లను మస్జిద్‌కు దగ్గరలో ఉండే ప్రదేశాలకు మార్చాలనుకున్నారు. కాని ప్రవక్త(స)వారు మదీనా పొలిమేరలు ఖాళీగా వదిలేయడాన్ని ఇష్టపడలేదు. కాబట్టి ఆయన(స) చెప్పారు: 'ఓ బనూ సలిమా, మీరు (మస్జిద్ వైపు) వేసే అడుగులకు (లభించే) ప్రతిఫలం కొరకు ఆశపడటం లేదా?" కాబట్టి వారు ఉండిపోయారు (ఎక్కడ ఉండేవారో అక్కడే!) (ఇబ్నెమాజా, సహీహ్, 784, పుస్తకం 7, అధ్యా.15, సంపుటి 1)

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : 'మీలో ఎవరైనా వుజూ చేసినప్పుడు దానిని బాగా చేయండి, అప్పుడు అతడు మస్జిద్‌కు వస్తాడు కేవలం సలాత్ కొరకు మరి ఏ ఇతర ప్రేరణ లేకుండా మరియు సలాత్ కాకుండా మరేది అన్వేషించకపోతే, అతడు ఒక్క అడుగూ వేయడు దాని ద్వారా అల్లాహ్ అతని స్థాయిని పెంచనంత వరకు, మరియు అతని పాపాలనుండి ఒక దానిని తీసుకెళ్ళి పోయేంతవరకూ, అతడు మస్జిద్‌లో ప్రవేశించేవరకూ.
అతడు మస్జిద్‌లో ప్రవేశించి నప్పుడు అతడు సలాత్ కొరకు నిరీక్షించినంతవరకూ అతడు సలాత్ స్థితిలో (సలాత్ చేస్తున్నట్లుగానే) ఉంటాడు, " (ఇబ్నెమాజా, సహీహ్, 774, పుస్తకం 7, అధ్యా.14, సంపుటి 1)

సహ్ల్ బిన్ సాద్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: శుభవార్తల నివ్వండి వారికి ఎవరైతే చీకట్లో మస్జిద్‌కు నడిచి వెళతారో, పునరుత్థాన దినమున పరిపూర్ణమైన కాంతి గురించి. (ఇబ్నెమాజా, హసన్, 780, పుస్తకం 7, అధ్యా.14, సంపుటి 1)

ఒకదశలో పునరుత్థాన దినము నాడు కటిక చీకటి మనుష్యులను పరివేష్ఠించి ఉంటుంది. మనుషులు చేసిన మంచి ఆచరణలే వెలుగులా కనిపించడంతో ఆ వెలుగులో విశ్వాసి నడవ గలుగుతాడు. చీకటిగా ఉందని మస్జిద్‌కు వెళ్ళకుండా ఇంటిలో ఉండిపోయే వారుంటారు. ఇంటి నుండి మస్జిద్ ఎంత దూరమైతే, ఫలితం కూడా అంత ఎక్కువగానే ఉంటుంది.

## ఫర్జ్ సలాత్ మస్జిద్‌లోనే చేయాలి

ఫర్జ్ నమాజ్ తప్పనిసరి పరిస్థితిలో తప్ప, మస్జిద్‌లోనే చేయాలి. ఉద్యోగరీత్యా లేదా మరేదైనా కారణం వలన ఒకటీ రెండు నమాజ్‌లు కుదరనప్పుడు, వాటిని వీలైనచోటే చేసుకోవచ్చు.

విడిగా ఇంటిలో సలాత్(నమాజ్) చేసేకంటే మస్జిద్‌లో అందరితో కలిసి సలాత్ చేస్తే, ఆ సలాత్‌కి **24 నుండి 27 రెట్లు ఎక్కువ విశిష్టత ఉంది**. (ఇబ్నెమాజా 786, 787, 788, 789, 790)

## సలాత్ (నమాజ్)లో ఉండగా మాట్లాడకూడదు

జైద్ బిన్ అర్ఖమ్ ఉల్లేఖనం. మేము సలాత్ మధ్యలో మాట్లాడుకునే వారము, ఒకరు తన ప్రక్కనే ఉన్న వ్యక్తితో వారు సలాత్ చేస్తుండగా మాట్లాడేవారు, ఈ ఆయత్ అవతరించే వరకూ.

"మీరు మీ సలాత్ (నమాజ్)లను కాపాడుకోండి మరియు (ముఖ్యంగా) మధ్య నమాజ్‌ను మరియు అల్లాహ్ సన్నిధానంలో వినయ విధేయతలతో నిలబడండి" (2:238)

అప్పుడు మేము నిశ్శబ్దంగా ఉండాలని మరియు మాట్లాడటం నిషేధమని ఆదేశించబడ్డాము". (సహీహ్ ముస్లిమ్, 1203, పుస్తకం 5, అధ్యా.7, సంపుటి 2)

## అజాన్ వినబడ్డాక మస్‌జిద్ నుండి వెళ్ళకూడదు

అబూ అష్-ష'తా ఉల్లేఖనం. ము'అజ్జిన్ మస్‌జిద్‌లో అజాన్ ఇచ్చినప్పుడు మేము అబూహురైరాతో కూర్చుని ఉన్నాము. ఒక వ్యక్తి నిలుచుని మస్‌జిద్ నుండి బయటికి వెళ్ళిపోయాడు. మరియు అబూ హురైరా అతనిని జాగ్రత్తగా గమనిస్తూ అనుసరించారు. అతడు మస్‌జిద్ నుండి బయటికి వెళ్ళేవరకూ. అబూ హురైరా చెప్పారు: ఈ వ్యక్తి అబుల్ ఖాసిమ్(స)కు అవిధేయత చూపాడు.'' (సహీహ్ ముస్లిమ్, 1489, పుస్తకం 5, అధ్యా.45, సంపుటి 2)

## సలాత్‌లో ఇమామత్ ఎవరు చేయాలి?

సాధారణంగా మస్‌జిద్ ఇమామ్ గారే మస్‌జిద్‌లో ప్రతీ సలాత్‌ని ముందుండి చదివిస్తారు. ఇమామ్‌గారి వెనుక సలాత్ చదివే వారిలో, ఒకొక్కసారి వేరే ఊరునుండి ఎవరైనా ఎక్కువ జ్ఞానం కలిగినవారు మస్‌జిద్‌కు వచ్చి ఉండవచ్చు లేదా ఊరిలోని మరో మస్‌జిద్ నుండి వచ్చి ఉండవచ్చు. అటువంటివారు తమకు జ్ఞానం ఎక్కువ కాబట్టి తామే సలాత్ చదివిస్తామని, వెనుక ఉండి సలాత్ చదివితే అది తమకు అవమానకరమని భావించకూడదు. **ఆ మస్‌జిద్ ఇమామ్‌గారి అనుమతి లేకుండా, ఆయన ఉండగా మరొకరు ఇమామత్ చేయకూడదు.** ఇటువంటి సంఘటన ఒక ఊరిలో జరిగితే, దానికి సంబంధించి హదీస్ వివరాల కోసం మమ్మల్ని ఆ ఊరి నుండి ఒక సోదరుడు వాకబు చేశారు.

ఇమామ్ గారికి ఆ వచ్చిన వ్యక్తి గురించి తెలిసి, ఆయనే ఇమామత్ కోసం ఆహ్వానించవచ్చు.

ఒక మస్‌జిద్‌లో ఇమామ్‌ని నియమించేటప్పుడు, ఇమామ్‌గా ఉండటానికి ఆసక్తి చూపేవారిలో ఎవరిని ఎన్నుకోవాలో క్రింది హదీస్ తెలియజేస్తుంది.

అబూ మస్'ఊద్ అన్సారీ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: ప్రజలు అల్లాహ్ గ్రంథాన్ని ఎక్కువ చదివిన వ్యక్తిచే (సలాత్‌లలో) చదివించ బడాలి. ఒకవేళ వారు ఖుర్'ఆన్ పఠనంలో సమానమైతే, సున్నత్‌లలో ఎక్కువ జ్ఞానం కలిగిన వ్యక్తిచేత (చదివించబడాలి), వారు సున్నత్ జ్ఞానంలో కూడా సమానమైతే అప్పుడు వారిలో ఎవరు ముందు వలస వచ్చారో వారి చేత, వారు వలస విషయంలో (కూడా) సమానమైతే అప్పుడు ఎవరు ముందుగా ఇస్లామ్ స్వీకరించారో వారిచేత (చదివించ బడాలి) **ఏ వ్యక్తి కూడా మరొక వ్యక్తిని సలాత్‌లో చదివించకూడదు అతని అధికారంలో ఉన్న ప్రదేశంలో లేక అతని ఇంటిలో అతని గౌరవ స్థానంలో కూర్చోకూడదు అతని అనుమతి లేకుండా**''. అల్-అషజ్జ్ తన ఉల్లేఖనంలో 'ఎవరు ముందుగా ఇస్లామ్ స్వీకరించారో' బదులుగా 'వయస్సులో పెద్దవారి చేత' అని చెప్పారు. (సహీహ్ ముస్లిమ్, 1532, పుస్తకం 5, అధ్యా.52, సంపుటి 2)

## మస్‌జిద్ నిర్మాణాలపై విశ్లేషణ

మస్‌జిద్ అంటే అల్లాహ్ గృహం. అది పిచ్చుక గూడువంటి చిన్నదైనా లేదా పెద్దదైనా సరే అది అల్లాహ్ గృహమే! ప్రపంచంలో తొలి మస్‌జిద్ మరియు అన్ని మస్‌జిద్‌ల కంటే విశిష్టత కలిగినది 'కాబా' మస్‌జిద్. ప్రారంభంలో ఈ మస్‌జిద్‌కు పై కప్పు కూడా లేదు.

పాఠకులు జుమ్మా ప్రసంగాలలో 'కుఫ్ఫారె మక్కా' అనే పదాలు ఎన్నోసార్లు వినే ఉంటారు. వారిని చాలా ఘాటుగా విమర్శిస్తారు. అందులో తప్పేమీ లేదు. సత్య తిరస్కారులైన ఆ మక్కా ఖురైష్‌లు ముస్లిములను ఎన్నో హింసలకు గురి చేశారు. ముస్లిముల విశ్వాసాన్ని, ఆచరణలను చూసి వారు తలదించుకున్నారు. ఇంతవరకూ బాగానే ఉంది.

కాని నేటి ముస్లిమ్ సమాజం 'కుఫ్ఫారె మక్కా' ముందు కొన్ని విషయాలలో తల దించుకోవాల్సి వస్తుంది. వారు కాబా మస్‌జిద్‌కు రిపేర్లు చేసి పునర్నిర్మించేటప్పుడు వారి దగ్గరున్న హలాల్ సొమ్ము సరిపోక అల్-హిజ్ర్ భాగాన్ని పూర్తిగా కట్టకుండా మధ్యలోనే ఆపివేశారు. డబ్బు అయితే వారి దగ్గర చాలా ఉంది. కాని 'ధర్మ సమ్మతమైన సొమ్ము' మాత్రం అయిపోయింది. వడ్డీ వ్యాపారం, వ్యభిచారం మరియు ఇతర అధర్మ మార్గాల ద్వారా వచ్చే సొమ్ము 'హరామ్'.

'అల్లాహ్' గృహాన్ని హరామ్ సొమ్ముతో నిర్మించ కూడదని నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం వారి దైవభీతిని స్పష్టం చేస్తుంది. అదే విధంగా మస్‌జిద్‌కు కూడా చాలా గౌరవమిచ్చారని స్పష్టంగా తెలుస్తుంది.

మరి నేడు మస్‌జిద్‌లను నిర్మిస్తున్న వారికి, నిర్మాణంలో వారు ఉపయోగిస్తున్న సొమ్ము 'హలాల్' (ధర్మసమ్మతమా)? లేక హరామ్ (నిషేధించబడినదా)? అని తెలుసుకుంటున్నారా?

ప్రతీ మస్‌జిద్‌కు వెళ్ళి, 'మా ఊరిలో మస్‌జిద్ కడుతున్నాము' చందా ఇవ్వండి అని అడుగుతారు గాని, అది తప్పనిసరిగా 'హలాల్' అయితేనే స్వీకరిస్తామని చెప్పడం లేదు.

నేటి ముస్లిమ్ సమాజం హరామ్ మరియు హలాల్ మధ్య తేడాని పట్టించుకోవడం లేదు. ఆ విధంగా ఆనాటి 'కుఫ్ఫారె మక్కా' నేటి ముస్లిముల కంటే ఈ విషయంలోఎంతో నయం అనిపించు కుంటున్నారు.

**నిర్మాణ వ్యయం :**

మనదేశంలో ప్లాట్‌ఫామ్‌పై గడిపేవారున్నారు. ఓ చిన్న గుడిశలోనే జీవించే వారూ ఉన్నారు. వీటికి భిన్నంగా కోట్లు ఖర్చుపెట్టి ఇండియాలోని అందరి ఇండ్ల కంటే అతి ఖరీదైన భవంతిని ముఖేష్ అంబానీగారు తన కుటుంబం కోసం నిర్మించుకున్నారు.

అంబానీగారు కట్టించినంత భవంతిని ఓ మధ్యతరగతి ఉద్యోగి ఎందుకు నిర్మించుకోవడం లేదు? తన స్థోమతకు తగ్గ చిన్న ఇల్లు కట్టుకుంటాడు గాని, ఓ రశీదు పుస్తకం తీసుకుని అన్ని ఊర్లు తిరిగి చందా వసూలు చేసి పెద్ద భవంతి కట్టుకోడు.

మరి అల్లాహ్ గృహాన్ని మన స్థోమతకు సరిపోయే విధంగా నిర్మించుకోలేమా? వాటికి చందాల కొరకు ఎందుకు తిరగాలి? 'కాబా' నిర్మాణం పూర్తి కావడానికి డబ్బు చాలకపోతే, వారెందుకు ఇతరులను చందా అడగలేదు.

కాబా మస్‌జిద్ పునర్నిర్మాణంలో పాలుపంచుకోవడానికి అందరూ పోటీ పడ్డారు. మదీనాలో మస్‌జిద్‌ను ముస్లిములే నిర్మించుకున్నారు. మరి మన మస్‌జిద్‌ల నిర్మాణం జరిగేటప్పుడు, ఆ నిర్మాణం పనిలో ఆ ఊరిలోని ఎంతమంది ముస్లిములు పాలుపంచుకుంటున్నారు? వారు పాలుపంచుకోక పోవడానికి కారణం వారికి చరిత్ర తెలియదు. జుమ్మా ప్రసంగాలలో ఇటువంటివి చెబితే వారికి తెలుస్తుంది. జుమ్మా ప్రసంగాల ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ఆ ఏరియాలో ఉండే ఆచరణలకు సరిపోయే విధంగా ఇస్లామ్ జ్ఞానాన్ని జుమ్మా ప్రసంగం ద్వారా అందిస్తే, సమాజానికి మేలు జరుగుతుంది.

క్రింద మట్టి మరియు గులకరాళ్ళు ఉండగా, పైన ఖర్జూరపు ఆకులతో నిర్మించబడిన ఆనాటి మదీనాలోని ముహమ్మద్(స)వారి మస్‌జిద్ కంటే, నేటి గ్రైనైట్ ఫ్లోరింగ్‌లతో గొప్ప డిజైన్లతో నిర్మించబడిన మస్‌జిద్‌లకు ఘనత ఎక్కువా?

'పిచ్చుక గూడు వంటి మస్‌జిద్'ను నిర్మించినా సరే, అల్లాహ్ అతని కొరకు స్వర్గంలో ఓ గృహాన్ని నిర్మిస్తానని వాగ్దానం చేశారు.

అతి చిన్న పక్షి పిచ్చుక. అది ఎవరిపై ఆధారపడకుండా కేవలం అల్లాహ్‌పై విశ్వాసంతో, అల్లాహ్‌చే సృష్టించబడిన కర్రపుల్లలు ఏరుకుని ముక్కుతో తెచ్చి ఓ గూడును నిర్మించుకుంటుంది.

మన ఊరిలోని మన మస్‌జిద్‌ను ఆ విధంగా నిర్మించుకోలేమా? ధనాన్ని ఖర్చుపెట్టవలసింది పేదవారి కొరకు. బిల్డింగ్‌ల కొరకు కాదు.

**మస్‌జిద్ కొరకు ఎవరైనా వచ్చి చందా ఇస్తే తీసుకోవద్దని లేదా మరో ఊరు వారి దగ్గర ఎటువంటి సహాయం తీసుకోకూడదని చెప్పడం మా ఉద్దేశ్యం కాదు. మన ఊరిలో అల్లాహ్ గృహాన్ని మనమే కట్టుకుందామని ఆలోచన ఎందుకు చేసుకోవడం లేదు? అని చెప్పడమే మా ఉద్దేశ్యం.**

ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాల ద్వారా జమియత్ వ్యవస్థ ఏ స్థాయిలో పతనమై పోయిందో స్పష్టంగా కనిపిస్తుంది.

కనీసం ముగ్గురు ముస్లిములున్నా సరే, అందులో ఒకరు అమీర్ (నాయకుడు) కావాలి. అతనికి మిగతా ఇద్దరూ విధేయత చూపాలి. ఆ విధంగా ఒక ఊరిలోని ముస్లిమ్ జమియత్‌కు ఒక అమీర్ ఉన్నారు. మొత్తం జిల్లాలో ఉన్న అమీర్ లందరికీ ప్రతినిధిగా జిల్లా స్థాయి అమీర్ ఉన్నారు. అన్ని జిల్లాల అమీర్లకు ప్రతినిధిగా రాష్ట్ర జమియత్‌కి ఓ అమీర్ ఉన్నారు.

వీరందరూ కలిసి అతి గొప్పదైన ఇస్లామీయ వ్యవస్థను ఆచరణలో ఉంచాలి. ఒక ఊరిలో మస్‌జిద్ నిర్మించవలసి వస్తే, ఆ ఊరి అమీర్‌గారు ఆ విషయాన్ని జిల్లా అమీర్ గారికి తెలియజేస్తే, జిల్లా అమీర్‌గారు రాష్ట్ర జమియత్ అమీర్‌గారికి తెలియజేయాలి.

ఆయన రాష్ట్రంలోని అన్ని జిల్లాల అమీర్లతో సమావేశమైనప్పుడు, ఈ విషయం చెబితే ఆయా జిల్లాల అమీర్లు, తమ జిల్లాలోని పట్టణ స్థాయి అమీర్లకు తెలియజేసి, ఆ విధంగా మస్‌జిద్‌లో సేకరించిన సొమ్మును రాష్ట్ర అమీర్‌గారికి అందిస్తే, దానిని సంబంధిత జిల్లా అమీర్‌గార్కి ఆయన పంపించ గలుగుతారు. సమాచారం వెంటనే చేరవేయడానికి సెల్‌ఫోన్లున్నాయి. డబ్బు బ్యాంక్ ఎకౌంట్‌లో జమ చేయవచ్చు.

ఈ మొత్తం ప్రోసెస్‌లో ఎవరూ తిరగనవసరం లేదు. జీవనోపాధిని వదులుకుని తిరగవలసిన అవసరం ఎవరికీ ఎంతమాత్రం లేదు. మస్‌జిద్ నిర్మాణం కోసం చందా వసూలుచేయడానికి కొందరు రాష్ట్రమంతా, మరికొందరు దేశమంతా తిరుగు తున్నారు. ఆ తిరగడానికి ఎంత ఖర్చు అవుతుంది? వారి భోజనాలకు మరియు ఇతర ఖర్చులకు ఎంత సొమ్ము ఖర్చవుతుంది? ఈ ఖర్చులన్నీ ఆ సేకరించిన చందా నుండే సమకూర్చుకోవాలి. ఈ లావాదేవీలలో ఎన్నో అభ్యంతరకరమైన విషయాలు కూడా ఉన్నాయి. కాని వాటిని మేము ఇక్కడ చెప్ప దలచుకోలేదు.

దీనిని బట్టి ప్రస్తుత అమీర్ వ్యవస్థ ముహమ్మద్(స)వారి బోధనలకు అనుగుణంగా లేదు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మీ జిల్లా అమీర్ గారికి చెప్పండి అని సలహా ఇస్తే, 'సర్లెండి. జమియత్ ఏమీ పట్టించు కోదు' అంటున్నారు. అన్ని చోట్ల నుండి ఇటువంటి వ్యాఖ్యలే వినిపిస్తున్నాయి.

ఎవరైనా జమియత్‌ని వదిలి ఒక్క జాన దూరం వెళ్ళిపోయినా, వారి చావు అజ్ఞానకాలపు చావు అవుతుంది. జమియత్‌ను బలోపేతం చేయాలి.

### మస్‌జిద్ ఫండ్ :

దేశవిదేశాల నుండి ఎవరైనా మస్‌జిద్ కొరకు విరాళమిస్తే, ఆ విరాళం మస్‌జిద్ ఫండ్‌కు డైరక్టుగా చేరేలా చూడాలి. మధ్యవర్తులు లేకుండా ఇస్లామ్ పద్ధతిలో పారదర్శకంగా ఈ ఫండ్ నుండి అవసరాన్ని బట్టి, సంబంధిత మస్‌జిద్‌లకు విడుదల చేయవచ్చు.

### మస్‌జిద్ నిర్వహణ :

మస్‌జిద్‌ను నిర్మించిన తరువాత అతి ముఖ్యమైనది - దాని నిర్వహణ మరియు నిర్వహించే వారెలా ఉండాలో అల్లాహ్‌యే మనకు ఖుర్‌ఆన్‌లో స్పష్టం చేసేసారు.

> **"నిశ్చయంగా అల్లాహ్‌ను అంతిమ దినాన్ని విశ్వసించేవారు, సలాత్ (నమాజ్)ను స్థాపించేవారు, జకాత్ ఇచ్చేవారు, అల్లాహ్‌కు తప్ప మరెవ్వరికీ భయపడని వారు మాత్రమే అల్లాహ్ మస్‌జిద్‌లను నిర్వహించాలి. ..."** (ఖుర్‌ఆన్ 9:18)

నేడు మన మస్‌జిద్‌లను నిర్వహించేవారు అటువంటి వారేనా?

**శుభ్రత :**

మస్‌జిద్‌ను శుభ్రం చేసే బాధ్యత కేవలం ము'అజ్జిన్‌దేనా? మన గృహాన్ని మనం శుభ్రం చేసుకుంటున్నాము కదా! 'అల్లాహ్ గృహాన్ని' శుభ్రం చేయడమంటే ఎంత గొప్ప విషయం! చాలా మస్‌జిద్‌లలో 'అజాన్' ఇవ్వడానికి కుర్రాళ్ళ దగ్గరనుండి పెద్దవారి వరకూ చాలామంది మేమిస్తామంటే మేమిస్తామంటూ పోటీ పడుతుంటారు. ము'అజ్జిన్‌ను బ్రతిమాలుతుంటారు. ఇదే పోటీ మస్‌జిద్‌ను శుభ్రపరచడంలో కూడా ఉంటే ఎంత బాగుంటుంది!

మస్‌జిద్‌లకి వచ్చినవారికి అర్జంటుగా టాయిలెట్‌కి వెళ్ళవలసిన అవసరం రావచ్చు. అందుకని మస్‌జిద్ బయట బాత్రూమ్‌లు కట్టిస్తున్నారు. కాని మస్‌జిద్‌కు ఎప్పుడూ రానివారు కూడా, వాటిని పబ్లిక్ టాయిలెట్స్‌లా ఉపయోగించు కుంటున్నారు. శుభ్రత సగం ఈమాన్ (విశ్వాసం) అన్నారు. కాని వాటిని అపరిశుభ్రంగా ఉంచుతున్నారు. వాటిని శుభ్రం చేయడానికి జీతానికి ఎవరినో నియమించి ఉండవచ్చు. అయినప్పటికీ మనం వాటిని పరిశుభ్రంగా ఉంచాలి.

ఇది రమదాన్ నెల. ఇఫ్తార్‌లు మస్‌జిద్‌లోనే. ఒక్క మెతుకు కూడా క్రింద పడకుండా జాగ్రత్త పడాలి. అందులోనే అల్లాహ్ మనకోసం ఉంచిన శుభం ఉందేమో! ముస్లిములు వరుసలలో నిల్చుని ఒకే పద్ధతిలో సలాత్ చేస్తున్నప్పుడు చూసేవారి కెవరికైనా ముచ్చటేస్తుంది.

ఈ ఇఫ్తార్‌లో కూడా ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు కూర్చోకుండా అందరూ ఒక పద్ధతిలో కూర్చుని, పూర్తి అయిన తరువాత వ్యర్థాలను ఓ డ్రమ్‌లో తీసే విధంగా ఏర్పాటు చేసుకుంటే, మస్‌జిద్ మరియు మస్‌జిద్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి.

శుభ్రమైన ప్రదేశాలను మరియు సువాసనభరితమైన ప్రదేశాలను ఫరిస్తాలు ఇష్టపడతారు.

**స్థల సేకరణ :** మస్‌జిద్ కొరకు స్థలాన్ని సేకరించేటప్పుడు గాని, దానిని కొనే విషయంలో గాని చట్టప్రకారం గానూ, మరియు అందులో ఎటువంటి అవినీతి లేకుండా చూసుకోవాలి. అనుమతి లేకుండా సంబంధిత భూమిని ఆక్రమించి కట్టడం చేయకూడదు.

ముస్లిములు మస్‌జిద్ కొరకు ధర్మ సమ్మతమైనది తప్ప ఏదీ స్వీకరించరని, అది అల్లాహ్ గృహమని ఇతరులు అర్థం చేసుకునేలా మన ఆచరణ ఉండాలి. ఒకచోట మస్‌జిద్ నిర్మించాలంటే, దాని కొరకు ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు తీసుకోవాలో తెలుసుకుని, అనుభవజ్ఞులు, పెద్దల సలహా ప్రకారం ఎవరికీ ఇబ్బంది లేకుండా నిర్మించాలి.

పొరుగువారు మన ప్రవర్తన వలన ఇబ్బంది పడకూడదని ఇస్లామ్ బోధిస్తుంది. కాబట్టి మనం నిర్మించే మస్‌జిద్ పొరుగువారికి ఇబ్బంది కలగని విధంగానూ, చట్టప్రకారం అన్ని అనుమతులతో నిర్మించడం మనపైనున్న కనీస బాధ్యత.

# మస్‌జిద్ - ఓ విజ్ఞాన కేంద్రం

## మస్‌జిద్ మరియు యూనివర్శిటీ

జామి جامِعٌ = మస్‌జిద్ مَسجِدُ

ఈ 'జామి' అనే పదం నుండే ఉత్పన్నమైన పదం - 'జామిఆ' **جامِعَةٌ** అంటే యూనివర్శిటీ (విశ్వవిద్యాలయం). చాలా చోట్ల ఇప్పటికీ 'జామిఆ' అంటే మస్‌జిద్ మరియు స్కూల్ . 'మస్‌జిద్' అర్థాన్నిచ్చే పదం నుండే 'యూనివర్శిటీ' అనే పదం ఉత్పన్నమవడం అనేది మరే ఇతర భాషలోగాని, సంస్కృతిలో గాని లేదు. మస్‌జిద్‌కు మరియు విద్యను సముపార్జించే స్కూలుకు విడదీయరాని బంధం ఉండబట్టే, ఇస్లామీయ జ్ఞానాన్ని సముపార్జించిన ముస్లిమ్ శాస్త్రవేత్తలు ఆధునిక సైన్స్‌కి పునాదులు వేయగలిగారు. జ్ఞానాన్ని సంపాదించుకోమని ముస్లిములందరినీ దైవప్రవక్త ముహమ్మద్(స) వారు ఆదేశించారు. జ్ఞానాన్ని తాము చేరుకోగలిగినంత మేర వెతకమన్నారు. అంతేకాకుండా, జ్ఞానాన్ని ఎల్లప్పుడూ వెతకమన్నారు. అంటే విద్యకు అత్యధిక ప్రాముఖ్యత నివ్వమని చెప్పారు.

## ప్రాథమిక విద్య ప్రతీ పిల్లవాడికి తప్పనిసరి

ఈ ఆదేశాలను, సాంప్రదాయాలను అనుసరిస్తూ, ముస్లిమ్ పాలకులు ప్రతీ ముస్లిమ్ పిల్లవాడు చదువుకోవాలని నొక్కిచెబుతూ, సాధారణంగా చదువుకోవడానికే కాకుండా, విద్యా సంస్థలకు కూడా మద్దతు నిచ్చేవారు. ఇస్లామీయ ఆదేశాలతో పాలకుల యొక్క ఈ తోడ్పాటే, ముస్లిములలో 'ప్రాథమిక విద్య'ను దాదాపు సర్వ సాధారణం అయ్యేలా చేసింది.


**"తమ వారికి పాఠశాలలో విద్య నేర్పించడంలో పాలకులు ఈ గొప్ప ఔదార్యాన్నే చూపించారు. వారి నాగరికత ప్రకాశవంతంగా మరియు శీఘ్రపురోగతి సాధించడానికి బలమైన కారణాలలో ఇది ఒకటి. విద్య ఎంత సర్వసాధారణంగా విస్తృతం అయిందంటే, చదవడం మరియు వ్రాయడం తెలియని ఒక్క ముస్లిమ్‌ని కూడా కనుగొనలేనంతగా." - Wilds**

**ముస్లిమ్ స్పెయిన్‌లో నిరుపేద రైతు యొక్క పిల్లలు కూడా 'చదువు యొక్క శుభాలను' అనుభవించకుండా ఉన్న గ్రామం అంటూ ఏదీ లేదు. కార్డోబాలో 800 పబ్లిక్ స్కూళ్ళు ఉండేవి. - Scott**

వారికి చదువును నేర్పే ప్రదేశం ఎంత ఉన్నతమైనదంటే, టీచర్లు మరియు విద్యార్థులను ప్రజలు గౌరవించేవారు. పెద్ద పెద్ద లైబ్రరీలను ఐశ్వర్యవంతులు మరియు వ్యాపారవేత్తలు ఏర్పాటు చేయడాన్ని బట్టి, జ్ఞానాన్ని పొందడమనేది ఆనాడు ఉన్నత వ్యక్తిత్వాన్ని సూచించే వాటిలో ఒక లక్షణంగా తెలుస్తుంది.

**ఇస్లామ్‌లో 'సాహిత్య జీవితం' పోషించిన పాత్రవంటిది, మరో సంస్కృతిలో కలిగియుండటం చాలా అరుదు. ఇల్మ్ (జ్ఞానం) అనేది ముస్లిమ్‌లకు మరే విషయం కంటే కూడా ఎక్కువ ఆసక్తిగాఉండేది. మస్‌జిద్‌లలో వికసించిన జ్ఞానం బయటికి వ్యాపించింది. ప్రభావాన్ని చూపగలిగే ప్రతీవర్గంలోనూ తనదైన ముద్ర వేసింది - Pederson**





1. స్పెయిన్‌లోని కార్డోబా మస్జిద్ మరియు యూనివర్శిటీ లోపలిభాగం, ఇది 785 సం॥లో స్థాపించబడింది. స్థాపించబడి ఇప్పటికి 1224 సం॥లు కావస్తున్న అతి పురాతన విశ్వ విద్యాలయం.
2. Qarawiyyin Mosque and University. ఖరవియ్యిన్ మస్జిద్ మరియు యూనివర్శిటీ, ఫెజ్, మొరాకో. 859 సం॥లో స్థాపించబడింది. (అంటే ఇప్పటికి ఇది స్థాపించబడి 1141 సం॥లు కావస్తుంది).
3. Al-Azhar University, Cairo. అల్-అజ్‌హర్ యూనివర్శిటీ, కైరోలో 22 జూన్, 972లో స్థాపించబడింది. ఈ యూనివర్శిటీ స్థాపించబడి, ఇప్పటికి 1037 సం॥లు కావస్తుంది.

మస్జిద్ నుండి హాస్పిటల్ వరకూ, అబ్జర్వేటరీ నుండి మదరసా (స్కూలు) వరకూ ప్రతీ ప్రదేశమూ నేర్చుకునే ప్రదేశమే! విద్వాంసులు (scholars) తమ స్వంత ఇళ్ళల్లో సమావేశమైన (ప్రొగైన)వారికి వివరించేవారు. అలాంటి చాలామంది విద్వాంసులలో అల్-ఘజాలీ, అల్-ఫరాబీ మరియు ఇబ్నె సిన్న ఉన్నారు. పబ్లిక్ స్కూళ్లలో బోధన తరువాత (అంటే రిటైర్ అయ్యాక) వారి యొక్క ప్రైవేట్ లైబ్రరీలలో మరియు అధ్యయనాల్లో ఏకాంతంగా గడిపేవారు. వారిని ఆహ్వానించే అదృష్టవంతులకు బోధించడాన్ని కొనసాగించేవారు.

విద్య కొరకు ఈ సర్వసాధారణ పిపాస మరియు ప్రోత్సాహం అన్నిటి కంటే సరియైనదిగా మరియు ఉన్నతమైనదిగా ఉండేది. ఈ universality ఈ రోజుకి సయితం సమానం కాలేదని చెప్పవచ్చు.

**ఇస్లామ్‌లో విద్యను వికసించేలా చేయడంలో మస్జిద్ చాలా గొప్ప పాత్ర పోషించింది. పాఠశాలకు మస్జిద్‌తో విడదీయలేని అనుబంధమేర్పడింది. - Scott**

**ప్రారంభంనుండి మస్జిద్ ఇస్లామీయ సమాజానికి కేంద్ర బిందువు. - Wardenburg.**

మరియు ఏ ప్రాంతమైతే ఇస్లామ్ స్వాధీనంలోకి వచ్చిందో, అక్కడ **మస్జిద్‌లు** స్థాపించబడేవి. ప్రాథమిక బోధన ప్రారంభమయ్యేది. అటువంటి మస్జిద్‌లు, తరచుగా వందల సంఖ్యలో, కొన్ని సార్లు వేల సంఖ్యలో విద్యార్థులకు బోధించే ప్రదేశాలుగా మరియు ఎక్కువ సంఖ్యలో ముఖ్యమైన లైబ్రరీలను కలిగి ఉండి, అందరికీ తెలిసిన ప్రదేశాలుగా అభివృద్ధి చెందేవి.

మస్జిద్‌తో కలిసి ఉండే మొట్టమొదటి స్కూలు మదీనాలో 653 సం॥లో ఏర్పాటు చేయబడింది. 744 సం॥లో డమాస్కస్‌లో మొదటి స్కూలు ప్రారంభమయింది. 900 సం॥ వచ్చేసరికి **దాదాపు ప్రతీ మస్జిద్‌లోను బాలికలకు మరియు బాలురకు విద్య నేర్పడానికి ఒక ప్రాథమిక పాఠశాల ఉండేది.**

సాధారణంగా 5 సం॥ల వయస్సున్న పిల్లలు స్కూలులో విద్య నభ్యసించడం ప్రారంభించేవారు. చదవడం మరియు వ్రాయడానికి సంబంధించిన ముఖ్య ప్రాథమిక విషయాలు బాగా నేర్చుకున్న తరువాత, ఖుర్ఆన్ గ్రంథాన్ని బాగా అధ్యయనం చేయడం మరియు గణితశాస్త్రాన్ని కూడా బోధించేవారు.

## పెద్ద మస్జిద్‌లు మరియు ఉన్నత విద్య

ఇంకా ఎక్కువగా చదువుకోవాలనే ఆసక్తిగలవారు, ఉన్నత విద్యను అందించే పెద్ద మస్జిద్‌లకు వెళ్లేవారు. అక్కడ వారికి అరబిక్ గ్రామర్ మరియు పద్యభాగం, లాజిక్, ఆల్‌జీబ్రా, బయోలజీ, చరిత్ర, న్యాయ శాస్త్రం (లా) మరియు మతధర్మ శాస్త్రాన్ని బోధించేవారు.

స్పెయిన్‌లో ఉన్నత విద్య తరచుగా మదరసాలలోనూ, హాస్పిటల్స్‌లోను, అబ్జర్వేటరీలోనూ మరియు విద్వాంసుల ఇళ్ళల్లోనూ బోధించబడినప్పటికిని, చాలా వరకూ టీచింగ్ మస్జిద్‌లలోనే జరిగేది, 8వ శతాబ్దంలో కార్డోబా మస్జిద్ నుండి ఇది ప్రారంభమైంది.

## మస్జిద్‌లలో స్టడీ సర్కిల్స్ - హల్‌ఖతుల్ ఇల్మ్

మస్జిద్ విద్య యొక్క ప్రాథమిక రూపమే - స్టడీ సర్కిల్. ఇస్లామ్‌లో 'హల్‌ఖతుల్-ఇల్మ్'గా ఇది బాగా సుపరిచితం. ఇంకా క్లుప్తంగా చెప్పాలంటే 'హలఖహ్'. 'హల్ఖా' అంటే ఎన్‌సైక్లోపీడియా ఇస్లామ్ యొక్క న్యూ ఎడిషన్ ప్రకారం, 'వృత్తాకారం(circle) లో అంటే గుండ్రంగా ప్రజలు కూర్చుని సమావేశమవడం'. లేదా టీచర్ చుట్టూ విద్యార్థులు సమావేశమవడం.

వేరే ప్రాంతాల నుండి సందర్శించడానికి వచ్చే విద్వాంసులను గౌరవ సూచకంగా టీచర్ ప్రక్కన కూర్చోవడానికి అనుమతించేవారు. చాలా హలఖాత్ (స్టడీ సర్కిల్స్)లో సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఓ సెక్షన్ (విభాగం) ఉండేది.

930 సం॥లో ఇరాఖ్‌లో ఓ పట్టణంలో అల్-బహ్‌లూలి అనే న్యాయాధికారి తన సోదరునితో సహా ఇటువంటి స్టడీ సర్కిల్స్‌ని చూడటానికి వచ్చారు. అలా వారు ఓ స్టడీ సర్కిల్ కొచ్చారు. అక్కడ ఓ విద్వాంసుడు జ్ఞానానికి సంబంధించిన వివిధ విషయాల యొక్క అన్ని మూలాల గురించి మాట్లాడటాన్ని చూశారు.

**ఉమయ్యద్ మస్జిద్** : ఇబ్నె బతూత గ్రంథస్థం చేసిన దాని ప్రకారం ఉమ్మయద్ మస్జిద్‌లోని హలఖాత్‌కి 500 కంటే ఎక్కువమంది విద్యార్థులు వచ్చేవారు.

**అమ్ర్ మస్జిద్** : కైరో సమీపంలోని అమ్ర్ మస్జిద్‌లో ఒకానొక సమయంలో 40 హలఖాత్ ఉండేవి.

కైరోలోని ముఖ్య మస్జిద్‌లో 120 హలఖాత్ ఉండేవి.

దేశాటన చేసే భౌగోళికుడు అల్-ముఖద్దసి ఇలా చెప్పారు:

సాయంకాల సమయాన చేసే రెండు ప్రార్ధనల మధ్యకాలంలో, ఈయన తన స్నేహితులతో కూర్చుని మాట్లాడుతుండగా, అతనికి ఓ అరుపు వినిపించింది **'మీ ముఖాలను తరగతి వైపుకు త్రిప్పండి'** అని. అప్పుడతనికి అర్థమయింది - తాము రెండు తరగతులకు మధ్య కూర్చున్నామని. అటువంటివి 110 వరకూ ఉన్నాయి.

నిజానికి హలఖాత్‌లలో టీచర్స్‌కే అధికారం ఉన్నప్పటికీ, స్టూడెంట్స్‌కి టీచర్లతో చర్చించడానికి మరియు సవాల్ చేయడానికి సయితం, టీచర్ చెప్పింది సరిలేకపోతే సరిచేయడానికి, తరచుగా తీవ్రమైన వాదనలకి కూడా అనుమతి నిచ్చేవారు. **చూశారా! 1000 సం॥ల క్రితమే ఎంత చక్కటి ఎడ్యుకేషన్ సిస్టమ్‌ని 'ఇస్లాం' ఏర్పరచిందో!**

మస్జిద్ చుట్టూ శుక్రవారం నాడు సమావేశమైన స్టడీసర్కిల్స్‌లో అన్ని సబ్జక్టులపై జరిగే చర్చలలో వాదనలకు చేసే హద్దే ఉండేది కాదు. 'No holds were barred'.

**దాదాపు పెద్ద మస్‌జిద్‌లు అన్నింటిలోనూ, విద్యను బోధించడం మరియు నేర్చుకోవడమనేది పూర్తి స్థాయి వృత్తిగా ఉండేది. మస్‌జిద్ స్కూల్ - తర్వాతి కాలంలో ఓ అకాడమీగా/ యూనివర్శిటీగా మారడానికి ఆ బాధ్యతను ఈ మస్‌జిద్ స్కూల్ తీసుకుంది. ఆ విధంగా ముఖ్యమైన ఉన్నత విద్యాకేంద్రాలు ఈ రోజున కూడా ప్రపంచంలో పురాతన విశ్వవిద్యాలయాలుగా ఉనికిలోనే ఉన్నాయి - Mackensen**

వాటిలోని కొన్ని యూనివర్శిటీలు : టునీషియాలోని అల్-ఖౌరవున్ మరియు అల్-జైతూన, ఈజిప్ట్‌లోని అల్-అజ్‌హర్ మరియు మొరాకో, ఫెజ్‌లోని అల్-ఖరవియ్యీన్.

అల్-అజ్‌హర్ యూనివర్శిటీలో 12వ శతాబ్దపు చివరికాలంలో అల్-బాగ్దాదీ వైద్యశాస్త్రాన్ని బోధించగా, ఇబ్నె ఖల్‌దూన్ 14వ శతాబ్దం చివరికాలంలో ఇక్కడ బోధించారు. ఆ విధంగా ప్రసిద్ధిగాంచిన స్థలాలుగా, ఇవి చాలా సంఖ్యలో విద్యార్థులను ఆకట్టుకునేవి.

## మదీనా మస్‌జిద్ మరియు తొలి స్కూల్

మదీనా మస్‌జిద్‌లో చాలా పెద్ద సంఖ్యలో విద్యార్థులు గుమి గూడేవారు. ఈ మస్‌జిద్ ప్రారంభపు స్కూల్ మాత్రమే కాకుండా చాలా అడ్వాన్స్‌డ్ స్కూల్ అని చెప్పవచ్చు. అల్-ఖరవియ్యీన్ యూనివర్శిటీలో మొరాకోలోని అన్ని ప్రాంతాలనుండి విద్యార్థులు చేరేవారు. అలాగే నార్త్ ఆఫ్రికాలోని మిగిలిన ప్రాంతాల నుండి, అండలూసియా (స్పెయిన్) మరియు సహారా నుండి సహితం విద్యార్థులు వచ్చేవారు.

సాధారణంగా ఈ విద్యార్థులకు వసతులను మొరాకో రాజవంశావళి పరంపర మరియు ఫెజ్ ప్రజలు కల్పించేవారు.

ఇక గ్రెనడా(Granada), Seville మరియు కార్డోబా యూనివర్శిటీలపై ఆసియా, ఆఫ్రికా మరియు యూరప్ విద్వాంసులకు చాలా ఎక్కువ అంచనా లుండేవి. 9వ శతాబ్దంలో కార్డోబా యూనివర్శిటీలో theology (మతధర్మ శాస్త్రం) విభాగంలోనే 4వేల మంది విద్యార్థులు ఉండేవారు.

ఆ కాలంలోనే ఈ యూనివర్శిటీలో హాజరయ్యే మొత్తం విద్యార్థుల సంఖ్య 11,000.

బ్రిటిష్‌వారు ఆక్రమించే సమయానికి, అల్-అజ్‌హర్ యూనివర్శిటీలో అప్పటికే 7,600 మంది విద్యార్థులు మరియు 230 మంది ప్రొఫెసర్లు ఉండేవారు.

1. ఇస్లామీయ యుగ ప్రారంభంలో, ఇస్లామిక్ సైన్సెస్‌కు సంబంధించి, ఒకటీ లేదా చాలా సబ్జక్టులను మరియు సాహిత్య కళలను మస్‌జిద్‌లలో బోధించేవారు.
2. కాని 9వ శతాబ్దం మధ్యభాగం గడిచిన తరువాత, ఎక్కువ సంఖ్యలో న్యాయశాస్త్రం వైపు వచ్చేవారు.

అల్-అజ్‌హర్ యూనివర్శిటీలో ఈజిప్ట్‌లోని ఇబ్నె తులున్ మస్‌జిద్‌లో ఖగోళశాస్త్రం మరియు ఇంజినీరింగ్, మెడిసిన్ మొ॥న సైంటిఫిక్ సబ్జక్టులను కూడా బోధించేవారు.

ఇక ఖరవియ్యీన్ యూనివర్శిటీలో బోధనాంశాలు ఏమిటంటే : Grammar (వ్యాకరణం), Rhetoric (సాహిత్య మీమాంస, వాక్చాతుర్యం), Logic (తర్కశాస్త్రం), Elements of Mathematics (గణితం) and Astronomy (ఖగోళశాస్త్రం), History (చరిత్ర), Geography (భౌగోళిక శాస్త్రం) Elements of Chemistry (రసాయన శాస్త్రం).

ఖేరవ్వన్ యూనివర్శిటీలో మరియు టునీశియాలోని జైతూనలో ఖుర్‌ఆన్ మరియు న్యాయశాస్త్ర మీమాంస (jurisprudence)తో పాటు చెప్పిన ఇతర బోధనాంశాలు: Grammar, Mathematics, Astronomy and Medicine.

ఖేరవ్వన్‌లో ప్రత్యేకంగా మెడిసిన్ క్లాసులను జైద్ ఇబ్నె ఖల్ఫున్, ఇష్‌హాఖ్ ఇబ్నె ఇమ్రాన్ మరియు ఇషాఖ్ ఇబ్నె సులైమాన్ బోధించేవారు. వీరు రాసిన గ్రంథాలను 11వ శతాబ్దంలో Constantine The African అనువదించడం జరిగింది.

ఇటలీ ధక్షిణ ప్రాంతంలోని Salernoలో వైద్యశాస్త్రపు తొలి అధ్యాపకులకు అరబీ భాషనుండి అనువదించబడిన విషయాలనే బోధించేవారు. ఆ విధంగా ఈ ప్రాంతం లాటిన్ యూరప్‌లో ఉన్నత విద్యను బోధించే తొలి కేంద్రం అయింది.

**అమ్ర్ మస్‌జిద్** : జెరూసలెం నుండి ముస్లిమ్ పర్యాటకుడు మరియు భౌగోళికుడు అయిన అల్-ముఖద్దసి చెప్పిన దాని ప్రకారం **అమ్ర్ మస్‌జిద్** సాయంత్రపు రెండు ప్రార్థనల మధ్య కాలంలో, Law (న్యాయశాస్త్రం), ఖుర్‌ఆన్, Literature (సాహిత్యం), Wisdom (Philosophy or ethics) క్లాసుల విద్యార్థులతో నిండిపోయేది.

**బాగ్దాద్ మస్‌జిద్‌లు** : ఇరాఖ్‌లోని బాగ్దాద్ మస్‌జిద్‌లలో బోధించబడే అంశాలు : Pharmacology, Engineering, Astronomy మరియు మరికొన్ని ఇతర సబ్జక్టులు. ఈ శాస్త్రాలను నేర్చుకోవడానికి సిరియా, పర్షియా మరియు ఇండియా నుండి విద్యార్థులు ఇక్కడికి వచ్చేవారు.

## ఇస్లామీయ విద్యారంగంలో రెండవ దశ

(మస్‌జిద్ + ఖాన్) = కాలేజ్

ఈ మస్‌జిద్‌లు ఉన్నత విద్యయొక్క విధి నిర్వహణను మరింత విశాలం చేసే బాధ్యతను తీసుకున్నాయి. ఈ వికాసాన్ని గమనించిన George Makdisi ఇలా చెబుతున్నారు. 10వ శతాబ్దంలో ఓ కొత్తరకమైన **College** (కాలేజ్) వికసించడం ఆరంభమైంది. **మస్‌జిద్** మరియు **ఖాన్** (లేదా inn - బయట ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు వసతి గృహం)ని కలిపి ఈ కొత్తరకమైన Collegeను ప్రారంభించారు.

కాలేజ్ అభివృద్ధికి సంబంధించిన ఈ రెండవ దశకు గొప్ప పోషకుడు బద్ర్ ఇబ్నె హసన్‌వైహ్ (d. 1014). బుయిద్‌ల ఆధీనంలో ఉన్న చాలా ప్రాంతాలకు ఈయన గవర్నర్‌గా ఉండేవారు. ఈయన గవర్నర్‌గా ఉన్న 30 సంవత్సరాల కాలంలో 3,000 **మస్‌జిద్ - ఖాన్** కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశాడు.

ఇలా మస్‌జిద్‌తో **'ఖాన్'**ను కలపడానికి గల కారణాన్ని George Makdisi ఇలా వివరిస్తున్నారు: న్యాయశాస్త్రాన్ని పూర్తి చేయడానికి ఒకో విద్యార్థికి చాలాకాలం పట్టేది. Under graduatesకే సాధారణంగా 4 సంవత్సరాలు పట్టేది. గ్రాడ్యుయేట్ స్టడీస్‌కయితే 20 సంవత్సరాల వరకూ పట్టేది. ఇదే సమయంలో గ్రాడ్యుయేట్ విద్యనభ్యసించే విద్యార్థి తన టీచర్‌కి బోధనలో సహాయపడేవాడు.

కొన్ని ప్రత్యేక పరిస్థితులలో తప్పితే, మస్‌జిద్‌ను నివశించడానికి ఉపయోగించరాదు. అందుకని ఖాన్ (inn) టీచర్లకు మరియు విద్యార్థులకు వసతి గృహం అయింది. ఆ విధంగా 'ఖాన్' మస్‌జిద్‌కు ఆనుకుని ఉండేది.

### మదరసా

మక్‌దిసి ప్రకారం, **మస్‌జిద్ యొక్క బోధనా బాధ్యతను మరియు ఖాన్ యొక్క వసతి బాధ్యతను కలుపుతూ, అభివృద్ధి చెందిన 'ముస్లిమ్ కాలేజ్' యొక్క చివరి దశే - మదరసా.**

ముహమ్మద్(స)వారిచే పునరుద్ధరించబడిన ఇస్లాం యొక్క ప్రారంభంలో, పేద విద్యార్థులు మరియు వేరే ప్రాంతం నుండి వచ్చిన వారికోసం ఓ వసతి గృహం మస్‌జిద్‌తో కలుపబడి ఉండేది.

ప్రవక్త(స)వారి ఈ సాంప్రదాయాన్నే **మదరసా అనుసరించింది.**

### ఫీజు మినహాయింపు :

వివిధ మస్‌జిద్‌లలోని విద్యార్థులకు అందే సహకారం చెప్పుకోదగ్గది. ఉదాహరణకు **ఖరవియ్యీన్‌లో విద్యార్థులకు కట్టవలసిన ఫీజునుండి మినహాయింపు ఇవ్వడమే కాకుండా, నియమిత కాలాలలో వారికి ఆర్థికంగా కూడా సహాయాన్ని అందించేవారు.** Bayard Dodge చెప్పిన దానిని బట్టి, నాలుగు ప్రక్కలా ఇళ్లతో మధ్యలో ఖాళీగా ఉండే రెసిడెన్షియల్ యూనిట్లలో (residential quadrangles) విద్యార్థులకు వసతిని కల్పించేవారు. ఈ బిల్డింగ్‌లు రెండు మరియు మూడు అంతస్థులతో విద్యార్థులు ఉండటానికి సౌకర్యంగా ఉండేవి. ఆహారం మరియు ఉండటానికి అవసరమైన కనీస సౌకర్యాలు విద్యార్థులందరికీ అందేవి.

అల్-అజ్‌హర్ యూనివర్శిటీలో విద్యార్థుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండేది. ఈజిప్ట్‌లోని అన్ని ప్రాంతాలతో పాటు, మగ్‌రెబ్ మరియు పర్షియాలాంటి చాలా సుదూర ప్రాంతాల నుండి వచ్చిన విదేశీ విద్యార్థులు 750మంది వరకూ ఉండేవారని అల్-మఖ్రిజి చెప్పారు.

కైరోలో ఇళ్లులేని విద్యార్థులకు ఒకో రెసిడెన్షియల్ యూనిట్‌ని కేటాయించేవారని Bayard Dodge చెప్పారు. సాధారణంగా ఆ రెసిడెన్షియల్ యూనిట్‌లో విద్యార్థులకు ఉచితంగా భోజనం అందించబడేది. ఆర్థిక స్థోమత బాగున్న విద్యార్థులు మస్‌జిద్ దగ్గరలోని వసతి గృహంలో ఉండేవారు. ప్రతీ పెద్ద యూనిట్‌లో, ఓ లైబ్రరీ, వంటగది, లావెట్రీ మరియు పర్నిచర్ కోసం కొంత స్థలం ఉండేది.

డమాస్కస్‌ని సందర్శించిన పర్యాటకుడు ఇబ్నె జుబైర్ - ఉమయ్యాద్ మస్‌జిద్ వద్ద సందర్శకులకు మరియు విదేశీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను, అధిక సంఖ్యలోనున్న అక్కడి విద్యార్థులను, అక్కడ అనుసరిస్తున్న ఉన్నత సాంప్రదాయం అతనిని ఇలా ప్రకటించేలా పురిగొల్పాయి :

> **"విజయాన్ని వెతికే పాశ్చాత్య దేశీయుల నెవరినైనా సరే, ఈ (డమాస్కస్) నగరానికి చదువుకోవడానికి రానివ్వండి. ఎందుకంటే ఇక్కడ అందే సహకారం అవసరమైనదానికంటే చాలా ఎక్కువ. ఇక్కడి విద్యార్థికి ఆహారం, ఉండటానికి వసతులకు సంబంధించి, ఏ విచారం లేకుండా స్వేచ్ఛగా ఉన్నారు. ఇది చాలా గొప్ప సహాయం."**

మస్‌జిద్‌లు విద్యను అందించేలా చేయడంలో పాలకులు కూడా ముఖ్య పాత్రను పోషించారని చెప్పవచ్చు. ఖరవియ్యీన్‌లో 3 వేర్వేరు లైబ్రరీలు (గ్రంథాలయాలు) ఉండేవి. వాటిలో ప్రతిష్ఠాత్మకమైనది **అబూ ఇనాన్ లైబ్రరీ.** దీనిని మెరినిద్ సుల్తాన్ 'అల్-ముతవక్కిల్ అబూ ఇనాన్' స్థాపించారు.

ఈయనకు పుస్తకాలు చదవడం మరియు వాటిని సేకరించడం అంటే అత్యంత ఆసక్తి. మత ధర్మం, సైన్స్, మేధస్సు మరియు భాషకు సంబంధించి లభించిన కొత్త పుస్తకాలను ఈయన లైబ్రరీలో ఉంచేవారు. అంతేకాకుండా ఈ లైబ్రరీ యొక్క బాధ్యతలను చూడటానికి ఓ లైబ్రేరియన్‌ను కూడా నియమించారు.

టునీశియాలో, 1534 మరియు 1574 మధ్య కాలంలో టునిస్‌ని ఆక్రమించిన స్పానియర్డ్స్ (Spaniards) అక్కడి మస్‌జిద్‌లను, లైబ్రరీలను కొల్లగొట్టారు. విలువైన ఎన్నో పుస్తకాలను, వ్రాతప్రతులను తొలగించారు.

ఆ తర్వాతి కాలంలో Ottomans , స్పానియర్డ్స్‌ని పారద్రోలి, జైతూన మస్‌జిద్‌ని, లైబ్రరీలను, మదరసాలను మామూలు స్థితికి తీసుకువచ్చి, **మస్‌జిద్‌ను మరింత విశాలంగా చేశారు.** ఆ విధంగా మరలా **ఇస్లామీయ సంస్కృతికి ఉన్నత కేంద్రంగా చేశారు.**

1365లో కైరోలో Mamluke రాకుమారుడు 'యల్బగా అల్-ఉమరి', ఇబ్నె తులున్ మస్‌జిద్‌లోని ప్రతీ విద్యార్థికి 40 దిర్హమ్‌లు, ఒక ఇర్దబ్

గోధుమలను ప్రతినెలా ఇవ్వాలని ఆదేశించారు. ఈ పాలకులు అధిక సంఖ్యలోనున్న టీచర్లకి జీతాలు, విద్యార్థులకు స్టైఫెండ్ (stipend) ఇచ్చేవారు.

ఈ ట్రెండ్‌ని ప్రత్యేకంగా ప్రోత్సహించినవారు సుల్తాన్ హుసామ్ అద్దీన్ లజిన్. కైరోలోని ఖతాయి జిల్లాలోని ఇబ్నె తులున్ మస్‌జిద్‌ని బాగుచేసి, అక్కడి ప్రొఫెసర్లకు జీతాలను, విద్యార్థులకు స్టైఫెండ్‌ను ఇచ్చేవారు. వీరి రాజభవనం లోని ఫిజీషియన్ (వైద్యులు) షరాఫ్ అద్దీన్ ముహమ్మద్ ఇబ్నె అల్-హవాఫిర్‌చే మెడిసిన్‌లో లెక్చర్స్ ఇప్పించేవారు.

ఏదో ఒక విషయంలోనే కాదు, ఎన్నో విషయాలలో యూరప్‌ని ఇస్లాం ప్రభావితం చేసింది. ఆ తరువాత మిగతా ప్రపంచం కూడా **ఇస్లామ్ యొక్క యూనివర్సాలిటీ** (universality), బోధనా పద్ధతులు, డిప్లొమాలు ప్రధానం చేయడం మొ॥న వాటితో కూడిన విద్యావ్యవస్థ ద్వారా ప్రభావితం అయింది.

Georges Makdisi ఈ విషయానికి సంబంధించి కొన్ని ప్రధానమైన విషయాలను ఎత్తి చూపుతూ సరిగ్గా వివరించారు.

> Amongst others, Islam influenced the West and the course of university scholarship in terms of academic freedom of professors and students, in the doctoral thesis and its defence, and in the peer review of scholarly work based on the consensus of peers. The open scholarly discussions in the mosques surely accounted for much of that in times when scientific intolerance ruled elsewhere, and any free scholarly thought was punished with burning at the stake. The influence also came in the form of the many translated books of Islamic scholars which formed the core of European education in their first universities (Montpellier, Bologna, Paris, Oxford…), which all were founded in the twelfth-thirteenth centuries.

అంటే విద్యార్థులకు, టీచర్లకు విద్యా సంబంధిత విషయాలలో ఉండే స్వేచ్ఛ గురించి, నేడు Ph.D. డిగ్రీ కోసం ఏ పద్ధతినైతే మన యూనివర్శిటీల్లో పాటిస్తున్నామో, నేడు ఎంతో ఆధునికం, నాగరికం అనుకునే ఈ పద్ధతిని కూడా శతాబ్దాల క్రితమే ఇస్లామీయ విద్య ప్రవేశ పెట్టింది. అలాగే రీసెర్చ్ స్కాలర్ చేసిన వర్క్‌ని అనుభవజ్ఞులు విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవడం, డాక్టరేట్ ప్రధానం చేయడం వంటి గొప్ప పద్ధతులను ప్రపంచానికి అందించింది ఇస్లామీయ విద్యావేత్తలే!

**అప్పట్లో మిగతా ప్రపంచంలో సైన్స్ గురించి మాట్లాడితే, చెట్టుకు కట్టి కాల్చి వేసే కాలంలో, ఇస్లామీయ సామ్రాజ్యంలో మస్‌జిద్‌లలో జ్ఞానుల మధ్య బహిరంగ చర్చలు జరుగుతుండేవి.**

అంతేకాకుండా ఇస్లామిక్ స్కాలర్స్ యొక్క పుస్తకాలని యూరోపియన్ భాషల లోనికి అనువదించబడటం ద్వారా కూడా ఇస్లామీయ విద్య యొక్క ప్రభావం వారిపై పడింది. ఈ అనువదించబడిన పుస్తకాలే యూరప్‌లోని తొలి విశ్వవిద్యాలయ విద్యకు 'కేంద్రకం' అయ్యాయని చెప్పవచ్చు. ఈ విశ్వ విద్యాలయాలు యూరప్‌లో 12 మరియు 13వ శతాబ్దాల మధ్యలో ప్రారంభించబడ్డాయి.

**ప్రారంభ దశ నుండే ఇస్లామ్ మరియు జ్ఞానం కలిసి పయనించాయి.**
**ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స) వారి యొక్క బోధనలు ప్రజలలో విద్య నేర్చుకోవాలనే తపనను కలిగించాయి.**

**ఇస్లామ్ యొక్క కాంక్రీట్ సింబల్ - మస్‌జిద్**

**విద్యా సముపార్జనకు కేంద్రం - మస్‌జిద్**

**మనవి**

ప్రతీ మస్‌జిద్ ప్రాథమిక విద్యను అందించేలా, పట్టణాలలోని పెద్ద మస్‌జిద్‌లలో అరబీ గ్రామర్, ఖుర్ఆన్ తఫ్సీర్, హదీస్ విజ్ఞానం మొదలైన వాటిపై ఉన్నత విద్యను అందించేలా చేస్తే పూర్వ వైభవాన్ని సాధించవచ్చు.

ఉన్నత ప్రమాణాలతో నడపబడే ఎన్నో మదరసాలు మన దేశంలో ఉన్నాయి. ప్రతీ సంవత్సరం ఎందరో ఆలిమ్‌లు కోర్సులు పూర్తి చేసుకుని వస్తున్నారు.

ఒక్కొక్క ముస్లిమ్ కుటుంబం ఓ 50 రు॥లు కేటాయించగలిగితే, ఈ ఆలిమ్‌లకు బయటి స్కూల్ టీచర్లతో సమానంగా లేక ఇంకా ఎక్కువ జీతాలు ఇవ్వ గలుగుతాము. అప్పుడు వారు కూడా వేరే వ్యాపకాలు పెట్టుకోకుండా పూర్తి సమయం చదివించ గలుగుతారు. మస్‌జిద్ ఓ విజ్ఞాన కేంద్రం అని మర్చిపోకూడదు.

ఇక దావా ప్రోగ్రామ్‌ల వంటివి ఆపివేస్తే, పుస్తకాలను సమకూర్చు కోవచ్చు. అన్ని మస్‌జిద్‌లలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయవచ్చు.

ఇల్మ్ లేకుండా ఏ జాతి కూడా అభివృద్ధి కాదు.

ఇస్లామ్ బోధన ప్రకారం :

ఉద్యోగమైనా లేదా వ్యాపారమైన కష్టపడి పనిచేయాలి. జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ధర్మంగా బ్రతకాలి. తోటివారికి చేతనైనంత సహాయం చెయ్యాలి. పరిశోధనలు చెయ్యాలి. అప్పుడే ఆ జాతి ప్రకాశిస్తుంది. ఇస్లామ్ ఆ విధంగానే ఆనాడు ప్రకాశించింది.

ఈ పవిత్ర రమదాన్ మాసంలో 'మస్‌జిద్'లకు పూర్వవైభవాన్ని తీసుకు రావడానికి ఇన్షా అల్లాహ్ అందరం ప్రయత్నాలు ప్రారంభిద్దాం!




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## దైవప్రవక్త నూహ్(అ)

డిశంబర్' 2010 నుండి ఒక్కొక్కరిగా అల్లాహ్ పంపిన ప్రవక్తల జీవితచరిత్రను అందించడం ప్రారంభించాము.

**గమనిక :** ఈ వ్యాసం పిల్లలకు అర్థమయ్యే విధంగా ఉండాలని సులభతరం చేసి అందిస్తున్నాము.

మూడవ ప్రవక్త 'ఇద్రీస్'(అ)వారి గురించి వివరంగా క్రిందటి సంచికలో అందించాము. వ్యాసం చివరిలో విగ్రహారాధన ఏ విధంగా ప్రారంభమైనదో చెప్పడం జరిగింది. ఇద్రీస్(అ)వారి తరువాత ప్రజలకు బోధించడానికి అల్లాహ్‌చే పంపబడిన మరో ప్రవక్త 'నూహ్'(అ).

### నూహ్(అ)వారి ప్రజలు - విగ్రహారాధకులు

నూహ్(అ)వారి రాకకు పూర్వం ఎన్నో తరాల నుండి అక్కడి ప్రజలు విగ్రహాలను పూజిస్తూ, వాటినే దైవాలు అనేవారు. అవే తమకు మేలు చేస్తాయని, చెడునుండి రక్షిస్తాయని, తమ అవసరాలు తీర్చే అన్నింటిని అవే సమకూరుస్తాయని నమ్మేవారు. వారు తమ విగ్రహాలకు పెట్టిన పేర్లను క్రింది ఖుర్‌ఆన్ వాక్యం ద్వారా తెలుసుకోవచ్చు.

> "మరియు వారు ఒకరితో నొకరు ఇలా అనుకున్నారు : 'మీరు మీ ఆరాధ్య దైవాలను విడిచి పెట్టకండి. **వద్ద్** మరియు **సువా'అ, య'గూస్, య'ఊద్** మరియు నస్ర్‌లను విడిచిపెట్టకండి!". (ఖుర్‌ఆన్ 71:23)

వాస్తవానికి ఈ ఐదు పేర్లు (వద్ద్, సువా'అ, య'గూస్, య'ఊద్, నస్ర్) - ప్రజల మధ్య నివశించిన ఓ ఐదుగురు ధర్మపరాయణుల పేర్లు. వారి మరణం తరువాత జ్ఞాపకార్థం వారి విగ్రహాలను లేపారు. తరువాయి తరాలకు ఆ విగ్రహాలు ఎందుకు లేపబడ్డాయో కూడా తెలియదు. వారికి తెలిసినదల్లా కేవలం వారి తల్లిదండ్రులు వాటిని పూజించారని మాత్రమే.

ఈ విధంగా విగ్రహారాధన అభివృద్ధి చెందింది.

చెడ్డ పనులకు అల్లాహ్‌చే శిక్షించబడతారని వారికి తెలియదు. వారు నీతిని వదిలి దుర్మార్గంగా మారిపోయారు.

పై విషయాలను బట్టి విగ్రహారాధన ఏ విధంగా ప్రారంభమైందో మీరు అర్థం చేసుకుని ఉంటారు.

ఇబ్నె జరీర్‌గారు చెప్పిన దాని ప్రకారం ఆదమ్(అ) మరియు నూహ్(అ) మధ్య కాలంలో ధర్మపరాయణు లుండేవారు. వారికి శిష్యులుండేవారు. వారు తమ గురువులను ఆదర్శనీయులుగా చేసుకున్నారు.

వారి మరణం తరువాత, వారిని అనుసరించే స్నేహితులు అన్నారు: "మనం వారి విగ్రహాలను తయారు చేసుకుంటే, దాని వలన మన ఆరాధన ఆహ్లాదకరంగా ఉంటుంది మరియు అవి వారిని మనకు గుర్తు చేస్తాయి. వారు విగ్రహాలను నిర్మించారు. వారు మరణించాక వారి తరువాత ఇతరులు వచ్చారు, వారి మనస్సులో ఇబ్లీస్ దూరి చెప్పాడు: 'మీ పూర్వీకులు వీటిని ఆరాధించేవారు మరియు వాటిని పూజించడం వలన వర్షం పొందేవారు'.

ఆ విధంగా వారు ఆ విగ్రహాలను ఆరాధించడాన్ని కొనసాగించారు.

ఇబ్నె అబీ హాతిమ్ వారి ప్రకారం, 'వద్ద్' ధర్మపరాయణుడైన వ్యక్తి. ప్రజలచే ఆయన అభిమానించబడ్డారు. ఆయన మరణం తరువాత బాబిలోనియాలో సమాధి గావించాక వారంతా విచారంలో మునిగి ఉన్నారు. వారి విచారాన్ని చూచి ఇబ్లీస్ మానవరూపంలో వచ్చి 'ఆ వ్యక్తి మరణంతో మీరంతా విచారించడాన్ని చూశాను. ఆయన వంటి ఓ విగ్రహాన్ని తయారు చేయనా? దానిని మీరు సమావేశమయ్యే చోట ఉంచుకోగలిగితే, అది ఆయనని మీకు జ్ఞాపకం చేస్తుంది' అన్నాడు. వారు అన్నారు : 'అలాగే'. కాబట్టి అతడు ఆయన వంటి విగ్రహాన్ని తయారు చేశాడు. వారు దానిని తాము సమావేశమయ్యేచోట అతని

జ్ఞాపకార్థం ఏర్పాటు చేసుకున్నారు. ఆయనను జ్ఞాపకం చేసుకునే వారి ఆసక్తిని గమనించి షైతాన్ అన్నాడు : "మీలోని ప్రతీ ఒక్కరి ఇంటిలో అతని విగ్రహాన్ని ఏర్పాటు చేయనా? మరియు మీరు అతనిని స్మరించగలగడానికి?" వారు అంగీకరించారు. వారి పిల్లలు వారేమి చేస్తున్నారో చూసారు మరియు దాని గురించి తెలుసుకున్నారు. అల్లాహ్‌కు బదులుగా ఆయనని స్మరించడం నేర్చుకున్నారు. ఆ విధంగా అల్లాహ్‌కు బదులుగా మొదట ఆరాధించ బడిన విగ్రహం 'వద్ద్'.

ముందుగా చెప్పుకున్నాం ఐదు విగ్రహాలను ప్రజలు ఆరాధించేవారని. ప్రతీ విగ్రహం ఓ ప్రత్యేక వర్గంచే ఆరాధించబడేది.

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం (సహీహ్ బుఖారీ, 4920, పుస్తకం 65, సూరహ్ నూహ్) ప్రకారం నూహ్ ప్రజలు పూజించిన ఈ విగ్రహాలనే తరువాయి కాలంలో అరబ్బులు కూడా పూజించారు. 'వద్ద్' అనే విగ్రహాన్ని కల్బ్ తెగవారు, 'సువాఅ' విగ్రహాన్ని బనీ హుదైల్ మరియు 'యగూస్'ని మురాద్ తెగ, ఆ తరువాత బనీ ఘుతైఫ్, 'యఊద్' విగ్రహాన్ని హమ్‌దాన్ మరియు 'నస్ర్' విగ్రహాన్ని హిమ్యార్ తెగవారు పూజించేవారు.

వీటన్నింటి బట్టి మనకు స్పష్టంగా తెలిసే విషయమేమిటంటే, షైతాన్ ప్రభావంతో జ్ఞాపకార్థంగా తయారు చేసుకున్న విగ్రహాలనే తరువాయి తరాలలో దైవాలుగా ఆరాధించడం ప్రారంభమైంది. పైన తెలియజేసిన ఉల్లేఖనం (4920) ప్రకారం ప్రజలకు ఆ విగ్రహాలు ఏ విధంగా ఉనికి లోకి వచ్చాయో తెలియకుండా పోయినప్పటివరకూ, అవి ఆరాధించ బడలేదు. ఆ తరువాతే అవి ఆరాధించ బడ్డాయి.

ఆ విధంగా షైతాన్ మానవులను తప్పుదారి పట్టించాడు.

డియర్ చిల్డ్రన్! ప్రతీ సమాజంలో మంచిని బోధించే వారుంటారు. వారు మంచివారేగాని 'ఆరాధ్యులు'కారు. వారిని గౌరవించాలేగాని, వారిని మనం దైవంగా ఆరాధించకూడదు. ఉదాహరణకు మీ టీచర్లు మీకు రోజూ ఎన్నో తెలియని విషయాలను బోధిస్తూ, మీకు జ్ఞానాన్ని అందిస్తారు. వారు మీకు ఎంతో గౌరవనీయులు. కాని వారు ఆరాధనకు యోగ్యులు కారు. ఆరాధించ వలసింది కేవలం 'అల్లాహ్'నే! ఆయన సకల లోకాలను సృష్టించిన సృష్టికర్త.

ఈ సందర్భంగా ఓ ఉల్లేఖనం ఇక్కడ ప్రస్తావించడం సమంజసంగా ఉంటుంది.

ఆయిషా(రజి) ఉల్లేఖనం. ఉమ్మె హబీబా(రజి) మరియు ఉమ్మె సలామా (రజి) ఇథియోపియాలో వారు చూసిన చర్చ్‌లో చిత్రాలు ఉన్నాయని రసూలుల్లాహ్(స)వారితో ప్రస్తావించారు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు చెప్పారు : "**ఆ ప్రజలు వారిలోని ఓ ధర్మ పరాయణుడైన వ్యక్తి మరణిస్తే, అతని సమాధిపై ఓ మస్‌జిద్‌ను నిర్మించేవారు మరియు ఆ చిత్రాలను లోపల చిత్రించేవారు. పునరుత్థాన దినమున అల్లాహ్ ముందు సమస్త మానవాళిలో బహుచెడ్డవారు వీరే అవుతారు.**" (సహీహ్ ముస్లిమ్, 1181, పుస్తకం 5, అధ్యా.3, సంపుటి 2)

విగ్రహారాధన చేసేవారిని అరబీ భాషలో ముష్రిక్‌లు అంటారు. ముష్రిక్‌ల గురించి పూర్తి వివరాలను శాంతిబాట .... సంచికలో చూడండి.

**నూహ్(అ)వారు తన ప్రజలకు చేసిన బోధన :**

ఇద్రీస్(అ) ప్రవక్తగారి తరువాత ప్రజలకు సన్మార్గాన్ని బోధించడానికి పంపబడిన మరో ప్రవక్త - నూహ్(అ). ఆయన ఎంతో సహనం గలవారు. మరియు బాగా ప్రసంగం చేసేవారు. ఆయన తన ప్రజలకు మానవ జీవిత రహస్యాలను వివరించి చెప్పారు. విశ్వంలోని అద్భుతాల గురించి తెలియజేశారు.

రాత్రి పగలును ఏ విధంగా అనుసరిస్తుందో మరియు ఆ రెండు విభిన్నమైన వాటి మధ్య సమతుల్యాన్ని అల్లాహ్ ఏ విధంగా మన మేలు కొరకు ఏర్పాటు చేశారో వివరించేవారు. రాత్రి మనకు చల్లదనాన్ని మరియు విశ్రాంతిని కలుగజేస్తే, పగలు వేడిని మరియు పనులు చురుకుగా జరిగేటట్లు చేస్తుంది. మొక్కలు మరియు జంతువులు జీవిస్తూ తమ పెరుగుదల కొరకు సూర్యుడిని ఉపయోగించుకుంటే, చంద్రుడు మరియు నక్షత్రాలు కాలాన్ని లెక్కించడానికి, దిశలను మరియు ఋతువులను తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి.

ఆకాశాలు మరియు భూమిపై హక్కు కేవలం అల్లాహ్‌దే! కాబట్టి వారికి ఆ ఒక్కడు తప్ప మరొక ఆరాధ్యుడు ఉండకూడదని ప్రజలకు చెప్పేవారు. ఏ విధంగా షైతాన్ వారిని తప్పుదారి పట్టించాడో మరియు షైతాన్ చేసే ఆ మోసాన్ని ఆపవలసిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు. మనిషిని అల్లాహ్ ఏ విధంగా సృష్టించిందీ, ఏ విధంగా పోషిస్తున్నదీ, ఏ విధంగా అనుగ్రహిస్తున్నదీ చెప్పి, విగ్రహారాధన మన మనస్సుకు ఊపిరాడకుండా చేసే అన్యాయం అని, అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని వివరించి చెప్పారు. వారు తమ చెడు మార్గాల నుండి తప్పుకోకుండా ఉంటే వారిపై అల్లాహ్ శిక్ష ఎంత ఘోరంగా ఉంటుందో వర్ణించారు.

**నూహ్ ప్రజలు**

ప్రజలు ఆయన చెప్పింది నిశ్శబ్దంగా విన్నారు. ఆలోచించడం మానేసిన వారి మనస్సులకు ఆయన పలికిన పలుకులు ఓ షాక్‌లా తగిలాయి. ఏ విధంగా అంటే ఓ గోడ క్రింద ఆదమరచి నిద్రపోతున్న వ్యక్తిని ఆ గోడ కూలిపడబోతుందని గబగబా లేపితే ఏ విధమైన షాక్‌కు గురిఅవుతాడో ఆ విధంగా. అతనిని రక్షిద్దామని మనం లేపినప్పటికీ నిద్రలేపినందుకు అతడు కోపగించుకోవచ్చు.

నూహ్(అ)వారు చేసిన హెచ్చరికతో ప్రజలు రెండుగా విడిపోయారు. ఆయన పలుకులు బలహీనుల, పేదవారి మరియు దయనీయ పరిస్థితిలో ఉన్న వారి హృదయాలను స్పృశించాయి. ఆ కారుణ్యం వారి గాయాలకు ఉపశమనం కలిగించింది.

అయితే ధనవంతులకు, శక్తిగలవారికి, నాయకులకు ఆ హెచ్చరిక మొండిగా అనుమానపడేలా చేసింది. వారు నూహ్(అ)వారికి వ్యతిరేకంగా మాట్లాడారు.

## అవిశ్వాసుల వాదనలు

అల్లాహ్ : మరియు వాస్తవానికి మేము నూహ్‌ను అతని జాతివారి వద్దకు పంపాము.

(అతను వారితో అన్నాడు:)

నూహ్ : మీరు అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదు. అలా చేస్తే నిశ్చయంగా ఆ బాధాకరమైన దినమున మీకు పడబోయే శిక్షకు నేను భయపడుతున్నాను.

*అప్పుడు అతని జాతివారిలో సత్యతిరస్కారులైన నాయకులు :*

అవిశ్వాస : నీవు కూడా మా మాదిరిగా ఒక సాధారణ మానవుడివే తప్ప, (నీలో మరే ప్రత్యేకతను మేము చూడటం లేదు) మరియు వివేకం లేని నీచమైన వారు తప్ప ఇతరులు నిన్ను అనసరిస్తున్నట్లు కూడా మేము చూడటం లేదు మరియు మీలో మాకంటే ఎక్కువ ఘనత కూడా మాకు కనబడటం లేదు. అంతేగాక మీరు అసత్యవాదులని మేము భావిస్తున్నాము" అని అన్నారు.

(ఖుర్‌ఆన్ 11:25-27)

అప్పటికే పేదవారు అల్లాహ్ మార్గాన్ని స్వీకరించారు. ధనవంతులైన ఈ నాయకులు విశ్వసించిన ఆ పేదవారితో కలిసి ఉండటానికి ఇష్టపడలేదు. ఆ పేదవారిని వదిలేయమన్నారు. అంటే ఈ నాయకులు అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తం చేయాలంటే, వారితో పాటు పేదవారు ఆ విశ్వాసంలో ఉండకూడదు.

అయితే నూహ్(అ) ఆ విషయంలో చాలా సున్నితంగా స్పందించారు. ప్రవక్తలకు గర్వం ఉండదు. సహనం ఎక్కువ ఉంటుంది. ప్రజలు తప్పుడు మార్గంలో ఉండటం చూసి ప్రవక్తలు చాలా ఆవేదన చెందుతారు.

పేదవారిని నూహ్(అ)వారు ఎలా పంపించేస్తారు? వారు ఆయన యొక్క అతిథులు కాదు కదా! వారు అల్లాహ్‌కు అతిథులు.

నూహ్ : మరియు ఓ నా జాతి ప్రజలారా! నేను దానికోసం మీ నుండి ధనాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం అల్లాహ్ దగ్గరనే ఉంది. మరియు నేను విశ్వసించిన వారిని త్రోసి వేయలేను. నిశ్చయంగా, వారైతే తమ ప్రభువును కలుసుకుంటారు, కాని నిశ్చయంగా నేను మిమ్మల్ని మూఢజనులుగా చూస్తున్నాను.

మరియు ఓ నా జాతి ప్రజలారా! ఒకవేళ నేను వారిని (విశ్వాసులను) గెంటివేస్తే నన్ను అల్లాహ్ (శిక్ష) నుండి, ఎవడు కాపాడగలడు? ఏమీ? మీరిది గ్రహించలేరా?

మరియు నా వద్ద అల్లాహ్ నిధులు ఉన్నాయని గానీ మరియు నాకు అగోచర జ్ఞానమున్నదని గానీ నేను మీతో అనటం లేదు, మరియు నేను దైవదూతనని కూడా అనటం లేదు మరియు మీరు హీనంగా చూసేవారికి అల్లాహ్ మేలు చేయలేడని కూడా అనటం లేదు. వారి మనస్సులలో ఉన్నది అల్లాహ్‌కు బాగా తెలుసు. అలా అయితే! నిశ్చయంగా, నేను దుర్మార్గులలో చేరినవాడనే!"

అల్లాహ్ తనకు అనుగ్రహించిన నైతిక జ్ఞానంతో నూహ్(అ)వారు అవిశ్వాస నాయకుల వాదనను చాలా సున్నితంగా తిప్పి కొట్టారు.

వారు నూహ్(అ)తో వాదించి వాదించి అలసిపోయారు. వారి గురించి అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఇలా తెలియజేస్తున్నారు :

వారు : అన్నారు: "ఓ నూహ్! నీవు మాతో వాదించావు. చాలా వాదించావు. ఇక నీవు సత్యవంతుడవే అయితే, నీవు భయపెట్టే ఆ (శిక్షను) మాపై దింపు!"

నూహ్ : అల్లాహ్ కోరితే నిశ్చయంగా, దానిని (ఆ శిక్షను) మీపైకి తెస్తాడు మరియు మీరు దాని నుండి తప్పించుకోలేరు!

ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని తప్పుదారిలో విడిచిపెట్టాలని కోరితే, నేను మీకు మంచి సలహా ఇవ్వాలని ఎంత కోరినా, నా సలహా మీకు లాభదాయకం కాజాలదు. ఆయనే మీ ప్రభువు మరియు ఆయన వైపునకే మీరంతా మరలి పోవలసి ఉన్నది. (ఖుర్‌ఆన్ 11:32-34)

వారికింకా చెప్పడానికి ఏమీ లేదు. మొరటుగా మారిపోయారు.

వారు : నిశ్చయంగా, మేము నిన్ను స్పష్టమైన తప్పుదారిలో చూస్తున్నాము!

నూహ్(అ)వారు ప్రవక్త స్థాయిలో ఉత్తమంగా స్పందించారు.

నూహ్ : నా జాతి ప్రజలారా! నాలో ఏ తప్పిదం లేదు. మరియు వాస్తవానికి నేను సర్వలోకాల ప్రభువు యొక్క ప్రవక్తను. నా ప్రభువు సందేశాలను మీకు అందజేస్తున్నాను మరియు (ధర్మ) బోధ చేస్తున్నాను. ఎందుకంటే! మీకు తెలియని విషయాలు అల్లాహ్ తరఫునుండి నాకు తెలుస్తున్నాయి.

(ఖుర్‌ఆన్ 7:60-62)

తన జాతి ప్రజలను నూహ్(అ) వదలలేదు. వారికి ధర్మబోధ చేస్తున్నారు. ఉదాహరణలు ఇస్తూనే ఉన్నారు. ఆయన వారిని అల్లాహ్‌వైపు ఎప్పుడు పిలిచినా వారు ఆయన నుండి పారిపోయేవారు.

## నూహ్(అ)వారు చేసిన మనవి

... ఓ నా జాతి ప్రజలారా! నిశ్చయంగా, నేను మీకు స్పష్టంగా హెచ్చరిక చేయటానికి వచ్చిన వాడిని. కావున మీరు అల్లాహ్‌నే ఆరాధించండి మరియు ఆయన యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి.

అలా చేస్తే ఆయన మీ పాపాలను క్షమిస్తాడు. మరియు ఒక నియమిత కాలం వరకు మిమ్మల్ని వదలిపెడ్తాడు. నిశ్చయంగా అల్లాహ్ నిర్ణయించిన కాలం వచ్చినపుడు, దానిని తప్పించడం సాధ్యం కాదు. ఇది మీరు తెలుసుకుంటే ఎంత బాగుండేది! అతను ఇలా ప్రార్థించాడు: ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నేను నా జాతి వారిని రేయింబవళ్ళు పిలిచాను.

కాని నా పిలుపు, వారి పలాయనాన్ని మాత్రమే హెచ్చించింది.

మరియు వాస్తవానికి నీ క్షమాభిక్ష వైపునకు పిలిచినప్పుడల్లా, వారు తమ చెవులలో వ్రేళ్ళు దూర్చుకునేవారు మరియు తమ వస్త్రాలను తమపై కప్పుకునే వారు మరియు వారు మొండి వైఖరి అవలంబిస్తూ దురహంకారంలో మునిగి ఉండేవారు.

తరువాత వాస్తవానికి నేను వారిని ఎలుగెత్తి పిలిచాను. ఆ తరువాత వాస్తవంగా, నేను వారికి బహిరంగంగా చాటి చెప్పాను మరియు ఏకాంతంలో, రహస్యంగా కూడా పిలిచాను. ఇంకా వారితో ఇలా అన్నాను: మీ ప్రభువును క్షమాపణకై వేడుకోండి, నిశ్చయంగా ఆయన ఎంతో క్షమాశీలుడు.

ఆయన మీపై ఆకాశం నుండి ధారాళంగా వర్షాన్ని కురిపింప జేస్తాడు. మరియు మీకు ధనసంపదలలోను మరియు సంతానంలోను వృద్ధినిస్తాడు మరియు మీకొరకు తోటలను ఉత్పత్తి చేస్తాడు మరియు నదులను ప్రవహింపజేస్తాడు.

మీకేమయింది? మీరు అల్లాహ్ మహత్యాన్ని ఎందుకు ఆదరించరు? మరియు వాస్తవానికి ఆయనే, మిమ్మల్ని విభిన్న దశలలో సృష్టించాడు. ఏమీ? మీరు చూడటం లేదా? అల్లాహ్ ఏడు ఆకాశాలను ఏ విధంగా అంతస్తులలో సృష్టించాడో!

మరియు వాటి మధ్య చంద్రుణ్ణి (ప్రతిబింబించే) కాంతిగాను మరియు సూర్యుణ్ణి (వెలిగే) దీపంగాను చేశాడు!

మరియు అల్లాహ్‌యే మిమ్మల్ని భూమినుండి మొలకల వలే ఉత్పత్తి చేశాడు!

తరువాత ఆయన మిమ్మల్ని అందులోకే తీసుకుని పోతాడు మరియు మిమ్మల్ని దాని నుండి (బ్రతికించి) బయటకి తీస్తాడు!

మరియు అల్లాహ్‌యే మీ కొరకు భూమిని విస్తరింపజేశాడు. మీరు దానిపై నున్న విశాలమైన మార్గాలలో నడవటానికి.

నూహ్ ఇంకా ఇలా విన్నవించుకున్నాడు : ''ఓ నా ప్రభూ! వాస్తవానికి వారు నా మాటను ధిక్కరించారు. మరియు వాడిని అనుసరించారు, ఎవడి సంపద మరియు సంతానం వారికి కేవలం నష్టం తప్ప మరేమి అధికం చేయదో!

మరియు వారు పెద్ద కుట్ర పన్నారు. మరియు వారు ఒకరితో నొకరు ఇలా అనుకున్నారు : 'మీరు మీ ఆరాధ్యదైవాలను విడిచిపెట్టకండి. వద్ద్ మరియు సువా'అ, య'గూస్, య'ఊఖ్ మరియు నస్ర్‌లను విడిచి పెట్టకండి!

మరియు వాస్తవానికి, వారు చాలా మందిని తప్పుదారిలో పడవేశారు. కావున (ఓ నా ప్రభూ!): ''నీవు కూడా ఈ దుర్మార్గులకు కేవలం వారి మార్గభ్రష్టత్వాన్నే హెచ్చించు!'' (ఖుర్'ఆన్ 71:2-24)

## ఎంతకాలం ప్రజలకు హితబోధ చేశారు?

నూహ్(అ)వారు ఎంతో సున్నితంగా, సౌమ్యంగా చెప్పినా ప్రజలు వినడం లేదని తెలుసుకున్నారు కదా! వీళ్ళు ఇంతే! ఇక నా మాట వినరు అని చిరాకుపడి వారిని వదిలేశారా? వారిని తిట్టారా? లేదు. అటువంటిదేమీ నూహ్(అ)వారు చేయలేదు. ప్రవక్తలంటే మానవులలో కెల్లా ఉత్తములు. వారికి అల్లాహ్ ఎనలేని సహనం అనుగ్రహిస్తారు.

నూహ్(అ)వారు 950 సంవత్సరాల సుదీర్ఘ కాలం జీవించారు. అల్లాహ్ ఆదేశం వచ్చిన దగ్గరనుండి మరణించే వరకూ ఆయన ప్రజలకు హితబోధ చేశారు. ఇప్పటి మనుష్యులు 150 సం॥లు కూడా దాటి బ్రతకలేరు. ఎన్నోవేల సంవత్సరాల క్రితం ప్రవక్తల జీవితకాలం ఎక్కువగా ఉండేది. చివరి ప్రవక్త ముహమ్మద్(స)వారు 63 సంవత్సరాలు మాత్రమే జీవించారు.

**"మరియు వాస్తవానికి, మేము నూహ్‌ను అతని జాతివారి వద్దకు పంపాము. అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాల వరకు (వారిని అల్లాహ్ ధర్మం వైపుకు ఆహ్వానిస్తూ) నివశించాడు. చివరకు వారు దుర్మార్గాన్ని విడనాడనందుకు, వారిని తుఫాను పట్టుకున్నది"** (ఖుర్'ఆన్ 29:14)

అయితే, నూహ్(అ)వారు 950 సంవత్సరాలు జీవించినట్లే, అక్కడి ప్రజలంతా జీవించారని అనుకోవద్దు. తరాలు గడుస్తున్నాయి. కొందరు చనిపోయారు. మరికొందరు జన్మించారు. తల్లిదండ్రుల తిరస్కారాన్నే బిడ్డలు కూడా అనుసరించారు. విశ్వాసుల సంఖ్య పెరగడానికి బదులు సత్యాన్ని తిరస్కరించేవారి సంఖ్య పెరిగింది. తన ప్రజల విషయంలో ఆయనకు విచారం పట్టుకుంది. కాని అప్పటి వరకూ నిరాశ చెందలేదు.

## సత్య తిరస్కారుల ముగింపు కొరకు ప్రార్థన

ప్రవక్తల ఆవేదన చూసి చలించేది కరుణామయుడైన అల్లాహ్‌యే కదా! ఆయనే తన ప్రవక్తలను ఓదార్చుతారు. ఇక ఎవ్వరూ విశ్వసించరనే విషయాన్ని నూహ్(అ)కి అల్లాహ్ తెలియజేశారు.

మరియు నూహ్‌కు ఇలా సందేశం (వహీ) పంపబడింది: ''నిశ్చయంగా నీ జాతివారిలో ఇంతవరకు విశ్వసించిన వారు తప్ప ఇతరులెవ్వరూ విశ్వసించరు, కావున వారు చేసే కార్యాలకు నీవు చింతించకు! మరియు నీవు మా సమక్షంలో మా సందేశానుసారంగా, ఒక ఓడను నిర్మించు మరియు దుర్మార్గులను గురించి నన్ను అడుగకు. నిశ్చయంగా, వారు ముంచి వేయబడతారు.'' (ఖుర్'ఆన్ 11:36-37)

నూహ్(అ)వారికి తన ప్రజల గురించి ఇక బాధపడనవసరం లేదని తెలిసింది. క్రింది విధంగా అల్లాహ్‌ను ఆయన ప్రార్థించారు.

''... ఓ నా ప్రభూ! సత్య తిరస్కారులలో ఒక్కరిని కూడా భూమి మీద వదలకు. ఒకవేళ నీవు వారిని వదిలిపెడితే, నిశ్చయంగా వారు నీ దాసులను మార్గభ్రష్టత్వంలో పడవేస్తారు. మరియు వారు పాపులను మరియు కృతఘ్నులను మాత్రమే పుట్టిస్తారు.'' (ఖుర్'ఆన్ 71:26-27)

నూహ్(అ)వారి ప్రార్థనను అల్లాహ్ స్వీకరించారు. కేసు ముగిసి పోయింది. అల్లాహ్ తన తీర్పును 'వరద' రూపంలో ఇచ్చారు. ఓ ఓడను అతనికి అనుగ్రహించిన జ్ఞానంతో మరియు ఆదేశాలతోనూ మరియు

దైవదూతల సహకారంతో నిర్మించమని తన దాసుడైన నూహ్(అ)కు అల్లాహ్ ఆదేశించారు :

"మరియు నీవు మా సమక్షంలో, మా సందేశానుసారంగా, ఓ ఓడను నిర్మించు మరియు దుర్మార్గులను గురించి నన్ను అడగకు. నిశ్చయంగా, వారు ముంచి వేయబడతారు".

**ఓడ నిర్మాణం**

నూహ్(అ)వారు ఊరి చివరిలో ఓ ప్రదేశాన్ని ఎన్నుకున్నారు. ఆ ప్రదేశం సముద్రానికి చాలా దూరం. ఆయన కలప(wood)ను మరియు పనిముట్లను (tools) సేకరించుకుని ఓడ నిర్మాణం కొరకు రాత్రి పగలు పనిచేయడం ప్రారంభించారు. ప్రజలు ఆయనను వెక్కిరించడం ప్రారంభించారు. సముద్రానికి ఎంతో దూరంగా ఉన్నచోట ఓడను నిర్మించడాన్ని చూచి వెక్కిరించేవారు.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా చెబుతున్నారు :

మరియు నూహ్ ఓడ నిర్మిస్తూ ఉన్నప్పుడు, ప్రతిసారి అతని జాతి నాయకులు అతని ఎదుట నుండి పోయేటప్పుడు, అతనితో పరిహాసాలాడేవారు. అతను (నూహ్) వారితో అనేవాడు : **"ఇప్పుడు మీరు మాతో పరిహాసాలాడుతున్నారు, నిశ్చయంగా మీరు పరిహాసాలాడినట్లే, మేము కూడా మీతో పరిహాసాలాడతాము. అవమానకరమైన శిక్ష ఎవరిపైకి వస్తుందో మరియు శాశ్వతమైన శిక్ష ఎవరిపై పడుతుందో త్వరలోనే మీరు తెలుసుకుంటారు"** (ఖుర్ఆన్ 11:38-39)

**వరద ప్రారంభం**

ఓడ నిర్మించబడింది. నూహ్(అ)వారు అల్లాహ్ ఆదేశం కొరకు నిరీక్షిస్తున్నారు. వరద ఎప్పుడు ప్రారంభం అవుతుందో ముందుగానే నూహ్(అ)వారికి సూచన ఇవ్వబడింది. నూహ్(అ)వారి ఇంటిలోని పొయ్యి నుండి అద్భుతంగా నీరు ఉబికి వస్తుంది. అదే సూచన!

ఆ భయంకరమైన రోజు రానే వచ్చింది. సూచన స్పష్టంగా కనబడింది. నూహ్(అ)వారు శీఘ్రంగా ఓడను సిద్ధం చేసి విశ్వాసులను పిలిచారు. ఆయనతో పాటుగా ప్రతీ జంతువు, పక్షి మొదలైన ఎన్నో జీవుల ఆడ, మగ జంటలను తనతో పాటు తీసుకువెళ్ళారు. ఆయన ఆ విధంగా తీసుకు వెళ్ళడాన్ని చూసి సత్య తిరస్కారులు గట్టిగా నవ్వారు.

"చివరకు మా ఆజ్ఞ రానే వచ్చింది మరియు పొయ్యి పొంగింది (జల ప్రవాహాలు భూమిని చీల్చుకుని రాసాగాయి). అప్పుడు మేము (నూహ్‌తో) అన్నాము : ప్రతి జాతి (పశువుల) నుండి రెండు (ఆడ-మగ) జంటలను మరియు నీ కుటుంబంవారిని - ఇది వరకే సూచించబడినవారిని తప్ప - మరియు విశ్వసించిన వారిని అందరినీ దాని (ఓడ)లోకి ఎక్కించుకో! అతనిని విశ్వసించినవారు కొందరు మాత్రమే!"

**విశ్వాసుల సంఖ్య**

నూహ్(అ)వారి భార్య విశ్వాసి కాదు. ఆమె ఆయనతో ఓడ ఎక్కలేదు. నూహ్(అ)వారి కుమారులలో ఒకడు కూడా విశ్వసించ లేదు. తండ్రి ముందు విశ్వాసిగా ఉంటూ, రహస్యంగా సత్య తిరస్కారాన్ని ప్రదర్శించేవాడు. ప్రజలలో ఎక్కువమంది అవిశ్వాసులే!

అయితే ఓడ మీద ఎంతమంది ఉన్నారనే విషయం స్పష్టంగా తెలియదు. వారి సంఖ్య 100 కంటే తక్కువ అనేది మాత్రం స్పష్టం. ఇబ్నె అబ్బాస్(రజి)వారి ప్రకారం వారు 80 మంది. కాబ్ అల్ అహ్‌బర్ వారి ప్రకారం 72 మంది. కొందరు చెప్పినదానిని బట్టి వారు 10 మంది మాత్రమే.

**వరద**

భూమి పగుళ్ళ నుండి నీరు పొంగింది, ఆ విధంగా నీరు రాని పగులు అనేది భూమి మీద లేదు. అంతకు ముందెన్నడూ చూడని విధంగా ఆకాశం నుండి వర్షం కుంభవృష్టిగా కురుస్తూనే ఉంది. ఈ పరిస్థితి ఆ విధంగా కొనసాగుతూనే ఉంది. గంటగంటకు నీటిమట్టం పెరుగుతుంది. నేలను సముద్రాలు లోబరచుకున్నాయి. తొలిసారి నేల అంతా మునిగిపోయింది.

**నూహ్(అ) తన కుమారునికి చేసిన మనవి:**

మరియు (నూహ్) అన్నాడు : "ఇందులోకి ఎక్కండి అల్లాహ్ పేరుతో దీని పయనం మరియు దీని ఆగటం. నిశ్చయంగా నా ప్రభువు క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత."

మరియు అది వారిని పర్వతాల వలే ఎత్తైన అలలలోనికి తీసుకొని పోసాగింది. అప్పుడు నూహ్ (పడవ నుండి) దూరంగా ఉన్న తన కుమారుణ్ణి పిలుస్తూ (అన్నాడు) : "ఓ నా కుమారా! మాతోపాటు (ఓడలోకి) ఎక్కు అవిశ్వాసులలో కలిసిపోకు!"

మరియు (అతని కుమారుడు) అన్నాడు : "నేను ఒక కొండపైకి ఎక్కి శరణు పొందుతాను, అది నన్ను నీళ్ళనుండి కాపాడుతుంది." (నూహ్) అన్నాడు : "ఈ రోజు అల్లాహ్ తీర్పుకు విరుద్ధంగా కాపాడేవాడు ఎవ్వడూ లేడు. ఆయన (అల్లాహ్)యే కరుణిస్తే తప్ప!" అప్పుడే వారి మధ్య ఒక కెరటం రాగా అతడు కూడా మునిగిపోయే వారిలో కలిసిపోయాడు. (ఖుర్ఆన్ 11:41-43)

(పైన తెలిపిన నూహ్ కుమారుడు నాలుగవ వాడు. అతని పేరు యామ్ మరియు అతని ఇంటి పేరు కనాన్‌గా పేర్కొనబడింది. అతడు సత్యతిరస్కారి కాబట్టి ఓడలో ఎక్కలేదు. కాని ముస్లిమైన అతని భార్య తన పిల్లలతో ఎక్కారు.)

**వరద తగ్గింది**

ఆ తరువాత ఆజ్ఞ వచ్చింది : "ఓ భూమీ! నీ నీళ్ళను మ్రింగివేయి. ఓ ఆకాశమా! (కురవటం) ఆపివేయి!" అప్పుడు నీరు (భూమిలోకి) ఇంకి పోయింది. (అల్లాహ్) తీర్పు నెరవేరింది. ఓడ జూదీ కొండమీద ఆగింది. మరియు అప్పుడు : "దుర్మార్గుల జాతివారు దూరమై పోయారు!" అని అనబడింది.

జూదీ కొండ కుర్దిస్తాన్‌లో, ఇబ్నె ఉమర్ ద్వీపానికి ఈశాన్య భాగంలో దాదాపు 25 మైళ్ళ దూరంలో ఉంది.

మరియు నూహ్ తన ప్రభువును వేడుకుంటూ అన్నాడు: 'ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నా కుమారుడు నా కుటుంబంలోని వాడు! నీ వాగ్దానం సత్యమైనది మరియు నీవే సర్వోత్తమ న్యాయాధికారివి."

ఆయన (అల్లాహ్) జవాబిచ్చాడు : "ఓ నూహ్! అతడు నిశ్చయంగా, నీ కుటుంబంలోని వాడు కాడు. నిశ్చయంగా, అతని పనులు మంచివి కావు. కావున నీకు తెలియని విషయం గురించి నన్ను అడుగకు. నీవు కూడా మూఢులలో చేరినవాడవు కావద్దని నేను నిన్ను ఉపదేశిస్తున్నాను".

(నూహ్) ఇలా విన్నవించుకున్నాడు : 'ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నాకు తెలియని విషయాన్ని గురించి నిన్ను అడిగినందుకు, నేను నీ శరణు వేడుకుంటున్నాను. మరియు నీవు నన్ను క్షమించకపోతే, నన్ను కరుణించకపోతే, నేను నష్టపోయిన వారిలో చేరుతాను."

ఇలా ఆజ్ఞ ఇవ్వబడింది : "ఓ నూహ్! నీవు మరియు నీతో ఉన్న నీజాతి వారు శాంతి మరియు మా ఆశీర్వాదాలతో (ఓడ / జూదీ పర్వతం నుండి) దిగండి. వారిలోని కొన్ని సంఘాలకు మేము కొంతకాలం వరకు సుఖసంతోషాలను ప్రసాదించగలము. ఆ తరువాత మా వద్దనుండి బాధాకరమైన శిక్ష వారిపై పడుతుంది."
(ఖుర్ఆన్ 11:44-48)

అల్లాహ ఆదేశంతో నేలపై మరలా ప్రశాంత వాతావరణం ఏర్పడింది. నీరు వెనక్కి మరలింది. సూర్య కిరణాలతో పొడినేల తిరిగి కనిపించింది. ఆ వరద సత్య తిరస్కారులను మరియు బహుదైవారాధకులను తుడిచి పెట్టుకుపోయింది.

నూహ్(అ) తనతో తీసుకువచ్చిన పశువులను, జంతువులను, పక్షులు మొదలైన వాటన్నింటిని విడుదల చేశారు. అవి భూమిపైకి నలుదిక్కులా వెళ్ళిపోయాయి. తరువాత విశ్వాసులు క్రిందికి దిగారు. నూహ్(అ) సజ్దా చేశారు. వారు నేలపై అగ్నిని రాజేసి దాని చుట్టూ కూర్చున్నారు. అంతకాలం వారు ఓడలో నిప్పురగిలించలేదు. అల్లాహ్‌కు కృతజ్ఞతగా ఆ రోజు వారు ఉపవాసమున్నారు.

### నూహ్(అ)వారి మరణం

మరణశయ్యపై తన కుమారులను పిలిచి హితబోధ చేశారు. అల్లాహ్‌కు సహవర్తులుగా ఎవరినీ చేయవద్దని, అహంకారాన్ని వ్యతిరేకించమని బోధించారు. ఏడు ఆకాశాలను, ఏడు భూములను త్రాసులో ఒక వైపు ఉంచి, రెండవ వైపు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (లేడు ఆరాధ్యుడు అల్లాహ్ తప్ప) అనే వచనాన్ని ఉంచితే అటువైపు త్రాసు మొగ్గు చూపుతుందని బోధించారు.

కొందరు ఉల్లేఖకులు ఆయన సమాధి మక్కాలో ఉందని, కొందరు ఇరాఖ్‌లోని బాలబక్‌లో ఉందని చెప్పారు.

డియర్ చిల్డ్రన్! ఇంత వరకూ అల్లాహ్ ప్రవక్తయైన 'నూహ్(అ)' వారి జీవిత చరిత్రను చదివారు.

నూహ్(అ)వారి జీవిత చరిత్ర గురించి ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అన్నారు :

**నిశ్చయంగా, ఇందులో సూచనలున్నాయి. మరియు నిశ్చయంగా మేము పరీక్షకు గురిచేస్తూ ఉంటాము.** (ఖుర్ఆన్ 23:30)

చదివారు కదా! మీకు అర్థమైన ఆ సూచనలేమిటి? ఆలోచించండి. ఆ తరువాత క్రింద ఇచ్చిన వివరాలను చదవండి.

- అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని నూహ్(అ)వారు చెప్పిన తరువాత అతని జాతి ప్రజలు వినలేదు. సత్యాన్ని తిరస్కరించారు. వందల సంవత్సరాలు సుదీర్ఘకాలం పాటు ఆయన ప్రజలకు సత్యాన్ని బోధిస్తూనే ఉన్నారు. అయినా సరే వారు వినలేదు.
- పేదవారు మాత్రమే ఎందుకు విశ్వసిస్తున్నారు? ధనవంతులు తమ ఐశ్వర్యాన్ని చూసుకుని గర్వపడతారు. గర్వం వలన మనిషి సత్యాన్ని అర్థం చేసుకోలేడు. నూహ్(అ) తన బిడ్డలకు అదే బోధించారు. ధనవంతులకు ఐశ్వర్యం ఇచ్చింది అల్లాహ్‌యే! పేదవారికి పేదరికం కలిగించింది అల్లాహ్‌యే! అది వారికి పెట్టిన పరీక్ష!
- పరీక్షలో నెగ్గే విశ్వాసులకు అల్లాహ్ సుఖసంతోషాలను వాగ్దానం చేస్తున్నారు. ఎవరికి అర్థమైనా, కాకపోయినా, చదువుకునే మీకు పరీక్ష గురించి బాగా అర్థమౌతుంది. మీరంతా బాగా చదువుకుని మీకు నచ్చిన ఓ ఫీల్డ్‌లో జాయినై పరీక్షలో పాసయితే, మంచి ఉద్యోగాన్ని పొంది ఏ విధంగా సుఖాన్ని అనుభవిస్తారో, అదే విధంగా అల్లాహ్ పెట్టే పరీక్షలో పాసయితే ఈ లోకంలోనూ మరియు మన శాశ్వత నివాసమైన పరలోకంలోనూ సంతోషంగా ఉండవచ్చు.
- నూహ్(అ)వారు అన్ని వందల సంవత్సరాలు అల్లాహ్ ధర్మంవైపు ప్రజలను పిలిస్తే, ఆయనతో పాటు ఓడలో ఎక్కినవారు కనీసం 100 మంది కూడా లేరు. సంఖ్య ముఖ్యం కాదు. కాబట్టి మీరు కూడా సత్యాన్ని తోటివారికి చెబుతూ ఉండండి. సహనంతో విసుక్కోకుండా చెప్పండి. మీ జీవితకాలంలో మీరు చెప్పినదానిని ఒక్కరైనా అంగీకరించవచ్చు.
- కుటుంబమంతా అల్లాహ్‌ని విశ్వసిస్తే చాలా బావుంటుంది. నూహ్(అ)వారి భార్య మరియు ఒక కుమారుడు ఓడలోకి ఎక్కలేదు. వారు సత్యాన్ని తిరస్కరించారు. సత్య తిరస్కారియైన తన కుమారుడి కోసం నూహ్(అ) దువా చేసుకుంటే, అల్లాహ్ మందలించారు. అతడు నూహ్(అ)వారి కుటుంబంలోని వాడు కాదన్నారు. కాబట్టి కుటుంబంలో ఎవరైనా అల్లాహ్‌ను విశ్వసించకుండా చనిపోతే వారి కొరకు మనం దువా చేయలేము.
- తన కుమారుడు సత్య తిరస్కారి అయిపోయి నీటిలో మునిగి పోతున్నప్పుడు ఆ తండ్రికి ఎంత బాధ కలిగి ఉంటుందో! మీరు మాత్రం మీ పేరెంట్స్ బాధపడకుండా, అల్లాహ్‌ను విశ్వసించి ఆయన ఆదేశాల ప్రకారం ఆచరించండి. మీ తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించండి.
- సముద్రానికి దూరంగా నేలపై ఓడను తయారు చేస్తుంటే, వారు

నూహ్(అ)ని వెక్కిరించారు. ఆ విధంగా వెక్కిరించినవారు చివరికి నాశనమయ్యారు.

- మీరు మాత్రం ఎవ్వరినీ వెక్కిరించకండి. మీకు చేతనైతే సహకరించండి. వారిని సంస్కరించండి. వెక్కిరించడం విశ్వాసుల (believers) లక్షణం కాదు.

క్రింది ఖుర్'ఆన్ వాక్యం చదవండి :

**"ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. బహుశా వారే (ఎగతాళి చేయబడేవారే) వీరికంటే శ్రేష్ఠులు కావచ్చు ! ...."**

(ఖుర్'ఆన్ 49:11)

**నూహ్(అ)వారికి అల్లాహ్ నేర్పిన దువాలు**

ఆ తరువాత నీవు మరియు నీతో ఉన్నవారు నావలోకి ఎక్కిన పిదప ఇలా ప్రార్థించండి :

**'సర్వ స్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే, ఆయనే మమ్మల్ని దుర్మార్గుల నుండి విమోచనం కలిగించాడు.'**

ఇంకా ఇలా ప్రార్థించు :

**"ఓ నా ప్రభూ! నన్ను శుభప్రదమైన గమ్యస్థానంలో దించు. గమ్యస్థానానికి చేర్పించే వారిలో నీవే సర్వోత్తముడవు!"**

(ఖుర్'ఆన్ 23:28-29)

కాబట్టి మీరు ఎక్కడైనా ప్రయాణం చేసేముందు క్రింది దువాను చదవండి :

رَبِّ أَنزِلْنِى مُنزَلًا مُّبَارَكًا وَأَنتَ خَيْرُ الْمُنزِلِينَ

**"ఓ నా ప్రభూ! నన్ను శుభప్రదమైన గమ్యస్థానంలో దించు. గమ్యస్థానానికి చేర్పించే వారిలో నీవే సర్వోత్తముడవు!"**

**"My Lord! Cause me to land at a blessed landing place, for You are the Best of those who bring to land."**

(మరొక ప్రవక్తగారి గురించి ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...)

**అతి ముఖ్యమైన మరొక విషయం :**

విశ్వాసులు అతి కొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారు ఓడలోకి ఎక్కారు. అంటే వారు కొద్దిమంది అయినప్పటికీ అల్లాహ్ ఆదేశాన్ని ఆచరణలో చూపారు. మిగిలినవారంతా సత్యాన్ని (అల్లాహ్‌ని) తిరస్కరించిన వారు.

విశ్వసించిన కొద్దిమంది తప్ప మిగిలిన మానవాళి అంతా నీటిలో మునిగి నాశనమైంది. అల్లాహ్ నుండి శిక్షను తీసుకురా అంటూ సవాల్ చేసిన వారంతా నాశనమయ్యారు.

అల్లాహ్ వెంటవెంటనే శిక్షలను పంపిస్తే, భూమిపై ఎవరూ ఉండరు. ఆయన కొంత సమయం ఇస్తారు. తమను తాము సంస్కరించుకోవలసింది ఇచ్చిన ఆ సమయంలోనే. అల్లాహ్ శిక్ష వచ్చాక, దాని నుండి ఎవరూ తప్పించుకోలేరు.

సునామీ వస్తుందని ఎవరూ ఊహించలేదు. సునామీ రావడం ఎంతోమంది సర్వనాశనమయ్యారు.

నేటి సమాజంలో కూడా అవినీతి పెరిగిపోయింది. సత్యానికి విలువ ఇవ్వడం లేదు. ఎక్కడ చూసినా మోసం, అసత్యాలు. అల్లాహ్‌ను నిజంగా విశ్వసించిన వారి సంఖ్య చాలా తక్కువ. సత్య తిరస్కారుల సంఖ్యే చాలా ఎక్కువ ఉంది.

ఆనాటి నూహ్(అ)వారి జాతికంటే మెరుగైన స్థితిలో ఏమీ లేదు నేటి సమాజం.

కాబట్టి అల్లాహ్ ఏదో ఒక శిక్షను పంపి నాశనం చేయవచ్చు. దాని నుండి మనం తప్పించుకోలేము. తప్పించుకోవాలంటే ఒకటే మార్గం. మనం నిజమైన విశ్వాసులు కావడం. అల్లాహ్ ఖుర్'ఆన్ ఆదేశించినట్లు, ముహమ్మద్(స)వారికి విధేయత చూపుతూ జీవించడం మరియు ఇతరులకు సహనంతో, సౌమ్యంగా అల్లాహ్ మార్గం గురించి తెలియజేయడం.

డియర్ చిల్డ్రన్! ఆలోచించండి.

# సంవత్సర చందా కొరకు మనవి

**గత సంవత్సరం జూలై, 2010 సంచికతో సంవత్సర చందా పూర్తయిన సోదర సోదరీమణులకు ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశాము. వారు సహృదయంతో వీలు చూచుకుని పంపిస్తామని చెప్పారు. ఇంకనూ చాలామంది నుండి సంవత్సర చందా రావలసి ఉంది. ఈ సంచికతో మరో పది నెలలు కూడా పూర్తయ్యాయి. దయచేసి చందా పంపవలసిన వారు రు. 200 లు M.O. (మనియార్డర్) ద్వారా గాని లేదా క్రింద ఇచ్చిన ఎకౌంట్‌లో డిపాజిట్ చేయమని కోరుతున్నాము. మీ ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి. ఎడ్రస్ మరింత వివరంగా తెలియజేయండి. గత మార్చి మరియు ఏప్రిల్ నెలలలో చందాదారులుగా చేరినవారి చందా కాలం కూడా పూర్తయింది. వారికి కూడా చందా పంపమని విజ్ఞప్తి చేస్తున్నాము.**

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిక్కు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్‌ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వందంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్ధం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

16

## శీర్షిక ముగింపు వ్యాసం (ఆఖరి భాగం)

### డేవిడ్ కోల్మన్ హెడ్లీ ఎవరు ? అమెరికా తయారుచేసిన తీవ్రవాదా?

క్రిందటి సంచికలో 'ఒసామా బిన్ లాడెన్' పేరుతో అమెరికా ప్రపంచ వ్యాప్తంగా చేసిన నరమేథాన్ని, అమెరికా మోసాన్ని మరియు ఆ దేశానికున్న మత దురభిమానాన్ని ఆధారాలతో సహా అందించాము. ప్రపంచానికి పెనుముప్పు అమెరికా నుండే ఉంది. అమెరికా రాక్షస దాడులకు అడ్డే లేకుండా పోయింది. ప్రపంచ మీడియాను ఓ మత వర్గంవారు శాసిస్తున్నారు. అది జగమెరిగిన సత్యం. వారిని కాదని ధైర్యంగా నిజాలు వ్రాయగలిగే సత్తా నేటి మీడియాకు లేదు.

'ఒసామా బిన్ లాడెన్' విషయంలో అమెరికా ప్రభుత్వం మీడియా సహకారంతో ప్రపంచ ప్రజలను తప్పుదారి పట్టించి మోసం చేసింది. బిన్ లాడెన్ విషయాన్ని ఇండియన్ టి.వి. సీరియల్ లాగ సాగదీయడం అమెరికా అధ్యక్షులుకి కష్టం అవుతున్న నేపథ్యంలో కొత్తగా తెరపైకి మరొకరిని తీసుకువచ్చారనే అనుమానాలు బలంగా ఉన్నాయి. అతడి పేరు : **డేవిడ్ కోల్మన్ హెడ్లీ.**

**ఇతని చరిత్ర అంత నేరమయమే! డబ్బు కోసం ఏదైనా చేస్తాడు.**

ఈ హెడ్లీ విషయంలో అమెరికా ఎన్నో కథలు చెప్పింది. హెడ్లీ విషయంలో అమెరికా నడిపిన నాటకం కూడా బయటపడింది. తొలి విజయం అబద్ధానిదే కావచ్చుగాని నిజం ఆలస్యమైనా బయటికి వస్తుంది. అబద్ధం నాశనమైపోతుంది.

ఇతని మొదటి పేరు దావూద్ సయ్యద్ గిలానీ. 1960లో వాషింగ్‌టన్ డి.సి.లో జన్మించాడు. **జన్మత: అమెరికన్.** తండ్రి పేరు సలీమ్ గిలానీ మరియు తల్లిపేరు సెర్రిల్ హెడ్లీ. ఈమె **ఎల్. కోల్మన్ హెడ్లీ** కూతురు. తల్లి అమెరికన్. వాషింగ్‌టన్‌లోని పాకిస్తాన్ ఎంబసీలో సెక్రటరీగా పనిచేసేవారు. తండ్రి వాయిస్ ఆఫ్ అమెరికాలో పనిచేసేవారు.

హెడ్లీ తల్లిదండ్రులు 1960ల మధ్యకాలంలో పెళ్లి అయిన కొన్ని సంవత్సరాలకే విడిపోయారు. ఆమె భర్త తన ఇద్దరు పిల్లలను తీసుకుని పాకిస్తాన్ వెళ్ళిపోయాడు. 1977లో హెడ్లీ తల్లి పాకిస్తాన్ వెళ్ళి అక్కడ నుండి కొడుకుని తీసుకుని అమెరికా వచ్చేసింది. ఆమెకు అమెరికాలో ఓ బార్ ఉండేది. 1985లో హెడ్లీ వివాహం చేసుకున్నాడు. వివాహం జరిగిన రెండు సంవత్సరాలకే 1987లో భార్యకు విడాకులు ఇచ్చేశాడు.

- 1980లలో అతడు న్యూయార్క్ నగరంలో రెండు వీడియో రెంటల్ స్టోర్స్ ఓపెన్ చేశాడు.
- 1987 సం॥లో **డ్రగ్స్ స్మగ్లింగ్‌లో** అరెస్ట్ అయ్యాడు. **D.A.E.**కు సహకరించి నందుకు తేలికపాటి శిక్షతో వదిలేసారట.
- 1997 సం॥లో పాకిస్తాన్ నుండి **హెరాయిన్** అమెరికాలో **స్మగ్లింగ్** చేస్తూ దొరికి పోయాడు. ఈసారి కూడా ఇతనికి శిక్ష తక్కువే పడింది.
- 2002లో D.A.E. తరపున రహస్య ఏజెంట్‌గా పనిచేస్తూ పాకిస్తాన్ చాలా సార్లు వెళ్ళాడు.
- 2003లో మూడు సార్లు పాకిస్తాన్ వెళ్ళాడు. అతడు లష్కరె తైబ శిక్షణ శిబిరాలకు హాజరయ్యాడట.

ఇతడు అమెరికాలో పుట్టాడు. కొంతకాలం అమెరికాలోనే పెరిగాడు. 51 సంవత్సరాల వయస్సుగల ఈ హెడ్లీ పాకిస్తాన్‌లో దాదాపు ఓ పది

సంవత్సరాలు మాత్రమే ఉండి ఉంటాడు. అంటే 41 సంవత్సరాలు అమెరికాలోనే ఉన్నాడు. అతడు అమెరికా ప్రభుత్వ ఏజెంట్‌గా పనిచేస్తూ పాకిస్తాన్ చాలా సార్లు వెళ్ళాడు, ఓ అమెరికన్ రహస్య ఏజెంట్‌గా అంటే **అమెరికన్ పాస్‌పోర్ట్‌తో వెళ్ళేవాడు.** మన ఇండియన్ ఏజెన్సీ వారు అతడు అమెరికా గూఢచారి సంస్థ CIA ఏజెంట్ అని అనుమానిస్తున్నారు.

2001 సెప్టెంబర్‌లో ట్విన్ టవర్స్ కూల్చేసిన తరువాత అమెరికాలో సెక్యూరిటీ చాలా టైట్ చేసినట్లు అందరికీ తెలుసు. ముస్లిమ్ పేరు కనిపిస్తే చాలు. ఆ పేరు గల వానిని అనుమానించేవారు.

అంత టైట్ సెక్యూరిటీ ఉండగా 2002, 2003 సంవత్సరాలలో చాలాసార్లు ఈ హెడ్లీ ముస్లిమ్ పేరుతోనే పదే పదే పాకిస్తాన్ వెళుతున్నాడంటే అతనిపై నిఘా పెట్టలేదా? అప్పటికింకా అతడు తన పేరు హెడ్లీగా మార్చుకోలేదు. 2006లో పేరు మార్చుకున్నాడు.

**ఈ అమెరికన్ యొక్క నడవడిక మంచిది కాదు**

1987లో డ్రగ్స్ విషయంలో అరెస్ట్ అయి తేలికపాటి శిక్షతో బయటపడి, మరలా 1997లో అదే పనిచేస్తూ దొరికి పోయాడంటే ఈ 10 సం॥ల కాలంలో అతని నడవడికలో ఎటువంటి మార్పు రాలేదు. మరలా తేలికపాటి శిక్షతో వదిలేశారుట. మరోసారి అటువంటి పనులు చేయడని గ్యారంటీ ఏమిటి?

1977లో అమెరికా వచ్చిన దగ్గర నుండి 1997 వరకూ ఈ 20 సం॥లలో అమెరికాలో రెండు సార్లు అరెస్ట్ అయి కొంత శిక్ష అనుభవించాడు. **ఈ అమెరికన్ పౌరుడిది అంతా నేర చరిత్రే!** డ్రగ్స్ ద్వారా ప్రజల జీవితాలతో ఆటలాడుకునే వ్యక్తి.

వీసాల విషయంలో ఎంతో కఠినంగా వ్యవహరించే అమెరికా, నేర చరిత్రగల ఓ వ్యక్తిని, అందులోనూ ఓ ముస్లిమ్ పేరుతో ఉన్న వ్యక్తిని పాకిస్తాన్‌కు పదే పదే వెళ్ళడానికి అనుమతి నివ్వడం ఎన్నో సందేహాలకు దారి తీస్తుంది.

ఇతడు డబ్బుకోసం అనైతిక పనులు చేసేవాడేగాని, ఏదైనా ఓ మతం కోసం పనిచేసే వ్యక్తి కాడు. **'లష్కరే తైబ' దగ్గర శిక్షణ కోసం అమెరికాయే పంపిందా?**

బిన్‌లాడెన్‌ను తమ దేశంలోనే ఉంచుకుని తెలియదు అంటున్నారని పాకిస్తాన్‌పై, ఆఫ్ఘనిస్తాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా, ఇండియాపై దాడులకు కుట్రపన్నిన ఓ తీవ్రవాదిని తమ దేశంలో ఉంచి కాపాడుకుంటుంది.

పచ్చి అబద్ధాలు ఆడే దేశంగా, మోసం చేసే దేశంగా అమెరికా గురించి ప్రపంచ ప్రజలకు తెలుసు. అలవాటు ప్రకారంగా హెడ్లీ విషయంలో కూడా ప్రపంచ ప్రజలకు అబద్ధమే చెప్పింది.

**హెడ్లీ లష్కరె తైబ దగ్గర శిక్షణ తీసుకున్నాడని అంటున్నారు. కాబట్టి అతడికి కఠినమైన శిక్ష వేయవలసింది పోయి, తేలికపాటి శిక్ష వేసి ఎలా వదిలేసారు?**

**ఉగ్రవాదంపై పోరాటం చేస్తున్నామని చెప్పే అమెరికా, 'ఒసామా బిన్ లాడెన్'ని ఈ మధ్యనే కాల్చి చంపివేశామని ఘోరంగా బొంకిన అమెరికా, డేవిడ్ హెడ్లీని మాత్రం బహిరంగంగా కాల్చి చంపకుండా ఇంకా ఎందుకు నిరీక్షిస్తున్నారు? అతడి చేత ఇంకా ఎన్ని దాడులు చేయించాలని?**

## తీవ్రవాద దాడులు చేయించడానికి శిక్షణ అందించేది ఎవరు? దానిని పర్యవేక్షించేది ఎవరు?

ఆనాడు ఆఫ్ఘనిస్తాన్‌లోని ముజాహిదీన్‌లకు శిక్షణ ఇచ్చింది అమెరికాయే. అదంతా CIA పర్యవేక్షణలోనే జరిగింది. ఇది జగమెరిగిన సత్యం. ఒక దేశంపై వేరే దేశం చేత దాడులు చేయించడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య.

ఇప్పుడు ఇండియాపై దాడులు చేయడానికి పాకిస్తాన్‌లో కొందరికి అమెరికా శిక్షణ ఇప్పిస్తుందని డేవిడ్ హెడ్లీ ఉదంతం తెలియజేస్తుంది. మరలా పర్యవేక్షణ సి.ఐ.ఎ. దే అవుతుంది. ఎందుకంటే దుర్మార్గపు పనులలో వారికి కాక మరెవరికి అనుభవం ఉంది! పాకిస్తాన్‌లో శిక్షణ అంటే, పాకిస్తాన్‌లోని అమెరికా వారి స్థావరాలలో అయి ఉండాలి.

**మరోసారి హెడ్లీ అరెస్ట్**

హెడ్లీ తీవ్రవాది అని ఫిర్యాదు. ఫిర్యాదుపై చర్య తీసుకోని అమెరికా.

2005లో మూడు సంవత్సరాల కాపురం తరువాత తన న్యూయార్క్ భార్యతో పడిన గొడవలో అరెస్ట్ అయ్యాడు. FBI వారికి అతని భార్య ఫిర్యాదు చేసింది. తన భర్త పాకిస్తాన్ శిబిరాలలో తీవ్రవాద శిక్షణ పొందాడని మరియు ఆ సంస్థకు యాక్టివ్ మెంబర్ అని, నైట్ గాగుల్స్ మరియు ఇతర ఎక్విప్‌మెంట్ కొన్నాడని ఫిర్యాదు చేసింది.

ఈమె మాత్రమే కాదు, ఆ తరువాయి భార్య కూడా FBIకు 2007లో ఫిర్యాదు చేసింది. కాని ఈ విషయాలు 2010 అక్టోబర్‌లో గాని బయట ప్రపంచానికి తెలియ లేదు.

**పెద్ద జోక్**

2006లో డేవిడ్ కోల్మన్ హెడ్లీగా పేరు మార్చు కున్నాడట. క్రైస్తవ పేరు అయితే అమెరికా నుండి ఏ దేశానికైనా సులభంగా రాకపోకలు సాగించవచ్చుట. అందుకనే పేరు మార్చుకున్నాడట. **అమెరికన్ ప్రభుత్వం కొత్త పాస్‌పోర్ట్ ఎలా జారీ చేసింది?** అప్పటికే 3 సార్లు అరెస్ట్ అయ్యాడు. హెడ్లీ తీవ్రవాది అని అతని భార్యే స్వయంగా ఫిర్యాదు చేసింది. అప్పుడే FBI వారు హెడ్లీని అడిగి ఉంటే, నిజం చెప్పేసేవాడు కదా! అప్పటికే 1987లోనూ మరియు 1997లోనూ నిజం చెప్పేసి చిన్న శిక్షతో తప్పించుకునే అలవాటు ఉంది కదా! ఇప్పుడు కూడా అలాగే తప్పించుకోవచ్చు. కాని అమెరికా అడగలేదు. షారుక్ ఖాన్ వంటి సినిమా స్టార్‌ని కూడా అనుమానంతో తనిఖీ చేసిన అమెరికా, స్వయంగా తన భర్త తీవ్రవాది అని ఫిర్యాదు చేసినా కూడా అనుమాన పడలేదు అంటే, అతడితో అమెరికాయే తీవ్రవాద కార్యకలాపాలు చేయిస్తుండబట్టే ఆ ఫిర్యాదును పట్టించు కోలేదా?

### తీవ్రవాద సంస్థలకి నామకరణం చేసే వారెవరు?

'అల్-ఖైదా' అని నామకరణం చేసి, వారికి తమ భూభాగంలోనే ఆనాడు శిక్షణ ఇచ్చిన 'అమెరికా', మరో సంస్థకి 'లష్కరె తైబ' అని కూడా నామకరణం చేసిందా? **అల్-ఖైదా అమెరికా సృష్టి అని స్పష్టంగా తెలియడానికి 30 సంవత్సరాలు పట్టింది.** 'లష్కరె తైబ' కూడా అమెరికా సంస్థ అవునో కాదో స్పష్టం కావడానికి ఇంకెన్ని సంవత్సరాలు పడుతుందో?

ఒకప్పుడు తన భూభాగంలోనే అమెరికా శిక్షణ ఇచ్చింది. కాని ఇప్పుడు ప్రపంచంలో చాలా చోట్ల అమెరికా స్థావరాలు ఏర్పాటు చేసుకుంది. కాబట్టి తీవ్రవాద శిక్షణలు వేరే దేశాలలో ఇస్తుండవచ్చు.

### ఇండియా రావడానికి హెడ్లీకి వీసా ఎలా లభించింది?

2008 ముంబై దాడులకు ముందు హెడ్లీ ఎన్నోసార్లు ఇండియా వచ్చాడు. 2007లో 2 సార్లు హెడ్లీ భార్య ఇండియా వచ్చింది.

పాకిస్తాన్ జాతీయత ఉంటే అంత సులభంగా వీసా రాదు. ఇండియన్ పరిశోధకులకు ఆశ్చర్యమేసింది. చికాగోలోని ఇండియన్ కాన్సులేట్ హెడ్లీకి వీసా ఎలా జారీ చేసింది? అమెరికా పాస్‌పోర్ట్‌లో తండ్రిపేరు అవసరం లేదట. తండ్రి జాతీయత తెలిసి ఉంటే పట్టుకునేవారని సమాచారం.

తండ్రి పేరు **"విలియమ్ హెడ్లీ"** అని అప్లికేషన్‌లో వ్రాశాడట. మరి పోలీస్ ఎంక్వైరీ ఉండదా? అప్పటికే 3 సార్లు అరెస్ట్ అయ్యాడు. ఎన్నో సార్లు పాకిస్తాన్ వెళ్ళాడు. అప్పటికే భార్య అతడు 'తీవ్రవాది' అని ఫిర్యాదు కూడా చేసింది. అయినా సరే అతనికి పాస్‌పోర్ట్ ఇష్యూ చేశారంటే, దీనిలో అమెరికా ప్రభుత్వం హస్తం లేకుండా ఇదంతా జరుగుతుందా?

### ముంబయి దాడులు జరగబోతాయని ఆధారాలతో సహా ఫిర్యాదు

హెడ్లీ రెండవ భార్య 2007లో ఇస్లామాబాద్‌లోని అమెరికన్ ఎంబసీకి ఫొటోలు కూడా చూపించింది. ముంబైలో తాజ్‌మహల్ హోటల్‌లో బస చేయడం గురించి మరియు లష్కరె తైబ తరపున తన భర్త ఏదో చెడు చేయబోతున్నాడని ఫిర్యాదు చేసింది.

### అమెరికన్ ఎంబసీ ఎందుకు చర్య తీసుకోలేదు?

"తీసుకునే ఉంటుంది. అన్నీ మీకు చెబుతారా ఏమిటి?" అని మమ్మల్ని పాఠకులు ప్రశ్నించవచ్చు. అలాగే అనుకుందాం. అమెరికా చర్య తీసుకుని ఉంటే, ఇండియాకు హెడ్లీ వలన ప్రమాదం ఉంది కాబట్టి 2008లో అతనిని ఇండియాకు వెళ్ళకుండా కట్టడి చేస్తుంది కదా! ఆ విధంగా ఎందుకు చేయలేదు?

అంటే తీవ్రవాదంపై పోరు చేస్తున్నామని అమెరికా చెప్పేది బూటకమని స్పష్టం అవుతుంది.

జూన్ 2010లో మన NIA హెడ్లీని ప్రశ్నించగలగడానికి అనుమతి నిచ్చారు. ఇంత ఆలస్యం దేనికి?

### 26/11 ముంబయి హోటల్ దాడి గురించి అమెరికాకు ముందుగానే తెలుసా?

హెడ్లీ భార్య చేసిన ఫిర్యాదును బట్టి వారికి స్పష్టంగా తెలుసు.

'26/11 ముంబయి హోటల్ దాడి గురించి రహస్యాన్ని హెడ్లీ అమెరికాకు తెలిపే ఉండవచ్చు' అనే వ్యాసంలో డిశంబర్ 16, 2009న కొన్ని కీలకాంశాలను The Economic Times (ద ఎకనామిక్ టైమ్స్) ప్రచురించింది.

అమెరికా తన mole (కళంకాన్ని) - డేవిడ్ కోల్మన్ హెడ్లీని - రక్షించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు మరియు అతను C.I.A. (అమెరికన్ గూఢచారి సంస్థ) ఏజెంట్ అని కూడా మన ఇండియన్ ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఉన్న సమాచారాన్ని బట్టి మనవారు చాలా ఖచ్చితంగా అనుమానించారని తెలుస్తుంది.

తీవ్రవాద వ్యతిరేక సమాచారాన్ని పంచుకునే విషయంలో, అమెరికా కేవలం కొన్ని ఎంచుకున్న విషయాలను మాత్రమే ఇండియాకు తెలియజేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సెప్టెంబర్ 2008లో తాజ్‌మహల్ హోటల్ దగ్గర దాడి జరగబోతుందని అమెరికా హెచ్చరించింది.

మన భద్రతా వ్యవస్థ సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకుంది. కాని ఈ రెండు నెలలలో దాడి జరగకపోవడంతో, భద్రతను సడలించిన కొన్ని రోజులకే నవంబర్‌లో అమెరికా సూచించిన మార్గంలోనే దాడి జరిగింది.

విశ్వసనీయ ఆధారాల ప్రకారం, హెడ్లీ డబుల్ ఏజెంట్‌గా C.I.A. కొరకు పనిచేస్తున్నాడని ఇండియన్ ఏజెన్సీలకు స్పష్టం అయ్యింది.

ఢిల్లీ, పూణే, పుష్కర్, గోవా మరియు ముంబయి నగరాలకు మార్చి 2009లో ఇతను వస్తున్నట్లు ఇండియాకు అమెరికా ఎందుకు తెలియజేయలేదు? ఆ విషయంలో అమెరికా ఎందుకు నిశ్శబ్దంగా ఉంది? **హెడ్లీ వస్తున్నట్లు ముందుగా హెచ్చరిస్తే, ఇండియాలోనే 'హెడ్లీ'ని అరెస్ట్ చేసి ఉండేవారు కదా!**

హెడ్లీపై ఇండియా చేయి పడటాన్ని అమెరికా కోరుకోవడం లేదు. హెడ్లీ దగ్గరకి వెళ్ళి ప్రశ్నించడానికి మన NIA అడిగితే FBI తప్పించుకు తిరుగుతుంది. పైపెచ్చు ఇండియన్ల చేత ప్రశ్నింపబడటానికి హెడ్లీకి ఇష్టం లేదని FBI చెబుతుంది. తీవ్రవాదుల ఇష్టాయిష్టాలతో వారికేం పని?

**హెడ్లీని విచారిస్తే, అతను అమెరికా ఏజెంట్ అనే విషయం బయట పడిపోతుందని భయమా? అమెరికాకు భయమెందుకు? ప్రపంచంలో క్రూరమైన దేశమని ప్రపంచ ప్రజలకు తెలియదా? ఇది కొత్త విషయమేమీ కాదు.**

హెడ్లీ CIA ఏజెంటని, మొదటి నుండి మన భద్రతా దళాలు మాత్రమే అనుమానించడం లేదు. హెడ్లీతో స్నేహం చేసిన రాహుల్ భట్ (డైరక్టర్ మహేష్‌భట్ కుమారుడు) NIA కి ఇచ్చిన సమాచారం ప్రకారం, హెడ్లీ ఎప్పుడూ అమెరికా చేసిన యుద్ధాల గురించి, ఆర్మీ మరియు మిలటరీ

పుస్తకాల గురించి చెప్పేవాడని, అతను CIA ఏజెంట్‌గా అనిపించేవాడని చెప్పారు.

చికాగో కోర్టులో హెడ్లీ విచారణపైనే మన ఇండియన్ ఏజెన్సీ కళ్ళున్నాయి. మనవారు ఊహించిన దేమిటంటే,

1. అతడు తన శిక్ష తగ్గించుకోవడానికి బేరసారాలు చేసి, 2 నుండి 5 సంవత్సరాల శిక్షవంటి తేలికపాటి శిక్షతో బయటపడతాడని. ఇదే గనుక జరిగితే అతడు **CIA యొక్క నమ్మకస్తుడైన మరియు విలువైన mole అనే విషయం ఫైనల్‌గా నిర్ధారణ అయిపోతుందని మనవారు ఎదురు చూస్తున్నారు.** మనవాళ్ళు డిశంబర్'2009 లో ఊహించినది 2010 మార్చి నెల మూడవ వారంలో నిజమైంది.
2. ఇదే గనుక జరిగితే, అతనిని భారతదేశ ప్రభుత్వానికి అప్పగించమని అడిగే అవకాశమొస్తుందని, అప్పుడు ఇక్కడ అతనిపై నమోదైన కేసు విషయంలో అతనిని విచారించవచ్చని ఆశాభావంతో ఉన్నారు.
3. అంతేకాకుండా ఓ తీవ్రవాది విషయంలో అమెరికా మెత్తగా వ్యవహరిస్తుందని భారతీయులు గట్టిగా నిరసన కూడా తెలియజేస్తారని మన ఏజెన్సీ ఊహించింది. నిరసన వరకూ ఎందుకు? అమెరికాను పల్లెత్తు మాట కూడా అనడానికి ఎవరూ సాహసించలేదు.

## హెడ్లీ విషయంలో  తలెత్తే కొన్ని ప్రశ్నలు

1. ప్రపంచంలో 320 ప్రాంతాలపై దాడి జరుగుతుంది అంటూ అమెరికా పార్లమెంట్ (కాంగ్రెస్) సభ్యులిద్దరు గట్టిగా హెచ్చరించారట. భారత్‌లో 20 ప్రాంతాలపై దాడులు జరగవచ్చుట.  వారి స్క్రిప్ట్ ప్రకారం '**ముంబై దాడుల నేపథ్యంలో అమెరికా దర్యాప్తు అధికారులు లష్కరే కుట్రల గురించి సమాచారం సేకరించారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లు, ఈ-మెయిల్స్, ఇతర రికార్డుల ప్రకారం ఆ సంస్థ మొత్తం 320 ప్రదేశాల్లో మారణకాండకు పథకాలు రచించింది.**'

   తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పే అమెరికా, ఈ వివరాలను బహిర్గతం చేయవచ్చు కదా! తమ దేశ పౌరుడు మరియు తమ ఏజెంట్ అయిన 'హెడ్లీ'కి ఓ ఉగ్రవాద సంస్థకి సంబంధముంది అంటే, **అమెరికాకు తీవ్రవాద సంస్థలకు ప్రత్యక్షంగా సంబంధం ఏదైనా ఉందా?**

   ప్రపంచవ్యాప్తంగా దాడులు చేయాలంటే, అమెరికా వంటి సూపర్ పవర్ సాయం లేకుండా చేయడం సాధ్యమౌతుందా? అమెరికా



ప్రపంచమంతా రక్తపాతం

వాషింగ్టన్: పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున మారణహోమానికి కుట్రలు పన్నిందని అమెరికా పార్లమెంటు(కాంగ్రెస్) సభ్యులిద్దరు గట్టిగా హెచ్చరించారు. భారత్‌లోని 20 లక్ష్యాలు సహా ప్రపంచవ్యాప్తంగా 320 లక్ష్యాలపై లష్కరే గురిపెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ లష్కరేకు రక్షణ కవచంగా నిలుస్తోందని ధ్వజమెత్తారు. గత వారాంతంలో కాంగ్రెషనల్ కమిటీకి మార్విన్ వీన్‌బామ్, గ్యారీ అకర్మాన్‌లు ఈ విషయాలు వెల్లడించారు. లష్కరే కుట్రల గురించి, దానికి ఐఎస్ఐతో ఉన్న అనుబంధాల గురించి వీరు ఏం చెప్పారంటే..

లష్కరే కుట్ర

- భారత్‌లో 20 లక్ష్యాలపై కన్ను
- ప్రపంచ వ్యాప్తంగా 320 లక్ష్యాలు
- అమెరికా కాంగ్రెస్ సభ్యుల వెల్లడి

*16.03.2010 pg. 3* (సాక్షి)

అయితే, ప్రపంచంలో తనకి నచ్చిన ఏ దేశం పైనైనా వేల కిలోమీటర్లు పయనించి, ఆయా ప్రాంతాలను నాశనం చేయగలదు. మిగిలిన ప్రపంచ దేశాలు చోద్యం చూస్తూ కూర్చుంటాయి.

అల్-ఖైదా అమెరికా సృష్టి అని తెలిసిపోయింది. మరి 'లష్కరే'ను సృష్టించింది కూడా అమెరికాయేనా?



"There was no alert on German Bakery"

Special Correspondent

MUMBAI: Contradicting Union Home Minister P. Chidambaram, his Maharashtra counterpart R.R. Patil on Friday said that in the last 365 days the State had received 349 alerts and none about Pune's German Bakery as a possible terror target.

- R.R. Patil contradicts Chidambaram's remark
- Not to hand over probe to CBI

*20.03.2010 pg. 12*
*The Hindu*

2. **కేంద్ర హోం మంత్రి Vs మహారాష్ట్ర హోం మంత్రి**

   జర్మన్ బేకరీపై ఫిబ్రవరిలో జరిగిన దాడి విషయంలో హెచ్చరించామని గౌ॥ చిదంబరం గారు చెబితే, మహారాష్ట్ర మంత్రి గౌ॥ పటేల్‌గారు, అటువంటి హెచ్చరిక ఏదీ అందలేదని చెబుతున్నారు. గత సంవత్సరం అందిన 349 హెచ్చరికలలో ఈ జర్మన్ బేకరీ విషయం లేదంటున్నారు.

   జర్మన్ బేకరీపై దాడి జరిగి కొన్ని గంటలుకూడా గడవక ముందే ఇంటర్‌నెట్‌లోని ఆన్‌లైన్ ఎన్‌సైక్లోపీడియా వికీపిడియాలో హెడ్లీకి సంబంధించిన వివరాలలో ఈ దాడి విషయం కూడా అప్‌డేట్ అయిపోయింది. ఈ వ్యాసం కోసం అదే రోజు హెడ్లీగురించి ఇంటర్‌నెట్‌లోని వివరాలను అధ్యయనం చేస్తుండగా ఈ విషయం తెలిసింది. దాడికి హెడ్లీయే కారణమని ఆ తరువాత న్యూస్‌పేపర్లలో వచ్చింది.
3. అమెరికా తమ దేశ పౌరుడు మరియు తమ ఏజెంట్ అయిన హెడ్లీ వలన దాడి జరగవచ్చు అని సమాచారాన్ని ఇచ్చినప్పుడు, ఖచ్చితమైన తేదీలను, స్థలాలను చెప్పగలదు. కాని అలా ఎందుకు చేయలేదు? దాడుల వెనుక అమెరికా హస్తం ఉందా? ఒకవేళ అమెరికా ప్రమేయం ఉందని తెలిసిపోతే, తప్పుదారి పట్టించడం కోసమే, **"ముందుగానే తెలియజేశాం కదా!"** అని చెప్పడానికే చెబుతున్నారా?
4. అమెరికా ప్రశ్నిస్తే చాలు, వెంటనే తప్పును ఒప్పేసుకునే హెడ్లీ, అమెరికా శిక్షల నుండి ఎప్పటికప్పుడు శిక్షలో మినహాయింపు పొందే హెడ్లీ అమెరికాకు నిజంగా చెప్పలేదంటారా?
5. బిన్ లాడెన్ అమెరికాలోని టవర్స్‌ను కూల్చేశాడని కేవలం ఆరోపించి, సాక్ష్యాలు లేకపోయినా సరే, అతను ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నాడన్న అనుమానంతో, ఆ దేశంపై దాడి చేసింది కదా!

**ఇండియాలో జరిగిన దాడికి 'హెడ్లీ' కారణమని ఆరోపించబడటమే కాకుండా, అతను నేరాన్ని అంగీకరించినట్లు అమెరికా చెబుతుంది. అంతేకాకుండా అతనిని ఇండియాకు అప్పగించేది లేదని కూడా అమెరికా చెబుతుంది. మరి 'ఇండియా' అమెరికాపై యుద్ధం చేయవచ్చా?**

## అమెరికా బిన్ లాడెన్ విషయంలో చేసిన పనినే, హెడ్లీ విషయంలో ఇండియా చేస్తే?

6. తీవ్రవాద సంస్థకు పాకిస్తాన్ సైన్యం సాయం చేస్తుందట. అది బహిరంగ రహస్యమేనట. అదే గనుక నిజమైతే, తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడే అమెరికా, **పాకిస్తాన్‌తో ఎలా స్నేహం చేస్తుంది?** నిజంగా పాకిస్తాన్ తీవ్రవాదాన్ని ప్రోత్సహించి ఉంటే, తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడే అమెరికా, పాకిస్తాన్‌పై చర్య తీసుకుని ఉండేది. అలా జరగలేదు అంటే, క్రింది 2 విషయాలలో ఏదో ఒకటి నిజమవుతుంది :
   1. **పాకిస్తాన్ తీవ్రవాదాన్ని ప్రోత్సహించడం లేదు. అమెరికాయే ఆ పనిచేస్తుంది.** లేదా 2. **అమెరికా తీవ్రవాదానికి వ్యతిరేకం కాదు.**


7. **అమెరికాలో దొంగతనానికి 22 సంవత్సరాల జైలు శిక్ష!** కేవలం క్రెడిట్ కార్డులను దొంగిలించినందుకే కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తికి అమెరికాలో 22 సంవత్సరాల జైలు శిక్షను విధించారు. మరి తీవ్రవాదానికి పాల్పడ్డాడని హెడ్లీ చికాగో కోర్టులో ఒప్పుకుంటే, తేలికపాటి శిక్షను ఎలా వేస్తారు? కనీసం ఓ 50 సంవత్సరాలైనా శిక్ష వెయ్యాలి. క్రెడిట్ కార్డును దొంగిలించిన వ్యక్తి కూడా తన నేరాన్ని ఒప్పుకుని ఉంటే, 1 సంవత్సరం శిక్షతో వదిలిపెట్టి ఉండేవారా? అమెరికాలో ఎవరిని కావాలనుకుంటే వారిని హత్య చేసి ఆ నేరాన్ని ఒప్పుకుంటే శిక్ష తగ్గిస్తారా? **అమెరికా అభివృద్ధి చెందిన దేశమా? లేక అనాగరిక దేశమా?**

8. చికాగో కోర్టులో హెడ్లీపై జరిగిన విచారణను వీడియో రికార్డింగ్ చేయలేదా? ఫొటోలు తీయలేదా? అవి ఎందుకు రిలీజ్ చేయలేదు? నిజంగా కోర్టులో విచారణ జరిగిందా? కోర్టులో విచారణ జరిగినట్లు ఓ డ్రాయింగ్ మాత్రం పేపర్లో వచ్చింది. 'కసబ్'పై 189 రోజులపాటు ఇండియాలో విచారణ జరిగింది. ఎప్పటికప్పుడు వివరాలను భారత ప్రభుత్వం మీడియాకు తెలియజేస్తూనే ఉంది.


Chidambaram: no setback, we will continue to seek extradition of Headley

He will be charged in Mumbai terror attack case at an "appropriate time"

*20.03.2010 pg. 1 (The Hindu)*


IN THE DOCK: *In this courtroom drawing, David Coleman Headley faces U.S. District Court Judge Harry Leinenweber in Chicago on Thursday.*
– PHOTO: AFP/DRAWING BY CAROL RENAUD

**Courtroom drawing by Carol Renaud**

9. హెడ్లీని అమెరికా ఇండియాకు ఎందుకు అప్పగించడం లేదు? అతనిని ప్రశ్నించడానికి సైతం మొదట్లో అమెరికా ఒప్పుకోవడం లేదంటే, అమెరికాపై సహజంగానే అనుమానం కలుగుతుంది.

రష్యాకి మిత్రదేశం అయినందుకు 'భారతదేశం'పై పెంచుకున్న శత్రుత్వమా? లేక భారతదేశం అభివృద్ధి చెందుతుందని, ఆ అభివృద్ధిని ఆపడానికి దాడులు చేయిస్తుందా?


భారత్ ముందుకెళ్తే గెలవలేం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత్‌తో పోటీ గురించి మళ్లీ

ఒబామా వ్యాఖ్య

• శాస్త్రవేత్తల సంఖ్యలో గట్టిపోటీ ఎదుర్కొంటున్నాం

*21.02.2010 pg. 3* (సాక్షి)

**పాకిస్తాన్ పౌరుడు దాడిచేస్తే పాకిస్తాన్ ప్రమేయం ఉంది అన్నప్పుడు, అమెరికా పౌరుడు దాడిచేస్తే అమెరికా ప్రమేయం ఉన్నట్లే కదా! దాడి చేయించింది అమెరికా అని అనుమానం కలుగుతుంది. నిజం మాత్రం అల్లాహ్‌కే తెలుసు.**

### అన్యాయంగా ముస్లిములపై కేసులు

మహారాష్ట్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిగారు ఆరిఫ్ నసీమ్ ఖాన్ 'బ్లాస్ట్ కేసులో నిందితుల కుటుంబాల వారు తమ వాళ్ళు అమాయకులని ఎప్పటినుండో నిరసన తెలియజేస్తున్నారని, వాళ్ళు అమాయకులైతే వదిలేస్తామని' చెప్పారు.

కమాల్ జహా భర్త షబ్బీర్ మసివుల్లాహ్ (42)ని ఆగష్టు 3, 2006లో మాలెగావ్ బ్లాస్ట్‌కు ముందే అరెస్ట్ చేశారు. ఆమె చెబుతున్నారు, 'గడిచిన 5 సంవత్సరాలలో నలుగురు పిల్లలను పోషించుకోవడానికి ఎన్నో అవస్థలు పడ్డాను'. షబ్బీర్ కుటుంబీకులు ఆసరానందించారు. తన భర్తపై తప్పుడు కేసును బనాయించారని, హోమ్ మినిష్టర్ చిదంబరం గారితో సహ ఎంతోమందిని కలిసినా ఏమీ జరగలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు తెలుసు వారంతా అమాయకులని అది ఇప్పుడు నిజమైంది' అని ఆమె చెప్పారు. ఇఖ్బాల్ మఖ్జూమీ, యునానీ డాక్టరైన తన కుమారుడు ఫరూఖ్‌ని ముంబై ట్రైన్ బ్లాస్ట్ విషయంలో నేరాన్ని ఆరోపించి అరెస్ట్ చేశారని చెప్పారు. తరువాత ఆ ఆరోపణను మాలెగావ్ బ్లాస్ట్‌కు మార్చారు. తప్పుడు కేసులతో 5 సంవత్సరాలుగా జైలులో ఉన్నాడు. (ద హిందూ, 23.01.11)

**నేరం చేసేది కొన్ని సంస్థలకు చెందినవారు. కాని ప్రాణాలు కోల్పోయేది అమాయకులు. తప్పుడు కేసులతో జైళ్ళలో మగ్గిపోతూ, తమ కుటుంబ సభ్యులకు కన్నీరు మిగిల్చి, బలై పోయేది దాడికి ఎటువంటి సంబంధంలేని అమాయకులే!**

ఈ మధ్య తెలిసింది మక్కామసీదు బాంబ్ బ్లాస్టులుగాని, మాలెగావ్ బ్లాస్టులుగాని, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ బ్లాస్టులుగాని ముస్లిములు చేయలేదని. ఎంతో మంది అమాయక ముస్లిములను జైళ్ళలో వేసి తీవ్రంగా హింసించారు. సమాజంలో అవమానం. కెరీర్ నాశనమై పోయింది. ప్రస్తుత గవర్నమెంట్ ఉన్న ఈ కాలంలోనే ఈ విధంగా బాంబు దాడులు జరిగితే, పోటా చట్టం అమలులో పెట్టిన గవర్నమెంట్ కాలంలో జరిగిన బాంబు దాడులను ఖచ్చితంగా అనుమానించాలి.

నేడు ఓ కాంగ్రెస్ ముఖ్యమంత్రి ముస్లిములపై తప్పుడు కేసులు పెట్టి హింసించారని బహిరంగంగా ప్రకటించారు.

*మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారు ఈ మధ్యనే హైదరాబాద్‌లో ఇలా ప్రకటించారు : **"మక్కా మస్జిద్ పేలుళ్లు హిందూ ఉగ్రవాదుల పనే".** హిందూ ఉగ్రవాదులను, మతోన్మాద శక్తులనూ దూరంగా ఉంచేందుకు అంతా ముందుకు రావాలని*

పిలుపునిచ్చారు. **మక్కా పేలుళ్ల కేసులో తొలుత అమాయకులైన ముస్లిమ్ యువకులను నిందితులుగా భావించి జైళ్ళకు పంపాల్సి వచ్చిందన్నారు.** *పేలుళ్ళతో వారికి సంబంధం లేదని విచారణలో తేలిందన్నారు. ముస్లిమ్ యువకులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తామన్నారు."* **(సాక్షి దినపత్రిక, ఫిబ్రవరి 3, 2011 పేజీ. 12)**

పైన తెలిపిన బ్లాస్టలకు కారకులైన వారికి ఆనాటి పోటా గవర్నమెంట్ చాలా అనుకూలం కాబట్టి, ఎంతమంది అమాయక ముస్లిములను హింసించారో అల్లాహ్‌కే తెలియాలి

## ఉగ్రవాద దాడులు ఎప్పుడు ఆగుతాయి? దానికి పరిష్కారమేమిటి?

**1857లో బ్రిటిష్‌వాడు బీజం నాటాడు** : 1857 నుండి బ్రిటిష్ వారు హిందూ ముస్లిముల మధ్య చిచ్చు రగిలిస్తూ, ఒకరిపై మరొకరికి ద్వేషం పెరిగేలా చేశారు. విడగొట్టి వెళ్ళిపోయారు. ఇప్పుడు ఆ పని అమెరికా వాళ్ళు చేస్తున్నారు. హిందూ ముస్లిముల మధ్య సోదర భావాన్ని దెబ్బతీసి అమెరికా ప్రయత్నాలకు తమ వంతు సాయాన్ని చేసే నాయకులు మన దేశంలో ఉన్నారు. మన సమైక్యతే తీవ్రవాద దాడులను తిప్పి కొడుతుంది. మన సమైక్యతను దెబ్బతీసే నాయకులకు సమిష్ఠిగా మనమంతా సమాధానం చెప్పాలి. మత కలహాలు సృష్టించేవాళ్ళు వణికిపోవాలి. **ప్రపంచ శాంతికి విఘాతం కలిగించేది పాశ్చాత్య దేశాల దుర్మార్గమే!**

ఉన్మాదంతో విచక్షణ కోల్పోయిన 'కసబ్' వంటివారు శిక్షింప బడతారు. కొత్తవారు పుట్టుకొస్తూనే ఉంటారు. మన రాష్ట్రంలో అమ్మాయిలపై యాసిడ్ దాడులు జరిగాయి. ఆ ఉన్మాదులకి శిక్ష పడింది. దాడులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఈ ఉన్మాదానికి పరిష్కారం చూపకుండా శిక్షలు వేసినంత మాత్రాన యాసిడ్ దాడులు ఆగుతున్నాయా?

**అగ్నిని నీటితో ఆర్పడానికి బదులు పెట్రోల్ పోస్తే ఏమౌతుంది?**

మత దురభిమానంతో తీవ్రవాదానికి మతం రంగు పులిమి, ఆ మతవర్గపు అమాయక ప్రజలను అవమానిస్తూ, రెచ్చగొడుతూ ఉంటే, తీవ్రవాదులుగాని నక్సలైట్లు గాని ఆ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. అన్యాయానికి, దుర్మార్గానికి బలైన వారిని తమవైపు వారు తిప్పుకునే అవకాశముంది.

పార్లమెంట్‌పై దాడిచేసిన 'అఫ్జల్ గురు'ను ఉరితీయక పోవడాన్ని మతతత్వ పార్టీగా ముద్రపడిన బిజెపి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ముస్లిముల ఓట్ల కోసమే కాంగ్రెస్ ఈ శిక్షను ఆపిందని చెబుతూ అమాయక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

పరోక్షంగా వీరి మాటలలో దాగిఉన్న దుర్మార్గం ఏమిటంటే, పార్లమెంట్‌పై దాడి చేసిన వారిపై ముస్లిములకు అభిమానమున్నట్లు అర్థమొచ్చేలా, **ముస్లిములను దేశానికి శత్రువులుగా చూపించడమే.** ఏ పార్టీకి ఓటువెయ్యాలో, ఆయా నియోజక వర్గాలలోని ముస్లిములు నిర్ణయించుకుంటారు. తీవ్రవాదానికి, ఇస్లామ్‌కు ఏదోవిధంగా సంబంధాలను అంటగట్టి, ముస్లిములను అణగదొక్కడానికి ఏదో ఒక చట్టాన్ని తీసుకురావాలనేది ఈ పార్టీవారి కోరిక. మెజారిటీ ప్రజలకు వీరి కుయుక్తులు బాగా తెలుసు.

ఒక అపరాధిని ఉరితీస్తే ముస్లిములు న్యాయం జరిగిందని సంతోషిస్తారు. అఫ్జల్ గురుకి ఉరితీయకపోతే సంతోషించేవారు ఎవరైనా ఉంటే వారు బిజెపి వారే! ఎందుకంటే అతడి పేరు చెప్పుకుని ఉన్మాదంతో ఊగిపోతూ ఓట్లు అడుక్కోవడానికి అవకాశం ఉంటుంది.

పుండు వచ్చిన ప్రతీసారి ఏదో ఒక మందు పూసుకుని సరిపెట్టు కునే బదులు, ఆ పుండుకి కారకమైనది శాశ్వతంగా తొలగించాలి. ఈ తీవ్రవాద దాడులలో అమెరికా హస్తముందని ఆధారాలతో మనదేశం గట్టిగా గళం విప్పి తీవ్రమైన హెచ్చరిక పంపాలి.

మన రాజకీయ నాయకులు మరియు మన మీడియాలో మార్పు రావాలి. నిజాన్ని నిర్భయంగా చెప్పాలనే ఆలోచన వారిలో రావాలి. వారిలో ఆలోచన వచ్చేలా మనం కృషి చేస్తూనే ఉండాలి. మన ఇండియాలోని నిఘావర్గాలకు నిజాన్ని బయటకి తీసుకురాగల నైపుణ్యం ఉంది. ఆ నిజాలను గళం విప్పి చెప్పే ధైర్యమే నాయకులకు లేదు.

**అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్తాన్‌ను దోషిగా నిలబెట్ట గలిగామని పూర్తి విశ్వాసంతో మనం ఎప్పుడు చెప్పగలమంటే,**

1. పాకిస్తాన్‌తో అమెరికా పూర్తిగా తెగతెంపులు చేసుకునేలా చేసినప్పుడు మరియు 'పాకిస్తాన్' తన మిత్రదేశం కాదని అమెరికా చేత అంతర్జాతీయ సమాజానికి చెప్పించగలిగినప్పుడు.
2. విధ్వంసకర ఆయుధాలున్నాయంటూ ఇరాఖ్‌పై ఆంక్షలు విధించిన అమెరికా వంటి (అ)నాగరిక దేశాలు, పాకిస్తాన్ విషయంలో ఆంక్షలు విధించేలా చేయగలిగినప్పుడు.
3. తాలిబాన్లు 'బిన్‌లాడెన్'ని అప్పగించనందుకు 'ఆఫ్ఘనిస్తాన్'పై దాడిచేసిన విషయాన్ని అమెరికాకు జ్ఞాపకం చేసి, అదేవిధంగా 'హెడ్లీ'ని ఇండియాకు అప్పగించనందుకు మీ దేశంపై ఎందుకు చర్య తీసుకోకూడదు? అని అమెరికాను అంతర్జాతీయ సమాజం ముందు ఇండియా నిలదీయగలిగినప్పుడు.
4. హెడ్లీ ఇండియా వచ్చినప్పుడు, ఆ సమాచారాన్ని ఇండియాకు ఎందుకు తెలియజేయలేదు? అని అమెరికాను ప్రశ్నించ గలిగినప్పుడు.

ఇవి అన్నీ జరిగినప్పుడు ఇండియా అంటే ఏమిటో, అంతర్జాతీయ సమాజానికి అర్థమౌతుంది. ఈ విషయంలో భారతీయులందరూ మన ప్రభుత్వానికి సహకరించి, మన దేశ సార్వభౌమాధికారాన్ని సవాల్ చేస్తే సహించేది లేదని ప్రపంచానికి చాటి చెప్పాలి.

**ఇస్లామ్ అంటే శాంతి. ఇస్లామ్ మత సహనాన్ని బోధిస్తుంది. ఇండియన్ ముస్లిములు ఇండియాను అమితంగా ప్రేమిస్తారు. మన భారతదేశం లోని ముస్లిములకు మన దేశంపై తమకున్న ప్రేమను నిరూపించు కోవల్సిన ఖర్మ పట్టలేదు.**

**We Love India మనమంతా ఒక్కటే**

**మానవతా విలువలను గౌరవించేవారు 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనే పదాలను ఉపయోగించి 'మానవత్వాన్ని అవమానించరు'.**

- డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు, M.Sc., Ph.D.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440,
**Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

حَدَّثَنَا أَبُو بَكْرِ بْنُ أَبِي شَيْبَةَ : حَدَّثَنَا مُحَمَّدُ بْنُ فُضَيْلٍ، عَنْ يَحْيَى بْنِ سَعِيدٍ، عَنْ أَبِي سَلَمَةَ، عَنْ أَبِي هُرَيْرَةَ قَالَ : قَالَ رَسُولُ اللهِ ﷺ ((مَنْ صَامَ رَمَضَانَ إِيمَاناً وَاحْتِسَاباً غُفِرَ لَهُ مَا تَقَدَّمَ مِنْ ذَنْبِهِ)).

అబూ హురైరా(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఎవరైతే విశ్వాసంతో మరియు ప్రతిఫలాన్ని ఆశించి రమదాన్ (నెల) ఉపవాసముంటారో, అతని పూర్వపు పాపాలు క్షమించబడతాయి.

(ఇబ్నెమాజా, 1641, సహీహ్, పుస్తకం 7, అధ్యా. 2, సంపుటి 2)

(అంటే మనపై అల్లాహ్ హక్కులకు సంబంధించి మనం చేసే చిన్న చిన్న పాపాలు క్షమించబడతాయి. అయితే ప్రజలకు మనపై ఉండే హక్కులకు సంబంధించి చేసిన పాపాలను వారికి న్యాయం చేకూర్చేవరకూ లేదా బాధితుడు క్షమించే వరకూ క్షమించబడవు. మిగిలిన పాపాలు తౌబా (హృదయపూర్వకంగా చేసే పశ్చాత్తాపం) ద్వారా క్షమించబడతాయి.)

حَدَّثَنَا إِسحَاقُ بنُ نَصرٍ : حدَّثَنا عَبدُ الرَّزَّاقِ : أخبرَنا ابنُ جُرَيجٍ قالَ : أخبرَني يَحيى بنُ سَعيدٍ، وَسُهَيلُ ابن أبي صَالحٍ : أنَّهُما سَمِعَا النُّعمانَ بنَ أبي عَيَّاشٍ عَنْ أبي سَعِيدٍ الخُدْرِيِّ رَضِيَ اللهُ عَنهُ قالَ : سَمِعتُ النَّبيَّ ﷺ يَقُولُ : ((مَنْ صَامَ يَوماً فِي سَبِيلِ اللهِ، بَعَّدَ اللهُ وَجهه عَنِ النَّارِ سَبعِينَ خَرِيفاً)).

అబూ సఈ'ద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖనం.

రసూలుల్లాహ్(స)వారు చెప్పగా విన్నాను :

"ఎవరైతే అల్లాహ్ మార్గంలో ఒక రోజు సౌమ్ (ఉపవాసం) ఉంటారో, అల్లాహ్ అతని ముఖం నుండి నరకాగ్నిని 70 వసంతాల (సంవత్సరాల ప్రయాణ దూరమంత) దూరంగా ఉంచుతాడు."

(సహీహ్ బుఖారీ, 2840, పుస్తకం 56, అధ్యా. 36, సంపుటి 4)

**SAANTHIBAATA MONTHLY** *Special Issue* **June - July, 2011** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

**జూలై 1వ తేదీ నాటికి ఉన్న వెండిధరను బట్టి
రూ. 30,000/- కంటే ఎక్కువ సంపద కలిగిన
ప్రతీ ముస్లిమ్ ఈ సంవత్సరం జకాత్ చెల్లించాలి.**

**నిశ్చయంగా, అస్సదఖాత్ (జకాత్) కేవలం**

- యాచించు నిరుపేదలకు, మరియు
- యాచించని పేదవారికి, మరియు
- (జకాత్) వ్యవహారాలపై నియుక్తులైన వారికి మరియు
- ఎవరి హృదయాలనైతే ఆకర్షించవలసి ఉందో వారికి,
- బానిసల విముక్తి కొరకు,
- అప్పులపాలైన వారి కొరకు,
- అల్లాహ్ మార్గంలో (పోయేవారి) కొరకు మరియు
- బాటసారుల కొరకు

ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక విధి.
మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు.

(ఖుర్'ఆన్ 9:60)

ముఖ్య గమనిక:
మదరసాలకు, దావా సంస్థలకు, దాయీలకు
సొసైటీలకు, జీతాల చెల్లింపు కొరకు,
లైబ్రరీలకు, మస్జిద్‌లకు, టి.వి. ఛానళ్ళకు,
పబ్లిషర్స్‌కు, పుస్తకాలకు మొ॥న వేటికొరకూ
**జకాత్ ఇవ్వకండి.**
కేవలం పైన తెలిపిన
8 రకాల వ్యక్తులకు మాత్రమే
జకాత్ ఇవ్వాలి.

**Visit**
**www.saanthibaata.net**
19 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న
తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్

అల్లాహ్ మార్గంలో (పోయేవారు) అంటే,
వారు ముజాహిద్‌లు మరియు హజ్ యాత్ర చేసే పేదవారు
(సహీహ్ బుఖారీ, 24వ పుస్తకం, అధ్యా. 49, సంపుటి 2)